
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.6.2026
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



శోభన


# మిసిమి

చింతనాత్మక సారస్వతం



ఉప్పెన

మాసపత్రిక, జులై, 2026 ₹ 60/-



వెలుగు పువ్వు



వెన్నెల నవ్వు

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 37 సంచిక 7

జూలై - 2026

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

Published by

**BAPANNA ALAPATI**

PLOT # 196, ROAD NO. 13,
JUBILEE HILLS,
HYDERABAD - 500 033.

Editor: V. ASWINI KUMAR
Ph: 994 951 6567

**చందా వివరాలు:**

₹ 720/- (సంవత్సర చందా),
₹ 1,440/- (రెండు సంవత్సరాలకు),
₹ 2,160/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

LIBRARY OF CONGRESS
LCCN 91-903060

PEER REVIEWED

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com

www.misimimonthly.com

YouTube Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జూలై నెల సూచికలు...


**మిసిమి** డైరి : సిద్ధార్థ – సెక్రటరీ ... 3

జీవన మకరందం : అశ్వినీకుమార్ ... 4

చలం మెచ్చిన–నగ్నముని చెప్పిన 'సిద్ధార్థ' : హెర్మన్ హెస్సే .... 5

అక్షర వైభవం : డా. యన్. విజయరాఘవ రెడ్డి .... 8

డా.యడ్లపల్లి వెంకటేశ్వరరావు గారితో : **మిసిమి** ... 9

కృష్ణకాంతుని వీలునామా : ప్రొ. పార్థసారథి ... 29

దళిత జీవనం : ప్రొ. బన్న అయిలయ్య ... 34

బుద్ధుని జాతక కథలు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 40

భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ... 43

కిషినావ్ విశేషాలు : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 46

సముద్రపు దొంగలు : చెన్నూరి శివరామక్రిష్ణ ప్రసాద్ ... 50

చలన చిత్ర–శిల్పకళ : టి.వి. ప్రసాద్ ... 55

కాలంతో ప్రయాణించే కాళోజీ కథలు : శీలా సుభద్రాదేవి ... 60

వడుగర్ సంస్థానం : డా. సగిలి సుధారాణి ... 64

**నో రూమ్**–కాళీపట్నం రామారావు : రాజా ... 73

ఫ్రాగ్రెన్స్ **ఆఫ్ తెలుగు లైఫ్**–ఆంగ్లంలో తెలుగు కథలు : ఎన్వీఆర్ ... 74

నెమలినార : ఆర్వియన్ ... 77

డమరు ధ్వని–ప్రతిధ్వని : మద్రాపు వసుంధరా దేవి ... 78

చదవండి : **మిసిమి** ... 79




రైతునేస్తం


### అట్టమీది బొమ్మలు





ఉప్పెన



వెలుగు పువ్వు



వెన్నెల నవ్వు



శోభన

# సిద్ధార్థ - సెక్రటరీ.....

**మొ**న్న రాత్రి దిగంబర కవివర్యులు - ఋషీకేశ్ మహాశయులు ఫోన్‌లో పలకరించారు. ఆయన పిలుపే బంగారం - మాటే **మిసిమి**! అశ్విని గారూ అంటూ ఆప్యాయంగా పలకరించి ఎన్నో విషయాలు ప్రస్తావిస్తారు - ఎప్పుడు (అరుదుగానే) ఓ గంటలోపు మా సంభాషణ సాగుతుంది - నవ్వులు పువ్వులు విరుస్తాయి. పరిమళాలు ప్రయాణం చేస్తాయి - చాలా అరుదుగా ఫోన్ చేసే నగ్నముని / దిగంబర ఋషి ఆ రాత్రి ఫోన్ చేస్తే - మీకేమైనా ఆరో ఇంద్రియం వున్నదా? అన్నాను. కావచ్చు ఊరకనే పిలవను కదా - రేపు నా పుట్టినరోజు అని తట్టిందా? అలా అని అనలేను కాని - ఎందుకో వేళ్లు మీ మీదకు పోయినాయి అని నవ్వు - ఇక్కడ వరకూ వినిపించింది. ఇది ఉపోద్ఘాతమే - మొన్న వారి పుట్టినరోజు ఘనంగా - దినపత్రికలు - సామాజిక మాధ్యమాలు జరుపుకున్నాయి. రేపటి సూర్యుడు ఇవాళే వచ్చాడు - ఇదీ ఉపోద్ఘాతమే అసలు కథలోకి వద్దాం -

ఆ రాత్రి సంభాషణలో వారు మరిన్ని విషయాలు చెప్పారు - అందులో ఒకటి వారు మద్రాసులో ఏదో పనిమీద వెళ్లి - అక్కడ నుంచి - గుడిపాటి వెంకటాచలం ఉన్న అరుణాచలం వెళ్లడం - మధ్యలో నా సందేహం ఎంత ప్రయాణం? అబ్బా దూరమే - ఓరోజంతా బస్సులో వెళ్ళాలి. సరే వెళ్లి మూడురోజులున్నారు - ఆయనతో గిరి ప్రదక్షిణలు చేశారు. ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు - అట్లాంటి విషయాల్లో ఒకటి సిద్ధార్థ చదివావా? అని అడిగారు - ఆఁ చదివాను చాలాసార్లు అన్నారు మన కవి - అందులో నీకు బాగా నచ్చిన - ఒక సన్నివేశం / సందర్భం చెప్పగలవా? ఋషికేశులు చెప్పిన సందర్భం - చలం మెచ్చిన సన్నివేశం - అశ్విని రాసిన సిద్ధార్థ నుంచి **మిసిమి** పాఠకులకు కోసం - మంచి పుస్తకాలు మళ్లీ మళ్లీ చదవటం - మంచిదే.... *(పుట 5)*


నగ్నముని

- - - - -


**సా**యంత్రం చెట్లకింద వచ్చీరాని గాలికి - తిరుగుతున్నాను. లైబ్రరీ హాల్లో లైటు వెలగటం చూసి అటుగా వెళ్లాను. అక్కడ దక్కన్ క్రానికల్ చదువుతుంటాను - ఆ టేబుల్ దగ్గర ఆమె కూర్చుని చదువుకుంటున్నది - ఎప్పుడైనా చూశానా? ఆమె పలకరించింది - హాయ్ సార్ - అంటూ - ఏమిటి ఈ వేళలో - ఇది నా స్టడీ ప్లేస్ - వచ్చే నెల పరీక్షలు - ఓ - డిగ్రీ? - ఆఁ - సబ్జెక్టు? కంపెనీ సెక్రటరీ - ఓ అదొకటి వుందా? అంతలో - నేను క్లాసు వినవచ్చా? కానీ - ఫోన్‌లో రికార్డెడ్ క్లాస్ వినటం మొదలుపెట్టింది - నేను దక్కన్ క్రానికల్ తిరగవేస్తున్నాను - అప్పటికే ఏడు దాటింది - నేను లేచి - మళ్ళీ కలుద్దాం - అని - నీ పేరు? ప్రియాంక - నేను అశ్విని అని పూర్తి చేయలేదు - నాకు తెలుసు! అంటే ఆశ్చర్యపోయాను - నైస్ టు మీట్ యు - అని చెట్ల కింద ఎల్ఈడి లైట్ల వెల్తురులో ఆశ్రమం వైపు సాగిపోయాను - చదవాలని సంకల్పం వుంటే-ఏదీ అడ్డు కాదు. అప్పట్నుంచి - అప్పుడప్పుడు అక్కడే కలుస్తున్నాం - ఎప్పుడూ - ప్లజంట్‌గా వుంటుంది ప్రియాంక! రెండు కిలోమీటర్లు నడిచి (కొండాపూర్) ఆశ్రమం లైబ్రరీ వరండాలో ఒంటరిగా చదువుతూ - పాఠాలు వింటుంది - నాకు ఒక్కసారి నా చదువు - బడి - రాత్రి చదువు గుర్తువచ్చి నవ్వుకున్నాను.

డిగ్రీ - కంపెనీ సెక్రటరీ - సబ్జెక్ట్స్ ఏముంటాయి - చెప్పింది - 'లా' కూడా పూర్తి చేసింది - మనకు సెక్రటరీ అంటే సి.ఇ.ఓ సెక్రటరీ అనుకుంటాం - కాదు - కంపెనీ సెక్రటరీ - దాదాపు స్వతంత్ర బాధ్యత - కార్పొరేట్ కంపెనీలు - ఎన్విరాన్‌మెంట్, లేబర్ లాస్ - పబ్లిక్ కంప్లైంట్ - లీగల్ మేటర్స్ ఇంకా - చైర్మన్ - సి.ఇ.ఓ - సెక్రటరీకే రిపోర్ట్ చేయాలి-ఎన్నో చెప్పింది-తమ్ముడు హాస్పిటాలిటీ చేస్తున్నాడు.


ప్రియాంక చాలా కాన్ఫిడెంట్‌గా మాట్లాడుతుంది - ఒక్కటి చెప్పగలవా? ఇక్కడ సోషల్ ఛేంజెస్‌ని నిర్దేశించే ఫాక్టర్స్ ఏమిటి? చాలా రెలెవెంట్ క్వశ్చన్ - ముఖ్యంగా - టెక్నాలజీ - ఎకనమిక్స్ - ఇవి రెండు - స్థూలంగా సొసైటి మార్పుని నిర్దేశిస్తాయి - ఇంకా లోతుగా వెళ్తే - ఫ్యామిలీ రిలేషన్స్ - ఎడ్యుకేషన్ - ఎంప్లాయ్‌మెంట్ - అవకాశాలు - ఇది రెండో లేయర్. మరింత లోతుగా ఆలోచిస్తే - ఎమోషనల్ బాండ్స్ - ఆధ్యాత్మిక చింతన-ట్రావెల్ - తీర్థయాత్రలు ఇవి ప్రత్యేకంగా మార్పు చెందవు - కోర్, సొసైటీ కోర్ మారదు! - అయితే ప్రాంతీయంగా కొన్ని లక్షణాలుంటాయి - ఇవన్నీ పరిశీలించేవారు - సోషియో ఎకనమిక్ ఎక్స్‌పర్ట్స్! వీరు మనకి-కనిపించరు - కాని అధ్యయనం జరుగుతుంటుంది. అలా నడిచింది మా సంభాషణ!

**- ఎ.కె.**

# జీవన మకరందం



- ఇది క్రూర ప్రపంచం – ఆకర్షణలు – అనారోగ్య బంధనాలు నిన్ను చిక్కుల్లో ఇరికిస్తాయి. నిన్ను నువ్వు నీ విద్యతో రక్షించుకోవటానికి జాగరూకుడవై వుండాలి!
- రేపు కూడా ఇవాళలాగానే వుంటాము. ఈరోజు నీ అనుభవాలతో నీవు ఎదుర్కొన్న క్లిష్టమైన సవాళ్లన్నీ కలిసి వుంటాయి. ఇదే ఈ విశ్వ రహస్యం – న్యాయం!
- నీకు ఎదురయ్యే కష్ట నష్టాలన్నీ నీవు జీవన సూత్రాలను విస్మరించటమే కారణం – ఇవన్నీ ఎప్పుడో రాసిపెట్టిన రాతలే.
- జీవితం నిత్యస్రవంతి – ప్రవాహం వేగవంతమైన కొలదీ మార్పులు త్వరగా సంభవిస్తాయి. ఇవన్నీ ప్రకృతి అనే దైవత్వం నియంత్రిస్తుంది!
- అందరిలో దైవత్వాన్ని దర్శించగలిగితే (అదేమీ కష్టమైన కార్యం కాదు) నీ అహం – నీ ఆనందంగా మారిపోతుంది!
- నీ సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైతే – నీకు అంత జ్ఞాపకశక్తి సమకూరుతుంది! పనిలోనే శక్తి వుంది! కష్టాలన్నీ ఇష్టాలుగా మారిపోతాయి!
- నీలోని ప్రేమ సుడులు తిరిగి నిన్ను చుట్టుముడితే వెలుగు వెల్తురవుతుంది! చీకటి వెన్నెలవుతుంది! ప్రకృతిలోని సౌందర్యం నిన్ను ఆవహిస్తుంది!
- నిన్ను నీవు విముక్తి చేసుకో... బాధా, సౌఖ్యం, సుఖం–దుఃఖం ఇవన్నీ భావనలే – నీకు శాంతి లభించేది ఆత్మదర్శనంతోనే – ధ్యానమే దానికి మార్గం
- దైవత్వం అంటే సూర్యరశ్మి – భౌతిక సుఖాలంటే చీకటి గది!



- నీ విధిని నువ్వు నిర్ణయించుకోలేవు.
- ఈ జీవితాన్ని నిర్వచించలేము. అర్థవంతంగా జీవించటమే దీని పరమార్థం.
- న్యాయస్థానాల్లో చివరివరకూ వెల్లడి కానిది సత్యమే!
- నీ ఆలోచనల సారమే నీ జీవితానికి ఔన్నత్యం సాధిస్తుంది.
- సృష్టికి పరిధి వుంటుంది. ఆలోచనలకు అవధి వుండదు.
- నీ ప్రతిచర్య – నైతికతకు లోబడి వుండాలి.
- నిన్ను నువ్వు తెలుసుకోవటమే కాదు – నీలాగా నువ్వు వుండగలగాలి!
- బలహీనమైన సత్యమార్గం – దుర్మార్గాన్ని మించిన ప్రమాదం!
- అధికారం చెలాయించేవాడున్నచోట – వ్యతిరేకించువాడూ వుంటాడు.
- నీకు 'పేషన్' తపన అంటూ లేకపోతే – నీ వ్యక్తిత్వం అసంపూర్ణమే.

# చలం మెచ్చిన - నగ్నముని చెప్పిన 'సిద్ధార్థ'

**అం**దరూ సిద్ధార్థను ప్రేమించారు. అతని ఉనికే అందరికీ ఉల్లాసం, సంతోషం.

అయితే సిద్ధార్థ?! అతను ఆనందంగా ఉండలేకపోతున్నాడు. పూదోట దారుల్లో అశాంతిగా తిరుగాడుతున్నాడు. రావిమాను లేత నీడల్లో పరధ్యానంగా ఉంటున్నాడు. అనుదినమూ సలిపే పవిత్ర స్నానాల్లో అర్ఘ్య విధులతో అతనికి ఆనందం కలగటంలేదు. అతని హృదయం అల్లకల్లోలమవుతోంది. నదిలోని అలల్లా రాతిరి తారకలతళుకు కాంతులు - పగటి వెలుగు వెచ్చనికిరణాలు అతని కలల్ని, ఆలోచనల్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. హోమగుండాల హవిస్సుల సాంద్ర ధూమవలయాలు, యజుర్వేద నిత్యఘోష, వృద్ధ బ్రాహ్మణులు వల్లెవేసే సామవేద పారాయణం - అతన్ని అశాంతికి గురిచేస్తున్నాయి!

అతని అంతరాళంలో ఏదో అశాంతి రాజుకుంటోంది. తన తండ్రి ప్రేమ, తల్లి మమకారం, గోవిందుని అభిమానం - ఇవన్నీ తనని ఆనందింప చేయలేకపోతున్నట్లు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నాడు. మానసిక తృప్తి, ప్రశాంతి పొందలేకపోతున్నట్లు గ్రహించాడు. ఇప్పటికే తన తండ్రి, తన గురువులు వారి శక్తిమేరకు తమ విజ్ఞానాన్ని, వివేకాన్ని తన జీవన పాత్రలో ఒంపారని గుర్తించాడు. కాని ఇంకా అది నిండలేదే? తన మేధ ఇంకా సంతుష్టి చెందలేదే? తన ఆత్మకు ఈ అశాంతి ఏమిటి? తన మనసు స్థిమితంగా లేదే? ఈ పవిత్ర స్నానాలు హాయిగానే ఉన్నాయి. కాని ఇవి నీరు మాత్రమేనా? ఇవి పాపాలను ఎలా కడిగివేస్తాయి? అశాంతిలో వేగిపోయే హృదయాన్ని ఉపశమింపచేయలేవా? దేవతలకు చేసే యజ్ఞయాగాదులు, నైవేద్యాలు అద్భుతంగా ఉంటున్నాయి. కాని ఇదే సర్వమా? ఈ క్రతువులు క్రాంతినిస్తాయా? మరి దేవుళ్ళ మాటేమిటి?

ఈ సృష్టికి మూలం ప్రజాపతేనా? మరి ఆత్మ ఏమిటి? ఆత్మ సర్వస్వమైతే,

ఈ దేవుళ్ళెవరు? వారు మనలాగే అశాశ్వతులేగా. అయితే వారికీ పూజా క్రతువులెందుకు? వారికి కాకపోతే ఎవరికి అర్పించాలి? అయితే పరమాత్మ ఒక్కడేనా? ఈ ఒకే ఒక్కడు ఎక్కడుంటాడు? ఎలా ఉంటాడు? ఏ విధంగా కనుగొనాలి? అతని నిరంతరాత్మ ఎలా స్పందిస్తుంది? అంతరాత్మలో, ప్రతి వ్యక్తి అంతరాత్మలో, ఈ పరమాత్మ స్పందించకపోతే మరి వేరెక్కడ దీని అస్తిత్వం? రక్తమాంసాదులు, ఆలోచన, అంతఃస్పృహ లేని ఈ అంతరాత్మ - ఇదేగా జ్ఞానులు బోధించేది? అయితే ఇది ఎక్కడ ఉంది? ఆత్మను, అంతరాత్మను, పరమాత్మను అన్వేషించాలంటే ఏదైనా మార్గం ఉందా? ఇంతవరకు ఎవ్వరూ చూపలేదే? ఎవరికీ తెలియదా?

జ్ఞానవంతుడు విద్యావంతుడైన తన తండ్రి, గురువులు, వివేకవంతులైన బ్రాహ్మణులు, ఎవరూ, చివరికి ఏ ఉపనిషత్తులు ఉపదేశించలేదే? ఈ పవిత్ర గ్రంథాలకు, ఈ బ్రాహ్మణోత్తములకు అన్నీ తెలుసు. అన్నింటిని శోధించారు. ఈ ప్రపంచాన్ని, ఈ సృష్టిని, వాచకాన్ని, ఆహారాన్ని, ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని, జ్ఞానేంద్రియాల్ని, దేవతల బాధ్యతల్ని అన్నీ అధ్యయనం చేశారు. సర్వస్వమూ పరిశోధించి, పరిశీలించారు. కానీ ముఖ్యమైన, ఎంతో ముఖ్యమైన విషయం వదిలి ఇవన్నీ అవసరమా? సామవేదం, "నీ ఆత్మ - అదే ఈ ప్రపంచం! నీవు నిద్రించేటప్పుడు నీ అంతరాత్మను దర్శిస్తావు?" అంటుంది. ఈ మాటల్లో ఎంతో జ్ఞానం ఇమిడివుంది. తరతరాలుగా మునివరులు ప్రోది చేసిన ఈ జ్ఞాన నిక్షేపాల్ని కాదనలేము. కానీ ఈ మౌనులు, ఋషులు, ఈ జ్ఞానసమపార్జన చేసిన మహాత్ములు ఎవరైనా దీని 'అనుభూతి'ని పొందగలిగారా? నిద్రావస్థలో ఆత్మను దర్శింపగలిగిన మహాత్ములు జాగరూకులై ఉన్నప్పుడు ఈ ఆత్మదర్శనం ఎందుకు పొందలేకపోతున్నారు?

సిద్ధార్థునికి తెలిసి ఎందరో మహానుభావులు! మహాసాత్వికుడైన తన తండ్రి, అతని నిష్ఠ, నిబద్ధ జీవితం, ఉత్తమాలోచనలతో, నిత్య ధ్యానంలో గడిపే తన తండ్రి, ప్రశాంతుడై ఉన్నాడా? ఆయన హృదయం పరమానందంగా ఉన్నదా? ఈయన కూడా అన్వేషి కాడా? అసంతృప్తితో అనంత తృష్ణతో పవిత్ర జలాలలో స్నానాదికాలు సలపటంలేదా! క్రతువులు సమావేశాలు తర్కసంభాషణలు నిత్యమూ జరపటంలేదా? తన తండ్రిలాంటి నిర్మల హృదయునికి, నిష్ఠాగరిష్ఠునికి ప్రతిదినమూ పాపప్రక్షాళన కోసం నదీజలాల్లో సంధ్యావందనాలు ఎందుకు? అంటే ఆయన అన్వేషించేది ఆయనలో లేదా? ఈ మూలాధారము ఆయన

హృదయంలో లేదా? ఈ ఆదిశక్తిని కనుగొనాలి. ఈ మహాత్రాణ నీలోనే ఉండాలి. లేకపోతే మిగిలేది అన్వేషణే. అది ప్రక్కదారే, తప్పుదారే! ఇవీ, సిద్ధార్థుని ఆలోచనలు. ఇది అతని తీరని దాహం, అతని తపన. అతని ఆవేదన! ఛాందోగ్య ఉపనిషత్తు 'సత్యమే బ్రహ్మము. ఇది అవగాహన అయితే, భగవత్సన్నిధానం అందుబాటులోనే ఉంటుంది' అంటోంది. అతనికి ఆ అలౌకిక ప్రపంచం దగ్గరైనట్లు అప్పుడప్పుడు అనిపిస్తుంది. కాని అతను అందుకునే స్థితికి చేరలేకపోతున్నాడు. తన గురువులు తనకు తెలిసిన జ్ఞానులు ఎవరూ కూడా ఆ అలౌకికానందాన్ని పొందినట్లు చెప్పలేకపోతున్నారు.

సిద్ధార్థుడు ఒక్కసారిగా "గోవిందా! రా, నాతో రా. ఈ మర్రిచెట్టు నీడలో ధ్యానం చేద్దాం" అన్నాడు. మరోమాట లేకుండా గోవిందుడు అనుసరించాడు. ఇరవై అడుగుల దూరంలో కూర్చొని ఓంకార శబ్దాన్ని "ఓంకారం శరాసనమై ఆత్మ శరమై బ్రహ్మను చేరాలి. ఇదే నా ధ్యేయం" అంటూ ధ్యానమారంభించాడు.

సాయం సమయానికి గోవిందుడు ధ్యానం చాలించి లేచాడు. సంధ్యావందనం, అర్ఘ్యాదులకు సమయమాసన్నమయింది. 'సిద్ధార్థా' అని పిలిచాడు గోవిందుడు. సిద్ధార్థుడు పలకలేదు. ధ్యాననిమగ్నుడైన అతని నయనాలు అర్ధనిమీళితాలై అనంత దూరంలో అగుపడని ధ్యేయాన్ని తదేకంగా వీక్షిస్తున్నట్లున్నాయి.

అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా ఆగిపోయినట్లు నిశ్చలంగా ఉన్నాడు. అతను నిశ్శబ్దంగా గానం చేసే ఓంకార మంత్రం వలయంలా అతని చుట్టూ మార్మోగుతోంది! బ్రహ్మలోక పరితప్తుడై ఆత్మశరసంధానకర్తలా పద్మాసన విన్యాసంలో ప్రశాంతంగా వెలుగుతున్న సిద్ధార్థుణ్ణి చూసి గోవిందుడు ఆశ్చర్యపోయాడు.

– – –

అంతకు పూర్వం సన్యసించి, దేశాటన చేస్తున్న ముగ్గురు శ్రమణులు సిద్ధార్థుని ఊరికి వచ్చి వెళ్ళారు! వీరు ముగ్గురూ, చివికిపోయిన గుడ్డపీలికల్లా ఉన్నారు. మధ్యవయస్కులే, ధూళి, రక్తం ఓడుతున్న శరీరాలతో ఆచ్ఛాదన లేని దేహాలతో ఎండ వేడికి బడలి వడలిన శరీరాలతో, ఒంటరిగా, వింతగా జాగరూకులై జనంలో తిరుగుతున్న జాగిలాల్లా కనిపించారు! వారి చుట్టూ ఒక నిర్మల దీనావస్థ పరిభ్రమిస్తున్నట్లుండేది. ఒక అత్యవసరమైన విస్ఫోటనం జరుగబోతున్నట్లు, వారు అందుకే నిర్దాక్షిణ్యమైన ఆత్మవైరాగ్యాన్ని ఆశ్రయించినట్లు ద్యోతకమయ్యేది.

"గోవిందా! రేపటి ఉదయం నేను శ్రమణుల వద్దకు వెళ్తున్నాను. సిద్ధార్థుడు సన్యసిస్తున్నాడు!"

సహవాసి మాటలకు గోవిందుడు తెల్లబోయాడు. శరాసన విముక్తమైన బాణంలా అతని నిర్ణయం, తిరుగులేని నిశ్చయాన్ని విని, అతని ముఖారవిందాన్ని గమనించి "అవును, ఇప్పుడే మొదలైంది గమనం. ఏ దారులు, ఏ గమ్యాలకు దారితీస్తాయో! మిత్రమా, నీతోనే నేను. నీ గమ్యమే నాది కూడా" అనుకుంటూనే మరింత పాలిపోయాడు గోవిందుడు. "... నీ తండ్రి అనుమతిస్తాడా..." దుఃఖార్తితో గోవిందుడన్నాడు. సిద్ధార్థుడు అప్పుడే నిద్ర మేల్కొన్నట్లు అతన్ని తేరిపారా చూశాడు. గోవిందుని హృదయాన్ని, ఆందోళనను, ఆవేదననూ క్షణంలో పసిగట్టాడు. "మనం కాలయాపన చేయవద్దు. రేపు ఉదయమే శ్రమణ ప్రయాణం." సరాసరి, తండ్రి కూర్చొని ఉన్న గదిలోకి ప్రవేశించాడు. తుంగచాపమీద పద్మాసనంలో ఉన్న అతని వెనుకనే నిలబడ్డాడు. అతని ఉనికిని తండ్రి ఎప్పుడు గమనించాడో "నీవేనా నాయనా? ఏమి చెప్పాలని వచ్చావు?" అని ప్రోత్సహించాడు.

"మీ అనుమతితో, మీతో చెప్పేందుకే వచ్చాను. రేపు ఉదయం, ఈ ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. సన్యసించి శ్రమణ జీవితంలో ప్రవేశిస్తాను. అడ్డు చెప్పరనే పూర్తి నమ్మకంతోనే." సిద్ధార్థుని స్వరం సర్వమూ వ్యాపించింది. ఆ రెల్లుగడ్డి గోడలు దాటి చరాచర ప్రపంచంలో ప్రవేశించింది. అతని స్వరాన్ని ఆలకించటానికా అన్నట్లు ఆకాశంలోని చుక్కలు ఆ గది చిన్న కిటికీలో నుంచి తొంగిచూస్తున్నాయి. అలా ఎంత సమయం గడిచింది? ఇప్పుడంతా నిశ్శబ్దంగా ఉంది. కిటికీలో నుంచి కనపడే చుక్కల రాశి మారిపోతున్నది. ఆ బ్రాహ్మణోత్తముడు కొడుకుని చూశాడు! చేతులు కట్టుకుని స్థిరంగా నిలబడి ఉన్న సిద్ధార్థుణ్ణి మార్చిమార్చి చూశాడు.

"బ్రాహ్మణులు ఆగ్రహపూరితమైన దుర్భాషలు చేయరాదు. కానీ నా హృదయం ఆక్రోశిస్తుంది. ఈ ప్రస్తావన మరోమారు తేవద్దు..." తండ్రి మెల్లగా లేచాడు. సిద్ధార్థుడు మౌనంగా నిలబడి ఉన్నాడు.

"ఎందుకు ఇంకా నిలబడి ఉన్నావు?" తండ్రి.

"ఎందుకో మీకు తెలుసు..." సిద్ధార్థుడు.

అసంతృప్తిగా అతని తండ్రి ఆ గది వదలి శయనాగారానికి వెళ్ళాడు. నిద్ర పోవటానికి విశ్వ ప్రయత్నం చేశాడు. లేచి అశాంతిగా తిరిగాడు.

సిద్ధార్థుడు నిలబడి ఉన్న గదిలోకి, చిన్న కిటికీలో నుంచి చూశాడు.

సిద్ధార్థ స్థిరంగా చేతులు కట్టుకుని నిలబడే ఉన్నాడు.


తండ్రి హృదయం తల్లడిల్లింది.

మళ్ళీ నిద్రపోవటానికి ప్రయత్నించాడు. అతని వలన కాలేదు. ఇంకోసారి, మరి కొంత సమయం గడిచిన తర్వాత ఆ చిన్న కిటికీలో నుంచి సిద్ధార్థుణ్ణి చూశాడు. అలాగే ఆ చీకటిలో, ఆ చుక్కల వెలుగులో, ఆ రాత్రి చివరిలో అలాగే నిలబడి ఉన్నాడు.

ఎంత సమయం, ఎంత రాత్రి గడిచిపోయిందో సిద్ధార్థ అంతే స్థిరంగా నిలబడి ఉన్నాడు.

తండ్రి హృదయం ఆగ్రహంతో ఉడికిపోయింది. భయంతో వణికిపోయింది. బాధతో ద్రవించి పోయింది. మెల్లగా సిద్ధార్థ దగ్గరకు వచ్చాడు. అతనికి తన తనయుడు అన్యుడుగా తోచాడు. ఎంతో ఉన్నతంగా కనిపించాడు! ఎక్కడో చంద్రవంక ఆకాశంలో వ్రేలాడుతోంది! తండ్రి అడిగాడు "ఎంతసేపు నిలబడతావు?" అని.

"నిలబడే ఉంటాను, వేచి ఉంటాను."




"అలసిపోతావు సిద్ధార్థా..."

"అవును, అలసిపోతాను"

"నిద్రపోతావు..."

"నేను నిద్రపోను, వేచి ఉంటాను"

"చనిపోతావేమో?"

"పోవచ్చు!"

"అయితే నా ఆజ్ఞ కాదని నీవు చనిపోవటానికే సిద్ధపడుతున్నావా?"

"లేదు, మీ మాట ఎప్పుడూ జవదాటలేదు."

"అయితే, నీ నిర్ణయం మార్చుకో."

"అలాగే; మీరు చెప్పినట్లు చేస్తాను."

తండ్రి ధృవతారను చూశాడు. ఉదయపు తొలి వెలుగు ఆ గదిలో అప్పుడే ప్రవేశించింది!

తండ్రి సిద్ధార్థుణ్ణి పరీక్షగా చూశాడు. అతని కాళ్ళు సన్నగా వణుకుతున్నాయి కానీ ముఖంలో స్థిరత్వం పోలేదు. అతని విశాల నయనాలు ఎక్కడో చూస్తున్నాయి. అప్పటికి అర్థమయ్యింది, సిద్ధార్థుడు అప్పటికే తనని, ఇంటిని వదిలివేశాడని, అతనిని ఆపడం ఇక సాధ్యం కాదని!

మెల్లగా అతని భుజాన్ని తాకి "సిద్ధార్థ, సరే, నీవు వెళ్ళవచ్చు. సన్యసించి శ్రమణ జీవితంలో ప్రవేశించు నీ ఇష్టప్రకారమే. నీకు జ్ఞానోదయం అయితే, ప్రశాంతత చిక్కితే వచ్చి నాకు కూడా బోధించు.

నీకు అక్కడ కూడా భ్రమ, భ్రాంతులే ఎదురైతే తిరిగి వచ్చేయి. ఇక్కడ మన బ్రాహ్మణ విధులు నిర్వహించుదాం.

వెళ్ళు. వెళ్ళి నీ తల్లి పాదాలు స్పృశించి పయనమవు. ఉదయ సంస్కారానికి నాకు సమయమయింది."

తండ్రి సిద్ధార్థుణ్ణి వదిలి కదిలిపోయాడు! అప్పుడు సిద్ధార్థుడు కదిలాడు.

అతని కాళ్ళు మొద్దుబారి అడుగు పడలేదు. అయినా నిలద్రొక్కుకొని తండ్రికి అభివాదం చేశాడు. తండ్రి చెప్పినట్లు తల్లి దగ్గరకు వెళ్ళి అక్కడ నుంచి అప్పుడే రక్తప్రసరణ మొదలయిన పాదాలతో ఇంకా నిద్ర లేవని ఈ ఊరిని వదిలి అడవిలోకి పయనమయ్యాడు.

# అక్షర వైభవం

**– డా. యన్. విజయరాఘవ రెడ్డి**

"ఒక జాతి సజీవంగా ఉందో లేదో చెప్పడానికి ఆ జాతి చదువుతున్న పుస్తకాలే సాక్ష్యం. కానీ నేడు తెలుగునాట పుస్తక దుకాణాలు క్రమ క్రమంగా మూత పడుతున్నాయి. పుస్తకం చదవడం అనేది పాత తరం ముచ్చట కాదు, అది నేటి తరం యువత ఐటీ కారిడార్లలో గర్వంగా చెప్పుకునే ఒక 'ప్రీమియం లైఫ్‌స్టైల్' కావాలి. ఇది కేవలం ఒక వ్యాపార చర్చ కాదు... మన అస్తిత్వాన్ని, మన చైతన్యాన్ని కాపాడుకునే పోరాటం. పుస్తకం తెరిస్తే మనస్సు తెరుచుకుంటుంది... మరి మన మనస్సులు తెరుచుకోవడానికి సిద్ధంగా ఉన్నాయా?"

రైలు కూత వినపడగానే ప్లాట్‌ఫారమ్ మీదున్న బుక్ స్టాల్ వైపు పరుగు తీయడం... ఆదివారం వస్తే చాలు దాచుకున్న పాకెట్ మనీతో విజయవాడ ఏలూరు రోడ్డులోనో, హైదరాబాద్ అబిడ్స్ ఫుట్‌పాత్‌ల పైనో దొరికే అరుదైన పుస్తకాల కోసం గంటల తరబడి వెతకడం.. ఇదంతా ఒకప్పటి తెలుగునాట అక్షర వైభవం! చలం, విశ్వనాథ, శ్రీశ్రీ, యద్దనపూడి, యండమూరి, మల్లాదిల రచనలు తెలుగు గుండెల్లో ఆలోచనల తుఫానులు రేపిన రోజులవి. కానీ నేడు, ఆ పుస్తక దుకాణాలు మూత పడుతున్నాయి. కాంక్రీట్ జంగిల్లుగా మారుతున్న నగరాల్లో అక్షరాల పరిమళం కరువవుతోంది. పాశ్చాత్య దేశాలతో పాటు ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో Independent Bookstore Movement ఒక సరికొత్త ట్రెండ్‌గా మారుతుంటే, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇంకా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ఈ నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాల్సిన, తెలుగు అక్షరానికి మళ్లీ పట్టాభిషేకం చేయాల్సిన సరైన సమయం ఇదే! ఐరోపా నగరాల్లో కార్పొరేట్ కాఫీ షాపుల పక్కన పుస్తక దుకాణాలు వెలుస్తున్నాయి. అయితే, తెలుగు నేలపై ఈ సంస్కృతి వుంజుకోవాలంటే మనం కేవలం పాశ్చాత్య నమూనాలను నకలు చేస్తే సరిపోదు. మన సాంస్కృతిక మూలాల్లోకి వెళ్లాలి.




మన గ్రామాల్లో, పట్టణాల్లో ఒకప్పుడు 'అరుగు'ల మీద కూర్చుని కథలు, కబుర్లు చెప్పుకునేవాళ్లం. నేటి తరం పుస్తక దుకాణాలు ఆధునిక 'అరుగులు'గా మారాలి. అక్కడ కేవలం పుస్తకాలు అమ్మడం మాత్రమే కాదు... కొత్త రచయితల పరిచయాలు, కవిసమ్మేళనాలు, నాటక చర్చలకు అవి కేంద్రాలు కావాలి. పుస్తక దుకాణంలో అచ్చమైన తెలుగు ఫిల్టర్ కాఫీతో పాటు, మన సాంప్రదాయ చేనేత వస్తువులు, స్థానిక కళాకారుల పెయింటింగ్‌లు, తెలుగు సాహిత్య ఆడియో రికార్డింగ్‌లు లభించేలా చేయాలి. అది ఒక వ్యాపార స్థలంలా కాకుండా, 'తెలుగుతనానికి' ఒక సజీవ చిరునామాగా మారాలి.

టెక్నాలజీ మనకు శత్రువు కాదు, అద్భుతమైన మిత్రుడు. డిజిటల్ విప్లవాన్ని పుస్తక సంస్కృతికి వారధిగా మార్చుకోవాలి. స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలవుతున్న నేటి పిల్లల కోసం, ప్రతి పుస్తక దుకాణంలోనూ వారంతాల్లో ప్రత్యేక కథల కార్యక్రమాలు నిర్వహించాలి. బాల్యంలో నాటిన అక్షర బీజమే రేపటి తరాన్ని ఆలోచనాపరులుగా మారుస్తుంది. తెలుగు పుస్తకాలతో ఆకర్షణీయమైన రీల్స్ చేయడం, తాము చదివిన నవలలపై ఇన్‌స్టాగ్రామ్‌లో యువత విస్తృతంగా చర్చలు పెట్టడం వంటి డిజిటల్ ట్రెండ్స్ రావాలి. తెలుగు చదవడం ఒక విలాసవంతమైన, గౌరవప్రదమైన అలవాటు" అనే భావనను ఐటీ కారిడార్లు, కార్పొరేట్ వేదికల ద్వారా నేటి తరం యువతలోకి బలంగా తీసుకెళ్లాలి. ఇది కేవలం వ్యాపారం కాదు... జాతి చైతన్యం!

అమెజాన్ లాంటి గ్లోబల్ సంస్థలు కేవలం పుస్తకాలను మన ఇంటి గుమ్మం ముందుకు తెస్తాయి. కానీ ఒక భౌతిక పుస్తక దుకాణం మాత్రమే ఇద్దరు మనుషులను, రెండు విభిన్న ఆలోచనలను దగ్గర చేస్తుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖ, రాజమండ్రి ఇలా ప్రతి ప్రాంతంలోనూ మళ్లీ పుస్తక విప్లవం రావాలి. పుస్తకం మనిషిని ఒంటరితనం నుండి కాపాడుతుంది, సమాజానికి ప్రశ్నించే గుణాన్ని ఇస్తుంది. ఒక జాతి సజీవంగా ఉందో లేదో చెప్పడానికి ఆ జాతి చదువుతున్న పుస్తకాలే సాక్ష్యం. తెలుగు రాష్ట్రాల్లో ఈ సంస్కృతి మళ్లీ చిగురించడానికి మన ప్రచురణకర్తలు, రచయితలు, ముఖ్యంగా సాహిత్య అభిమానులైన యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. కేవలం లాభాల కోసమే కాకుండా, మన సాంస్కృతిక అస్తిత్వాన్ని బతికించుకోవడానికి 'మోడరన్ తెలుగు బుక్ కేఫ్‌లు' స్థాపించాలి. మూసిఉన్న పుస్తకశాలల తలుపులు మళ్లీతెరుచుకోవాలి. తెలుగుఅక్షరం మళ్లీ గలగలలాడాలి. మన ఇంట్లో, మన వీధిలో, మన నగరంలో ఒక కొత్త పుస్తక ప్రపంచాన్ని నిర్మించుకుందాం. ఎందుకంటే, పుస్తకం తెరిస్తే మనస్సు తెరుచుకుంటుంది. మనస్సు తెరుచుకుంటే సమాజం ప్రగతి వైపు నడుస్తుంది!

**డా. యన్. విజయ రాఘవ రెడ్డి**
ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, ఫోన్ : 9441239803

# రైతునేస్తం-పద్మశ్రీ డా. యడ్లపల్లి వెంకటేశ్వరరావు

- మిసిమి



డా. యడ్లపల్లి వెంకటేశ్వరరావు

**చి**న్నతనంలో యూరియా బస్తాలు మోసిన రైతుబిడ్డ అతను.. వ్యవసాయంలో కష్టం తెలుసు.. తన పంటతో అనుగ్రహించే రైతు గిట్టుబాటు ధరలేక ఎలా ఆగ్రహిస్తాడో చూసినవాడు.. రైతు వ్యాపారిగా మారితేనే లాభపడతాడు, తను పండించిన పంటకు ఫలితం దక్కుతుందన్న ఆలోచన అతనిలో ఎక్కడో గూడుకట్టుకుని ఉంది. పొట్ట చేతపట్టుకుని భాగ్యనగరం బాట పట్టాడు. డిటిపి ఆపరేటర్‌గా జీవితాన్ని 1989లో మొదలుపెట్టాడు.. 1995లో డిటిపి సెంటర్ పెట్టుకున్నాడు.. 2005లో రైతుకు సమాచారవాహికగా మారాడు.. రైతునేస్తం పత్రిక పెట్టాడు.. రైతులకు పురస్కారాలివ్వటం మొదలుపెట్టాడు.. రైతే తన జీవితలక్ష్యమయ్యాడు..2016నుంచి రైతునేస్తం ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాలలో చిరుధాన్యాలు సిరిధాన్యాలన్న కాన్సెప్టును ప్రచారం చేశాడు..మెచ్చిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.. ఇప్పుడు మిద్దెతోటల సాగుతో పట్టణాల ముఖచిత్రాలను మారుస్తున్నారు.. ఆయనే రైతునేస్తం వై. వెంకటేశ్వరరావు గారు.. సంకల్పం ఉంటే వ్యక్తి ఒక సామూహిక శక్తిగా ఎలా ఎదగవచ్చో నిరూపించిన రైతునేస్తం వై.వెంకటేశ్వరరావు గారితో **మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్ జరిపిన ఆత్మీయ సంభాషణ ఆశ్చర్యపోయే అంశాలను వెలికితీసింది.. చదివితే మీరూ ఔరా అనకమానరు. ఆ సంభాషణ నుంచి కొన్ని భాగాలు మీకోసం..

**మిసిమి :** **వెంకటేశ్వరరావు గారు నమస్కారం.. మిసిమికి స్వాగతం.. ఇది మా గ్రంథాలయం.. మీకు కనిపించే ఆ ఛాయాచిత్రం మిసిమి పత్రిక వ్యవస్థాపకులు ఆలపాటి రవీంద్రనాధ్ గారిది. ఇక మిమ్మల్ని ఆహ్వానించటానికి కారణం.. మీ గురించి ప్రజానీకానికి తెలిసిన విషయాలు కాకుండా నాకు కొన్ని సందేహాలున్నాయి. వాటిని గురించి అడగాలని ఉంది.. అడొగొచ్చు కదా..**

వెంకటేశ్వరరావు : తప్పకుండా అడగండి. ముందుగా నన్ను **మిసిమి** పత్రిక కార్యాలయానికి ఆహ్వానించినందుకు ధన్యవాదాలు..

**మిసిమి :** **మిమ్మల్ని భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. మీకు కె.ఎల్. యూనివర్శిటీ వారు గౌరవ డాక్టరేట్ ఇచ్చారు. మిమ్మల్ని చూస్తే మీకు నిండా అరవై నిండలేదు. మీరేమీ సినిమాలు తీయలేదు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లేవు. స్టార్టప్‌లు మొదలుపెట్టలేదు. మామూలు డిటిపి ఆపరేటర్‌గా జీవితాన్ని మొదలుపెట్టి ఇప్పుడు వందలమందికి ఉపాధి కల్పిస్తున్నారు. పురస్కారాలిస్తున్నారు. పధ్నాలుగు లక్షల మంది సబ్‌స్క్రైబర్స్‌తో ఛానెల్ నడుపుతున్నారు. మిద్దెతోటలు సాగుచేయిస్తున్నారు. రైతునేస్తం ఫౌండేషన్ నిర్వహిస్తున్నారు. ఇవన్నీ ఒంటిచేత్తో చేస్తున్నారు.. ఏ వనరులతో ఇన్ని పనులు చేస్తున్నారా అని నేను ఆశ్చర్యపోతుంటాను.. మీరు మాత్రం చిరునవ్వుతోనే ఉంటారు.. మిసిమి పాఠకులకు మీ అద్వితీయ ప్రస్థానం గురించి చెప్పండి.. అలాగే మీకెదురయిన కష్టాలు, నిరాశలు, అడ్డంకులు ఎలా అధిగమించారో చెప్పండి..మాకు రైతునేస్తమంటే ఎన్.జి.రంగాగారే..**

**వెంకటేశ్వరరావు :** నేను పుట్టింది, పెరిగిందంతా పల్లెటూరే.. చిన్నప్పటినుంచి పొలాలు, పశువులు (ఎక్కువ గేదెలే ఉండేవి. ఆవులు తక్కువ..) ఇలాంటి వాతావరణంలో పెరిగాను.. నాకు ఊహ తెలిసేనాటికి మా అమ్మ పాలు పితకటం చేసేది. రోట్లో జొన్నలు దంచేది. డెబ్భైల్లో మేము జొన్నన్నమే తినేవాళ్ళం. నేను ఎనిమిదిలోనో, పదవ తరగతిలోనో ఉన్నప్పుడు...చదువుకుంటున్నాడు కుర్రాడని నాకు వరి అన్నం పెట్టేవారు. నిజానికి నన్ను స్కూల్లో మూడో తరగతిలో వేశారు. అప్పటివరకు మా ఊళ్ళో ఉన్న పంతులు గారే అ,ఆలు నేర్పించి అవీ ఇవీ చెప్పేవారు. విజయవంతంగా అవి పూర్తి చేశాను.. మా గ్రామం పక్క హేమ్లెట్ పుల్లటిగుంటతోపు అని ఉండేది. అక్కడొక కాన్వెంట్ పెట్టారు.. ఆ కాన్వెంట్‌లో ఇంగ్లీషు మీడియం, తెలుగు మీడియం రెండూ ఉండేవి. ఒక మాస్టారు గారు ఆ కాన్వెంట్ పెట్టారు. నన్ను ఇంటర్వ్యూ చేసి వీడిని మూడులో వేసేయొచ్చు అని డిసైడ్ అయ్యారాయన. ఆయన చండశాసనుడు.పిల్లల్ని బాగా అదుపులో పెట్టేవాడు. కొద్దోగొప్పో నాకు మంచి హేండ్ రైటింగ్ వచ్చిందంటే ఆయనే కారణం.. అక్కడ ఐదు వరకు చదివాను. 1975-77వరకూ అక్కడ చదివి ఆరోతరగతికి గారపాటి స్కూల్లో చేరాను. అక్కడే పది వరకు చదివాను. రోజూ ఆరు కిలోమీటర్లు వెళ్ళటానికి నడక, తిరిగి రావటానికి ఇంకో ఆరుకిలోమీటర్లు నడక.. టెన్త్‌లో చివరి రోజుల్లో సైకిలు మీద వెళ్ళేవాడిని. జిల్లా పరిషత్తు హైస్కూల్.. గారపాటి స్కూలుగా ప్రసిద్ధి చెందింది. నాకు క్రీడలంటే ఆసక్తి ఉండేది. దానివలన బేస్ బాల్ ఆడేవాడిని, షటిల్ ఆటతో టచ్ ఉండేది, కబడ్డీ కూడా తెలుసు. అప్పుడప్పుడు టోర్నమెంట్స్‌కు స్కూల్ తరఫున వెళుతుండేవాడిని. గ్రామీణ వాతావరణంలో పెరగటం వలన పశువులంటే ఇష్టం. మా అమ్మ పాలు, పెరుగు గుంటూరు తీసుకెళ్ళి అమ్మేది. మా ఊరు గుంటూరుకి ఆరుకిలోమీటర్ల దూరంలో ఉండేది. మాకు మూడెకరాల వ్యవసాయముండేది. నాతోపాటు ముగ్గురు సిస్టర్స్ ఉండేవారు. నేను మూడో వాడిని. నా తర్వాత ఒక చెల్లెలు ఉంది. మాకు రెండు గేదెలుండేవి.. వాటినుంచి వచ్చే పాడి అమ్మిన ఆదాయంతోనే నా చదువు సాగింది. మా నాన్న వ్యవసాయం చేసేవాడు. ఆయనిది వానాకాలం చదువు. మా అమ్మ చదువుకోకపోయినా చాలా దక్షత కలిగింది. నా చదువు విషయానికి వస్తే ఎవరి ప్రోద్బలమూ లేదు. ఎవరి ప్రోత్సాహమూ లేదు. నా అంతట నేనే చదువుకోవాల్సిన పరిస్థితి. తెల్లవారుఝామునే మూడు, మూడున్నరకు లేచి కిరోసిన్ దీపం వెలుగులో చదివేవాడిని. గట్టిగా పైకి చదివేవాడిని, అందరికీ ఈడు చదువుతున్నాడని తెలియటం కోసం. నేనొక్కడినేకాదు..ఎవరు చదివినా ఇలాగే చదువుతుండేవాళ్ళు.అప్పటి గ్రామాల్లో పిల్లలు చదువుకునే ఇంట్లో వాతావరణం అలా ఉండేది. మా నాన్న ఆదివారం నాడు నన్ను పొలానికి తీసుకెళుతుండేవాడు.మావి మెట్టపొలాలు. ఎక్కువగా పత్తి, మిరప, పొగాకు పంటలేసేవాళ్ళు. నేను పొగాకు ఆకు తుంచటం, దబ్బనంతో ఆకులు గుచ్చటం వంటి పనులు చేసేవాడిని. మాది చిన్న ఇల్లయినా ఆ ఇంట్లోనే పొగాకును అణగదొక్కటం కోసం మండెలేసేవాళ్ళం. ఖాళీలేకపోతే ఆ మండెపైనే పడుకునేవాడిని. పొలం పనుల్లో కలుపు కూడా తీసేవాడిని. ఇన్ని పనులు చేస్తున్నా కాబట్టి.. అబ్బో ఈడు చాలా పనులుజేత్తన్నాడు అని ఊళ్ళోవాళ్ళు అనుకునేవాళ్ళు. మాఇంటికి అరకిలోమీటరు దూరంలో చెరువుండేది. అక్కడకివెళ్ళి కావిళ్ళతో నీళ్ళు మోసుకొచ్చేవాడిని. గేదెలకు మేత పెట్టడం.. ఇలాంటి పనులు కూడా చేస్తుండేవాడిని. పత్తి తెచ్చినప్పుడు ఖాతాల్లో లెక్కలు నాచేత రాయించేవారు. అలా నాకు.. వీడు బుద్ధిమంతుడు అనే పేరొచ్చింది. నేను టెన్త్ క్లాసు ఫస్ట్ క్లాసులో పాసయ్యాను.అన్ని సబ్జెక్ట్‌ల కంటే హిందీలో ఎక్కువ మార్కులొచ్చినయి.. బట్టీకొట్టి తెచ్చుకున్న మార్కులే కానీ, హిందీ చదవటం రాయటం బాగా వచ్చేది నాకు. గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో చేరినప్పుడు ఎమ్.పి.సి.తీసుకుందామంటే కొంచెం భయపెట్టారు. దాంతో సి.ఇ.సి.తీసుకున్నాను. నిజానికి నేను జె.కె.సి.కాలేజీ, రెడ్డి కాలేజీ, హిందూ

కాలేజీ..ఈ మూడుచోట్ల అప్లై చేశాను.అన్నిచోట్లా ఎమ్.పి.సి గ్రూప్ కోసమే అప్లై చేశాను. మిగిలిన రెండు కాలేజీల్లో సీటురాలేదు. హిందూ కాలేజీలో కూడా సీటు రెండో రౌండో, మూడో రౌండ్‌లోనో వచ్చింది. ప్రిన్సిపాల్ గారికి తెలిసినవారుంటే వారిద్వారా సి.ఇ.సి.లో చేరాను, ఎమ్.పి.సి.వద్దనుకున్నానని చెప్పానుకదా...

ఇంటర్మీడియెట్ సెకండ్ క్లాస్‌లో పాసయ్యాను. బి.కాం. కూడా అక్కడే చదివాను. బి.కాంలో థర్డ్ క్లాస్ వచ్చింది. గ్రామాలనుంచి వచ్చి గుంటూరులాంటి పట్టణాల్లో ఉండి చదువుకునే పిల్లలు ఎలా చదువుకుంటారో నేనూ అలానే చదువుకున్నాను. నాలో ప్రత్యేకత ఏమీలేదు. ఇలా చదువుకునే రోజుల్లో సినిమాలు చూసే అలవాటు కూడా ఉండేది. ఆరోజుల్లో సామాజిక అంశాలపై వచ్చిన చిత్రాలే ఎక్కువ చూసేవాళ్ళం. మళ్ళీ సాయంత్రానికి కళ్ళమ్మట నీళ్ళొచ్చేవి. ఇంట్లో వాళ్ళు చదువుకోమని పంపిస్తే నేనేం చేస్తున్నాను, డబ్బు వేస్ట్ చేస్తున్నాను అన్న గిల్టీ ఫీలింగ్ ఉండేది. తప్పు చేస్తున్నప్పుడు నా అంతరాత్మ నన్ను హెచ్చరించటం నాకు మొదటినుంచీ ఉండేది. నేను పొలంపనులు బాగా చేస్తుండేవాడిని. ప్రత్యేకించి పొలంలో కలుపు బాగా తీస్తుండేవాడిని. ఆదివారం వస్తే చాలు, నన్ను అడిగి మరీ తీసుకెళుతుండేవాళ్ళు. ఒక్క కలుపే కాదు పత్తి తీసేవాడిని. మిరప కోసేవాడిని. పత్తి తీసేటప్పుడు చేతి చివర్లు కోసుకుపోయేవి. మిరప కోయటం.. ఎండపెట్టడం, తిరగేయడం పనులు చేసేవాడిని. పొగాకు పంటకు సంబంధించి కూడా ఈ పనులు చేసేవాడిని. పదో పరకో చేతిలో పెట్టేవారు. నన్నెందుకు మా ఊళ్ళోవాళ్ళు ఇష్టపడేవారంటే నేను చాలా వేగంగా ఈ పనులన్నీ చేసేవాడిని. ఎండిన మిరపని గోతాల్లోకి తొక్కాలి. అవి మార్కెట్‌కు పంపేవరకు ఇంట్లో పెట్టుకోవాలి. ఇల్లంతా మిరప ఘాటుతో నిండిపోతుంది ఆ సమయంలో. అయితే గ్రామాల్లో ఇలాంటి పనులు చేసి చేసి ఆ వాసనకు, ఆ కష్టానికీ అలవాటుపడిపోతాం. ఎండాకాలం వచ్చిందంటే పత్తికట్టలు పీకేవాళ్ళం. ఆ పీకే పద్ధతిని కత్తెర అంటారు. మొక్కను పీకేముందు కింద కత్తెరేస్తారు. దాన్ని లాగినప్పుడు మొదలు నుంచి వచ్చేస్తుంది. ఇదెందుకు చేస్తారంటే హైబ్రిడ్ పత్తిమొక్కల ఎత్తు ఎక్కువ. ఒక్కో మొక్క ఐదారు అడుగులు ఉంటుంది. పీకటానికి అంత వెంటనే రావు.. ఎండాకాలంలో రాత్రిపూట వెన్నెల బాగా కాంతితో ఉంటుంది. మీరు చూస్తే పగలులానే ఉంటుంది. అందుకని రాత్రిపూట ఈ పత్తి మొక్కలను పీకేపని పెట్టుకునేవాళ్ళం. దీనితోటి చేతులు బొబ్బలెక్కుతాయి. రాత్రిచేయగా మిగిలింది పగలు చేసేవాళ్ళం. ఎండ పెరిగినకొద్దీ మళ్ళీ ఆ పనిని రాత్రికి మార్చేవాళ్ళం. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే గ్రామాల్లో రైతులుపడే కష్టం చూసినవాడిని. ఆరోజుల్లో యాభైకిలోల ధాన్యం మూటలు, యూరియా బస్తాలు కూడా మోశాన్నేను.



గౌ॥ భారత రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారం

మా ఇంటి దగ్గరనుంచి మా పొలం రెండుకిలోమీటర్లుంటుంది. వర్షాకాలంలో అంతా బురద బురదగా ఉంటుంది. ఆ బురదలోనే ఈ యూరియాబస్తాను తలమీద పెట్టుకుని తీసుకెళ్ళేవాడిని.

అప్పటికి కూడా గ్రామాల్లో మట్టి డొంకలే ఉండేవి. ఆ డొంకలన్నీ వర్షాకాలంలో బురదమయంగా ఉండేవి. ఇంకో విషయం చెప్పాలి.. ఆరోజుల్లో పొలంలోనే అన్నం తినాలంటే ప్లేట్లు ఉండేవి కావు.. చేతిలోనే ముద్దలు పెట్టేవాళ్ళు లేదా ఏదన్నా ఆకులో పెట్టేవాళ్ళు. ఇప్పటిలాగా అప్పుడు ప్లేట్స్ లేవు. అయినా చేతిలో ముద్ద పెట్టించుకు తినడం మాకు బాగా అలవాటుగా ఉండేది. పెరుగన్నం కన్నా మజ్జిగన్నం ముద్దలు పెట్టేవారు. అందులో మిరపకాయ నంజుకు తినేవాళ్ళం. పొలంలో గనిసిగడ్డలుండేవి. వాటిల్నే ఇప్పుడు చిలగడ దుంపలంటున్నారు. వాటిని పచ్చివి తినేవాళ్ళం.. మా చుట్టుపక్కల గ్రామాల్లో వాటిని ఉడకబెట్టుకుని తినేవాళ్ళు. దాంట్లో ఏదో ఒక పచ్చడి నంచుకుని తినేవాళ్ళం. ఆరోజుకి ఇక అదే భోజనం. అవి తింటే కడుపు నిండిపోయేది. ఆ గనిసి గడ్డల్ని పత్తిసాళ్ళల్లో కానీ మిరప చేలల్లో కానీ మధ్యలో వేసేవారు. మొదట్లో పొగాకు వేసేవారు. క్రమేణా దాని స్థానంలో మిర్చి పంట వచ్చింది.. మిర్చి పంట సాగుచేయడం చాలా కష్టం.. చాలా స్ప్రేలు కొట్టాలి. సైపర్ మిథిన్, ఎకలక్స్, నువాక్రాన్ ఇవన్నీ స్ప్రే చేసేవాడిని నేను. ఆ మందులకు ఘాటు చాలా ఎక్కువ కానీ అలవాటు పడిపోయేవాళ్ళం.. మాస్కులవీ ఇచ్చేవారు కానీ, ఎవరూ పెట్టుకునేవారు కాదు. అవి పెట్టుకోవాలంటే అసౌకర్యంగా ఉండేది. పత్తి చేలలో కింద పాములు తిరుగుతుండేవి. వాటిల్ని చూసుకుంటూ నడవాల్సి వచ్చేది. ప్రభుత్వమూ, శాస్త్రవేత్తలు జాగ్రత్తలు చెప్పేవారు కానీ పాటించేవాళ్ళం కాదు. పాముకు విరుగుడు కోసమని కారంచేడులో మెళ్ళో ఓ పాముదారం మంత్రమేసి కట్టేవారు. అందరం అది కట్టించుకునేవాళ్ళం. అదో నమ్మకం.

**మిసిమి :** **మీరు పత్తిపై నువాక్రాన్ లాంటి మందులు పిచికారీ చేసేవారు కదా. ఆ మందు ఘాటుకు పాములొచ్చేవా?**

**వెంకటేశ్వరరావు :** ఆ మందు ఘాటు కొన్నిరోజులేగా ఉండేది.. తర్వాత మళ్ళీ మామూలే. పాములకు కూడా మనుషులంటే భయమే. అలికిడి చేసుకుంటూ వెళ్ళేవాళ్ళం.. ఆ అలికిడికి వెళ్ళిపోతుండేవి. వాటినేం చేయకపోతే అవి మనల్నేమీ చేయవు. ఆ దారం కట్టుకునే సంప్రదాయం ఇప్పటికీ కూడా కారంచేడులో నడుస్తోంది. మనకి హైదరాబాదులో బత్తినగౌడ్ గారి కుటుంబంలా అక్కడ రెండు కుటుంబాలు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాయి. చుట్టుపక్కల గ్రామాల వారందరూ దానికోసం కారంచేడుకు వస్తారు. ఎనభై ఎనిమిది (1988) లో నా డిగ్రీ అయిపోయింది. ఎనభై తొమ్మిదిలో నేను హైదరాబాద్ వచ్చాను. సంవత్సరం ఆలస్యంగా హైదరాబాద్ రావటానికో కారణముంది. అప్పట్లో గుంటూరుకు వెళ్ళే రోడ్డొకటి మాఊరిగుండా వేస్తుంటే చిన్న అడ్డంకి వచ్చింది. అప్పుడు నేను ఆ గ్రామాలు తిరిగి వాళ్ళకి వివరించి ఒప్పించి దానికి కావలసిన నిధులు సేకరించాను. అలా మా ఊరి డొంక గుండా రోడ్డుపడింది. ఇప్పుడు బస్సులు తిరుగుతున్నాయి.. ఆ పని పూర్తయ్యాక ఎనభై తొమ్మిది జూన్‌లో హైదరాబాద్ వచ్చాను.

**మిసిమి :** **హైదరాబాద్ ఎందుకొచ్చారు?**

**వెంకటేశ్వరరావు :** ఎందుకొచ్చానంటే... కారణం చెప్పటం కష్టం.. ఒక కారణం.. ఉద్యోగమంటే ఆరోజుల్లో అందరూ హైదరాబాదే వెళ్తుండేవారు. క్రేన్ వక్కపొడి అధినేత గ్రంధి సుబ్బారావు గారిది మా ఊరే. మా ఊరినుంచే ఆయన గుంటూరు వచ్చారు. నాకేమైనా అక్కౌంట్స్ రాయటానికి అవకాశమిస్తారేమోనని వెళ్ళి కలిశాను. చూద్దామన్నారు కానీ ఇవ్వలేదు. మా ఊరి ఆయనే అయినా మా ఊరివాళ్ళకు ఒక్క ఉద్యోగం కూడా ఆయన ఇవ్వలేదు. నేను మా ఊరిలో ఒక పెద్దాయనను తీసుకెళ్ళి కలిశాను. ఉద్యోగం ఇవ్వకపోవటానికి ఆయన కారణాలు ఆయనకి ఉండొచ్చు. ఇక్కడుంటే వీడు ఉద్యోగం చేయడు..ఆపని, ఈపని అంటూ తిరుగుతాడని మా అమ్మ హైదరాబాద్ వెళ్ళమంది. అదీ నేను హైదరాబాద్ రావటానికి కారణం..మా ఇంటి పక్కనున్న పెద్దాయన తమ్ముడు హైదరాబాదులో

ఉంటే వచ్చి మల్కాజిగిరిలో ఉన్నాను. 1989 జూన్‌లో వచ్చాను. అప్పుడు బ్రహ్మర్షి విశ్వామిత్ర షూటింగ్ జరుగుతోంది. ఓ పదిహేను రోజులు రికామీగా తిరిగాను. అప్పుడే జూబిలీహిల్స్ రోడ్లన్నీ రూపుదిద్దుకుంటున్నాయి. జూబిలీహిల్స్ రోడ్ నెంబర్ 45లో ఒక ఇంటర్వ్యూకి వెళ్ళాను. ఇంటర్వ్యూచేసే ఆయన నీకు ఇంగ్లీష్ వచ్చా అని అడిగాడు. మనం చదివింది తెలుగు మీడియం.. మనకంత పరిజ్ఞానం లేదు. అదే చెప్పాను. మాకు ఇంగ్లీష్ వచ్చి ఉండాలన్నాడాయన. అంతకు ముందు నేను మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు కూడా ఇంగ్లీషొచ్చా అని అడిగారు. టై కట్టుకుని షూ వేసుకుని వెళ్ళి చూడటానికి బావున్నా, ఇంగ్లీషు రాకపోవటమే సమస్య. జూబిలీహిల్స్‌లో ఆ ఇంటర్వ్యూ తన్నేశాక రాజ్‌భవన్ రోడ్డులో ఒకాయన దగ్గర చేరాను.. నా పని లెడ్జర్ రాయటం.. ఆయన దగ్గర రెండునెలలే ఉన్నాను. ఈ రెండు నెలల్లో నాకర్థమయిందేమిటంటే నాకింకా విషయపరిజ్ఞానంలో మెచ్యురిటీ లేదని తెలిసింది... మనదింకా విలేజ్ స్టైలే కానీ, పట్టణాల్లో ఎలా ఉండాలన్న అవగాహన రాలేదు..

నేను అక్కౌంటెంట్‌గా రెండునెలలు పనిచేసిన కంపెనీ పేరు మార్విన్ ఇన్వెస్టిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్. నేనక్కడ అక్కౌంటెంట్ దగ్గర లెడ్జర్ రాసే పనికి కుదిరాను. ఆ కంపెనీ ప్రవచనాలు చెప్పే గొట్టిపాటి సత్యవాణి గారి మరదిగారిది. ఆ రెండునెలల కాలంలోనే స్వీట్స్ పుల్లారెడ్డి గారు అక్కడికి వచ్చారు. ఆయన, సత్యవాణి గారు విశ్వహిందూపరిషత్‌లో కలిసి పనిచేస్తుండేవాళ్ళు. నాకు మెచ్యురిటీ రాలేదని చెప్పాకదా.. అదెందుకో చెబుతాను.. నన్నోరోజు అర్జంట్‌గా బ్యాంకుకు వెళ్ళి డిమాండ్ డ్రాఫ్టు తీసుకోమన్నారు. తీసుకొని వస్తుంటే మా ఊరతను ఒకతను తారసపడ్డాడు.. ఇద్దరం కబుర్లలో పడిపోయాం.. లంచ్ చేసి ఆఫీస్‌కు వెళ్ళేసరికి మూడు దాటిపోయింది. ఆయనేమో త్వరగా తీసుకురమ్మన్నాడు. నేను ఆలస్యం చేయడంతో ఆయన నన్ను తిట్టాడు. ఈ సంఘటన వలన సమయపాలన ఎంత ముఖ్యమో తెలిసొచ్చింది. ఈలోగా ఇక్కడ అరుణా అపార్ట్‌మెంట్స్‌లో తెనాలి శాసన సభ్యుడు  కొడాలి వీరయ్యచౌదరి తమ్ముడి కొడుకు ఇంకో ఇద్దరితో కలిసి డిటిపి సెంటర్ పెట్టాడు. ఇది ఎక్కడంటే రెడ్ హిల్స్ దగ్గరున్న కేన్సర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న అరుణా అపార్ట్‌మెంట్స్‌లో పెట్టాడు. నన్ను టెస్ట్‌కు రమ్మన్నారు. నాకు అప్పటికే డిగ్రీ రోజుల్లో తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చు.. నేను టైపింగ్‌లో తెలుగులో పాసయ్యా.. ఇంగ్లీష్‌లో ఫెయిల్ అయ్యాను. ఆ రోజుల్లో ఫెయిల్ అయినా సర్టిఫికెట్ పంపేవారు. అదో విచిత్రం..

ఆరోజు నన్ను పిలిచారు.. నాకు తెలిసిన చుట్టాల ద్వారా కలవటంతో వాళ్ళు నన్ను పిలిచారు. కంప్యూటర్ నాముందు పెట్టి టైపు చేయమన్నారు. ఏడు పేజీలు గంటలో టైపు చేసేశాను. వాళ్ళు నన్ను గమనించారు. ఇతను టైపింగ్ స్పీడుగా చేయగలడని వాళ్ళకు అర్థమయింది..ఈలోగా కరెంట్ పోయింది. అప్పటివరకూ టైపు చేసింది సేవ్ చేయాలని నాకు తెలియకపోవటంతో నా ప్రయత్నమంతా వృథా అయిపోయింది. ఫర్వాలేదు.. నీకు టైపింగ్ బానేవచ్చు అన్నాక ధైర్యమొచ్చింది.. రేపటి నుంచి వచ్చేయమని చెప్పటంతో ఊపిరి పీల్చుకున్నాను.

నేను కంప్యూటర్ మోజులో పడిపోయి, నేను పనిచేస్తున్న కంపెనీ వాళ్ళకి చెప్పకుండా ఇక్కడ డిటిపి సెంటర్‌లో చేరిపోయాను. అప్పట్లో కమ్యూనికేషనంతా ల్యాండ్ ఫోన్లే కదా.. నేను అక్కడకి వెళ్ళకపోవటంతో మా బాబాయ్ ఫోన్ చేసి అడిగాడు. నువ్వా అక్కౌంట్స్ ఆయన దగ్గరకు వెళ్ళటం లేదేమిటి అని.. మా కంపెనీ ఆయన మా బాబాయ్‌కి ఫోన్ చేసి అడగటంతో మా బాబాయ్ నన్నడిగాడన్నమాట. బాబాయ్..ఇంకోచోట చేరానని చెప్పగానే ..ముందు మీ పాత కంపెనీ ఆయనకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పు..ఆయన కంగారుపడుతున్నాడని చెప్పగానే ఎస్టీడిబూత్‌కు వెళ్ళి ఆయనకు ఫోన్ చేశాను. ఆయన మళ్ళీ తిట్టాడు. నువ్వు వెళ్ళొచ్చు.. తప్పులేదు.. ఇంకో జాబ్‌లో చేరొచ్చు. కానీ నువ్వు పనిచేసే సంస్థ వాళ్ళకి చెప్పి కొత్తచోట చేరాలని క్లాసు

పీకాడు. బాధ్యతగా ఉండాలి అనేది ఆయన దగ్గర నేర్చుకున్నాను. అక్కడ చేరాక ఇంకో గుంటూరు కుర్రాడు అక్కడ అప్పటికే ఉన్నాడు. అతని టైపింగ్ యమ స్పీడు. కళ్ళు మూసుకుని కొట్టేసేవాడు. అతని పేరు రాధాకృష్ణ. అలాంటివాడి దగ్గర నేను పడ్డాను. వీడు పనికొస్తాడు అనుకున్నట్టున్నాడు. కొన్ని టిప్స్ నాకు చెప్పాడు. కానీ అతనికి ఆర్నెల్లకే బెటర్ ఉద్యోగం రావటంతో వెళ్ళిపోయాడు. కొంత మా బాసులే జాలిపడో, అవసరం కోసమో నాకు పని నేర్పారు.. పగలు రాత్రి తెలియకుండా నేను కష్టపడ్డాను. అప్పటికింకా కంప్యూటర్‌లో మౌస్ ఉపయోగించేవారు కాదు.. కంప్యూటర్ ముందు పగలూ రాత్రి తేడా లేకుండా కూచుని, కూచుని..సంవత్సరం తిరిగేలోగా నాకు కళ్ళజోడు వచ్చేసింది.. నాముందు పనిచేసిన కుర్రాడు పగలంతా అటు ఇటు తిరిగి రాత్రిపూట పని చేసేవాడు. టాలెంటెడ్ కుర్రాడని బాసులు కూడా ఏమీ అనేవారుకాదు.. కరెక్షన్స్ కోసం కస్టమర్స్ సాయంత్రం వచ్చేవారు.. అలా పగలురాత్రీ తేడా లేకుండా అతనితోపాటు కష్టపడ్డాను. నేర్చుకోవాలన్న తపనే నన్ను కాపాడింది. రెండేళ్ళ తర్వాత నన్ను లేజర్ గ్రాఫిక్స్ వెంకటేశ్వరరావు అని పిలవటం మొదలుపెట్టారు. ఈలోగా తొంభై ఒకటిలో నాకు పెళ్ళయింది.. అప్పుడే నాతో ఉన్నతను వెళ్ళిపోవటంతో కరెక్షన్స్ బాధ్యత కూడా నామీద పడింది. అప్పుడు హిందీ టైపింగ్ కూడా అవసరమయింది. నాకు హిందీ చదవటం, రాయటం వచ్చు.. కానీ టైపింగ్ రాదు. నాకోసమని టైప్ రైటర్ తెప్పించి నన్ను అర్జంట్‌గా నేర్చుకోమన్నారు. కాస్త పట్టు చిక్కింది. ITC కంపెనీ వాళ్ళు వాళ్ళ వార్షిక నివేదిక టైపింగ్ కోసం మా దగ్గరకి వచ్చారు.. అది వంద పేజీలుంటుంది. హిందీలో కూడా టైప్ చేసిమ్మని అడిగారు. నేనే టైప్ చేస్తూ కరెక్షన్స్ చేసుకున్నాను. నాకో ప్రాక్టీసు టెస్ట్ లాంటిదది. అదే సమయంలో  పి.వి.నరసింహారావు గారు ప్రధానమంత్రిగా ఉన్నారు.. వారు దక్షిణభారత హిందీ ప్రచార సభ వారిచేత ఒక హిందీ వాచకంలాంటిది తయారుచేయించారు. ఆ ప్రాజెక్ట్ మొదలెట్టినతను మధ్యలో వెళ్ళిపోవడంతో ఆ వర్క్ నాదగ్గరకే వచ్చింది. దాదాపు నాలుగొందల పేజీల పుస్తకమది..హిందీ ప్రచార సభ వాళ్ళు ఇద్దరు మనుషలను ఈ పనికోసమని నా దగ్గరకి పంపించారు. వాళ్ళు నెలరోజులు నా దగ్గరుండి ప్రూఫ్ రీడింగ్ అదీ చూశారు. దానివలన వారితో నాకు వాళ్ళతో మంచి స్నేహం ఏర్పడింది.. తర్వాత నేను హిందీప్రచార సభ వారి ఆఫీసు కాంప్లెక్స్‌లోనే ఉండటానికి కారణమయింది..

1989-94 వరకు నేను లేజర్ గ్రాఫిక్స్‌లో ఉన్నప్పుడు చాలామంది నన్ను వారి సంస్థలోకి తీసుకెళదామని ప్రయత్నించారు. నేను 1989లో 1300 రుపాయలకు చేరాను. నన్ను తమ సంస్థ కోసం అడిగినవారు ఐదువేలిస్తాం రమ్మనేవారు. అప్పటికి ఐదువేలు చాలా ఎక్కువ. నా పెళ్ళయ్యే సమయానికి నా జీతమెంతనుకున్నారు.. పదిహేను వందలే.

జీవితంలో కొన్ని ఇబ్బందులు కూడా చూశాను. నేను బి.హెచ్.ఇ.ఎల్.లో పనిచేసేవారమ్మాయినే చేసుకున్నా. నా పెళ్ళయిన కొత్తలో ఎస్.ఎఫ్.సి. వాళ్ళు నేను పనిచేసే సంస్థను కొంతకాలం మూసేశారు. మా బాసులకు ఎస్.ఎఫ్.సి.తో లోన్ గొడవ ఉంది.. ఈ సంస్థను పెట్టిన వాళ్ళు యంగ్ స్టర్స్.. మూడులక్షలతో మొదలుపెట్టారు. తలో యాభైవేలు వేసుకుని స్టార్ట్ చేశారు. వాళ్ళ తండ్రులు చాలా జాగ్రత్తగా ఉండేవారు. వీళ్ళు కుర్రకారు..లోన్ విషయం పట్టించుకోకుండా షికార్లు చేశారు. దాంతో దెబ్బపడింది. మరి నాపరిస్థితేమిటి.. కొత్తగా పెళ్ళయ్యింది. పెళ్ళవగానే ఉద్యోగం పొయిందని అనుకుంటారని నేను రోజూ బి.హెచ్.ఇ.ఎల్.నుంచి వచ్చి సాయంత్రం దాకా ఉండి వెళుతుండేవాడిని. ఇలా పదిహేనురోజులు గడిచాక మళ్ళీ మా సంస్థను తెరిచారు. ఊపిరి పీల్చుకున్నాను.. ఈ డిటిపి చేస్తున్నప్పుడే నాకు నవ్య ప్రింటర్స్ రామకృష్ణారెడ్డి గారు, పిఓడబ్ల్యు సంధ్య గారు పరిచయమయ్యారు. దానివలన విప్లవ సాహిత్యం తెలిసింది. అంతకుముందు మా ఊళ్ళోనే కొంత లెఫ్ట్ వర్గాలపట్ల అవగాహన ఉండేది. దానితోటి కమ్యూనిజం ప్రభావం నామీదుండేది. అందుచేత కులమతాల పట్టింపులు నాకుండేవి కాదు. నా చిన్నప్పటి

సంఘటన ఒకటి చెబుతాను. మా గ్రామంలో, మా ఇంటి దగ్గర్లో ఒక బావి ఉండేది.. అది ఉప్పునీళ్ళ బావి. మా ఊరే కాదు, గుంటూరు చుట్టుపక్కల గ్రామాల్లో ఉప్పునీళ్ళ బావులే ఉండేవి. తాగటానికి చెరువు నీళ్ళు వాడేవాళ్ళం. మిగిలిన అన్ని అవసరాలకు ఉప్పునీళ్ళే వాడుతుండే వాళ్ళం. ఈ ఉప్పునీళ్ళ బావికి మాదిగపల్లి నుంచి వచ్చేవాళ్ళు. వాళ్ళకి వీళ్ళు నీళ్ళు పోసేవాళ్ళు కాదు. ఎవరైనా తోడి పోయాల్సిందే.. కానీ వాళ్ళు తోడుకోవటానికి లేదు. ఆ బావి బ్రాహ్మిన్స్ బావి. వెంకట అంజయ్యగారి బావి అంటారు. అలాంటి సమయంలో నేను నీళ్ళు తోడి నీళ్ళు వాళ్ళ బకెట్లలో పోసేవాడిని. ఎవరైనా పోసేవరకు వాళ్ళు అలాగే ఉండాల్సిందే. ఎవరో ఒకరో ఇద్దరో పోసేవారంతే... మేం చదువుకునేందుకు గుంటూరు బస్సుల్లో వెళ్ళేటప్పుడు మాలపల్లి నుంచి, మాదిగపల్లి నుంచి పిల్లలు ఎక్కేవాళ్ళు కాబట్టి మనకు కులమతాల పట్టింపులేదు. నేను హైదరాబాద్ వచ్చినప్పుడు కూడా ఎస్సీల ఇంట్లోనే అద్దెకుండేవాడిని. ఇక్కడ ఎవరు ఏం కులమో తెలీదు.. అడగరు కూడా. అలాగే నేను గుంటూరు హిందూ కాలేజీలో చదువుకునేటప్పుడు విద్యార్థి సంస్థ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SFI)లో తిరుగుతు ఉండేవాడిని. కరప్షన్‌కు వ్యతిరేకంగా పోరాడటం ఇష్టంగా ఉండేది. అలా అని గుడికి వెళ్ళటం మానేవాడిని కాదు.. చిన్నప్పటి నుంచి గుడికి వెళ్ళినా భక్తికన్నా ప్రసాదమంటేనే ఇష్టం.. మా ఊళ్ళో సాయంత్రం పూట గుగ్గిళ్ళు పెట్టేవారు. హైదరాబాద్‌లో కూడా గుడికి వెళుతుంటాను కానీ కోరికలతో కాదు. ఇదిలా ఉంటే మా ఆఫీసు బాసులు ఆఫీసును పట్టించుకోకపోవటంతో నువ్వు సొంతంగా పెట్టుకో అని ఇద్దరీ ముగ్గురు మిత్రులు సలహా ఇచ్చారు. ఈ సలహా నాకు 1994లో ఇచ్చారు. ఈ మధ్యలో వేరేవాళ్ళు నాకు ఆఫర్ ఇచ్చినా నేను వెళ్ళలేదు. నా స్థిర నిర్ణయం ఏమిటంటే.. చేస్తే ఇక్కడే చేస్తా..వేరేచోటకు వెళ్ళను. కావాలంటే సొంతంగా పెట్టుకుంటా.. ఇది నేను నిర్ణయించుకున్న నా ప్రణాళిక. నాకు ఉద్యోగం ఇచ్చిన వాళ్ళని వేరేవాళ్ళ కోసం ఎందుకు వదిలి వెళ్ళాలి అనేది నా పాయింట్.. నేను వెళ్ళిపోతానని ఆర్నెల్ల ముందునుంచి వాళ్ళకి చెబుతూనే వచ్చాను.. దాన్ని వాళ్ళంత సీరియస్‌గా తీసుకోలేదు. చివరికి ఒకరోజు వచ్చే నెలనుంచి రానని చెప్పాను. వాళ్ళు నువ్వే నడుపుకో అని ఆఫర్ కూడా ఇచ్చారు. నేను వచ్చేసిన తర్వాత నెమ్మదిగా అది మూతపడింది.. కాక్టన్ ప్రింటర్స్ వారు ఎక్కువిస్తాం రమ్మన్నా అందుకే వెళ్ళలేదు. అలా అని సొంతంగా నా వ్యాపారం మొదలుపెట్టడానికి నా దగ్గర ఫైనాన్స్ లేదు. మా అత్తగారు వాళ్ళు నాకిచ్చిన మూడెకరాల్లో ఎకరన్నర మా చెల్లెళ్ళ పెళ్ళికి ఖర్చయిపోయింది. ఒక ఎకరం అప్పుల కోసం ఉంచేశా. ఇక మిగిలింది అరెకరం.. మా మామగారు ఆ అరెకరం అమ్మి నాకు లక్షా పాతికవేలిస్తే , నేనింకో లక్షా పాతికవేలు భాగ్యనగర్ కోపరేటివ్ బ్యాంకు నుంచి తీసుకున్నాను.. ఆ బ్యాంకు ఛైర్మన్‌కు సరూర్‌నగర్‌లో ప్రెస్సుంది. లెటర్ ప్రెస్ అది. ఆయనకు డిటిపి సెంటర్ పెట్టాలని కోరిక.. ఆయనో కండీషన్ పెట్టాడు. నువ్వు నాకో కంప్యూటర్ ఇప్పించాలా, ఒక డిటిపి ఆపరేటర్‌ని చూపించాలా అన్నాడు. లోన్ ఇచ్చాడు. కాబట్టి ఆయన అడిగిన రెండూ నేను సమకూర్చాను. నేనూ కూడా ఒక కంప్యూటర్, ప్రింటర్ కొనుక్కుని లక్డీకాపూల్ బ్రిడ్జ దిగంగానే కుడివైపు అలంకార్ మెస్సని ఉండేది.. నాకు ఆ మెస్సువాళ్ళు పరిచయం.. తర్వాత ఆ మెస్ మూసేశారు కానీ అక్కడ నేను నా బిజినెస్ కోసం రూం తీసుకోగలిగాను.. ఈలోగా ఇంకో వ్యక్తిని రిక్రూట్ చేసుకున్నాను. అతనిపేరు వెంకట్.. డిజైనర్.. ఇప్పటికీ నా దగ్గరే ఉన్నాడు. డాన్ బాస్కో స్కూల్‌లో చేస్తుండేవాడు. నా సంస్థ పేరు వి.యస్.యస్.లేజర్ గ్రాఫిక్స్ అని పెట్టా. వి అంటే వెంకటేశ్వరరావు, ఎస్ అంటే సుధారాణి, ఇక ఎస్ అంటే శ్రవణ్ అని మా అబ్బాయి పేరు కలిసొచ్చేట్టు పెట్టాను. ఇప్పటికీ ఆ పేరు ఉంది..బిజినెస్ చేయటం లేదు కానీ PAN కార్డులో ఆ పేరే ఉంది. అప్పటికింకా PC లు రాలేదు. యాపిల్-మేకింతోష్ (Apple-Macintosh) కంప్యూటర్లే వాడేవాళ్ళం.. ఖరీదు ఎక్కువ.. కాకపోతే వాడుకోవటం చాలా సులభం. రెండువేల సంవత్సరం వరకూ అక్కడే నా బిజినెస్

నడిపాను... మధ్యలో ఇక్కడ బాగా దుమ్ము వస్తుండటం వలన ఎదురుగుండా ప్రగతి లైన్‌లోకి మారాను. అక్కడే కంటిన్యూ అయిపోయాను.. అప్పుడంతా డే&నైట్ షిఫ్టులుగా పనిచేసేవాళ్ళం. ఒక నలుగురు ఆపరేటర్లను పెట్టాను. వెంకట్ ఈవెనింగ్ వచ్చేవాడు. మేము ఎక్కువగా బుక్ వర్కే చేసేవాళ్ళం. అప్పటికింకా కలర్ డిజైనింగ్ రాలేదు. బ్లాక్&వైట్‌లోనే వర్కంతా చేసేవాళ్ళం. 1998-99 పీరియడ్‌లో కలర్ డిజైనింగ్ వచ్చింది. నేను అవినీతికి వ్యతిరేకమని చెప్పాను కదా.. నేను సొంతంగా చేస్తున్నప్పుడు కొంతమంది ఏదైనా గవర్నమెంట్ జాబ్ వర్క్ చేస్తే డబ్బు ఆశిస్తూ ఉండేవారు. అది నాకు బాధ కలిగించేది. అట్లా రెండువేల సంవత్సరం వరకు ఏదోరకంగా మేనేజ్ చేసి నడిపించాం..1998లో ఒకచిన్న సింగిల్ కాలమ్ ప్రింటింగ్ మెషీన్ తీసుకున్నాను. ఇంతకుముందు హిందీ ప్రచార సభ వాళ్ళతో పరిచయం ఏర్పడిందని చెప్పానుకదా. వాళ్ళకి స్రవంతి అనే హిందీ మేగజీన్ ఉండేది. వాళ్ళకో లెటర్ ప్రెస్ ఉండేది. అందులో ప్రింటయ్యేది. నేనే కంపోజ్ చేసేవాడిని. ప్రింటింగ్ వాళ్ళ ప్రెస్‌లో జరుగుతుండేది. నేను కొన్న ప్రెస్‌ను వాళ్ళ అనుమతితో ఇక్కడే ఇప్పుడున్న నేచురల్ ప్రొడక్ట్స్ షాపు ప్లేసులో ఏర్పాటు చేశాను.. ఈలోగా వాళ్ళు ప్రెస్ తీసేశారు. తర్వాత ఆంధ్రాబ్యాంక్‌కి అద్దెకిచ్చారు. తర్వాత నా ప్రెస్ పెట్టుకోవడానికి ఒప్పుకున్నారు. 94లో వ్యాపారం మొదలుపెట్టిన నేను 2000 సంవత్సరం వరకు ఏమీ సంపాదించలేదు.. సంపాదించలేదా అంటే కొన్ని సౌకర్యాలు ఏర్పడ్డాయి. అందులో మారుతి 800 కారొకటి.. మెహదీపట్నంలో ఒక ఫ్లాట్ కొన్నాను.. అదికూడా పెంట్ హౌస్.. కాస్త చవగ్గా వచ్చిందని కొన్నాను.. అంతే..ఇవి నేను సంపాదించుకున్నవి..

రెండువేల సంవత్సరంలో నాకో ఎదురుదెబ్బ తగిలింది. ఒక పత్రిక వాళ్ళు నాకు పోస్టర్స్, డైరీలు ఆర్డర్ ఇచ్చారు. వాళ్ళు చేసిన misuse వలన నాకు పదిలక్షల నష్టం వాటిల్లింది. వాళ్ళ దగ్గర నేను అడ్వాన్స్ తీసుకోలేదు. వాళ్ళడగినవి వేరే ప్రెస్‌లో ప్రింట్ చేయించా.. వాళ్ళ misappropriation వలన నాకు డబ్బులాగిపోయాయి. అప్పటికి నాకు మల్టీకలర్ ప్రింటింగ్ లేదు. అలాంటి సమయంలో నాకు పది లక్షల నష్టం. అప్పుడు నాకు జ్ఞానోదయం అయింది. అప్పుడు దాకా నాకు వాస్తు గురించి ఆలోచన లేదు. అవగాహన లేదు. ఒక స్నేహితుడు వెంకటరమణ డిజిటల్స్ అనే సంస్థ నడుపుతుండేవాడు. వాళ్ళు కంప్యూటర్స్ సర్వీసింగ్ చేసేవారు. వాళ్ళొక డిజిటల్ పెడదామనుకున్నారు.. నేను లేజర్ గ్రాఫిక్స్ వలన లక్డీకాపూల్ ఏరియాలో అందరికీ బాగా తెలుసు. నేను కూడా డిజిటల్‌కు సిద్ధమయ్యాను..ఈలోగా మా పాతబాస్ వచ్చి తనుకూడా డిజిటల్ పెట్టాలనుకున్నట్టు చెప్పాడు.. ఫైనాన్స్ సమస్యొచ్చి ఆయన వెనక్కి తగ్గాడు. నేను కూడా వెనక్కి తగ్గాను. డిజిటల్స్ పెడదామని నేను తీసుకున్న షాపు వెంకటరమణా డిజిటల్స్ వాళ్ళకిచ్చేశాను.. వెంకటరమణ డిజిటల్స్ పరశురాం తనకోసం వాస్తు చూపించుకుంటూ నాక్కూడా సలహా ఇచ్చాడు.. చూపించుకుంటే బావుంటుంది కదా అని.. చూపిస్తే నష్టమేముందని సరే అన్నాను.. బహుశా 94 నుంచి 2000వరకు నేను బిజినెస్‌లో ఉండి ఏమీ సంపాదించలేదన్న అసంతృప్తి నన్ను వాస్తువైపు నడిపిందేమో అనిపిస్తుంది.

**మిసిమి :** **మీకు స్నేహితులంటూ ఏర్పడ్డారా..మీ వ్యాపారం వాళ్ళని మినహాయించి!**

**వెంకటేశ్వరరావు :** బిజినెస్ వాళ్ళు కాకుండా నాకు స్నేహితులంటే పుస్తకాలు ప్రింట్ చేసేవాళ్ళే.. కవులు, రచయితలు నాకు పెద్దగా పరిచయం లేదు. కానీ వామపక్షం వాళ్ళతోటి పరిచయాలున్నాయి. వాళ్ళకు నేను చాలా వర్క్ చేసిపెట్టాను. వాళ్ళ పత్రికలు కూడా టైప్ చేసి పెట్టాను. వాళ్ళు చేసే సర్వీస్ గురించి తెలిసింది నాకు. మళ్ళీ వాస్తు దగ్గరకు వస్తే, వాస్తు చూసేవాళ్ళు చెప్పిన మార్పులు చేశాక మల్టీకలర్ ప్రింటింగ్ మెషీన్ కొన్నాను (ఆ మార్పుల కోసం హిందీ ప్రచార సభ వాళ్ళను ఒప్పించాను. ప్రెస్ పైన ఆఫీస్ కట్టుకున్నాను). సాహిత్య పత్రికలు, పుస్తకాలు వేస్తున్నప్పుడు నాకు కూడా ఒక పత్రిక పెట్టాలని కోరిక గలిగింది. ఆ పత్రిక వ్యవసాయానికి సంబంధించింది

అవ్వాలని బలంగా అనిపించింది. అప్పటికే జర్నలిస్టులు మిత్రులుగా ఉండేవారు. కమర్షియల్‌గా పెట్టమని సలహా ఇచ్చారు కానీ నేను వినలేదు.. ఏదైనా రైతుకు సాయం చేయాలనేది నా కోరిక. వ్యవసాయ పత్రిక రైతుకు ఉపయోగపడుతుందని నమ్మాను...అలా రైతునేస్తం పత్రికకు 2005వ సంవత్సరంలో అంకురార్పణ జరిగింది..మొదటి సంచికను ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. ముందునుంచి కూడా నాకు మనం ఏది చేసినా కొత్తగా ఉండాలి. అది ముందుచూపు కలిగి ఉండాలని అనుకునేవాడిని. అప్పటికి మార్కెట్‌లో వ్యవసాయంపై పత్రికలున్నాయి. నా పత్రిక వాటికి భిన్నంగా ఉండాలనుకున్నాను.. రైతునేస్తం పత్రిక నడపటంలో రైతులు, శాస్త్రవేత్తల పాత్ర గణనీయం.. వారికెప్పుడూ ఋణపడి ఉంటాను.. పత్రికలో రైతుల విజయగాథలతోపాటు వాళ్ళ ఫోన్ నంబర్లు కూడా ఇచ్చేవాళ్ళం. అది మిగిలిన పత్రికలు చేసేవాళ్ళు కాదు. అలా ఫోన్ నంబర్లు ఇవ్వటం మాకు ప్లస్సయ్యింది..

**మిసిమి :** **అప్పటికే అన్నదాత, జమీన్ రైతు, రైతువాణిలాంటి పత్రికలున్నాయి కదా. వాటికి భిన్నంగా ఉండటానికేదయినా ఎడిటోరియల్ పాలసీ పెట్టుకున్నారా? ఒక ప్రణాళిక అంటూ ఏమైనా పెట్టుకున్నారా?**

**వెంకటేశ్వరరావు :** అలాంటిదేమీ లేదండీ.. మీరన్నట్టు ఇదేమీ లేకుండానే పత్రిక మొదలుపెట్టాను. కానీ మా ఫోకస్ అంతా రైతులపైనే ఎక్కువుండేది. ఇందుకోసం ఇద్దరు ముగ్గురు రిపోర్టర్లను పెట్టుకున్నాను. అదనంగా సమాచారాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సేకరించేవాడిని. అలాగే శాస్త్రవేత్తలు కూడా సహకరించేవారు..

**మిసిమి :** **మార్కెటింగ్ ఎలా చేసేవారు?**

**వెంకటేశ్వరరావు :** పత్రికను లాభాపేక్ష లేకుండా నడపాలనేది నా ఉద్దేశం. అందువలన మార్కెటింగ్ మీద దృష్టి లేదు. కానీ కొత్తపత్రిక కావటంతో బానే చందాలు కట్టారు. పోస్ట్ ద్వారా పత్రిక పంపటానికి కావలసిన ఏర్పాట్లు చేసుకున్నాను. చందాకట్టిన వారికి మూడు బహుమతులు పెట్టాం. మొదటి బహుమతి ట్రాక్టర్ ఇచ్చాం.

**మిసిమి :** **ప్రకటనలు తీసుకునేవారా? తీసుకుంటే మీరు చేపట్టిన ఆర్గానిక్ వ్యవసాయానికి భిన్నంగా పురుగుమందుల ప్రకటనలు తీసుకున్నారా మరి?**

**వెంకటేశ్వరరావు :** మాకు ప్రకటనలు బానే వస్తుండేవి. అయితే పత్రిక మొదలుపెట్టినప్పుడు ఆర్గానిక్ వ్యవసాయం మాత్రమే చెప్పాలి అని మొదలుపెట్టలా.. అన్నిరకాల సాగు సమాచారం ఇస్తుండేవాళ్ళం. 2006వ సంవత్సరంలో పత్రికపెట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పదిహేనుమంది రైతులకు అవార్డులిచ్చాం. నిజానికి పత్రిక పెట్టడానికి ఒకవిధంగా స్ఫూర్తి నాకు రామోజీరావు గారు. ఆయన అన్నదాతతో పాటు, విపుల, చతుర పత్రికలు ఎలా నడిపేవారో గమనిస్తూ ఉండేవాడిని. ఆ స్ఫూర్తితోనే పశునేస్తం, ప్రకృతి నేస్తం పత్రికలు కూడా మొదలుపెట్టాను. కానీ ఇవి వెంటనే మొదలు పెట్టలేదు. నాకు కొంత సమయం పట్టింది.. సమయం తీసుకున్నాను కూడా.ఎవరూ చేయనిది మనం చేయాలనే బలమైన కాంక్ష నాలో ఎప్పుడూ ఉండేది అని చెప్పాను కదా.. 2012లో పశునేస్తం పత్రిక, 2014లో ప్రకృతి నేస్తం పత్రిక మొదలుపెట్టాను. ప్రకృతినేస్తం పత్రిక సేంద్రియ వ్యవసాయాన్ని (natural farming) గురించి చెప్పేది. అప్పటినుంచి ఆర్గానిక్ ఫార్మింగ్ కాన్సెప్ట్‌లోకి మారిపోయాం.. అప్పటికి పాలేకర్ గారు చేసే పద్ధతులు పరిశీలించటం, ఆయనతో కలిసి పనిచేయటం అలవాటయ్యింది. ఆ ప్రభావంతో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం అవసరం తెలియచేయాలన్న కోరిక బాగా పెరిగింది. నిజానికి సేంద్రియ వ్యవసాయం రైతులకు కొత్తేమీ కాదు. అయితే అరవైలకు ముందున్న పద్ధతులు హరిత విప్లవం వచ్చాక కనుమరుగైపోయాయి. అందుకే ఆ పద్ధతులను తిరిగి రైతులకు చెప్పాల్సిన అవసరం

ఏర్పడింది. ఒకప్పుడు భారతదేశంలో మనుషుల సంఖ్య కన్నా పశువులెక్కువ ఉండేవి. అయితే వ్యవసాయంలో యాంత్రీకరణ, ఎరువుల వాడకం.. అనంతర కాలంలో పురుగు మందులు, పెరిగిన నీటివసతి ఇవన్నీ గ్రామాల స్వరూపాన్ని మార్చేశాయి.. అంటే అభివృద్ధి క్రమంలో ఒక విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. అది ముందుగా ఉత్తరభారతంలో కనిపించింది. అంతకుముందు గ్రామీణ భారతమంతా ఉమ్మడికుటుంబాలతో కళకళలాడుతుండేది. సేంద్రియ వ్యవసాయం చేస్తుండేవారు. ఆర్థికంగా బలంగా లేకపోయినా వ్యవసాయం పట్ల ప్రేముండేది.. ఎప్పుడైతే ఆర్థికంగా బలపడ్డారో, నగరజీవితం పట్ల మోజు పెరిగింది.. సాఫ్ట్‌వేర్ ఇంకా ఇతర రంగాల పట్ల ఆసక్తితో పట్టణాలకు వలస మొదలయ్యింది. మీకు గుర్తుండే ఉంటుంది. ఒకప్పుడు గ్రామాల్లో వస్తుమార్పిడి పద్ధతి బాగా అమలులో ఉండేది. మీకు ఒక వస్తువు కావాలంటే మీదగ్గరున్న వస్తువునిచ్చి ఆ వస్తువు తీసుకునేవారు. మిరపకాయలు కావాలంటే మనదగ్గరున్న పప్పులిచ్చి తీసుకునేవాళ్ళం. పప్పుచెక్కలు అమ్మేవాళ్ళు కూడా కందులో, మిరపకాయలో ఇస్తే తీసుకుని ఆ వస్తువు మనకిచ్చేవారు. చేతివృత్తులవారు కూడా మనకేదైనా పనిముట్లు కావాలంటే మనదగ్గరున్న జొన్నలో, వరిగెలో ఇస్తే ఆ పనిముట్లు మనకిచ్చేవారు. హరిత విప్లవం వచ్చాక క్రమక్రమంగా అన్నీ మారిపోతూ వచ్చాయి. గ్రామాల్లో బళ్ళొచ్చినయి, ట్రాక్టర్లొచ్చినయి, ఊరికి రోడ్లొచ్చినయి.. ఒక్కమాటలో చెప్పాలంటే సౌకర్యాలొచ్చినయి. తినే ఆహారంలో రసాయనిక ఎరువులు చేరాయి.. కాయకష్టం తగ్గింది. మెకనైజేషన్‌తో శారీరక శ్రమ తగ్గింది. ఇంతకుముందు ఎకరం భూమిలో రకరకాల పంటలేసేవారు. అది కాస్తా ఒకేపంటకు కుదించుకుపోయింది. ఎక్కువ డబ్బు సంపాదించాలని రైతు వాణిజ్యపంటలవైపు మొగ్గు చూపటం మొదలుపెట్టాడు.. రైతుకు పలు కారణాలతోటి డబ్బు అవసరాలు పెరిగాయి. అది ఆ వాణిజ్య పంటలసాగుకు దారితీసింది. దానితోటి రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగింది. పురుగుమందులు విచ్చలవిడిగా స్ప్రే చేయటం అలవాటయ్యింది. ఇవన్నీ దిగుబడి పెంచే మార్గాలుగా రైతు చూశాడు. శాస్త్రవేత్తలు ఎరువులు, పురుగుమందులు వాడమని చెప్పారు కానీ మోతాదు మించకుండా వాడమన్నారు. అది రైతు చెవికి ఎక్కలేదు.. నిజానికి రైతును తప్పుపట్టాల్సింది కూడా ఏమీలేదు. వారికున్న అవసరాల దృష్ట్యా రైతు ఆపని చేయాల్సివచ్చింది. కానీ రాన్రాను వీటివాడకం పెరిగి నేల సారహీనంగా మారింది. ఎరువులు, పురుగుమందులు వాడకంలేని రోజుల్లో భూమిలోని సూక్ష్మజీవులు భద్రంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. మన శరీరంలోనే పలురకాల బాక్టీరియాలుంటాయి. వీటిలో మంచివీ ఉంటాయి.. చెడువీ ఉంటాయి.. మనం నిత్యం జంక్ ఫుడ్ తిన్నామనుకోండి.. ఆ మంచి బాక్టీరియా ఉంటుందా.. చచ్చిపోతుంది కదా.. మనలో శక్తి అంతరించి బలహీనంగా మారతాం.. అదేవిధంగా భూమికూడా ఈ ఎరువులు, మందులు వాడకంతో తన సహజశక్తిని కోల్పోతోంది. ఒకప్పుడు భూమిలో వానపాములు విపరీతంగా ఉండేవి. ఇవాళ వాటి సంఖ్య తగ్గిపోయింది.. ఈ అనర్థాలతో నేలలో సూక్ష్మపోషకాల లోపం ఏర్పడుతోంది.. మొక్కల ఎదుగుదలకు కావలసిన పోషకాలు మట్టిలో ఉండటం లేదు. అందుకని యూరియా వాడకం పెంచేశాం.. పురుగుమందులు పెంచేశాం. రైతుకు ఖర్చు పెరిగింది. కూలీల సమస్య కూడా తోడయ్యింది.. ఉపాధిహామీ పథకం కూడా దానికి కొంత కారణం. మరికొంత మెకనైజేషన్ కారణం.. దానివలన ఖర్చులు పెరిగిపోయినయి. దిగుబడి ఎంత పెరిగినా ఖర్చుల ఊబి రైతును వెంటాడుతోంది. దానికి తగ్గట్టు రైతు తన పంటకు తగ్గ ధర పొందలేకపోతున్నాడు. అది మిర్చి, మక్క, పత్తి ఏ పంటన్నా కావచ్చు. అపరాల పంటలు కావొచ్చు. కనీస మద్దతు ధర నిర్ణయించేది కేంద్రప్రభుత్వం.. వాళ్ళేం చేస్తున్నారు .. కొన్ని రాష్ట్రాల్లో సాగు ఖర్చు లెక్కేసి ధర నిర్ణయిస్తున్నారు. ఇది మనరైతులకు గిట్టుబాటవటం లేదు.

ఎప్పుడయితే రైతుకు గిట్టుబాటు కావడం లేదో అప్పుడు రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. మనదేశంలో ఎక్కువగా సన్నకారు రైతులే. ఒక సంవత్సరం ధర సరిగ్గా లేకపోయినా, అకాలవర్షాలవలనో, తుఫానుల వలనో దిగుబడి దెబ్బతింటే ఆ నష్టం పూడ్చుకోవటానికి రెండు మూడు సంవత్సరాలు పడుతుంది. ఉద్యోగికి నెల జీతం భరోసా ఉంటుంది. ఆ రైతుకు భరోసా లేదు. ఈ సంవత్సరం పండుతుందో తెలీదు. వచ్చేసంవత్సరం ఏమవుతుందో అసలు తెలీదు. విత్తనం విత్తిన దగ్గరనుంచి కోతనంతరం వరకు ప్రతిరోజు టెన్షనే. ప్రతిరోజూ ఒత్తిడే. పాతకాలానికి, ఇప్పటికీ అదేతేడా. విత్తనం నుంచే అతనికి సమస్యలు మొదలవుతాయి.. విత్తనం కల్తీది కాదని ఏ ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వదు.. ఇవ్వదు కూడా...

**మిసిమి :** **మరి వ్యవసాయశాఖ ఇవన్నీ చూడాలి కదా..?**

**వెంకటేశ్వరరావు :** మీరు వ్యవసాయశాఖవారిని కదిలిస్తే వారి సమస్యలు చెబుతారు కానీ సమస్యపై దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వాలు కూడా రైతును చిన్నచూపు చూస్తున్నాయనేది వాస్తవం.. అన్నిరాష్ట్రాల్లోను ఇదే పరిస్థితి. పంజాబ్‌లో ఇలాలేదు. వాళ్ళు మిగిలినవాళ్ళ కన్నా ముందు ఉన్నారనేది వాస్తవమే కానీ ఇప్పుడు వ్యవసాయరంగంలో అనారోగ్య రాష్ట్రమంటే పంజాబ్ అనే చెప్పాలి. ఎందుకంటే అత్యధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతున్నారక్కడ.. దానివలన దిగుబడైన పంట విషంగా మారుతోంది. అక్కడ అలా ఉంటే మిగిలినచోట్ల మరేవో సమస్యలు.. ఇన్ని సంవత్సరాలయినా రైతుకు కలిగిన నష్టాన్ని ఏ వ్యవసాయ బీమా ఆదుకోలేకపోతోంది. వేలకోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తుందన్న సాకుతో రైతుకు బీమా ఎగవేతకు చూస్తున్నాయి బీమా కంపెనీలు. ఈనాటికీ అత్యధికశాతం ప్రజలు వ్యవసాయరంగంమీదే ఆధారపడుతున్నారు. కానీ నిత్యం జీవితంతో సంఘర్షిస్తూనే ఉండటం విషాదం..

**మిసిమి :** **డెబ్బైల చివర్లో .. ఎనభైల మొదట్లో మీరు వ్యవసాయంలో మీరూ భాగస్వాములుగా ఉన్నారు.. నలభై ఏళ్ళు గడిచిపోయాయి కదా.. ఏమన్నా మార్పు వచ్చిందా?**

**వెంకటేశ్వరరావు :** ఏం మార్పు రాలేదు. టెక్నాలజీలో మార్పు వచ్చింది. కాకపోతే అప్పుడున్న జీవనశైలి వేరు. ఇప్పుడున్న జీవనశైలి వేరు. అప్పుడూ మూడెకరాలే.. ఇప్పుడూ మూడెకరాలే.. అందులో మార్పు లేదు. కాకపోతే సమాజానికి అనుగుణంగా మన లైఫ్ స్టైల్ మార్చుకున్నాం.. మనం గొప్పగా చెప్పుకునే గ్రీన్ రివల్యూషన్ వలన పశుసంపద నాశనమయింది.

**మిసిమి :** **అవసరం లేక తగ్గించారనుకోవచ్చు కదా!**

**వెంకటేశ్వరరావు :** అవును అవసరం లేకే తగ్గించారు. పోషించటానికి మనుషులు లేరు. అవసరమైన పశుగ్రాసాలు లేవు. వాణిజ్య పంటలు మన ప్రాధాన్యమైపోయాయి. వ్యవసాయానికి పాడీ-పంటా రెండుకళ్ళు. పంట నష్టం వస్తే ఆదుకునేందుకు పాడి ఉండేది ఒకప్పుడు. మిగిలిన వర్గాల వారిలానే రైతుకూడా తన పిల్లలను బాగా చదివించాలి అనుకుంటున్నాడు. మెరుగైన జీవనాన్ని ఇవ్వాలనుకుంటున్నాడు. దానికి అధిక దిగుబడి కోసం ఎరువులు వేస్తున్నాడు. దిగుబడి కోసం అన్ని రకాల చర్యలు చేపడుతున్నాడు. రైతును నేను విమర్శించటం లేదు. వాస్తవం చెబుతున్నాను. దానివలన నాలుగు డబ్బులు సంపాదించినా అనేక కష్టాలకు గురవుతున్నాడు. పర్యావరణం పాడవుతోంది. భూమి సారాన్ని కోల్పోతోంది.. ఇన్ని అనర్థాలు జరుగుతున్నాయి. పశుపక్ష్యాదులు తగ్గిపోతున్నాయి.

**మిసిమి :** **ఊళ్ళు ఖాళీ అవుతున్నాయి..కూలీలు దొరకటం లేదు.. దీన్ని సాల్వ్ చేయటానికి రైతునేస్తం ఎలా ఉపయోగపడుతుంది?**

**వెంకటేశ్వరరావు :** వ్యవసాయంలో మీకు కూలీలు దొరక్కపోవటానికి కారణం చెప్పాను.. ప్రభుత్వం ఒక కారణమని చెప్పాను కదా.. ఉపాధి హామీ పథకం గ్రామాల్లో ఉండే కూలీలను పనిచేయనివ్వకుండా చేస్తోంది.. ఇంకొకటి గ్రామాల్లో జనాభా తగ్గిపోవటానికి కారణమేమిటంటే వ్యవసాయం గిట్టుబాటు

కాకపోవటం.. ఎంత కష్టపడ్డా రైతు బతుకు తీరు మారటం లేదు. దాంతోటి మన పిల్లలు వ్యవసాయంలోకి రాకూడదు అనుకుంటున్నారు.. అందుకోసం పిల్లల్ని రైతు జాగ్రత్తగా చదివిస్తున్నాడు. చదివించాక పిల్లలు విదేశాలకు వెళ్ళినా, బయట ఊళ్ళలో ఉద్యోగాలు చేస్తున్నా తన ఆర్థిక స్తోమతు పెరుగుతోంది.. ఆ పెరిగినప్పుడు వీళ్ళు కూడా పట్నాలకు వెళుతున్నారు. దాంతోటి గ్రామాలు ఖాళీ అయిపోతున్నయి.. వ్యవసాయ కుటుంబాలు తరలిపోతున్నాయి. దానివలన పొలమంతా కౌలుదారుల చేతుల్లోకి పోతోంది. కౌలు తీసుకుని వ్యవసాయం చేసేవారికి దిగుబడులే ముఖ్యం.. అందుకోసం రసాయనిక ఎరువులు, మందులు విపరీతంగా వాడుతున్నారు. సేంద్రియ వ్యవసాయం నాకెందుకు.. ప్రకృతి వ్యవసాయం నాకెందుకు అన్న మైండ్ సెట్‌తో ఉంటారు.. ఉదాహరణకు ఈ సంవత్సరం మిర్చికి మంచి రేటొచ్చింది.. గత సంవత్సరం, అంతకుముందు సంవత్సరం రేటు లేదు. ఈ సంవత్సరం ఎక్కువమంది వేయలేదు.. వచ్చే సంవత్సరం మళ్ళీ చాలామంది మిరప పంట వేస్తారు.. మళ్ళీ ధర పడిపోతుంది.. అలా ఒక జూదంగా మారుతోంది వ్యవసాయం. అతనిలో ఒక ఒత్తిడి సృష్టిస్తోంది. చివరికి తన పంటను అమ్ముకున్నా కూడా ఆ నాలుగుడబ్బులు చేతిలో పడతాయో లేదో అన్న టెన్షన్..ఎందుకంటే కొన్నవాడు ఎగ్గొట్టేస్తాడేమోనని భయం. ఈ ఒత్తిడిలోంచి బయటపడాలంటే తన జీవనశైలి మార్చుకోవాలి.. ఒకప్పుడు తన కుటుంబం కోసం కూరగాయలు, పళ్ళు, పూలు రైతు తనే పండించుకునేవాడు. పాలు,పెరుగు కోసం పశువులుండేవి. అంటే ఎక్కువ ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ ఇవన్నీ చేయటానికి రైతు నెలకు ఐదువేల రూపాయలు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. సంవత్సరానికి అరవైవేలు.. ఒక చిన్నరైతు అంటే మూడెకరాల రైతుకి ఎంత భారమో ఆలోచించండి.. ఇది మార్చాలంటే అతని జీవనశైలి మార్చాలి.. ఇలాంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని 2016లో రైతునేస్తం ఫౌండేషన్ స్థాపించటం జరిగింది.. దానిద్వారా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వాలని మా ఉద్దేశం. ముందు చెప్పినట్లు అరవైల ముందు మన వ్యవసాయం సేంద్రియ పద్ధతుల్లోనే ఉండేది. ఇప్పుడు మారిన వాతావరణం తీరు, మారిన కాలాల తీరును బట్టి శిక్షణ అవసరం... మనకు రోగనిరోధక శక్తి తగ్గితే రోగాలు చుట్టిముట్టినట్టే, భూమిలో జీవం లేనప్పుడు మొక్కకు తెగుళ్ళు తొందరగా సోకుతాయి. పురుగుమందుల పిచికారీ బదులు, మన చుట్టుపక్కల దొరికే మెడిసినల్ ప్లాంట్స్ నుంచి కషాయాలు తయారుచేసుకోవాలని చెబుతాం.

**మిసిమి :** **వెంకటేశ్వరరావుగారూ.. సేంద్రియ వ్యవసాయంతో రైతుకు గిట్టుబాటు అవుతుందా?**

**వెంకటేశ్వరరావు :** ఆ విషయంలోకి వచ్చేముందు ఇంకొన్ని విషయాలు మేం చేసినవి చెబుతాను. ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాలలో 575కు పైగా సేంద్రియ వ్యవసాయ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాం.. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గుంటూరు జిల్లాకు పరిమితమై చేశాము. అక్కడ 280 శిక్షణా కార్యక్రమాలు చేశాం. మిగిలినవి రెండురాష్ట్రాలలో చేశాం

**మిసిమి :** **ఎంతవరకు రైతులు ఈ సేంద్రియ వ్యవసాయం లేదా ప్రకృతి వ్యవసాయాన్ని అడాప్ట్ చేసుకుంటున్నారు?**

**వెంకటేశ్వరరావు :** వాళ్ళు ఎంతవరకు దీన్ని అర్థం చేసుకున్నారు అంటే ఇంత అని ఖచ్చితంగా చెప్పలేం కానీ దీని గురించి అర్థమవుతోంది వారికి.. ఇప్పటిదాకా రైతు కొంత ఒత్తిడిలో ఉన్నాడని ఒప్పుకోవాలి.. రసాయన ఎరువులు వద్దు, ప్రకృతిలో దొరికే వాటిని వాడండంటారు వీళ్ళు.. కెమికల్ లేకుండా పంటెట్టా పండుద్ది అంటాడు రైతు...అయితే మార్పు ఒక్క రాత్రిలో రాదు.. మెల్లమెల్లగా వస్తుందనేది మా నమ్మకం.. మేము రైతులకు చెప్పేదేమిటంటే మీరు అరెకరంతో మొదలుపెట్టండి.. మీకు భూమిలో ఆర్గానిక్ కార్బన్ పెరిగితే వానపాములు పెరుగుతాయి. అవి మొక్కకు

రోగనిరోధకతనిస్తాయి. ఒక పశువును పెట్టుకోండి. దాని మూత్రం, పేడా, పశువులపెంటా ఈ అరెకరంలో వాడండి. లేదా పచ్చిరొట్ట పంటలేసుకోండి. అది సూక్ష్మజీవులకు ఆహారంగా పనిచేస్తుంది. జనుము, జీలుగ, పిల్లిపెసర వేస్తాం కదా.. అవన్నమాట. అలాంటివి ముప్పైరకాల విత్తనాలు కలిపితే PMD అంటాం.. (Pre -Monsoon Dry Sowing).. నలభై ఐదురోజుల తర్వాత దాన్ని కలియదున్నితే అది ఎరువులా పనిచేస్తుంది. పశువుల్లేనప్పుడు ఇదొక పద్ధతి. ఈ పచ్చిరొట్ట పంటలను వాతావరణాన్ని బట్టి వేసుకోవాలి. వర్షాలు లేనప్పుడు వేసుకోవాలి. వర్షాలు పడినప్పుడు మెట్టప్రాంతాలలో Rotary-Weeder వేయటానికి రాదు. ఇదే మాగాణి భూముల్లో అయితే ఫర్వాలేదు. దీనివలన కొంతమంది వెనకడుగు వేస్తారు ఇదో పెద్ద తలనొప్పని... మిర్చి పంట వేసేముందు పచ్చిరొట్ట పైరు వేస్తే మిరపపంటకు లాభం కలుగుతుంది. ఎలా అంటే దానివలన ఎరువులు తగ్గించుకునే అవకాశం దొరుకుతుంది కదా..

**మిసిమి :** **మీరు నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో రైతుకొచ్చే సందేహాలేమిటి! అవెలా ఉంటాయి?**

**వెంకటేశ్వరరావు :** సేంద్రియ వ్యవసాయం చేద్దామనుకునే రైతు inputs కావాలంటాడు. అతని దగ్గర పశువులుండవు. మేము పశువుల పేడ, మూత్రం కలిపి ఘనజీవామృతం అని తయారుచేస్తాం. జీవామృతం తయారుచేస్తాం. రైతు నేను చేయలేకపోతున్నాను, ఎలా అంటాడు. దగ్గరలో ఉన్న గోశాలకు వెళ్ళి వాటిని సేకరించటం ఒక పద్ధతిగా చెబుతాం. లేదంటే ఒక ఆవునో, ఒక పశువునో కొనుక్కొని మొదలుపెట్టు. అరెకరంతోనే స్టార్ట్ చేయి అంటాం. మొదటి ఒకటి, రెండు పంటలు రైతు చేతికి రావు. దానివలన కొంత ఇబ్బంది ఉంటుంది. అందుకే అరెకరం అని చెప్పేది. మేము చెప్పే కషాయాలన్నీ అంటే నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, జీవామృతం..ఇవన్నీ తయారుచేసుకోవాలి. ఇవి మార్కెట్‌లో దొరకవు. దానికోసం మన చుట్టుపక్కల ఔషధ మొక్కలుంటాయి. వాటిని వెతికి పట్టుకోవాలి. ఆ తర్వాత వాటిని మురగపెట్టి పశుమూత్రం కలిపి కషాయంగా తయారు చేసుకుని స్ప్రే చేసుకోవాలి. ఇవి తయారుచేసుకోవటానికి కాస్త ఉత్సాహముండాలి. ఓపికుండాలి. కొంచెం సమాచార సేకరణ కూడా చేయాలి. మా దగ్గర దీనికోసమే (సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం కోసం) కేటాయించిన భూముంది. కషాయాలు ఎలా తయారుచేసుకోవాలో చూపిస్తాము. ఒక్కో పంటకు ఒక్కోరకమైన కషాయం ఎలా తయారుచేసుకోవాలి, ఏ విధంగా ఎలా పిచికారీ చేసుకోవాలి, బలానికి జీవామృతం ఎలా ఇవ్వాలి, దుక్కిలో ఘనజీవామృతం ఎలా కలపాలి వంటి అనేక విషయాలపై వాళ్ళకు అవగాహన కల్పిస్తాం. వీటన్నిటికోసం ముందుగా భూసార పరీక్ష చేసుకోమని చెబుతాం. మా దగ్గర యాభైఐదు ఆవులున్నాయి. వాటి పేడ, మూత్రం నుంచి కషాయాలు ఎలా చేయొచ్చో చూపిస్తాం. పశువులతోపాటు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ చేయాలి. కొన్ని గొర్రెలు పెంచాల. మేకలు పెంచాల. కోళ్ళుపెంచాల. పుట్టగొడుగులు పెంచాల. అలాగే తేనెటీగల నుంచి వచ్చే తేనెకోసం తేనె అరలు పెట్టుకోవచ్చు. గొర్రెలు పెంచితే ఆకులకోసం



కె.ఎల్. యూనివర్శిటీ వారిచే డాక్టరేట్ ప్రదానం

ఎక్కడికో పోవక్కర్లేదు. మీ చేలో ఉన్న చెట్ల ఆకులు సరిపోతాయి. అదే కోళ్ళనుకోండి, కావాలసిన ఆహారాన్ని పొలంలో తిరుగుతూ తీసుకుంటాయి.. ఇలా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలోని విషయాలన్నీ వివరంగా వారికి తెలియచేస్తాం..

**మిసిమి :** **వెంకటేశ్వరరావు గారు.. ఈ పద్ధతిలో వ్యవసాయం చేసి రాణించాలంటే రైతుకు పదెకరాలయినా ఉండాలా?**

**వెంకటేశ్వరరావు :** అవసరం లేదు. ఎకరంలోనే చేసుకోవచ్చు.

**మిసిమి :** **దాంతో అతని కుటుంబం బతకొచ్చా?**

**వెంకటేశ్వరరావు :** కుటుంబం బతకాలంటే అరెకరమైనా సరిపోతుంది. కానీ ఈ పద్ధతిలో వ్యవసాయాన్ని ఒక దీక్షలా చేయాల. పొద్దున్ననుంచి సాయంత్రం వరకు పొలంలోనే ఉండాల. అరెకరం చాలని చెప్పాను కదా. గొర్రెలు, మేకలు, కోళ్ళు పెట్టుకుని బతకొచ్చు. కెమికల్స్ వాడకుండా ఆకుకూరలు, కూరగాయలు పండిస్తే బోల్డంత డిమాండ్ వాటికి. రోజుకు వెయ్యిరూపాయల ఆదాయం ఇరవై సెంట్ల భూమిలో పొందొచ్చు. మా ఫార్మ్ గుంటూరు పక్కనే ఉన్న పుల్లటిగుంటలో ఉంది. ఎవరైనా వచ్చి చూడొచ్చు. పత్తిపాడు వెళ్ళే దారిలో ఉంది. గుంటూరుకి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మేము రైతుకు ఈ సేంద్రియసాగులో చివరి స్టెప్ గురించి కూడా చెబుతాం. అదేమిటంటే పంట పండిస్తాడు సరే.. అదెలా అమ్ముకోవాలి.. దాన్నెలా మార్కెటింగ్ చేయాలో కూడా చెబుతాం. సేంద్రియ వ్యవసాయంలో ఇదే అసలైన సమస్య, దిగుబడి రాదన్న అభిప్రాయంతో రైతు ఉంటాడు. యూరియా వేస్తే కానీ దిగుబడి రాదు అనేది అతని మనసులో మాటనుకుందాం. హైబ్రిడ్ విత్తనాలెక్కువగా వాడతాడు కాబట్టి రసాయనిక ఎరువులు వేయాల్సిందే.. చీడపీడలొస్తాయి కాబట్టి పురుగుమందులు కూడా తప్పవు. ఇది అతని ఆలోచన.. దానికి తగ్గట్టు ప్రకృతి వ్యవసాయమంతా ప్రాక్టికల్‌గా సాగుతుంది కానీ ఇందులో రీసెర్చ్ అంటూ ఏమీలేదు. మన శరీరం లాంటిదే భూమి కూడా.. రోగమొచ్చాక బలం పుంజుకోవాలంటే మనకు సమయం పడుతుంది కదా.. భూమికి కూడా ఆర్గానిక్ కార్బన్ సమకూర్చుకోవాలంటే నాలుగేళ్ళు పడుతుంది. ఈమాట రైతులకు చెబుతాం.. నాలుగైదేళ్ళు ఇందుకోసం మీరు ఓపిక పట్టాలి అని.. ఉత్పత్తి, మార్కెటింగ్ గురించి కూడా చెబుతాం.. మీకు రసాయనిక ఎరువులతో నలభై బస్తాల వరి పండిందనుకుందాం. సేంద్రియ ఎరువులతో ఇరవై బస్తాల వరే వచ్చిందనుకుందాం. అప్పుడు మీరు సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన వరిని డైరక్ట్‌గా అమ్మకండి అని చెబుతాం. దానిని ప్రాసెస్ చేసి అమ్మండి. అప్పుడు మీకు నలభై బస్తాలు అమ్మితే వచ్చే ఆదాయం వస్తుందని చెబుతాం. ఆ ప్రాసెస్ ఎలా చేయాలో కూడా నేర్పిస్తాం. అందుకని ఆర్గానిక్ ఉత్పత్తుల రేట్లెక్కువ. అయినా కొంటున్నారు, ముఖ్యంగా కొవిడ్ తర్వాత ప్రజల్లో ఆలోచనల్లో మార్పు వచ్చింది.. మా దగ్గరకొచ్చిన రైతు వ్యాపారిగా మారాలనేది నా లక్ష్యం.. దానితోబాటుగా ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తిని నా దగ్గరకు తీసుకొస్తే మార్కెటింగ్ చేసే బాధ్యత నాది. ప్రచారం కూడా నా యూట్యూబ్ ఛానెల్ ద్వారా కల్పిస్తాను.. అది చూసి ఇంకో పది ఛానెల్స్ వస్తాయి. నిజానికి యూట్యూబ్ ఛానెల్ పబ్లిసిటీ చాలు.. వేరే మార్కెటింగ్ అక్కర్లేదు అని కూడా వారికి నమ్మకంగా చెబుతాను..

**మిసిమి :** **ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు సేంద్రియ వ్యవసాయమీమ్మదే కాదు, సేంద్రియ ఉత్పత్తుల మీద కూడా అవగాహన పెరిగింది. అవి ఖరీదుగా ఉంటాయన్న ఎరుక ప్రజలకు వచ్చిందంటారు.**

**వెంకటేశ్వరరావు :** అయితే రైతులు ఇంకా ఉత్సాహంగా ముందుకురావాలి.. డిమాండ్‌కు తగ్గ సప్లై లేదు అంటే కొనేవాళ్ళు ఎక్కువున్నారు.. పండించేవారు తక్కువున్నారు.. కానీ రైతు వ్యాపారిగా మారాలంటే వ్యాల్యూ ఎడిషన్ చేసుకోవాలి. అంటే ప్రాసెసింగ్ చేసేందుకు మా దగ్గర యంత్రాలున్నాయి.

వాటి ఖరీదు నలభైవేలలోపే.. చిరుధాన్యాలు పండిస్తే వాటి ప్రాసెసింగ్, ప్యాకింగ్ ఎలా చేయాలో నేర్పిస్తాము. మార్కెటింగ్ ఎలా చేయాలో కూడా చెబుతాం. ఇవన్నీ చేయటంతో అతని ఉత్పత్తికి అదనపు విలువ చేకూరుతుంది

**మిసిమి :** **మీ రైతునేస్తం ఫౌండేషన్ ఎలా పెట్టారు?**

**వెంకటేశ్వరరావు :** సొసైటీల చట్టం కింద దీన్ని ట్రస్ట్‌గా ఏర్పాటుచేయటం జరిగింది. దీనిపట్ల ఆసక్తి ఉన్న కొంతమంది పెద్దలను సభ్యులుగా పెట్టాం. వనరులన్నీ కూడా సొంతంగా సమకూర్చుకుని చేస్తున్నాం. నాబార్డ్ వారు శిక్షణా కార్యక్రమాలకు కొంత సహాయం చేస్తున్నారు. నిధుల కోసం నేనెవరినీ రిక్వెస్ట్ చేయటం లేదు. నేను సంపాదించిందాంట్లో కొంత ఫౌండేషన్ కోసం ఖర్చుపెడుతున్నాను. దీనికి ఆదాయపన్నుశాఖ వారి 80g మినహాయింపు ఉంది. ఇప్పటవరకు పెద్ద ఎవరూ ఇచ్చిందీ లేదు.. నేను అడిగింది లేదు..తీసుకున్నది లేదు..

**మిసిమి :** **ఏ పంటకు ప్రకృతి వ్యవసాయం బాగా అనుకూలం?**

**వెంకటేశ్వరరావు :** చిరుధాన్యాలు ప్రకృతి వ్యవసాయానికి చాలా అనుకూలం. ఎక్కువ నీటి వసతి అక్కర్లేదు. రెండు ముడు వర్షాలు సరిపోతాయి.. నేలకు మంచిది. పర్యావరణానికి మంచిది. ఎటువంటి స్ప్రేలూ అవసరం లేదు.. ఇప్పటిదాకా మనం వరి అన్నం తింటూ వస్తున్నాం.. నెమ్మది నెమ్మదిగా మార్పు వస్తోంది. వరి నుంచి సిరిధాన్యాలకు మారుతున్నాం.. అందుకే మా స్లోగన్ వరి నుంచి సిరికి మారండి.. 2018నుంచి రైతునేస్తం ఫౌండేషన్ ద్వారా సిరిధాన్యాల గురించి ప్రచారం చేస్తున్నాం. 2023 వ సంవత్సరాన్ని ప్రధాని మోదీగారు చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం వెనుక రైతునేస్తం కృషి ఉందని ఘంటాపథంగా చెప్పగలను. ఇదే మాట చిరుధాన్యాల శాస్త్రవేత్త ఖాదర్ వలీ గారు కూడా అన్నారు.


సేంద్రియ వ్యవసాయ క్షేత్రం

**మిసిమి :** **వారితో మీ అనుబంధం ఎలా మొదలయింది?**

**వెంకటేశ్వరరావు :** 2016లో ఫౌండేషన్ పెట్టినప్పుడు నా మొదటి ప్రాధాన్యతాంశమే చిరుధాన్యాలు. వాటి సాగు అవసరాన్ని గుర్తించి, వాటి గురించిన జ్ఞానాన్ని పెంచుకున్నాను. ఖాదర్ వలీ గారు 2018లో ఉస్మానియా యూనివర్సిటీలో చిరుధాన్యాల గురించి ప్రసంగించినప్పుడు, ఆ విషయాన్ని నేను పత్రికల ద్వారా తెలుసుకుని వారిని కలిసి నా ఉద్దేశ్యాలు, లక్ష్యాలు వివరించాను.అలా మా ప్రయాణం మొదలైంది. వారితో వందకుపైగా ప్రసంగాలు చిరుధాన్యాల మీద చేయించాను. కొన్ని కోట్లమందికి మా ప్రచారం చేరింది.బహుశః మన ప్రధానమంత్రి మోదీగారికి కూడా చిరుధాన్యాల విలువ ప్రాధాన్యత మాద్వారా చేరిందని నా ప్రగాఢ నమ్మకం.. అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారిచేత ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ప్రపంచ యోగాదినోత్సవం రోజున లక్షమంది బ్రహ్మకుమారీల సమక్షంలో చిరుధాన్యాలపై హిందీలో ఒక పుస్తకాన్ని రిలీజ్ చేయించాం. ఆ అపూర్వ ఘట్టాన్ని మా రైతునేస్తం యూట్యూబ్ ఛానెల్లో కోట్లమంది వీక్షించారు. చిరుధాన్యాల అవగాహన కింద మళ్ళీ తిరిగి కొనే పథకం (buy back scheme) కింద నాలుగు టన్నులు రైతులకిచ్చా. అయితే చిరుధాన్యాలకు ప్రాసెసింగ్ ముఖ్యం. రెండు తెలుగు

రాష్ట్రాలలో ప్రాసెసింగ్ యూనిట్లు లేవు ఆ యూనిట్లు మా దగ్గర ఉన్నాయి. ప్రాసెసింగ్ వలన లాభమేమిటో ఒక ఉదాహరణ చెబుతాను. వేరుశనగ విత్తనం తీయకుండా అమ్మితే టన్ను ఆరువేల ఐదు వందలు, అదే విత్తనం ఒలిచి అమ్మితే కిలో నూటయాభై, మనకు విత్తనం (గింజ) ఒలిచి అమ్మితే డెబ్భైకిలోలు వస్తాయి అంటే అమ్మితే పదివేల ఐదొందలు, ఆ డెబ్భై కిలోల విత్తనాలను నూనె తీసి అమ్మితే అమ్మితే ముప్పైలీటర్ల నూనె వస్తుంది. ముప్పై లీటర్ల నూనె అమ్మితే రైతుకు పదిహేనువేలొస్తాయి. అంటే వేరుశనగ విత్తనం అమ్మినదానికి, నూనె తీసి అమ్మినదానికి ఎంత తేడా ఉందో గమనించారు కదా. ప్రాసెసింగ్ కోసం రైతు రెండు, రెండున్నరవేలు ఖర్చుపెట్టినా గణనీయంగా ఆదాయం పెరుగుతుంది. అందువలన మీరు గానుగ పెట్టుకోమని రైతుకు చెబుతాం. వేరుశనగను కాయగా అమ్మకండని చెబుతాం.. ఇదీ ప్రాసెసింగ్ అంటే.. ఇలాగే మిర్చికి కూడా చేయవచ్చు. దానిని ప్రాసెస్ చేసి అమ్మండి. నలభై, యాభైవేలు పెడితే దానికి కావలసిన ప్రాసెసింగ్ మెషీన్ వస్తుంది. రైతు ఒక బ్రాండింగ్‌లా ఉండాలని మేం రైతులందరికీ చెబుతాం. ప్రతి గ్రామంలో ఇలా రైతుపెట్టిన షాపులుంటే, ప్రాసెసింగ్ యూనిట్లుంటే, పశుసంపద ఉంటే గ్రామంలో డబ్బు కళకళలాడుతుంది. గ్రామాల డబ్బు పట్టణాలకు వెళ్ళకుండా, పట్టణాల నుంచే గ్రామాలకు డబ్బు వస్తే గ్రామం అభివృద్ధి బాటలో సాగుతుంది. గ్రామంలో రైతు తయారు చేసే ఉత్పత్తులలో కల్తీ జరగదు. అదే పట్టణాలలో కల్తీ జరుగుతుంది.. ఇది వాస్తవమే కదా.

**మిసిమి :** **రైతుచేత మళ్ళీ పాత పద్ధతుల్లో వ్యవసాయం చేయించాలన్న మీ తపన అద్భుతం.. మీరు రైతులకోసం ఆ తపనతో రైతునేస్తం పత్రిక పెట్టారు. ఆ తర్వాత రైతునేస్తం ఫౌండేషన్ పెట్టారు.. అందులోంచి రైతును వ్యాపారిని చేయలని చిరుధాన్యాల సాగును ప్రచారం చేశారు.. మీ మనసులో చిన్నప్పుడు పేరుకుపోయిన ఆలోచనలను సాకారం చేస్తున్నారు. మీరు హైదరాబాద్ వచ్చి చేసిన పనికి దీనికి సంబంధమే లేదు. చదివిన చదువుకు కూడా సంబంధం లేదు. కానీ ఇంత తపన మీలో దాగి ఉంది కదా.. అదెక్కడుంది.. ఎలా ఏర్పడింది?**

**వెంకటేశ్వరరావు :** రైతు జీవితంలో అనేక దశలుంటాయి. ప్రతిదశలోను అతను దెబ్బతింటున్నాడు.. అలా దెబ్బ తినకుండా ప్రతి దశలోనూ అతడిని కాపాడుకోవాలి. ఇదీ నా ఆలోచన.. నిజానికి సేంద్రియ వ్యవసాయం గురించి 2016నుంచి 2020దాకా ప్రతి ఆదివారం ట్రైనింగ్ కార్యక్రమాలు పెట్టాం.. నేను తప్పకుండా దగ్గరుండి ఆ కార్యక్రమాలు చూసుకునేవాడిని.. కరోనా వచ్చేవరకు ఇలా చేయగలిగాం.. ప్రకృతి వ్యవసాయం గురించి అంత ప్రచారం చేశాక దాని ప్రభావంతో రైతు పండించాక తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ లేదని చెప్పేవాళ్ళు. అది ప్రధాన సమస్య.. అప్పుడే మేము రైతునేస్తం పేరుతో సేంద్రియ ఉత్పత్తుల షాపులు పెట్టడం జరిగింది.. నిజానికి అలా పెట్టిన షాపులతోటి మేం వ్యాపారం చేయాలని కాదు. వాళ్ళకి ఆ ప్రాసెసింగ్ అంతా చూపించి.. ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్స్ (FPO) ఏర్పాటుచేసుకోమని చెబుతున్నాం.. అలాగే ఇప్పుడు మిద్దెతోటలను పెంచమంటున్నాం.. మిద్దెతోటలు ఎక్కువగా పట్టణాల్లో వేస్తారు. అక్కడ వారికి డబ్బూ ఉంటుంది.. అవగాహనా ఉంటుంది.. అలాగే సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ పట్టణాలలో ఉంటుంది.. గ్రామాల్లో ఉండదు.. పట్టణాల్లో దీన్ని ప్రోత్సహిస్తే పర్యావరణం బాగుపడుతుంది అన్న నమ్మకంతో దానిపై దృష్టి పెట్టాం. వ్యవసాయం వదిలేసి దానిపై పడ్డావేమిటి అన్న వాళ్ళూ ఉన్నారు.. మిద్దెతోటల ద్వారా మూడు నాలుగు రకాల కూరగాయలు రెండు, మూడు రకాల ఆకుకూరలు పండిస్తారు కానీ చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెలు.. ఇవన్నీరైతు నుంచి రావలసిందే కదా అన్నది నా వాదన.. ఇంతకీ విషయంలోకి వస్తే రైతులతో లింకేజీ కోసమని వీరందరికీ వాట్సప్ గ్రూపులేర్పాటు చేశాము..

**మిసిమి :** **మీరు మిద్దెతోటల పెంపకానికి కూడా అవార్డులిస్తున్నారు కదా..**

**వెంకటేశ్వరరావు :** మేము ప్రతి సంవత్సరం ఇచ్చే అవార్డులు కాకుండా దాదాపు ఐదు సంవత్సరాలనుంచి మిద్దెతోటలు వేసేవారికి తుమ్మేటి రఘోత్తమరెడ్డి మిద్దెతోటలు అవార్డులిస్తున్నాం.. నేను ఈ అవార్డులు ఎందుకిస్తున్నానంటే మిద్దెతోటల సాగు పట్ల అవగాహన పెంచటం కోసం.. ఇప్పటివరకు నూటపాతిక మందికి పైగా వ్యక్తులకు ఈ అవార్డులు ఇచ్చి ఉంటాము. ఈ అవార్డు ఫంక్షన్లలో వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తాం.. దానివలన వచ్చినవారు ఒక కుతూహలంతో వస్తారు.. వారికి ఇది అవగాహన పెంచుతుంది.. మా యూట్యూబ్ ఛానెల్ ద్వారా ఇప్పటికే చాలా ప్రచారం చేశాం. మాకున్న పధ్నాలుగు లక్షల సబ్‌స్క్రైబర్స్ వలన మేం చెప్పే విషయాలు వారికి చేరుతున్నాయి.. మేము ఎక్కడ ఎప్పుడు మీటింగ్ పెట్టినా సమాచారం వారికి ఆటోమేటిక్‌గా చేరిపోతుంది.. సమావేశానికి హాజరైపోతారు.. ఆవిధంగా మా సబ్‌స్క్రైబర్ల్‌కు మేం ఋణపడుంటాం.. ఈరోజున తెలంగాణాలో హైదరాబాద్ మాత్రమే కాకుండా కరీంనగర్, నిజామాబాద్ మిగిలిన ఇతర జిల్లాలలో మిద్దెతోట పెంపకం ప్రచారం పొందింది. ఆంధ్ర ప్రాంతంలో విజయవాడ, విశాఖపట్టణం, రాజమండ్రి, గుంటూరు నగరాల్లో మిద్దెతోటలు గణనీయంగా పెంచుతున్నారు.. మీరు ఈ ఇంటర్వ్యూ మొదట్లో రైతునేస్తం పత్రికను అన్నదాత పత్రికతో పోల్చారు. మనం పత్రిక పెట్టడం వలన వాళ్ళ పత్రిక మరింత మెరుగైంది అని నమ్ముతాను నేను (కాంపిటీషన్ వలన). మేము రైతుల ఫోన్ నంబర్లు ఇస్తుండేవాళ్ళం. దానివలన వారుకూడా ఇవ్వవలసిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఇప్పటివరకు వందలమంది రైతులకు అవార్డులివ్వటం వలన రైతులను గౌరవిస్తున్నారు.. రైతు గురించి ప్రజలు తెలుసుకుంటున్నారు అంటాను.. మేమిచ్చే రైతునేస్తం పురస్కారాలకు ఇరవై ఏళ్ళనుంచి తొంభై సంవత్సరాల మధ్య వయసున్న వారికి ఇస్తాం.. ఎక్కువగా యువరైతులే ఈ పురస్కారాలు పొందుతుంటారు .. ఎందుకంటే వారిలో ఉన్న సృజనాత్మకత వలన. ప్రధానంగా వ్యవసాయంతో మీరొక కెరీర్ ఏర్పరుచుకోవచ్చు అన్నది మా అంతర్వాహక లక్ష్యం.. టెక్నాలజీ సహకారంతో కషాయాలు తయారుచేసి మార్కెటింగ్ చేసుకోవటం నుంచి పనిముట్ల తయారీ మార్కెటింగ్ వరకు ఎన్నో అంశాలు సాగుతో ముడిపడి ఉన్నాయని చెబుతూ అగ్రికల్చర్ ఆదాయాన్నిచ్చే వనరు అని చెబుతాం.

**మిసిమి :** **అగ్రికల్చర్ యూనివర్సిటీ వారితో మీరు కలిసి పనిచేసే అవకాశం ఉంటుందా! లేదంటే మీ వర్క్ వారు గమనిస్తుంటారా?**

**వెంకటేశ్వరరావు :** వారితో అనుబంధం ఉంది. అగ్రికల్చర్ డిగ్రీ చదివే విద్యార్థులు మా దగ్గర నలభైరోజుల ఇంటర్న్ షిప్ చేస్తారు. వాళ్ళే కాదు, మా దగ్గర జరిగే వర్క్ చూసేందుకు స్కూల్ పిల్లలు కూడా వస్తారు.

**మిసిమి :** **పురుగుమందులు, ఎరువులకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులకు ఆ సంస్థలతో లాలూచీ ఉండేది. ఇప్పుడేమైనా మార్పు వచ్చిందా?**

**వెంకటేశ్వరరావు :** మార్పు తప్పకుండా వచ్చింది.. ఇదివరకు రైతులు ప్రశ్నించటం తక్కువ చేసేవారు. సోషల్ మీడియా వచ్చాక ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది.. దీనివలన అన్నిచోట్లా విస్తరణ సేవా విభాగాలు చురుకుగా ఉండటం మొదలుపెట్టాయి.. పండించే పంట పురుగుమందుల అవశేషాలతో నిండి ఉంటే ఎవరి ఆరోగ్యమైనా ప్రమాదంలో పడుతుంది కదా. ఆ ఎరుక అందరిలోను కలిగింది.

**మిసిమి :** **ఉన్నట్టుండి ఈమధ్య యూరియా కొరత ఏర్పడింది.. దానికి యుద్ధం కారణం అంటున్నారు . అదెలా సాధ్యం?**

**వెంకటేశ్వరరావు :** కారణమేమిటంటే యూరియా తయారిలో వాడే ముడిపదార్థాలు బయటి నుంచి రావాలి. ఇది వ్యాపారం.. అలాంటప్పుడు ఇవన్నీ వస్తాయి. నేను యూరియా అవసరమని చెప్పను. కెమికల్

వాడేవాడికి యూరియా కావాలి.. మాది ఆర్గానిక్ ఫార్మింగ్ కదా.. అందుకని వాడం.. మేము కూడా ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఒకేసారి వెళ్ళమని చెప్పం.. ఐదెకరాలుంటే ఒక అర ఎకరం చేసుకోమని చెబుతాం..

**మిసిమి :** **పత్తి, మిరప వంటి కమర్షియల్ పంటలు ఎక్కువగా వేసింది కౌలురౌతులే కదా.. వ్యవసాయాన్ని జూదంగా మార్చింది వాళ్ళే కదా?**

**వెంకటేశ్వరరావు :** పూర్తిగా వాళ్ళే అని చెప్పలేం.. మొదట తెల్లబంగారంగా ముద్రపడిన పత్తి వేశాడు రైతు. దానివలన లాభం పొందాడు. మిగిలినవారికి ఆర్థిక అవసరాలున్నట్టే రైతుకు కూడా ఉంటాయి. అందుకని నెమ్మదిగా వాణిజ్య పంటలయిన పత్తి, మిరప వైపు మొగ్గు చూపాడు.. ఒకప్పుడు ఇంటిల్లిపాదీ పొలం పనుల్లో పాల్గొనేవారు. ఇవాళ ఆ పరిస్థితి లేదు.. మీకో విషయం చెప్పమంటారా.. మా యూట్యూబ్ ఛానెల్లో కూడా మేము యాభైవేలు పెట్టుబడి పడితే పదిలక్షలొస్తాయని చెబితే అందరూ చూస్తారు. మాకు వ్యూస్ వస్తాయి. అదీ ట్రెండు. అందుకే మేము కూడా రైతు డబ్బు సంపాదించగలిగే పంటలను సజెస్ట్ చేస్తాం..

**మిసిమి :** **ప్రింటింగ్ ప్రెస్ నుంచి చిరుధాన్యాల వరకు, రైతులకు అవార్డుల నుంచి రైతునేస్తం ఫౌండేషన్ వరకు ఇన్ని పనులు ఎలా చేయగలుగుతున్నారు?**

**వెంకటేశ్వరరావు :** మనసుంటే మార్గం ఉంటుందని మన పెద్దలు ఏనాడో చెప్పారు.. దాన్నే ఫాలో అవుతున్నాను. ఏదైనా ఒక కార్యక్రమం తలపెడితే అది పూర్తయేవరకూ దానిమీదే దృష్టిపెడతాను.. ఒక్కమాటలో చెప్పాలంటే మిత్రుల సహకారంతో ఈ ప్రయాణం సాగిస్తున్నాను. మీకు చేయాలనే బలమైన సంకల్పం ఉంటే చేయలేనిదేదీ లేదని నేను నమ్ముతాను. నాకు డబ్బు సంపాదించాలనే ధ్యాసకన్నా, సంపాదించిన డబ్బును ఉపయోగకరంగా ఖర్చుపెట్టడం మీదే ధ్యాసెక్కువ.. నేను కష్టపడతాను.. నాతోపాటు ఉన్నవాళ్ళతోటి పనిచేపిస్తాను.. ఖాళీగా ఉండటం నచ్చదు నాకు.. మాదగ్గర ప్రతివాళ్ళూ అన్నిపనులు చేస్తారు..

**మిసిమి :** **సంవత్సరానికి మీ బడ్జెట్ ఎంత?**

**వెంకటేశ్వరరావు :** దానిగురించి నేనెప్పుడూ ఆలోచించలేదు.. ఖర్చుల బడ్జెట్ వేసుకుని మొదలుపెడితే ఈరోజున ఇన్నిపనులు చేయగలిగేవాళ్ళం కాదు..

**మిసిమి :** **మీ ప్రెస్సే ఇన్ని కార్యక్రమాలు మీచేత చేయిస్తోందా?**

**వెంకటేశ్వరరావు :** నూటికి నూరు శాతం.. నా వెనక ఏ అజ్ఞాతశక్తీ లేదు.. ఏ అజ్ఞాతవ్యక్తీ లేడు. చాలామంది మాకెవరో విరాళాలిచ్చి ఆదుకుంటున్నారు అని అనుకుంటుంటారు. అది అబద్ధం. నన్ను ప్రత్యక్షంగా చూసినవారికి నేనేమిటో తెలుసు.

**మిసిమి :** **రైతునేస్తం పుస్తకం చందాదారులొక లక్షమంది ఉంటారా?**

**వెంకటేశ్వరరావు :** ఇప్పుడు రైతునేస్తం పత్రిక వెబ్‌సైట్‌లో పెట్టేస్తున్నాం. పుస్తకాన్ని ముద్రించడం లేదు. లక్షమంది ఆ వెబ్‌సైట్లో చూస్తున్నారు. ఆ పత్రికలోని వ్యాసాలను పిడిఎఫ్‌లుగా మార్చి ఫేస్బుక్, వాట్సప్ గ్రూపుల్లో పెడతాం (ఇరవైవేలమంది ఈ గ్రూపుల్లో ఉన్నారు). అలా ఎక్కడికక్కడ రీడర్ షిప్ ఏర్పడుతుంది..

**మిసిమి :** **వీళ్ళెవరన్నా మీకు ఆర్థిక సాయం చేస్తారా?**

**వెంకటేశ్వరరావు :** వ్యవసాయానికి ఎవరూ సహాయం చేయరండీ..మనది మనం చేసుకుంటూ పోవటమే.. ఇంకో విషయం చెప్పాలి రైతు ఆత్మహత్యల గురించి చర్చలు జరిగాయి.. కొంత సహాయం చేశారు. కానీ రైతులందరికీ చేయలేకపోయారు కదా..

**మిసిమి :** **రైతు ఆత్మహత్యల మీద సరైన ఫోకస్ పెట్టలేదనిపిస్తుంది.**

**వెంకటేశ్వరరావు :** రైతు ఆత్మహత్యలకు అనేక కారణాలుంటాయి.. ఖర్చులు పెరిగిపోవడం, దిగుబడి ఆ స్థాయిలో రాకపోవడం, ఒక సంవత్సరం ఉన్నరేటు ఆ మరుసటి సంవత్సరం ఉండకపోవటం.. ఇలా అనేక కారణాలు.. వీటితోబాటు వ్యక్తిగత కారణాలు ఉంటాయి.. అందుకే మేము ఏ మీటింగ్ పెట్టినా రైతుకు మౌలిక సదుపాయాలు కల్పించమని కోరతాం..

**మిసిమి :** **మీరు మాత్రం గొప్ప సేవ చేస్తున్నారు. దాని గురించి డౌటే లేదు. ఏమీ ఆశించకుండా రైతుకు సేవ చేయటం మామూలు విషయం కాదు.. మీరు చేస్తున్న ఈ సేవలను ప్రభుత్వం గుర్తించి మీకు పద్మశ్రీ పురస్కారం ఇవ్వటం వాళ్ళ గొప్పదనం.**

**వెంకటేశ్వరరావు :** నేను మాత్రం రైతుల గొప్పదనంగా చెబుతాను.. రైతులు సన్మాదరించకపోతే ఇంతకాలం ఇన్ని చేసేవాడిని కాదుకదా. అయితే పురస్కారం ఉత్సాహాన్నిచ్చింది. అది రైతులకంకితం అని ఆనాడే చెప్పాను. అలాగే మేమిప్పటివరకు ఏడువందలయాభైకు పైగా రైతులకు పురస్కారాలిచ్చాం.. వాళ్ళూ అదే ఉత్సాహంతో పనిచేయాలని. మన ప్రియతమ పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారొక మాట చెబుతారు. ఈ అవార్డు మరికొంతమందికి స్ఫూర్తినివ్వాలని.. ఆ మరికొంతమంది .. ఇంకా మరికొంతమందికి ఆదర్శబాట పరచాలని.. ఆ విధంగా ఇదొక చైన్ రియాక్షన్ కావాలన్న ఉద్దేశంతో రైతునేస్తం, ముప్పవరపు ఫౌండేషన్లు గత ఆరేడేళ్ళుగా సంయుక్తంగా ఈ అవార్డులనిస్తున్నాయి..

**మిసిమి :** **మీకు గౌరవ డాక్టరేట్ ఇచ్చారు.. ఎప్పుడిచ్చారు?**

**వెంకటేశ్వరరావు :** కెఎల్ యూనివర్సిటీ వారు 2019వ సంవత్సరంలో ఇచ్చారు. ఆ సంవత్సరం నాకు, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి గారికీ ఇచ్చారు. వాళ్ళకి కూడా వ్యవసాయం పట్ల అవగాహన ఉందనుకుంటాను. అప్పటికే వారు వ్యవసాయ విభాగం వాళ్ళ యూనివర్సిటీలో పెట్టారు.. వారితో పాటు విజ్ఞాన్ యూనివర్సిటీ వాళ్ళు కూడా అగ్రికల్చరల్ బియస్సీ మొదలుపెట్టారు.. కెఎల్ యూనివర్సిటీ వారిచ్చినందుకు సంతోషమే కానీ, నిజమైన సంతోషం మన వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటు ఇచ్చినప్పుడు కలుగుతుంది.. కానీ వారికి రూల్స్ పర్మిట్ చేయవు..



మిద్దెతోట

**మిసిమి :** **మీరు చదివిన చదువుకు, చేసే పనికి సంబంధం లేదు.. మీకు ఎప్పుడో మనసులో వ్యవసాయమనేది ఇంకిపోయింది.. అందువలన ఈ రంగానికి ఇంత మేలు చేస్తున్నారు. ఈ రంగంలో ఇంత కృషి చేస్తున్నారు.. మీరంతగా సంపాదించిందీ లేదు..**

**వెంకటేశ్వరరావు :** మనం పుట్టింది వ్యవసాయంలో.. ఆ రంగం గురించి ఎంతోకొంత అవగాహన కల్పించితే మన జన్మ సార్థకమయినట్లే అని నా అభిప్రాయం.. మీరు గమనిస్తే వ్యవసాయంలో ఉన్నవాళ్ళు పోయేవరకూ ఆ వ్యవసాయరంగంలోనే ఏదో ఒకటి చేస్తూ ఉంటారు.. అదీ ఈరంగం ప్రత్యేకత.. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినవాడిగా నా మనసు ఎప్పుడూ దానిచుట్టూ పరిభ్రమిస్తుంటుంది..

**మిసిమి :** **ఇప్పటిదాకా చాలా విషయాలు చెప్పారు.. మిసిమి పత్రిక మీకెప్పటినుంచీ పరిచయం?**

**వెంకటేశ్వరరావు :** మీరునమ్మరేమో కానీ.. రెండు దశాబ్దాల కాలంపైగానే నాకు **మిసిమి** పరిచయం.. వెంకటేశ్వరరెడ్డి గారు ఎడిటర్గా ఉన్నప్పటి నుంచి ఆ పరిచయం సాగుతోంది.. ముఖ్యంగా రైతునేస్తం పత్రిక సమయంలో ఇంకొంచెం సీరియస్గా పరిశీలించాను.. అంటే పుస్తకం సాంకేతికంగా ఏవిధంగా ఉంటోంది అన్న అంశానికి సంబంధించి..

**మిసిమి :** **మీరు వేసే పుస్తకాలు ఎలాంటివని చెప్పవచ్చు?**

**వెంకటేశ్వరరావు :** తొంభైఐదుశాతం పుస్తకాలు వ్యవసాయానికి చెందినవే ఉంటాయి.. ఆ సబ్జెక్టుకున్న డిమాండ్ బట్టి ఆ అంశంలో పరిజ్ఞానం ఉన్నవారితోటి రాయిస్తాము..ఆ పుస్తకాలను రైతుకు చేరుస్తున్నాం..

**మిసిమి :** **నేను పల్లెపలుకు అనే పుస్తకం ఒకటి రాయించాను ఒక పెద్దాయనతో.. గుంటూరు జిల్లాలో గ్రామీణులు మాట్లాడుకునే పదకోశం..**

**వెంకటేశ్వరరావు :** రైతునేస్తం తరపున మేం ప్రింట్ చేస్తాం..

**మిసిమి :** **చాలా కృతజ్ఞతలు మీకు.. రెండు భాగాలు ప్రింట్ చేసి పెట్టండి చాలు..**

**వెంకటేశ్వరరావు :** నేను ఆ రచన చూశాను. వాడుకభాష పదాలు అద్భుతంగా ఉన్నాయి.నేనూ ఆ పదాలు వాడినవాడినే..

**మిసిమి :** **1989నుంచి మొదలైన మీ ప్రయాణాన్ని 2026 వరకు పరిశీలిస్తే ఎంత తృప్తికరంగా ఉందని మీరు భావిస్తారు?**

**వెంకటేశ్వరరావు :** చాలా సంతోషంగా గడిచిందనే అనుకుంటాను.. ఎందుకంటే జీవితం అనేది తక్కువ సమయం ఉంటుంది. ఉన్నంతలో అందరూ సంతోషంగా ఉండాలన్నది నా కోరిక.. నెక్స్ట్ క్షణం ఎలా ఉంటుందో తెలియదు. కాబట్టి ఉన్నంతలో ఆనందంగా ఉంటూ పదిమందికి సాయం చేయగలిగితే చాలు.. రైతుల కళ్ళలో ఆనందం చూడాలన్నదే నా కోరిక.. వాళ్ళకి మంచి జరగాలి.. మనం తినే ఆహారం పండించేది రైతు.. అందుకని వాళ్ళకి ఏదో ఒక రూపంలో సాయం చేయాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నాను.

**మిసిమి :** **మీరు చాలా చిన్నవయసు వారిగా కనిపిస్తారు. దానికి రైతంటే మీకున్న ప్రేమ కారణం అనుకుంటాను. జంగ్ అనే సైకాలజిస్ట్ చెబుతాడు.. మనలో ఒక చిన్నపిల్లాడుంటాడు.. వాడిని మనం కాపాడుకోవాలని. అలాగే వర్తమానంలో బతకాలి. మనకిష్టమైన పని చేస్తుండాలి. అలాగే పాజిటివ్‌గా ఆలోచిస్తూ ఉండాలి. ఇవన్నీ గనక ఉంటే మనకు వయసు వచ్చినా కూడా అది మనకు కనపడదు. మిమ్మల్ని చూస్తే అదే అనిపించింది. ముందు ముందు ఏం ప్లాన్ చేసుకుంటున్నారు?**

**వెంకటేశ్వరరావు :** నేను ప్లానింగ్ అంటూ ఏమీ చేసుకోను. అప్పటికి ఏదితోస్తే అది చేయటమే.. కానీ పిల్లలకి వ్యవసాయం పట్ల, మొక్కల పట్ల ప్రేమ కలిగించాలి.. అవగాహన పెంచాలని నా కోరిక.. దానికోసం కొన్ని పుస్తకాలు పిల్లల కోసం ప్రింట్ చేసి స్కూళ్ళలో ఇవ్వలనుకుంటున్నాను. మార్పు పిల్లల దగ్గరనుంచే రావాలి.

**మిసిమి :** **పశు సంపద పెంచటం అవసరం కదా..**

**వెంకటేశ్వరరావు :** తప్పకుండా పెంచాలండీ. మనకు ఆర్గానిక్ ఫార్మింగ్లో ఇన్పుట్స్ అన్నీ పశువులనుంచే వస్తాయండీ..

**మిసిమి :** **పిల్లలకు పాఠ్యపుస్తకాల్లో కొన్ని అంశాలు వ్యవసాయానికి సంబంధించినవి పెట్టిస్తే బావుంటుదేమో కదా..**

**వెంకటేశ్వరరావు :** ఆ ప్రయత్నం వెంటనే చేయాలి.. మంచి సూచన చేశారు.. కొంత కసరత్తు ఆ దిశగా జరుగుతోంది. అలాగే తల్లిదండ్రుల్లో కూడా మార్పు రావాలి.. ఈరోజు సెల్‌ఫోన్ అనేది వ్యసనంగా మారిపోయింది.. పిల్లల్లో వ్యవసాయంపట్ల, జంతువులపట్ల, సాటిమనుషుల పట్ల ప్రేమ పెంచాలి.. ఇది తల్లిదండ్రులు మాత్రమే చేయగలరు.. పిల్లలు ఏదైనా నేర్చుకుంటారు.. ముఖ్యంగా టెక్నాలజీని చాలా తొందరగా నేర్చుకుంటారు వారు.. కుటుంబ వ్యవస్థ ఎప్పుడైతే బలంగా ఉంటుందో అప్పుడు జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయి..

**మిసిమి :** **ధన్యవాదాలు వెంకటేశ్వరరావుగారు.. చాలా విలువైన విషయాలు చెప్పారు.. ధన్యవాదాలు..**

**వెంకటేశ్వరరావు :** మీకు కూడా చాలా చాలా ధన్యవాదాలు..

---

**సంభాషణ : అశ్వినీకుమార్**

ధ్వని ముద్రణకు రాత ప్రతి : ***సి.ఎస్. రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

## మోహాంధకారంలో జ్వలించిన అంతరాత్మ

# కృష్ణకాంతుని వీలునామా

– ఆచార్య వై. పార్థసారథి

**న**వల కేంద్రాంశం 'కృష్ణకాంతుని వీలునామా'. వీలునామా ద్వారా వచ్చే ఆస్థి, వారసత్వ సమస్యలు – వాటి చుట్టూ పెనవేసుకున్న సామాజిక, వ్యక్తిగత సంబంధాలు ఈ నవలకు కేంద్రబిందువు. సంప్రదాయ కుటుంబ వ్యవస్థలోకి ఆధునిక చట్టం ప్రవేశించిన కాలంలో ఏర్పడే ఉద్రిక్తతలను ఒకవైపు ఉద్వేగంగా, మరోవైపు హాస్యరసభరితంగా చిత్రించడం బంకించంద్రకే చెల్లింది. ఆస్థి సమస్యలు పరిష్కారమైనా, మానవ సంబంధాలలో ఏర్పడిన గాయాలు అంత సులభంగా నయం కావు సరికదా, నూతన సమస్యలను సృష్టిస్తాయి.

బంకిం ఇతర నవలలో ఏదో పద్ధతిలో అంతర్లీనంగా వుండే మానవాతీత అంశాలు, చారిత్రక, రాజకీయ సంఘటనలు ఏ మాత్రం లేని సామాజిక విమర్శనాత్మక నవల ఇది. బంకిం ఈ రచన ద్వారా పాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ భారతీయ కుటుంబ జీవన విధానాన్ని ఎలా ప్రభావితం చేసిందో, విమర్శనాత్మక ప్రతిబింబంగా మనముందు వుంచగలిగారు. లంచగొండితనం ప్రభుత్వ వ్యవస్థలను నడిపే తీరును హాస్య రస సంభాషణలతో నవలలో చొప్పించడం విస్మయం కలిగిస్తుంది.

ఆనాటి భారత సమాజంలో వారసత్వం – కుటుంబక్రమం, పితృస్వామ్య అధికారం, సంప్రదాయ నియమాల ఆధారంగా నడిచేది. ఆధునిక రాత పూర్వక వీలునామా కుటుంబ సంబంధాలను చట్టబద్ధ హక్కులుగా మార్చడంతో ఆస్తి – ప్రేమ, సంప్రదాయాలతో కాకుండా, పత్రాలు, సంతకాలు, సాక్ష్యాలతో ముడిపడింది. వీటివల్ల అనుమానం, మోసం, ఘర్షణ పెరిగి, కుటుంబ సంబంధాలలో మానవత్వం లోపించి, లోభం మరింతగా మనిషిలో తిష్టవేసింది.

ఈ నవల రాయబడిన సామాజిక నేపథ్యం, కాలం కూడా ముఖ్యమైనవే. పందొమ్మిదవ శతాబ్దపు బెంగాల్, వలసపాలనలో వేగంగా మారుతూ–కొత్త విద్యావిధానాన్ని, చట్టవ్యవస్థను, ముద్రణా పద్ధతులను ఆకళింపజేసుకుని, వివాహం–సంస్కృతి–ఆచార వ్యవహారాలపై కొత్త ముద్రలను వేయడంతో వచ్చిన మార్పులను విశదీకరించిన సాహిత్య కృతి. ఈ మార్పులన్నీ కుటుంబ జీవితంలోకి వారసత్వ తగాదాలుగా, మారుతున్న నైతిక, లింగ సంబంధాలను ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయో కథాత్మకంగా వివరించిన నవల ఇది.

**బంకిం రచనలలో మొదటినుండి కనిపించే నైతికతత్వం – చెడు భయంకరమైన బాహ్య శక్తి కాదు – అది మనుషుల సాధారణ బలహీనత. మనస్సాక్షి లేని కోరిక, వినయం లేని అహంకారం, బాధ్యత లేని అధికారం నాశనానికి దారితీస్తాయి. ఈ నైతిక సూక్ష్మతే ఈ నవలను నీతికథల కంటె ఉన్నతంగా నిలబెట్టింది.**

ప్రధానంగా రోహిణి – గోవిందలాల్ – భ్రమరి అనే మూడు పాత్రల చుట్టూ నవల అల్లబడింది.

రోహిణి పాత్రను రూపొందించిన తీరే ఈ నవలలో అత్యంత నాటకీయత. ఆమె సాధారణ ప్రతినాయికగా లేదా ఆదర్శ నాయికగా కూడా చూడలేము. కోరిక, తెలివి, అసంతృప్తి, భావోద్వేగ తీవ్రతల సమ్మేళనం. ఇతర రచనలల్లోలా కాకుండా, బంకిం ఈ నవలలో రచయితగా ప్రవేశించి, తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ, మరికొన్ని సమయాల్లో ఆమె ఎందుకలా ప్రవర్తిస్తుందో నేను వివరించలేను అంటూ తప్పుకుంటాడు. రోహిణిని ఎక్కడ వర్ణించినా ఆమె బాహ్య సౌందర్యాన్నే బంకిం ప్రస్తావిస్తాడు.

ఆమె నిండు యౌవన, షోడశ కళాప్రపూర్ణ, సౌందర్యరాశి, బాల్య వితంతువు–అయినా రంగు చీరలు, గాజులు ధరిస్తుంది. తాంబూలం సేవిస్తుంది. నడుస్తుంటే గజ్జలు ఘల్లుఘల్లున మ్రోగుతాయి. విధవ అయినా బొట్టు పెట్టుకుంటుంది. చేపలను తింటుంది. ఆమె పందొమ్మిదవ శతాబ్దపు నియంత్రిత సమాజంలోని కట్టుబాట్లను తిరస్కరించే లక్షణాలు కలిగిన యువతి. వారుణి నదిలో నీళ్ళకడవ ముంచుతూ తన ప్రతిబింబాన్ని చూసుకుని, ఈ బాల వైధవ్యానికి కారణం ఏమిటని ఏడుస్తూ ప్రశ్నించుకుంటుంది. రోహిణికి కావలసింది భద్రమైన ఆశ్రయం. దుర్మార్గం కాని, డబ్బు కాని ఆమెను ఆకర్షించవు. కామం, లోభం ఆమె సహజ స్వభావంలో లేవు.

గోవింద్‌లాల్ ప్రధాన పాత్ర. నిర్ణయలేమితో బాధపడే పురుషత్వానికి ప్రతీక. చదువుకున్నవాడు, గౌరవనీయుడుగా కనిపించినా, నైతికంగా బలహీనుడు. కర్తవ్యం, కోరిక, ప్రేమ, ప్రలోభాల మధ్య తడబడుతుంటాడు. సరైన నిర్ణయాలు తీసుకోలేక విషాదాలకు కారణమవుతాడు. ధనిక కుటుంబంలో ఉండడం వల్ల కోరినది చేయడంలో ఎప్పుడూ అడ్డంకులు రాలేదు. దురాచారి కాదు. తన భార్య భ్రమరి తనను అర్థం చేసుకోలేదని గ్రహించడు. తానే ఆమెను అర్థం చేసుకోలేదని కూడా తెలుసుకోలేడు. ఆమె మనస్థితికి తాను ఎంత కారణమో అర్థం చేసుకోవడానికి తగినంత ఆలోచనలకు తావు ఇవ్వడు. ఈ పాత్ర ద్వారా పితృస్వామ్య సమాజంలో పురుషుల బాధ్యతారాహిత్యాన్ని బంకిం విమర్శనాత్మకంగా చూపించారు. పురుషులకు చట్టబద్ధ, సామాజిక అధికారం ఉన్నప్పటికీ, నైతికంగా విఫలమవుతారని ఈ పాత్ర తెలుపుతుంది.




భ్రమరి గోవింద్‌లాల్ భార్య. వయస్సులో గోవిందలాల్ కంటె చాలా చిన్నది. విశ్వాసం, నియంత్రణ, నిజమైన ప్రేమకు ప్రతీక. అయినప్పటికి ఆమె కేవలం ఆదర్శ భార్య కాదు. బాధ, గౌరవం, నైతిక బలం ఆమె పాత్రను లోతుగా తీర్చిదిద్దాయి. భావోద్వేగం కలిగి వుండేంత చదువు, ఇంటిని నిలబెట్టేంత సద్గుణం, ఇతరుల తప్పులను భరించేంత త్యాగం - ఈ ఆదర్శీకరణ ఎంత బాధాకరమో బంకిం ఈ పాత్ర ద్వారా రక్తి కట్టించారు. ఆమె తన భర్తను ఆరాధిస్తుంది, ప్రేమిస్తుంది కాని అర్థం చేసుకోదు, చేసుకోలేదు కూడా. తన చివరి రోజుల్లో ఆమె రాసిన ఉత్తరం - *నీవు ప్రేమకు పాత్రుడిగా ఉన్నంతకాలం నిన్ను ప్రేమించాను. విశ్వాసానికి పాత్రుడిగా వున్నంతకాలం నిన్ను నమ్మాను. ఇప్పుడు నిన్ను చూడడం నాకు ఆనందం ఇవ్వడం లేదు.*

సందేహం, అసూయ, పశ్చాత్తాపం, భావోద్వేగ విరుద్ధతలను వివరిస్తూ, ఆయా పాత్రలు కేవలం మంచి, చెడులకు ప్రతీకలు కాదని, మనిషిలో అంతర్గతంగా పోరాడే వైరుధ్యాలని, వీటిపై ఆధునిక భావజాల ప్రభావాన్ని తెలియపరచిన మానసిక విశ్లేషణాత్మక కథనం ఈ నవల.

విషాదం విధివల్ల మాత్రమే కాదు; నిర్ణయలేమి, అపార్థాలు, భావాలను సరైన సమయంలో వ్యక్తపరచలేని బలహీనతవల్ల ఏర్పడుతుందని ఈ మూడు పాత్రలు - రోహిణి - భ్రమరి - గోవింద్‌లాల్ తెలుపుతాయి.

\- - - -

1875-77 మధ్యకాలంలో వంగదర్శన్‌లో సీరియల్‌గా వచ్చి 1877లో నవలగా ప్రచురింపబడిన కృష్ణకాంతుని వీలునామా పూర్తి సాంఘిక నవల. ఈ నవల ప్రగతిశీలంగాను, మరోవైపు సాంప్రదాయక లక్షణాలతో తెలివి కలిగి, స్వతంత్రత కావాలనే రోహిణికి మద్దతు ఒకవైపు-గృహ సద్గుణాలను కలిగిన భార్య భ్రమరిని మహిమాన్వితంగా చూపిస్తూ మరోవైపు-అదే సమయంలో సామాజిక అతిక్రమణకు శిక్ష తప్పదని చెబుతూ బంకిం పాత్రలను మలిచాడని ఆ తర్వాతి స్త్రీవాదుల అభిప్రాయం.

భారతీయ సామాజిక దోషాలను పాశ్చాత్య నవలా నిర్మాణంతో భారతీయ భావాలను కలగలిపి రచించిన నవల అని శ్రీ అరవిందుడు అభిప్రాయపడగా, మహిళా పాత్రల అంతర్ముఖ వేదనలను తీర్చిదిద్దిన పద్ధతికి, మరే నవల సాటిరాదని ఠాగూర్ విశ్లేషించాడు.

ది అథేనియం అనే ప్రముఖ బ్రిటీష్ జర్నల్ తన సెప్టెంబర్ 1896 సంచికలో దీనిని సమీక్ష చేసింది. ***నాటకీయ అర్థం, హృదయాన్ని తాకే కరుణతో నిండిన సంఘటనలు, దృశ్యాల మధ్య కథ జరుగుతూ, కొన్నిచోట్ల చిలిపి హాస్యం, మరికొన్నిచోట్ల నేరపు చీకటి మేఘం లేదా అదుపులేని భావోద్వేగాల తుఫాను మిమ్ములను కమ్మి వేస్తాయి.***

**ది న్యూయార్క్ టైమ్స్ డిసెంబర్ 25, 1895న వెలువరించిన సమీక్ష.** ***కథ సులభంగా చదివించేదిగా వుంది. వర్ణనాత్మక భావాలు నిర్మలంగా, చిత్రాత్మకంగా వున్నాయి. దీని మాతృరూప భాషలో మరింత శక్తివంతమైన, ఉత్తేజకరమైన రచన అయి వుండవచ్చు. కృష్ణుడి గురించి పేరుగా తెలిసిన వారికి, హిందూ జీవన విధానం, ఆచారాలు మరింతగా అర్థంకాని పాఠకులకు, ఈ నవల సాహిత్యంలో ఒక విచిత్రమైన, ఆసక్తికర వస్తువుగా అనిపించవచ్చు.***

### కృష్ణకాంతుని వీలునామా

హరిద్రా గ్రామంలో కెల్లా ధనికుడైన కృష్ణకాంత్‌రాయ్ తన తమ్ముడు రమాకాంత్‌రాయ్‌తో కలసి తన ఆస్థిపాస్తుల్ని, జమీందారి గ్రామాల్ని విస్తృతంగా పెంచుకుని, సంవత్సరానికి

రెండు లక్షల పైగా ఆదాయాన్ని పొందుతుండేవాడు. తమ్ముడి హఠాన్మరణంతో, కలత చెందిన కృష్ణకాంత్, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ఊహించి, వీలునామా రాయించాడు. దాని ప్రకారం కృష్ణకాంత్ కుటుంబానికి సగభాగం, తమ్ముడు రమాకాంత్ కొడుకు గోవింద్‌లాల్‌కు సగభాగం ఆస్తి విభజింపబడింది. తనకు మరింతగా వాటా కావాలని కోరిన తన కుమారుడు హరలాల్‌ను మందలించి, అతని వాటాను మరింతగా తగ్గించి వేస్తాడు కృష్ణకాంత్.

తనకు ఆస్తిలో సగభాగం ఇవ్వకపోతే, విధవా వివాహం చేసుకుని వంశప్రతిష్ఠ దెబ్బతీస్తానని బెదిరించినా కృష్ణకాంత్ లొంగక, హరలాల్ వాటాను మరింతగా తగ్గించాలని కృష్ణకాంత్ నిశ్చయించుకుని, తిరిగి వీలునామా రాయించాలని, ఎప్పుడూ రాతకోతలు చేసే బ్రహ్మానందఘోష్‌ను పిలిపిస్తాడు. అంతకుముందే హరలాల్ బ్రహ్మానందుడితో ఒప్పందం కుదుర్చుకుని దొంగ వీలునామా రాయించి, వీలునామాలను మార్పించాలని ప్రయత్నించినా, మొదట్లో అంగీకరించిన బ్రహ్మానందుడు భయపడి వెనకడుగు వేస్తాడు.

హరలాల్, బ్రహ్మానందుడి అన్నకూతురు, బాల్యంలోనే వైధవ్యం ప్రాప్తించి, పెదనాన్న దగ్గరే ఉంటున్న రోహిణి దగ్గరకు వెళతాడు. రోహిణి పదహారు కళలతో వెలిగే శరశ్చంద్రుడి అందాలను పోతపోసినట్లు వుండే యువతి. విధవలు ధరించే వస్త్రాలు గాని, పద్ధతులు కాని పాటించకుండా స్వతంత్రంగా వుండే మహిళ. చిత్రలేఖనం, కుట్టుపని కూడా తెలిసి వుండడంతో ఆ గ్రామంలో వున్న బాలికలకు మార్గదర్శి. కృష్ణకాంత్ ఇంట్లోకి చొరవగా ఎక్కడికైనా వెళ్ళగలిగే చతురతతోపాటు మాటలతో మాయ చేయగల దిట్ట.

హరలాల్, రోహిణితో మాటలు కలిపి, విధవా వివాహం చేసుకుంటానని ఆశ కల్పించి, రాయించి వుంచుకున్న నకిలీ వీలునామాను, తన తండ్రి బీరువాలో ఉన్న నిజమైన వీలునామా స్థానంలో ఉంచి, నిజప్రతిని తెచ్చిమ్మని కోరతాడు. హరలాల్ ఇచ్చిన డబ్బును తీసుకోకుండా, రోహిణి, కృష్ణకాంత్ నల్లమందు సేవించి మగతగా వున్న సమయంలో వీలునామాలను మారుస్తుంది.

నిజప్రతి వీలునామా హరలాల్‌కు ఇవ్వకుండా, తనను కాని మరో విధవను కాని వివాహం చేసుకుంటేనే, నిజప్రతి వీలునామా ఇస్తానని అనడంతో, హరలాల్ ఆమెను దొంగ అని దూషించి, దొంగను వివాహం చేసుకోనని చెప్పి వెళ్ళిపోతాడు.

అతని మాటలతో హతాశురాలైన రోహిణి, తాను అనవసరంగా తప్పు చేశానని భావించి, నీటికోసం చెరువుకు వెళ్ళి ఏడుస్తూ కూర్చుంటుంది. అక్కడే ఉన్న గోవింద్‌లాల్ (కృష్ణకాంతుని తమ్ముడి కుమారుడు) ఆమెను ఓదార్చి, బాధకు కారణం అడిగినా చెప్పకుండా, ఏదో ఒకరోజు తప్పనిసరిగా చెబుతానని మాట ఇస్తుంది.

రచయిత ఇక్కడ మానవ హృదయంలో మంచి–చెడుల మధ్య ఎప్పుడూ జరిగే ఘర్షణను – సుమతి అనే దేవత – దుర్మతి అనే రాక్షసి రూపంలో చర్చలు జరుపుతాడు. ఈ హాస్యరస ప్రక్రియ, ఒక దశలో ఈ రెండు ఛాయలు జుట్టుపట్టుకుని కొట్టుకుంటాయి. మానవ మనో మథనంలో జరిగే ఈ ఘర్షణ, తరువాతి కాలంలో అనేక సినిమాలలో అద్దంలో రెండు భావాలను ప్రతిబింబించే వాదులాటలో గుర్తించవచ్చు.

ప్రతిరోజూ గోవింద్‌లాల్ తోట నుండి, నదిలో నీటికి వెళుతున్న రోహిణి, నెమ్మదిగా అతనంటే యిష్టాన్ని పెంచుకుంటుంది. తన దగ్గర దాచి వుంచిన వీలునామా ప్రకారం ఆస్తిలో సగభాగం గోవింద్‌లాల్‌కు చెందుతుంది. కాని కృష్ణకాంత్ దగ్గర వున్న వీలునామా ప్రకారం గోవింద్‌లాల్‌కు ఒక పైసా మాత్రమే వస్తుంది.

మానసికంగా తర్జన భర్జనలు చెంది, చివరకు వీలునామా మార్చివేయడానికి రోహిణి నిశ్చయించుకుని, కృష్ణకాంత్ పడకగదిలోకి వెళ్ళి, వీలునామాలను మార్చి, చివరిక్షణంలో పట్టుబడి, కృష్ణకాంత్ ఎదురుగానే దొంగ వీలునామాను తగలబెడుతుంది. తన కొడుకు హరలాల్ వీలునామాలను మార్చమని పంపించి ఉంటాడని, దొరికిపోవడంతో, దొంగ వీలునామాను రోహిణి తగలబెట్టిందని భావించిన కృష్ణకాంత్, రోహిణిని ఖైదు చేయించి, శిరోముండనం చేయించి, గ్రామ బహిష్కరణ చేయాలని నిశ్చయిస్తాడు.

గోవింద్‌లాల్ అసలు నిజం తెలుసుకుంటానని పెదనాన్నను ఒప్పించి, రోహిణిని తన ఇంటికి తీసుకు వస్తాడు. గోవింద్‌లాల్‌తో జరిగిన విషయాలన్నింటిని, కళంకినిగా, బందీగా వుంటూనే, రోహిణి ప్రణయ సంభాషణలాగా జరిగిన వృత్తాంతం మొత్తాన్ని, అందులో గోవింద్‌లాల్‌కు జరిగే లాభాన్ని వివరిస్తుంది. గోవింద్‌లాల్ కృష్ణకాంత్‌కు విషయమంతా విడమరచి చెప్పి, ఆమె నిర్దోషి, తప్పును తెలుసుకుందని, వదిలేయమని కోరతాడు. ఈ కుర్రాడు దానిమీద మనసు పడ్డాడా అని ఆలోచిస్తూ, ఇన్నేళ్ళ కుటుంబ సాన్నిహిత్యంలో ఆమె దొంగతనం

చేయదనే నమ్మకం వున్న కృష్ణకాంత్ ఆమెను వదిలేయడానికి అంగీకరించాడు.

- - - -

గోవింద్‌లాల్‌కు చిన్నప్పుడే వివాహం అయింది. భార్య భ్రమరి. చిన్నపిల్ల. నల్లగా వున్నా కళగా వుంటుంది. బాలికలానే భర్తతో ఆడుకుంటూ వుంటుంది. రోహిణి విషయం అంతా ఆమెకు అగమ్యగోచరంగా వుంది. రోహిణికి గోవింద్‌లాల్‌పై ప్రేమాగ్నిజ్వాలలు మొదలయ్యాయి. అతనిని చూడకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ ఏదో నెపంతో అతని తోట దగ్గరకు వెళ్ళి, వారుణీ నది మెట్లపై కూర్చోవడం మొదలుపెట్టింది. ఒకరోజు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంది. నదిలో దిగుతున్న రోహిణిని చూసిన గోవింద్‌లాల్ ఆమె స్నానం చేస్తున్నప్పుడు చూడకూడదనుకుని, ఆమె ఎంతకూ బయటకు రాకపోయేసరికి, నీటి అడుగు భాగాన పడివున్న స్వర్ణ ప్రతిమ వంటి రోహిణిని రక్షిస్తాడు. మాలి సహాయంతో ఎంతగా ప్రయత్నించినా, ఆమె చేతనాస్థితికి రాకపోవడంతో, ఆమె పెదాలలో నోరుంచి, గాలి వూది, పొట్టపై వత్తి ఆమెను బ్రతికిస్తాడు. నీవు లేకుండా నేను బ్రతకలేనని రోహిణి ఏడుస్తూ, గోవింద్‌లాల్‌ను కౌగలించుకుంటుంది. భ్రమరి - రోహిణి మధ్య నన్ను రక్షించు అంటూ గోవింద్‌లాల్ భగవంతుణ్ణి వేడుకుంటాడు. గ్రామంలో బాలికలు, స్త్రీలంతా వీరిద్దరి గురించి చెప్పుకునే మాటలన్నీ భ్రమరికి చేరి, ఆమె హృదయంలో తెలియని కాలమేఘం ఆవరిస్తుంది.

- - - -

వర్షాకాలపు ప్రథమ మేఘ సందర్శనతో నాట్యం చేసే నెమలిలా, గోవిందలాల్ మనస్సు రోహిణి రూపలావణ్యానికి ముగ్ధత పొంది నాట్యం చేయడం మొదలుపెట్టింది. ఏది ఏమైనా భ్రమరి పట్ల కృతఘ్నత కూడదని, జమిందారి వ్యవహారాలపై దృష్టి సారించడంతో, కృష్ణకాంత్ ఆనందంగా గోవింద్‌లాల్‌ను దూరప్రాంత గ్రామాల అజమాయిషీపై పంపిస్తాడు. వెంట వస్తానన్న భ్రమరిని వద్దని గోవింద్‌లాల్ ఒక్కడే వెళ్ళడంతో, అప్పటికే ఇరుగు పొరుగు వారి మాటలతో వ్యాకులతకు గురై వున్న భ్రమరి, భర్త తిరిగి వస్తున్నాడని తెలిసినా పుట్టింటికి వెళ్ళిపోయిందన్న కోపంతో, అహం దెబ్బతిని, గోవింద్‌లాల్ ఆమెను పిలిపించడానికి నిరాకరిస్తాడు. అనవసరంగా రోహిణి విషయంలో తనను అనుమానించినందుకు, ఆమెకు ప్రతీకారం జరపాలని, ఆమె గర్వానికి శిక్ష విధించాలని అనుకుంటాడు.

గోవింద్‌లాల్ భ్రమరిని మరచిపోవడానికి రోహిణితో చెలిమి చేయాలని అనుకోవడంతో, హృదయంలో స్మృతిగా ఉన్న రోహిణి నెమ్మదిగా వ్యధగా మారి ఆ వ్యధ కామవాంఛకు దోహదం కల్పించింది. గోవింద్‌లాల్ తన సౌందర్యానికి ఆకర్షితుడయ్యాడని, తనను కృష్ణకాంత్ శిక్ష నుండి తప్పించినపుడే గుర్తించిన రోహిణి అతని తోటలోకి రాకపోకలు సాగిస్తుంది. గ్రామంలో అందరూ ఈ విషయాన్ని చెప్పుకుంటూ, భ్రమరికి మరిన్ని కల్పించి కథలుగా వినిపిస్తారు.

ఇవన్నీ తెలిసిన కృష్ణకాంత్, గోవింద్‌లాల్‌ను మందలించాలని చూసినా, మరణశయ్యపై వుండి ఆరోగ్యం సహకరించదు. అందరి ముందు కృష్ణకాంత్ పాత వీలునామా చింపివేసి, దానిస్థానంలో గోవింద్‌లాల్ పేరు వున్నచోట భ్రమరి పేరు రాయించి, ఆస్తి భ్రమరి తదనంతరమే గోవింద్‌లాల్‌కు చెందుతుందని మార్పించి, ఆ రాత్రే మరణిస్తాడు. గోవింద్‌లాల్‌కు ఇప్పుడు ఆస్తిలో పైసా వాటా లేదు. అంతా భ్రమరికే చెందుతుంది. ఈ రెండవ వీలునామా మరిన్ని సమస్యలు సృష్టిస్తుందని కృష్ణకాంత్ ఊహించలేదు.

- - - -

భ్రమరి తన పేరున ఉన్న ఆస్తిని గోవింద్‌లాల్‌కు తిరిగి రాయించి ఇచ్చే ప్రయత్నం చేసినా, గోవింద్‌లాల్ అందుకు అంగీకరించక, భ్రమరిని వదిలి వేస్తున్నానని చెప్పి, తన మిగిలిన ఆస్తులన్నీ అమ్మివేసి, తల్లితో కలసి కాశీకి వెళ్ళిపోతాడు. రోహిణి ఏమి చేస్తుందో భ్రమరి తెలుసుకుంటూ వుంటుంది. రోహిణి దినచర్యలో ఏ మార్పు లేదు. కొన్నివారాలకు, రోహిణి ఆరోగ్యం బాగాలేక దగ్గరలో ఉన్న తారకేశ్వర్ పట్టణానికి వెళ్ళిందని, అక్కడే ఉంటుందని అందరూ చెప్పుకున్నారు. గోవింద్‌లాల్ కూడా తల్లి దగ్గర లేదని, ప్రయాణాలు చేస్తున్నాడని చెప్పుకుని కూడా సంవత్సరం గడచిపోయింది. భ్రమరి అనారోగ్యంతో చిక్కి శల్యమైంది. కూతురి జీవితం ఇలా కావడానికి కారణమైన గోవింద్‌లాల్‌పై పగ తీర్చుకోవాలని ఆమె తండ్రి మాధవీనాథ్ నిశ్చయించుకుని, అప్పటికే పాలనా వ్యవస్థలో ఏర్పడి వున్న లంచగొండితనం, అవినీతి సహాయంతో గోవింద్‌లాల్ వుంటున్న ప్రదేశాన్ని గుర్తిస్తాడు.

కలకత్తాలో పనీ, పాటా లేకుండా, మాటలతో పొద్దుపుచ్చే తన మిత్రుడు నిశాకరదాసుతో సహాయంతో గోవింద్‌లాల్ రోహిణి కలసి వుండే గ్రామానికి చేరుకుంటారు.

రోహిణి, గోవింద్‌లాల్ కలసి జీవిస్తున్నా, నిర్ణయ లేమితో బాధపడుతూ వుండే గోవింద్‌లాల్, తన ఈ రహస్య

జీవితానికి రోహిణే కారణమని అనుకుంటున్నప్పటికి, రోహిణి అందం అతడిని సమ్మోహనపరుస్తూ వుంటుంది. నిశాకరదాసు గోవింద్‌లాల్‌ను కలవాలని వారుంటున్న భవంతిలోకి వచ్చి రోహిణిని చూస్తాడు. రోహిణి కూడా ఎవరీ అందగాడు అని అనుకుంటుంది. నిశాకరదాసు తెలివిగా భ్రమరి పంపితే వచ్చానని, ఆమె తన ఆస్థిని కాంట్రాక్టుకు ఇవ్వాలనుకుంటుందని, అందుకు నిరభ్యంతర పత్రం కోసం వచ్చానని చెబుతాడు. ఆమె ఆస్థితో తనకెలాంటి సంబంధం లేదని, అది ఆమె ఇష్టమని గోవింద్‌లాల్ చెప్పడంతో, నిశాకరదాసు వెళ్ళిపోతూ, నౌకర్లతో మాటలు కలిసి, గ్రామ సంగతులు చెప్పాలని వుందని, రహస్యంగా తనను కలవమని రోహిణికి సందేశం ఇవ్వమని నౌకర్లకు డబ్బు ఆశ చూపుతాడు.

తన పినతండ్రి బ్రహ్మానందుడు ఎలా ఉన్నాడో తెలుసుకోవాలని నిశాకరదాసును కలవడానికి రోహిణి అంగీకరిస్తుంది. స్నేహితుడి కూతురి జీవితాన్ని కాపాడడానికి బాధ్యత తీసుకోవాలని అనుకున్న నిశాకరదాసు, రోహిణి తనను రహస్యంగా కలవబోతుందన్న విషయాన్ని, గోవింద్‌లాల్‌కు చెప్పమని మరొక నౌకరుకు డబ్బులిచ్చి ఒప్పిస్తాడు.

నిశాకరదాసుతో మాట్లాడుతున్న రోహిణిని బలవంతంగా గొంతునులిమి, ఇంటికి తెచ్చిన గోవింద్‌లాల్ ఏడుస్తూ, నీకోసం నా జీవితాన్ని నాశనం చేసుకున్నానని అంటూ ఆమెను తుపాకీతో కాల్చి చంపి పారిపోతాడు. పోలీసులు ఎంత వెదికినా, ఎక్కడా దొరకకపోవడంతో గోవింద్‌లాల్ అదృశ్యం మిస్టరీగా మారుతుంది.

భ్రమరి భర్తకోసం విలపిస్తూ అత్తగారింటికి వచ్చి నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. గోవింద్‌లాల్ పోలీసులకు దొరికిపోయాడని, దాదాపుగా ఉరిశిక్ష తప్పదని అందరూ అనుకుంటారు. కోర్టులో సాక్షులను ప్రభావితం చేయడానికి భ్రమరి యాభైవేలు ఖర్చుపెట్టి, తండ్రి ద్వారా కేసును తారుమారు చేయించడంతో, గోవింద్‌లాల్‌ను నిర్దోషిగా వదిలివేస్తారు. గోవింద్‌లాల్ కలకత్తా వెళ్ళి రహస్య జీవితాన్ని, ఒక సాధారణ మనిషిలా గడుపుతూ, తనను క్షమించమని భ్రమరికి ఉత్తరం రాస్తాడు. భ్రమరి కూడా తనను క్షమించమని, ఆస్థిపాస్తులన్నీ చూసుకోమని, తన శేష జీవితం గంగాతీరాన కుటీరంలో గడుపుతానని తెలుపుతుంది. తను ఆమెను కలిసే మానసిక స్థితిలో లేనని, నెలకు అయిదు వందలు భృతి పంపమని, ఉత్తరం ద్వారా గోవింద్‌లాల్ వేడుకుంటాడు. ఇది ఒకందుకు మంచిదే అని ఇద్దరూ అనుకుంటారు.

ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన భ్రమరి చివరి రోజున, ఆమె తండ్రి ఇచ్చిన సమాచారం మేరకు వచ్చిన గోవింద్‌లాల్ చరణధూళి స్వీకరించి, మన్నించమని కోరుతూ భ్రమరి మరణిస్తుంది.

గోవింద్‌లాల్ ఇద్దరు స్త్రీలను ప్రేమించాడు. రోహిణిని తనే చంపాడు. భ్రమరి చావడానికి కారణమయ్యాడు. ఒకరి ప్రత్యక్ష హత్యకు మరొకరి పరోక్ష హత్యకు అతనే కారణం. పురుషాహంకారాన్ని తగ్గించుకుని, లజ్జను వదులుకోగలిగి వుంటే, భ్రమరి అతనిని క్షమించేది. రోహిణి అంధకారంలో విలీనమవుతున్నట్లు, భ్రమరి ఆకాశాన్ని జ్యోతివంతం చేస్తున్నట్లు అనిపించి, గోవింద్‌లాల్ ఎవరికీ కనపడకుండా వెళ్ళిపోయాడు. గోవింద్‌లాల్ ఇల్లు విడిచిన ఏడు సంవత్సరాలకు, చనిపోయాడని భావించి దహన సంస్కారాలు జరిపించారు. అతని యావదాస్థి అన్నకొడుకైన శచీకాంతుడికి సంక్రమించింది.

శచీకాంతుడు అంతకు ముందు గోవింద్‌లాల్ ఎప్పుడూ గడిపే పూలతోటను బాగు చేయించి, ఒక మందిరాన్ని కట్టించి, అందులో భ్రమరి బంగారు విగ్రహాన్ని ప్రతిష్టించి, *సుఖదుఃఖాలలో, గుణదోషాలలో, భ్రమరిని పోలిన స్త్రీకి నేనే స్వర్ణ ప్రతిమను దానంగా ఇస్తాను* అని కింది భాగంలో చెక్కించాడు.

భ్రమరి మరణించిన పన్నెండు సంవత్సరాలకు ఒక సన్యాసి వచ్చి మందిరంలో ఏముందో చూడాలని వచ్చాను అని, భ్రమరి ప్రతిమను చూసి–భ్రమరీ–నా భ్రమరి నేను గోవింద్‌లాల్‌రాయ్‌ను అంటూ విలపించాడు. శశికాంత్ చేతులు జోడించి, ఈ ఆస్థి అంతా మీదే! అనుభవించండి అని ప్రార్థిస్తాడు. ఈ ఆస్థి కంటె విలువైనది, కుబేరునికి దొరకనిది, నా భ్రమరి కంటె మధురమైనది–శాంతి నాకు లభించింది. సన్యాసం వల్ల శాంతి దొరికింది అంటూ గోవింద్‌లాల్ చీకట్లో కలసిపోయాడు. ఆ తర్వాత ఎవ్వరూ హరిద్రా గ్రామంలో గోవింద్‌లాల్‌ను చూడలేదు సరికదా చెప్పుకోవడం కూడా మానేశారు.

– – – –

**సౌందర్యాన్ని సొంతం చేసుకోవాలనే కోరిక ఉన్నవారికి, ఆ సౌందర్యాన్ని ఆదరించడం, కాపాడుకోవడం అంత సులభం కాదని తెలియదు! ఆ వైఫల్యమే విషాదానికి మూల కారణమవుతుంది.**

ఆచార్య వై. పార్థసారథి
ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం (రిటైర్డ్),
ఉస్మానియా యూనివర్శిటీ, ఫోన్ : 900 043 8090

# తెలంగాణ దశాబ్ది కథ
# దళిత జీవనం

**– ప్రొ. బన్న అయిలయ్య**

**తె**లంగాణలో భూస్వామ్య వ్యవస్థ పాదుకొని ఉన్నకాలంలో అందరికంటే ఎక్కువగా పీడనను అనుభవించినది దళిత, బహుజనులే. స్వాతంత్ర్యానంతరం చదువుకునే అవకాశం రావడం వల్ల దళితులు కొంతవరకు చదువుకొని ఎదిగి జీవితాలను గెలుచుకున్నారు. నక్సలైట్ విప్లవోద్యమాలు మారుమూల పల్లెలకు విస్తరించడం వల్ల మరికొంత చైతన్యం దళితుల్లో వచ్చింది. వెట్టి, పీడన, అణచివేత తగ్గినట్లనిపించినా, అంటరానితనం పూర్తిగా సమసిపోలేదు. దళిత మేధావులు అంబేద్కర్ భావజాలన్ని వ్యాప్తి చేయడం వల్ల రాజ్యాధికారంలో వాటా అడుగాలన్న స్పృహ వచ్చింది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు సక్రమంగా వినియోగించుకొని ఎదగడానికి చదువొక్కటే మార్గమని దళితులు గుర్తించగలిగారు. ఇప్పుడు అన్ని రంగాలలో తమ వాటా ఏదని ప్రశ్నించగల్గుతున్నారు. ఉద్యోగం, ఉపాధి కొరకు నిర్వహించే పోటీ పరీక్షల్లో దళితులు ఓపెన్ క్యాటగిరికి, వెనుకబడిన తరగుతుల వారికి సమానంగా పోటిపడుతున్నారు.

గతంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు దళితుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపడ్తున్నట్లు ప్రకటనలు ఇచ్చి, వారి ఓట్లు దండుకొని పాలన చేసాయి. అయినా దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాక జరిగిన తొలి ఎన్నికలలో, దళితుడే తొలి ముఖ్యమంత్రి అంటూ ప్రచారం చేసి, మాట తప్పేతి లేదు, మడమ తిప్పేది లేదు, పదవులపై తమకు వ్యామోహం లేదని, మాట తప్పితే తల నరుక్కుంటానని, తెలంగాణ కావలి కుక్కగా ఉంటానని ఎన్నో మాటలు చెప్పి, దళితుల ఓట్లన్ని గంప గుత్తగా వేయించుకొని, గెలువగానే ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు మరచి అధికార పీఠం ఎక్కడం తెలంగాణ ప్రజలకు ఎల్లకాలం గుర్తుండిపోతుంది. నాటి నుండి నేటి వరకు అగ్రవర్ణులు ఏదో విధంగా దళితులను అణచి వేస్తున్నారని నిర్వివాదాంశం. దళితులకు అప్రధాన్యమైన ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టి ఉపశమనం కలిగించారు. అమలు పరచలేని, అసాధ్యమైన 'దళితులకు మూడెకరాల భూమి' పథకం కొన్నాళ్ళు దళితులను ఆశల పల్లకిలో ఊరేగించింది. 'దళిత బంధు' పథకం దిక్కు మొక్కులేకుండా పోయింది. ఈ పదేళ్ళ పాలనలో దళితులకు ఒనగూరిన ప్రయోజనమేమి లేదు. ఈ దశాబ్ది తెలంగాణ కథను పరిశీలిస్తే దళితుల జీవనంలో నెలకొన్న ఒడిదొడుకులు స్పష్టమవుతాయి.

గుడిపల్లి నిరంజన్ రాసిన ఊరుమెచ్చిన మనిషి (2016) కథ ఖరీదైన వైద్యం చేయించుకోలేని ఒక పేద దళితుని జీవితాన్ని చిత్రించింది. ఈ కథలో కక్కయ్య డెబ్బై సంవత్సరాలు పైబడిన వయస్సులో కులవృత్తిని వదలడు. ఊరి వాళ్ళకు చెప్పులు కుట్టి జీవిస్తారు. బ్రతికినన్ని రోజులు నీతిగా, నలుగురు మెచ్చేటట్లుగా బతకాలనే అభిప్రాయం కలవాడు. అతని ఇద్దరు కొడుకుల్లో పెద్ద వానికి పెండ్లి చేస్తే పట్నం వెళ్ళి భార్యతో కలిసి బతుకుతుంటాడు. చిన్నవాని చదువు ఇంకా పూర్తికాలేదు. తనకండ్ల ముందు వాడికి పెండ్లి చేయలేక పోతిననే బాధ ఒక్కటే కక్కయ్యకు మిగిలింది. ఒకరోజు కడుపునొప్పి వచ్చి శ్వాస తీసుకోవడం కష్టం కావడంతో వెంటనే గోదల్ నుండి కందనూల్‌కు తీసుకువస్తారు. అక్కడ పరీక్షలు చేసిన డాక్టర్ పాలమూరుకు తీసుకెళ్ళమంటాడు. అక్కడి డాక్టర్ పరీక్షించి, రిపోర్టు వచ్చాక కక్కయ్య కిడ్నీలు చెడిపోయాయని, పట్నం తీసుకెళ్ళి డయాలాసిస్ చేయించాలని సూచిస్తాడు. అతనికున్న ఆరోగ్యశ్రీ కార్డు ఈ వైద్యానికి ఉపయోగపడదని, డబ్బులుంటే పట్నం తీసుకెళ్ళమని చెప్తారు. కొడుకులు, బంధువులు తగిన ఆర్థిక స్థోమత లేనందున వెనుకాముందాడుతారు. కక్కయ్య ఇదంతా గమనించి తనను పుట్టినూరుకే తీసుకెళ్ళమంటాడు. కడసారి తన వాళ్ళను చూడాలని కోరికగా ఉందంటాడు. కక్కయ్యను ఇంటికి తీసుకువచ్చారని తెలుసుకున్న జనం కులానికి మాదిగోడైన గుణం గొప్పదని ప్రశంసిస్తారు. ఊరి సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి వచ్చి కక్కయ్యను పలకరిస్తాడు. ప్రాణం పోయే ముందు బంధువులు, ఆత్మీయులు అందరూ చూస్తుండగా దండంపెట్టి, తుదిశ్వాసం వదలుతాడు.

ఇట్లా నిరపేదలైన దళితులు వైద్య సౌకర్యాలు అందని స్థితిలో మరణానికి తలొగ్గుతున్నట్లు తెలుస్తుంది ఈ కథలో.

మన్నె ఏలియా రాసిన అపచారమపచారం (2016) కథ గ్రామాల్లో వేళ్ళానుకొని ఉన్న అంటరానితనాన్ని పట్టి చూపుతుంది. "అనాదిగా దళితులకు ఆలయ ప్రవేశాన్ని ఇంకా కొనసాగుతన్నదని, మనతోపాటే ఈ నేల మీద పుట్టిన మనిషి ముట్టుకుంటే దేవుడెలా మైల పడుతాడో చెప్పమంటుంది అపచారం కథ" (తెలంగాణ కథ - కురాడు - 2016, సంపాదకులు వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్) ఊరికి కొద్ది దూరంలో అడవికి దగ్గర అతి పురాతనమైన దేవాలయం ఉంది. పౌర్ణమి తర్వాత ఐదవ రోజు మొదలుకొని మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఆలయ నిర్వహణ కమిటి జాతర ఏర్పాట్లలో మునిగిపోతారు. ఆలయ ప్రాంగణంలోని బావిలో పందిపిల్ల ఎప్పుడో పడి చనిపోయి నీళ్ళపై తేలుతుండటం ఆలయ పూజారి రామశాస్త్రి చూస్తాడు. ఆ పంది పిల్లను తీయడానికి గాను తెల్లవారకముందే శాస్త్రి మాదిగ వాడకు చిన్న రాజిగాడిని నిద్రలేపి, విషయం చెప్పి. గుడికి రమ్మని చెప్పి వెళ్ళిపోతాడు. చిన్న రాజిగాడు వెళ్ళేసరికి ధర్మకర్త వెంకట్రాంరెడ్డి అక్కడే వుంటాడు. బావిలోంచి పందిపిల్లను తీసి బయట పడెస్తే ఒక రోజు కూలీ ఇస్తానని ధర్మకర్త చెప్తాడు. ఒకరోజు ఎండపూట దాహం వేసి నీళ్ళు తోడుకుని తాగినప్పుడు పటేల్ తనను కుక్కను కొట్టినట్లు కొట్టిన సంగతి చిన్నరాజి గానికి గుర్తుకు వస్తుంది. తనకు డబ్బులు అవసరం లేదని, ఒకసారి గుడిలోకి వెళ్ళి దేవుణికి దణ్ణం పెట్టుకొని వస్తానని చిన్నరాజిగాడు అంటే, సరే! చూస్తాం అంటారు. చిన్నరాజిగాడు దూలానికి తాడుగట్టి బావిలో దిగబోతుంటే రామశాస్త్రి అపచారం... అపచారం అంటూ వచ్చి మూడు బాకెట్ల నీళ్ళు వాడిపై పోస్తాడు. మరచెంబులోని నీళ్ళు కుడి అరచేతిలో పోసుకొని ఏవేవో మంత్రాలు చదివి వానిపై చిలకరిస్తాడు. చిన్నరాజిగాడు బావిలోకి దిగి, తాడు కొనకు పంది పిల్లను కట్టి, పైకి వచ్చి తాడు లాగుతాడు. పైకి వచ్చిన పందిపిల్లను తాడు నుంచి వేరు చేసి కొంత దూరం లాక్కెళ్ళి పడేసి వస్తాడు.

గుడిలోకి వెళ్ళి ఒకసారి దండం పెట్టి రావడానికి మొదటి మెట్టు ఎక్కుతుంటే శాస్త్రి అపచారం, అపచారం అని మొత్తుకోవడంతో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు వచ్చి చిన్నరాజిగాడిని స్పృహకోల్పోయేలా కొట్టి చచ్చి పడి ఉన్న పందిపిల్ల పక్కన పడేస్తారు. కొద్దిసేపటికి మెలకువ వచ్చిన చిన్నరాజిగాడు ఆ పంది పిల్లను గుళ్ళోకి విసరగా, అది గురి తప్పి మెట్ల మీద పడుతుంది. థూ అని కాండ్రించి ఉమ్మి అక్కడి నుండి వెళ్ళిపోతాడు. ఇట్లా గుడిమెట్లు తొక్కనీయకుండ దళితుల్ని అగ్రవర్ణాలు అడ్డుకుంటున్న దుర్మార్గం ఈ కథలో వెల్లడవుతుంది. డా॥ పసునూరి రవీందర్ రాసిన "పులి అడుగు దెబ్బ" (కుర్రాడు-2016, సంపాదకులు వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్) కథ అగ్రవర్ణ పోకడలతో దళితులపై కొనసాగుతున్న దౌష్ట్యాన్ని చిత్రించింది. ఈ కథలో కట్ట మల్లు మాదిగ వాడ పెద్దమనిషి. ఆరుగురు కొడుకులు, ఒక కూతురు అతని సంతానం. చిన్నప్పటి నుండే కూతురును మగరాయునిలా పెంచుతాడు. తండ్రి వెంట వెళ్తూ వ్యవసాయపు పనులు నేర్చుకుంటుంది కట్టమల్లు బిడ్డ రాజవ్వ. అందంలో చక్కని చుక్క. ఒకరోజు రాజవ్వ చెరువు కట్టపై ఎడ్లు కాస్తుంటే వెంకట్ రెడ్డి పటేల్ కొడుకు నరేందర్‌రెడ్డి చూస్తాడు. తనను తాను పరిచయం చేసుకుంటాడు. పట్నంలో చదువుకునే నరేందర్ రెడ్డికి రాజవ్వ అందం ఆకర్షిస్తుంది. ప్రతిరోజూ చెరువు కట్టపైకి వచ్చి రాజవ్వతో మాట్లాడుతుంటాడు. మీరు పటేండ్లు, మేం మాదిగోల్లం మీకు మాకు కలవదని రాజవ్వ చెబితే, కులానిదేమున్నది అంతా నేను చూసుకుంటానని భరోసా ఇచ్చి ఒకనాటి రాత్రి రాజవ్వను నరేందర్‌రెడ్డి లేవదీసుకెళ్తాడు. వెంకట్‌రెడ్డి పటేల్‌కు జరిగింది తెలిసి కట్టమల్లు ఇంటిపై దాడి చేయిస్తాడు. కుల బలం ఉన్నా, ధన బలం ముందు కట్టమల్లు గెలువలేకపోతాడు. పోలీసులు వెంకట్రెడ్డికి అమ్ముడు పోయి న్యాయం చేయలేక పోతారు. ఊరి పంచాయితీలో రాజవ్వదే తప్పని కట్టమల్లు కుటుంబాన్ని వెలివేస్తారు.

కొద్ది రోజులకు సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయి. రిజర్వేషన్‌లో ఎస్సీకి దక్కడంతో కట్టమల్లు పోటీలో ఉంటాడు. వెంకట్‌రెడ్డి కట్టమల్లు అన్న కొడుకునే ఈలోగా వెంకట్‌రెడ్డి పట్నంలో వాడా వాడా గాలించి కొడుకు జాడ తెలుసుకుంటారు. ఊరిలో ఉన్నప్పుడు రాజవ్వ చెడు తిరుగుళ్ళు తిరిగిందని, ఆమె శీలం మంచిది కాదని, ఆమెను వదిలేస్తే మంచి ఖాన్‌దాన్‌లో పిల్లను తెచ్చి పెళ్ళి చేస్తానని, అయినా రాజవ్వను వదలి రాకుంటే తాము ఉరివేసుకొని చనిపోతామని బెదిరించి, బలవంతంగా కొడుకును కారెక్కించుకొని వెళ్తాడు వెంకట్‌రెడ్డి. రాజవ్వ

నరేందర్‌రెడ్డి రాకకోసం ఎదురు చూస్తూ తిండి మానేస్తుంది. తల్లి మరణవార్త తెలిసి కడసారి చూసేందుకు వెళ్తే వెంకట్‌రెడ్డి ఊరవతలే అడ్డుకుని, కొట్టి వెనకకు పంపిస్తాడు. పట్నం వచ్చి కూలీ నాలీ చేస్తూ కూలీల గుడిసెల్లో తల దాచుకుంటూ దానికంటే హీనంగా బ్రతుకుతుంది. ప్రాణంలాంటి అయ్యను చూడాలని పరితపిస్తుంది. ఇంతలో కట్టమల్లు మరణవార్త తెలుస్తుంది. ఈసారి ఊళ్ళోనే బస్సు దిగుతుంది. ముప్పై నలభై మంది యువకులు కట్టెలు పట్టుకొని ఆమెకు రక్షణగా ఉంటారు. అంబేద్కర్ విగ్రహం వద్ద హల్ చల్ చేస్తారు. వెంకట్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉంటుంది. తండ్రి శవంపై పడి రాజవ్వ చాలాసేపు ఏడుస్తుంది. శవయాత్రలో రాజవ్వ డప్పు తీసుకొని 'పులి అడుగుదెబ్బ' కొడుతుంది. మాదిగవాడలో జెజ్జె జెజ్జెనక... అంటున్న పులులను ఊరంతా చూస్తారు.

"ఆధిపత్య వర్గాలు కింది కులాలను అణచి వేయడం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఎదురు తిరిగితే అడ్రసులు గల్లంతు చేయడం, దాడులకు పాల్పడడం ఇలా ఏదో విధంగా తొక్కి పెట్టడం వారికి అబ్బిన విద్య. దళితులు చైతన్యవంతం కానిదే ఆధిపత్యవర్గాల పీడను ఎదుర్కోలేమని, వారి గుండెల మీద 'పులి అడుగు దెబ్బ' పడందే దారికి రారని హెచ్చరించే కథ పులి అడుగు దెబ్బ". (తెలంగాణ కథ-కురాడు-2016, సంపాదకులు వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్) డా॥ పసునూరి రవీందర్ రాసిన "అయినా మనిషి మారలేదు" (కురాడు - 2016, సంపాదకులు వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్) కథ అత్యధిక జన సమ్మర్థమున్న పట్టణాలలో కూడ దళితుల పట్ల ఉన్న వివక్షను చూపుతుంది. పట్టణంలో కుల వృత్తులపై బతికే బహుజనులు దళితులను చులకనగా చూడటం ఈ కథలో కనిపిస్తుంది.

పట్నంలో ఉద్యోగం చేస్తున్న కరుణాకర్‌కు అద్దె ఇల్లు దొరకడం కష్టంగా మారుతుంది. కులం పేరు చెబితేనే ఇల్లు ఇవ్వడం, దళితులైతే అసలే దగ్గరకు రానివ్వకపోవడం అతని అనుభవంలోనిదే. తానుండే పోర్షన్‌లో అంబేద్కర్ బొమ్మ పెట్టుకున్నందుకే ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చింది. కుల పట్టింపులు లేని మనిషిని, మనిషిని మనిషిగా గౌరవించే ఓనరు ఉండే ఇంట్లో చేరాలనుకుంటాడు కరుణాకర్. అందుకోసం గల్లీలన్నీ గాలించి వస్తాడు. అతని భార్య అతనికి పక్క వీధిలో అద్దె ఇల్లు ఖాళీ ఉన్నట్లు తెలిస్తే, ఇద్దరు కలిసి ఓనరు వద్దకు వెళ్ళి, మాట్లాడుకొని అందులో దిగుతారు. ఒకరోజు కరుణాకర్ హెయిర్ కటింగ్ సెలూన్‌కు వెళ్ళినప్పుడు తమ ఇంటి ఓనరు బిక్షపతిది చాకలి కులం అని తెలుస్తుంది. చాకలి వాళ్ళంటే మా దళితుల్లాగే గ్రామాల్లో బాగా అణచివేతకు గురైనోళ్ళు, అందుకే ఇంటి ఓనరు తన కులం అడుగలేదని, ఏది ఏమైనా కింది కులాల వాళ్ళ ప్రేమ వేరేననుకుంటాడు కరుణాకర్. ఒకానొక సందర్భంలో ఇంటి ఓనర్ భార్య 'ఏమిటోళ్ళు' మీరు అని అడిగితే, మాదిగోళ్ళమని చెపితే తమను తక్కువ చేసి చూస్తారని 'క్రిష్టయన్నుము' అని అనిత చెప్తుంది. ఓనర్ భార్యకు అక్షర జ్ఞానం లేకపోవడం వల్లనేమో అదేం కులమోనని ఊరకుంటుంది. ఇంటి ఓనర్ కూడా నిరక్షరాస్యుడైనందున అన్ని విషయాల్లో కరుణాకర్ సలహాలు తీసుకుంటాడు.

ఒకరోజు పక్క వీధిలో ఎవరో చనిపోతే కులకట్టు ప్రకారం ఇంటి ఓనరు భార్య చావు బట్టలు పిండడానికి వెళ్తుంది. తిరిగి వచ్చాక డబ్బులు తక్కువ ఇచ్చారంటూ గులుగుతుంది. అనితతో "ఈ బలిసి నోళ్ళకు ఏం చెప్పాలె. మేం అంత నీచంగా కనబడ్తున్నామా, మా బట్టలుతికే పని వరకే మాకు చెప్పాలె. చేస్తం! కాని, ఆ ఊడ్సుడు కడుగుడు అది మాదిగోళ్ళవని! మాకు చెప్తారా! మాదిగోళ్ళకు చెప్పాలే!" అంటూ వాళ్ళను తిడ్తుంది. ఇట్లా మాదిగోళ్ళు మనుషులే కాదన్నట్లు మాట్లాడిన ఇంటి ఓనర్ భార్య పాతింటి దొరసానిలా అనితకు కనిపిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న కరుణాకర్ మనిషిని కులాలుగా విడదీసిన కనిపించని నిచ్చెన మెట్లదే ఈ తప్పని భావిస్తాడు.

కాలేటి సరిత రాసిన 'ఆరు తప్పులు' (రూబిడి-2019, సంపాదకులు వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్) కథలో భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల వల్ల దళితులకు రాజకీయాల్లో అవకాశాలు లభించినా, ప్రజాపాలనలో పెత్తనమంతా అగ్రవర్ణల చేతుల్లో వుండటాన్ని ఈ కథ సూచిస్తుంది. స్వరాష్ట్రంలో కూడా ఆధిపత్య వర్గాల వారే దళితుల నాయకత్వానికి అడ్డుతగిలి, వాళ్ళదే పైచేయిగా కొనసాగడాన్ని గురించి విశ్లేషిస్తుంది ఈ కథ. ఈ కథలో ఊరి సర్పంచ్ పదవి రిజర్వేషన్ వల్ల ఈ సారి హరిజన మహిళకే దక్కుతుంది. ఆ ఉరి దొర రాజేందర్ రెడ్డి అన్ని మాట్లాడుకుని చింతకింది బాలయ్య భార్య రేణుకను ఏకగ్రీగంగా ఎన్నిక చేయిస్తాడు.

తరతరాలుగా ఊళ్ళో దొరతనం చెలాయిస్తూ వచ్చిన కుటుంబంలోంచి వచ్చి రాజేందర్‌రెడ్డి అగ్రవర్ణపు అహంకారంతో 'ఒసేయ్ రేణుక' అనే పిలుస్తాడు. అతని దృష్టిలో పెద్దలు ఏర్పర్చిన వర్ణ వ్యవస్థ సక్రమమైనదని, అందులో బ్రాహ్మణులు పూజలు, పునస్కారాలు, యజ్ఞాలు, యాగాలు, అర్చనలు, అభిషేకాలు, పెండ్లీలు, బారసాల మొదలైన పనులు చేయాలని, వైశ్యులు వ్యాపారం చేసుకుంటూ బ్రతకాలని, దళిత, బహుజనులు కుల వృత్తులు, కూలీపనులు చేయాలని, రెడ్డి, వెలమ, కరణం, కాపులంతా రాజ్యాధికారం చేయడానికి అర్హులని భావిస్తాడు. దళితునిగా పుట్టాక నేను వేదం చదువుతా, రాజ్యాలేలుతా, వ్యాపారాలు చేస్తా, మీ ఇంట్లో చొరబడి మీ కాళ్ళు ఒత్తుతానంటే ఎట్లా వీలవుతుందంటాడు. రాజ్యాంగం రాసినవాడు దళితులకు రిజర్వేషన్ కల్పించి అందల మెక్కించాడని, పెద్ద కులపోల్లంతా చేతులు కట్టుకొని నిల్చోవలసిన ఖర్మ ఏర్పడిందని వాపోతాడు. అందుకే సర్పంచి రేణుక చేస్తున్న పనికి అడ్డుతగులుతాడు. తాను చెప్పిన పని చేయడం లేదని 'కొంచెపుముండా' అంటూ తన అనుచరుల చేత తిట్టిస్తాడు. మహిళా సర్పంచ్ గ్రామ పంచాయితీ పాత రికార్డులు పరిశీలించినందుకు పదిమందిలో అవమానించి, ఆమె చేత చెప్పుదెబ్బలు తింటాడు. ప్రతీకారం తీర్చుకోవడానికి తన ఎనభై ఎకరాల్లో ఒక ఎకరం అమ్మైనా ఆమె అడ్రస్సు గల్లంతు చేయాలన్న కసితో రగిలిపోతాడు.

విద్యావంతురాలైన రేణుక తరతరాలుగా తమ జాతి అవమానాలు, పీడనను అనుభవించారని, మతం మారినా గౌరవం దక్కలేదని, స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏండ్లు గడిచిపోయినా దళితుల నుండి ఒక్కరు దేశ ప్రధాని కాలేక పోయారని, గ్రామాల్లో ఇప్పటికీ దళితులకు సామాజిక గౌరవం లభించడంలేదని, ఇప్పటికీ ఆత్మ గౌరవం కోసం అస్తిత్వ పోరాటం చేయాల్సి వస్తుందని, 'అప్పుడు ఇప్పుడూ నేను ఒసేయ్ రేణుక'నే అని చెప్తుంది. తాను స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొని పనిచేస్తుంటే అగ్రవర్ణపు అహంకారంతో రాజేందర్‌రెడ్డి పదిమందిలో ఉండగా తనపై అఘాయిత్యానికి తలపడ్డాడని, అందుకే చెప్పుతో కొట్టాల్సివచ్చిందని అంటుంది. సర్పంచి పదవి చేపట్టాక తాను ఆరు తప్పులు చేయాల్సి వచ్చిందని, వాస్తవానికి ఒప్పులే అయినా, ఆధిపత్య వర్గాల వారికి అవి తప్పులుగానే కనిపిస్తాయని తెలియజేస్తుంది. "అసలు నేను చేసినది ఏంటంటేనమ్మా కుల రాహిత్యమైన సర్వసమానత్వం సిద్ధించిన మా ఊరి ఆఫీసులో పర్యావరణ కాలుష్యం దృష్ట్యా డిస్పోజల్ గ్లాసులు వాడకపోవడం నా మొదటి తప్పమ్మా డజన్ స్టీలు గ్లాసులు తెప్పించి, ఎప్పటికప్పుడు శుభ్రంగా కడిగించి అందరికీ అవే గ్లాసుల్లో టీలు ఇప్పించడం నా రెండో తప్పమ్మా. నేను చదువుకొని ఉండటం మూడో తప్పమ్మా. పాత లెక్కలన్ని తప్పుల తడకలా రాసిండ్రేంటని అడుగడం నాలుగో తప్పమ్మా. అడిగిన దానికి సమాధానం చెప్పకుండా అవమానకరంగా మాట్లాడిన మొదటి రోజే ఆ రాజేందర్ గాడిని చెప్పు దీస్క కొట్టి, పదిమందిల పంచాయతీ పెట్టకపోవడం నా ఐదో తప్పమ్మా. మా అంటరాని ఆడోళ్ళు కనిపిస్తేచాలు వావివరస, ముసలిముతక, పిల్లా జెల్లా.. అన్న తేడా లేకుండా మదమెక్కిన ఆంబోతులా చూసేటోడిని, పదిమంది ఎదుట నా కొంగు పట్టిలాగి, నా యెద మీద చెయ్యేసి వెనక్కి తోసి, బలిసి కొట్టుకుంటున్నావే లం... అని తిట్టినోడి మీద ఏదో పిచ్చావేశంతో ఎస్సీ అట్రాసిటీ యాక్టు కింద కేసెట్టడం ఆరో తప్పమ్మా!" అని రేణుక చెప్తుంది, అయితే తాను పెట్టిన కేసు కోర్టులో నిలిచే నమ్మకం తనకు లేదంటుంది. ఎందుకంటే బలిసినోడి డబ్బు కోసం ఎస్పై, జడ్జీలు, మైసూర్ మహారాజు, అమెరికా ప్రెసిడెంట్ గూడ ఈ రోజు రాత్రి వేళ దొర ఫాం హౌజ్‌లో కాళ్ళ బేరానికి, చేతుల బేరానికి ఇంకా అన్ని రకాల బేరాలకు వస్తారని, ఇన్ని బేరాలయ్యాక తన కేసు నిలువదంటుంది.

గాదె వెంకటేష్ రాసిన "అర్బన్ అన్‌టచ్ బిలిటీ" (నెనరు-2021, సంపాదకులు వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్) కథ పట్టణాలలో అంటరానితనం చాపకింది నీరులా కొనసాగడాన్ని సూచిస్తుంది. ఈ కథలో వెంకట్ రిజర్వేషన్ ఫలాలు అందిపుచ్చుకొని ఎం.టెక్., ఎం.బి.ఏ చదివి పి.హెచ్.డి చేస్తూ ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, అతని భార్య బి.ఇ.చేసి ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్‌లో గెజిటెడ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తుంది. ఐదేండ్లలో వారికిద్దరు పిల్లలు కాగా, వారి భవిష్యత్తుకోసం, చదువుల కోసం ముందు చూపుతో హబ్సిగూడ రోడ్ నెం.5లో వారి తాహతుకు మించి హౌసింగ్ లోన్‌తో ఫ్లాట్ తీసుకొని అందులో స్థిరపడుతారు. వెంకట్‌కు దగ్గరి స్నేహితుడు ఉదయ్. వీళ్ళు తరచూ

కలుసుకొని దళితులు చదువుల వల్లనే ఎదగగలరని, డా॥ ఆర్.యస్. ప్రవీణ్ కుమార్ 'స్వేరోస్ నెట్‌వర్క్ ద్వారా దళిత విద్యార్థులను చైతన్యం చేస్తున్న తీరును ప్రశంసిస్తారు. వెంకట్ తాను తొమ్మిద తరగతిలో ఉండగానే ఆఫీస్ బాయ్‌గా పని చేయడం మొదలుపెట్టి ఎదిగిన తీరును ఉదయ్‌తో పంచుకుంటాడు.

అపార్ట్‌మెంట్‌లో ఇల్లు కొనడం ఒక ఎత్తయితే, కులాన్ని దాచడం మరొక ఎత్తైందని, అపార్ట్‌మెంట్‌లో కులాన్ని సూచించే శాస్త్రి, రావు పేర్లు ఉన్నవాళ్ళు దర్పాన్ని ప్రదర్శించడం, దళిత, బహుజనులు తమ కులం పేరు చెప్పకుండా 'నాన్‌వెజ్‌టేరియన్స్' అని చెప్పాల్సి రావడం, ఈ కులపిచ్చి నగరాలకు విస్తరించి అవమానాలకు గురిచేస్తుందని వెంకట్ వాపోతాడు. సమగ్ర కుటుంబ సర్వే రోజున 302 ప్లాట్‌లో ఉండే రామాచార్యులు సర్వే టీమ్‌తో వచ్చి వివరాలు నమోదు చేయించడంలో సహకరిస్తాడు. కులము నమోదు విషయంలో చారి వెంకట్ సర్టిఫికెట్ చూసి, కులం పేరు పలుకకుండా, దాని కోడ్ చెప్పి నమోదు చేయిస్తాడు. తన కులం రామాచారికి తెలిసిపోయిందని ఏదో అపరాధ భావంతో వెంకట్ క్రుంగిపోతుంటే, సర్వేటీం వెళ్ళిపోయాక చారి సంతోషంగా వచ్చి మీతో చాలా మాట్లాడాలని తన ప్లాట్‌కు తీసుకెళ్ళి తలుపు మూస్తాడు. సార్ మేం ఎస్సీలమే, మాలోల్లం మాది గుంటూరు. భార్యాభర్తలం మేమిద్దరం బ్యాంకులో జాబ్ చేస్తాము. స్కూల్లో చదివేటప్పుడు నేను అభిమానించే ఉపాధ్యాయుడు రామాచార్యులు అని పేరు మార్చడం వల్ల అందరూ బ్రాహ్మణుడు అనుకుంటారని చెప్తాడు. చారి, వెంకట్ భార్యలు వచ్చాక అపార్ట్‌మెంట్‌లో ఉండే 15 కుటుంబాలలో తమ రెండు కుటుంబాలే ఎస్సీ కావడం చేత ఇకనుంచి కులం బయటపడకుండా జాగ్రత్తగా ఉండాలని నిర్ణయానికి వస్తారు. అపార్ట్‌మెంట్‌లో ఉండే వాళ్ళు ఏదో విధంగా వెంకట్ కులం తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, చారి ఇంట్లో పనిచేస్తూ, వెంకట్ ఇంట్లో పనికి కుదిరిన పనిమనిషి కూడా వీళ్ళ కులం తెలుసుకోవాలని ప్రయత్నిస్తుందని, మనం తెలివిగా మసలు కోవాలని వెంకట్ భార్య దమయంతి అంటుంది. తాముండే ప్లాట్‌కు నేమ్ ప్లేట్ పెట్టకపోవడంతో, దమయంతి పేర నేమ్ ప్లేట్ రాయిస్తానంటే, తన పేరు చూడగానే క్రిస్టయన్ అని తెలిసిపోతుందని ఆమె నిరాకరిస్తుంది.

తాము ఎస్సీలమని కొద్ది కొద్దిగా అపార్ట్‌మెంట్‌లో ఉండే కుటుంబాలకు తెలుస్తున్నందున తమతో స్వేచ్ఛగా, చనువుగా మాట్లాడలేకపోతున్నారని, మనస్సాక్షిని చంపుకొని జాతి ప్రయోజనాలు కాపాడాల్సిన పనిలో భాగస్వాములం కాలేక పోతున్నందుకు బాధపడ్తున్నానని వెంకట్ ఉదయ్‌కు చెప్తాడు. బ్రాహ్మణైజ్డ్ అవుతున్న ఈ కాలంలో ఆత్మ గౌరవ స్వశక్తి ఉద్యమాలను ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఉదయ్ అభిప్రాయం వ్యక్తం చేస్తాడు. ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధపడిన వెంకట్ నేమ్ ప్లేట్‌తో పాటు, బుద్ధుని విగ్రహానికి ఆర్డరిచ్చి అన్నింటిని ఎదుర్కోవడానికి సిద్ధపడుతాడు.

ఈ దేశంలో కులం, అస్పృశ్యత ఒక రాచపుండు. రోజు రోజుకు దళితులను బాధిస్తూనే ఉన్నాయి. సమాజం అన్ని రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా వీటి రూపం మారుతుంది తప్ప నిర్మూలన కావడం లేదు. కులం పునాదుల మీద ఏ జాతిని, నీతిని నిర్మించలేరనే అంబేడ్కర్ మాటలు ఈ సందర్భంగా గుర్తు చేసికొవాల్సిందే. అందరూ ఈ దేశం బిడ్డలే అయినప్పుడు ఎందుకు కులాల మధ్య తారతమ్యతలు, మనుష్యుల మధ్య అస్పృశ్యత అనేది రచయితలు ప్రశ్నిస్తున్నారు. దళితులు దేవాలయ ప్రవేశానికి అనర్హులా? ఇప్పటికీ ఆలయాల్లోకి వారికి ప్రవేశం లేదనేది "అపచారం అపచారం" కథ నిరూపిస్తుంది. ఒకవేళ ఆలయ ప్రవేశం చేయాలనే కోరిక వారికి ఉంటే దళితులను అగ్రవర్ణాలు ఎంతగా హింసిస్తారో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

దళితుల శ్రమకు అస్పృశ్యత లేనప్పుడు, ఆలయ ప్రవేశం చేసినప్పుడు అస్పృశ్యత ఎందుకు ఉంటుందో తర్కానికందని విషయాన్ని ఈ కథలో రచయిత చూపించారు. కులాంతర వివాహాలను రాజ్యాంగ బద్ధమే. కానీ సమాజం దాన్ని అంగీకరించడం లేదు. పెద్ద తరం అంగీకరించకనే జాతి మొత్తం నిస్సత్తువలో ఉంది. తరువాత తరం కులాంతర వివాహం చేసికున్నా అంగీకరించకపోవడాన్ని "పులి అడుగు దెబ్బ"లో ఉంది. కానీ దళితులు ఐక్యంగా ఉంటే మరో చరిత్ర సృష్టిస్తారనేది ఈ కథలోని సందేశం. దళిత బహుజనుల ఐక్యతే రాజ్యాధికారాన్నిస్తుంది. కానీ బహుజనులు దళితులను అగ్రవర్ణాలవారు కించపరిచినట్లే కించపరచడం వలన దళిత బహుజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే

అన్నట్లు ఉందనేది "అయినా మనిషి మారలేదు" కథలో కనిపిస్తుంది. దళితులు చదువుకోవడం సమాజంలో ఒక మలుపు. అందునా దళిత స్త్రీలు చదువుకోవడం గొప్ప వెలుగు మలుపు. గ్రామస్థాయిలోనైనా అధికారం దళితులు చేపడితే అభివృద్ధి భిన్నంగా ఉంటుంది. సమగ్ర దృష్టితో ప్రణాళికల రచన చేసి సుపరిపాలన అందించాలనే తపన అధికారంలోకి వచ్చిన దళిత పాలకులకు ఉంటుంది. కానీ అధికారం కోల్పోయిన అగ్రవర్ణాలకు ఇలాంటి సుపరిపాలనా నచ్చునే నచ్చదు అనే విషయాన్ని "ఆరు తప్పులు" కథలో చూస్తాం. మార్పును అంగీకరించని కుల దురహంకారులు అధికారంలో ఉన్న దళితులను చులకన చేసి మాట్లాడడం జరుగుతుంది. ఇక దళిత స్త్రీలే పాలకులైతే వారిని మరింత చులకన చేస్తారు. అవసరమైతే శారీరక దాడులకు దిగుతారనే సామాజిక వాస్తవాన్ని ఈ కథలో చూస్తాం.

ఈ దేశంలో ఎన్నికలు ప్రారంభమైన దగ్గరి నుండి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడానికి రకరకాల పార్టీలు దుస్సాధ్యమైన వాగ్ధానాలు చేస్తూనే వున్నారు. అట్లాంటిదే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడమే ఒక ప్రహసనం. అది అమలుకాని ఒక వాగ్ధానం అని తెలిసినా, ప్రజలు అల్పసంతోషులని ఈ వాగ్ధానానికి తమను అధికార పీఠంపై తప్పకుండా కూర్చుండబెడతారనే బలమైన విశ్వాసంతో నీ వాగ్ధానం చేసింది. ఈ కుహనా వాగ్ధానాన్ని ప్రజలు నమ్మి పార్టీలకు పాలించే అవకాశమిచ్చారు. ఐదేండ్లు పాలించినా అమలుచేయని వాగ్ధానాన్ని, మళ్ళీ జరిగే ఎన్నికల ముందు భూమి పంపకం డ్రామా ఆడి దళితులను వంచించి అధికారంలోకి వస్తారు. క్షేత్రస్థాయికి వచ్చే సరికి అది కుహనా వాగ్ధానమేననేది "భూమాట" కథ నిరూపిస్తుంది. పల్లెలు పట్టణాలవుతున్నాయి, పట్టణాలు నగరాలవుతున్నాయి, నగరాలు మహా నగరాలవుతున్నాయి. కానీ అస్పృశ్యత నిర్మూలన జరగడంలేదు. భారతీయ సమాజం కొత్తను ఆహ్వానిస్తూనే పాతని విడిచిపెట్టని ఒక ఛాందస మనస్తత్వం కలిగినది. ఇందుకు ఉదాహరణ "అర్బన్ అన్ టచ్‌బులిటి" కథ. నగరాల్లో, మహానగరాల్లో బహుళ అంతస్తుల మేడలు అపార్ట్‌మెంట్‌లుగా వెలుస్తున్నాయి. వందలాది కుటుంబాలు ఈ అపార్ట్‌మెంటుల్లో జీవనం చేస్తున్నాయి. అయినా గ్రామాల్లో ఉండే కుల స్పృహను విడిచిపెట్టకుండా ఉండడం ఒక విషాదమే. తమ కులం తెలిసిపోతే తమ చుట్టూ ఉన్న అపార్ట్‌మెంటు వాసులు తమను గౌరవించరనే న్యూనత భావంతో గుట్టుగా జీవించడం ఆత్మహత్య సదృశ్యమే. ఇలాంటి విషయాల్ని "అర్బన్ అన్ టచ్‌బులిటి" కథ వివరిస్తుంది. మన భారత జాతిలో కులాల మధ్య వివిధ అంతస్తులు ఉన్నాయి. ఈ అంతస్తులను, అంతరాలను తొలగించి జాతి యావత్తును బలోపేతం చేయడానికి రిజర్వేషన్లను రాజ్యాంగం ఏర్పరిచింది. ఈ ఉత్తమ లక్ష్యాన్ని అర్థం చేసుకుని అగ్రవర్ణాలు రిజర్వేషన్ పొందుతున్న వర్గాలను చులకన చేసి మాట్లాడడం, న్యూనతకు గురిచేయడం, అన్ని రంగాల్లో కనిపిస్తుంది. ఇది విద్యావంతుల్లోనూ, విద్యాగంధం లేని వారిలోనూ సర్వసాధారణంగా కనిపించే అంశం. ఈ మధ్య అగ్రవర్ణ పేదలకు కూడా 'ఈడబ్ల్యూఎస్' రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించింది. ఇంతకాలం దళిత బహుజనులను రిజర్వేషన్ గాళ్ళు అంటూ హేళన చేసిన అగ్రవర్ణాలు కూడా నేడు రిజర్వేషన్ అనుభవిస్తున్నారు. 'ఈడబ్ల్యూఎస్' రిజర్వేషన్ పొందుతున్న వాళ్ళను 'రిజర్వేషన్ గాళ్ళు', ప్రతిభలేనివాళ్ళు అంటే ఎలా ఉంటుందో "టిట్ ఫర్ ట్యాట్" కథలో రచయిత నర్మగర్భంగా వివరించారు.

దళితులు తమ వృత్తిని ఎంత నిబద్ధతతో చేస్తారో, మనుషుల్ని కులాలకు, మతాలకు అతీతంగా ఎంత అవ్యాజంగా ప్రేమిస్తారో, తన ఊరిని, ఊరిలోని ప్రకృతిని అంతే ప్రేమిస్తారు. తమ చివరి శ్వాస తమ ఊరిలోనే విడువాలనే బలమైన కోరిక దళితులకు ఎలా ఉంటుందో 'ఊరు మెచ్చిన మనిషి' కథలో చూస్తాం. మారుతున్న పరిస్థితుల్లో మానవ సంబంధాలు, సామాజిక సంబంధాలు మారుతున్నాయి. అయినా దళితుల జీవితాల్లో, వారిని అగ్రవర్ణాలు చూసే తీరులో మార్పు మాత్రం రావడంలేదు. మార్పు వచ్చినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఈ కథలు ప్రబోధిస్తున్నాయి. ఎంతో ఆశావాదంతో దళిత రచయితలు గుణాత్మకమైన మార్పుకోసం ఈ కథలు రాసారు.


**ప్రొఫెసర్ బన్న అయిలయ్య**
విశ్రాంతాచార్యులు
కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్
సెల్ : 9949106968

# బుద్ధుని జాతక కథలు

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

**బౌ**ద్ధ సాహిత్యంలో జాతక కథలకు విశేషమైన ప్రాధాన్యం ఉన్నది. సంప్రదాయ బౌద్ధులుగా పిలువ బడుతున్న థేరవాదులు ఈ జాతక కథలను బలంగా నమ్ముతారు. అందుచేతనే థేరవాద భావనలో జాతక కథలకు ప్రత్యేక స్థానం ఉన్నది. థేరవాద బౌద్ధం ఎక్కువగా అమలులో ఉన్న దేశాలైనటువంటి శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్ మరియు కంబోడియాలలో వీటికి అధిక ప్రాధాన్యం కలదు. బౌద్ధం విలసిల్లుతున్నటువంటి ఇండియా, నేపాల్, ఇండోనేషియా, టిబెట్‌లలో కూడా వీటికి ఆదరణ ఎక్కువే. బౌద్ధాన్ని నమ్మేవారు బౌద్ధ ధర్మము, సాహిత్యములతోపాటు ఈ జాతక కథలకు కూడా అంతే విలువను, గౌరవాన్ని ఆపాదిస్తారు. బౌద్ధంలో మూల సాహిత్యమైనటువంటి త్రిపిటకాలలో జాతక కథల ప్రస్తావన ఉన్నది. వినయ పిటకంలో భాగమైన చుల్లవగ్గలో *సుఖ-విహారి, తిత్తిరి, ఖండావత్ర* వంటి కథలు పేర్కొనబడ్డాయి.

బుద్ధుడు మరణించిన నూరు సంవత్సరాల తరువాత (అంటే సుమారుగా 300 బి.సి.ఇ. నుండి 400 సి.ఇ.ల మధ్య) ఇవి వెలుగులోనికి వచ్చినట్లుగా తెలుస్తుంది. కామన్ ఇరాకు ముందు 377 సం. ప్రాంతంలో వైశాలిలో జరిగిన రెండవ బౌద్ధ సంగీతి సమావేశంలో కొన్ని బౌద్ధ సంప్రదాయాల పైన చర్చ జరిగింది. ఛాదస్తంగాను, అసంబద్ధంగాను ఉన్న కొన్ని నియమాలను తొలగించి లేదా మార్పు చేసి క్రొత్త నియమావళిని ఏర్పాటు చేసుకోవటం జరిగింది. ఆ సందర్భంలో ఆవిష్కరించబడిన గ్రంథాలలో జాతక కథలు ఒకటి. ఈ సమావేశం బుద్ధుడు మరణించిన నూరు సంవత్సరాలకు జరిగింది. అందుచేత




ఈ కాలమే జాతక కథల గుర్తింపు, ప్రచారానికి మొదలుగా చెప్పబడు తున్నది.

ప్రారంభంలో ఈ కథలు కేవలం మౌఖికంగా ఉండేవని, అటుపైన వాటి ప్రాచుర్యం, ఆదరణ గమనించిన పిమ్మట వాటిని గ్రంథస్థం చేసే దిశగా ప్రయత్నం జరిగిందని తెలుస్తున్నది. ఇవి మొదటగా పాళీ భాషలో ఉన్నట్లు, ఆ గ్రంథాన్ని సిలోన్ (నేటి శ్రీలంక)కు చెందిన *మహింద* అన్న భిక్షువు *సింహళ* దేశానికి కొనిపోయి, వాటిని *సింహళం* లోనికి తర్జుమా చేశాడని చెప్పబడుతున్నది. సుమారుగా బి.సి.ఇ. 250 ప్రాంతంలో 'పాట్నా'లో జరిగిన సంగీతి తరువాత ఇది జరిగింది. ఆ విధంగా మహింద చేత తర్జుమా చేయబడిన సింహళంలో ఉన్న కథలనే బుద్ధఘోషుడు సి.ఇ. 430 ప్రాంతంలో తిరిగి పాళీ భాషలోనికి మార్చి వ్రాశాడు. ప్రస్తుతం వివిధ భాషలలో లభ్యమవుతున్న జాతక కథలకు బుద్ధఘోషుని రచనే మాతృక. పాళీ భాష నుండి ఆంగ్లానువాదానికి రైస్ డేవిడ్ అనే పరిశోధకుడు ప్రయత్నం చేసి 1880 సం.లో ఒక సంపుటిని ప్రచురించినట్లు దాఖలాలు ఉన్నాయి. అటు తరువాత ఇ.బి. కొవెల్ సంపాదకత్వంలో కొద్ది మంది బౌద్ధ చింతనాపరులు, ఔత్సాహికులు ప్రయత్నించి *ది జాతక స్టోరీస్ ఆఫ్ ది బుద్ధాస్ ఫోర్మర్ బర్త్స్* అన్న పేర 1957 సం.లో ఒక గ్రంథాన్ని ఆంగ్లంలో వెలువరించారు. దీనిలో 550 కథలున్నాయి. జాతక కథలకు సంబంధించి ఇదొక మంచి ఉపయుక్త గ్రంథంగా ఉన్నది.

ఆసక్తికరమైన అంశం ఏమంటే, ఈ జాత కథలకు సంబంధించిన చిత్రాలు సాంచి, అమరావతి, బర్హుత్‌లలో ఉన్న బౌద్ధారామాల రైలింగ్‌లపైన, గోడలపైన చెక్కబడి ఉన్నాయి. వీని ఆధారంగా జాతక కథలు బి.సి.ఇ. మూడవ శతాబ్ది నాటికే ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. సి.ఇ. 400 ప్రాంతంలో శ్రీలంకను సందర్శించిన చైనా యాత్రికుడు *పాహియాన్ అభయగిరి* అన్న ప్రాంతంలో సుమారుగా 500లకు పైబడి బుద్ధుని యొక్క వివిధ

జన్మలను తెలిపే ప్రతిమలు చెక్కబడి ఉన్నట్లుగా పేర్కొన్నాడు. పాళీ భాషలో ఉన్నటువంటి జాతక కథలు, ఆ తరువాత ప్రాచుర్యం పొందిన' ప్రక్రీత్భాష'లోనికి తర్జుమా కాబడి అనేక మార్పులకు గురైనాయి. రెండు భాషలలో వ్రాయబడిన కథ ఒక్కటియే అయినప్పటికీ పాత్రలు, కథనం వేరుగా ఉంటాయి. నిజానికి పాళీని ప్రక్రీత్ యొక్క మూల భాషగా చెప్పవచ్చు.

ఈ సందర్భంలో పేర్కొనదగినది, కొద్దిమంది మహోన్నత వ్యక్తులు, తమ ఇష్టపూర్వకంగా తమ యొక్క గత జన్మలలోనికి తొంగి చూడగలరని, అనుభూతి చెందగలరనే నమ్మిక. బుద్ధునికి ఈ విధమైన జ్ఞానం ఉన్నట్లుగా చెప్పబడుతున్నది. గత జన్మలకు సంబంధించిన జ్ఞానం తనకు 'జ్ఞానోదయం' కలిగిన సమయంలోనే ఏర్పడిందని బుద్ధుడు చెప్పినట్లుగా పాళీ భాషలో వ్రాయబడిన అనేక బౌద్ధ గ్రంథాలలో ఉటంకించబడింది. గ్రీకు సాహిత్యం ప్రకారం పైథాగరస్‌కు ఈ విధమైన జ్ఞానం ఉన్నట్లు చెప్పబడింది. గ్రీకు తత్త్వవేత్తలైనటువంటి ప్లేటో, సోక్రటీస్ వంటి వారు దీనిని తత్త్వశాస్త్రంలో ఆత్మ పరివర్తన లేదా జీవాత్మ ప్రయాణం (Metempsychosis) అన్న భావనగా విశ్లేషించారు. దీని ప్రకారం కొన్ని ఆత్మలకు ఈ జ్ఞానం ఉంటుంది. హిందూ వాఙ్మయం ప్రకారం అనేక మంది ఋషులకు ఈ జ్ఞానం ఉండేదని చెప్పబడింది. అటువంటి వారిని ఉన్నత జ్ఞానం పొందిన వ్యక్తులుగా గుర్తించారు. ఋగ్వేదంలో వామదేవుడు అన్న ఋషికి ఈ జ్ఞానం ఉన్నట్లు పేర్కొనబడింది. అట్లే శ్రీకృష్ణుడు, అర్జునికి భగవద్గీతను బోధించిన సందర్భంలో 'తన గత జన్మలన్నీ తనకు తెలుసునని వెల్లడించాడు.' బోధిసత్త్వునిగా ఉన్న బుద్ధుడు జ్ఞానోదయం పొందడానికి అవసరమైన అర్హత పొందే దిశగా ఈ జన్మలు ధరించినట్లుగా చెప్పబడుతున్నది. మేథోసంపత్తిపరంగాను, నైతికత పరంగాను ఉన్నత స్థితి లేదా పరిపూర్ణతను పొందిన తరువాతనే బుద్ధుడు జ్ఞానోదయం పొందినట్లుగా ఈ జాతక కథలు పేర్కొంటాయి. తరచి చూస్తే జాతక కథలు గొప్ప కాల్పనిక సాహిత్యాన్ని పోలి ఉంటాయి. ఆసక్తికరమైన విషయమేమనగా, యూరప్ మరియు ఇతర పాశ్చాత్య దేశాలలో ప్రచారంలో ఉన్న జానపద సాహిత్యానికి జాతక కథలే ఆధారమని నిరూపించబడింది. అట్లే అనేక ఇతర దేశాల కథా సాహిత్యంలో జాతక కథల ప్రభావం ఎనలేనిది. ఈ విషయాలను అటు ఉంచి, జాతక కథలు మానవాళికి ఇచ్చే సందేశం ఏమిటి? అన్న అంశాన్ని మనం ఇప్పుడు చర్చిద్దాం.

ఈ విషయంగా ప్రధానంగా చెప్పదగినది, జాతక కథలు మానవులు తమ శీలాన్ని, ప్రవర్తనను ఏ విధంగా మెరుగుపరుచుకోవచ్చునో సూచిస్తాయి. ప్రతి కథ మానవునిలో ఉండే ఏదో ఒక లోపాన్ని లేదా దుర్గుణాన్ని ప్రస్తావించి, దానిని పరిహరించుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఉదాహరణకు మానవులు లోభత్వాన్ని వీడి, దాన గుణం అలవరచుకోవడం మంచిదని, దాని వలన సమాజానికి కలిగే మంచిని తేటతెల్లం చేస్తుంది. అట్లే మానవులు తమ జీవన విధానాన్ని లేదా గమనాన్ని ఏ విధంగా మలచుకుంటే బాగుంటుందో సూచిస్తాయి. మనిషి ఎల్లప్పుడూ కష్టించి పని చేయాలని, చిన్న చిన్న అవరోధాలకు లేదా అడ్డంకులు చూపి చేపట్టిన పనిని విడువరాదని బోధిస్తాయి. మానవుల ఆలోచనా గమనాన్ని, శక్తిని మార్చ గలిగిన శక్తి జాతక కథలకు ఉన్నదని ఘంటాపథంగా చెప్పవచ్చు. 'నైతిక విద్య' యొక్క అవసరం పెరుగుతున్న నేటి పరిస్థితులలో జాతక కథలు పాఠ్యాంశంగా చక్కగా అతికినట్లు సరిపోతాయి. మానవుడు పాటించవలసిన నీతి, న్యాయం, ధర్మం, త్యాగం, నిజాయితీ వంటి సందేశాల నిలయంగా ఇవి ఉన్నాయి.

ఈ కథల ద్వారా ప్రస్ఫుటమయ్యే మరొక అంశం, సృష్టిలో ప్రతి ప్రాణి విలువైనదే. బుద్ధుడు వివిధ జన్మలలో అనేక రకాల జంతువులుగా, మనిషిగా జన్మించి సార్థకతను సాధించినట్లుగా చెప్పబడింది. మనిషి రూపంలో కూడా ఉన్నత, నిమ్న జాతులకు చెందిన వివిధ వర్గాలు, జాతులు లేదా తెగలకు సంబంధించిన సమూహాలలో జన్మించాడు. దీనిద్వారా మనం గనించదగిన అంశం సృష్టి అన్ని ప్రాణులకు సమానమైనదే. ఉచ్చనీచములు మనుషులు కల్పించుకొన్న అంతరాలు మాత్రమే. ఆ విధంగా మానవులలో నెలకొనవలసిన 'సమ భావాన్ని' జాతక కథలు గుర్తు చేస్తాయి.

బోధిసత్త్వునిగా ఉన్న బుద్ధుడు జ్ఞానోదయం పొందడం కోసం అనేక జన్మలు ధరించినట్లుగా జాతక కథలు పేర్కొంటాయి. ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క లక్షణం ప్రముఖంగా

ప్రస్తావించబడింది. ఆ విధంగా బుద్ధుడు కలిగి ఉన్న అనేక లక్షణాలను బహిరంగపరచడం వీని యొక్క ఉద్దేశ్యం. ప్రతి సందర్భంలోనూ బుద్ధుడు ఒక అద్వితీయమైన వ్యక్తిగా చిత్రించబడ్డాడు. ఈ లక్షణాలు బుద్ధుని యొక్క జ్ఞానోదయ మార్గానికి సోపానాలుగాతీర్చబడ్డాయి. ఈ లక్షణాల సాధన ద్వారా ఏ వ్యక్తి అయినా బుద్ధత్వాన్ని పొందగలుగుతాడు అన్నది వీటి సందేశం.

జాతకకథల ద్వారా సంభవించిన మరొక ప్రయోజనం, బహుళ ప్రచారం పొందిన నీతి వాక్యాల జననం. ప్రతి కథ ఒక నీతిని బోధించే విధంగా సాగుతుంది. ఆవిధంగా అనేక నీతి వాక్యాలు వెలువడినాయి. మిగిలిన అనేక జానపద, నీతికథల ద్వారా కూడా ఇవి ఉత్పన్నమై ఉన్నప్పటికీ, జాతక కథలకున్న ప్రత్యేకత వేరు. వీటితో ముడిపడి ఉన్న కొన్ని నీతి వాక్యాలను ఇక్కడ ప్రస్తావించుకుందాం.


- ఐకమత్యమే బలం
- సత్యమే జయిస్తుంది
- అత్యాశ వినాశానానికి మూలం (దురాశ దుఃఖానికి చేటు)
- చెడు వినవద్దు, చెడు చూడవద్దు, చెడు మాట్లాడవద్దు.
- పరులకు సహాయపడటం పరమ ధర్మము
- తప్పు చేయటంలో రహస్యం అనేది ఏమీ ఉండదు
- మనసు నీటిలో అలల వంటిది
- బుద్ధిలేని స్నేహితులు, బుద్ధి గల శత్రువుల కంటే చెడ్డవారు.
- ఓర్పుతో సాధించలేనిది ఏదీ లేదు
- ఆనందం ఎక్కడ దొరుకుతుందో అదే నీ నివాసం
- జీవితం ప్రయాణం వంటిది, దానిని సాగించవలసిందే.
- వర్తమానంలో జీవించండి
- ఇతరుల ఆనందానికి కారణమైతే, దుఃఖాన్ని కూడా నీతిమంతులు ఎంతో గౌరవిస్తారు.

జాతక కథల సందర్భంగా చర్చకు వచ్చే మరొక ముఖ్య అంశం పునర్జన్మకు సంబంధించినది. జాతక కథల భావన మొత్తంగా ఈ అంశం పైనే ఆధారపడి ఉంది. బౌద్ధం ప్రకారం ప్రాణం లేదా చైతన్యం, మరణించిన పిదప కూడా కొనసాగుతుంది. ఇది రెండు రూపాలుగా పరిణమించవచ్చు. ఒకటి ప్రాణం మానవునిగా గాని, జంతువుగా గాని పునర్జన్మ పొందవచ్చు. రెండు, నిర్వాణం సాధించడం ద్వారా పునర్జన్మను నిలుపుదల చేయవచ్చు. అందుచేతనే బుద్ధుడు నిర్వాణం సాధించే దిశగా అనేక జన్మలను పొందినాడు. ఒక జన్మలో నిర్వహించిన మంచి లేదా చెడు కర్మలు వ్యక్తి యొక్క తదుపరి జన్మను నిర్ధారిస్తాయి. 'కర్మ' అంటే ఇక్కడ అర్థం కార్యము లేదా పని అనే కంటే బుద్ధుడు దానిని 'తలంపు'గా వర్ణించాడు. ఒక వ్యక్తి దేహం ద్వారా గాని, వాక్కు ద్వారా గాని, మనస్సు ద్వారా గాని నిర్వహించే కార్యాలన్ని 'కర్మ' క్రిందకే వస్తాయి. ఇదే బౌద్ధంలో 'కమ్మ'గా చెప్పబడింది. పునర్జన్మ అన్నది 'గణిత శాస్త్ర సమీకరణం' వలె 'మంచి కర్మ' మంచి జన్మను, 'చెడు కర్మ' చెడు జన్మను వెంటనే కలుగ చేస్తుంది అని చెప్పడానికి వీలు లేదు. అతను నిర్వహించిన పనులు లేదా క్రియలతోపాటు అతని యొక్క ఆలోచనలు కూడా పునర్జన్మను ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో మనం జాతక కథలను అర్థం చేసుకోవాలి.

**ఆచార్య కోదాటి వియ్యన్నరావు**
**పూర్వ ఉపకులపతి**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**
**గుంటూరు, ఫోన్ : 7093260655.**

**నాయకులు ఎట్లా అవుతారు? - డా. ఎన్. భాస్కరరావు :** నాయకులుగా రాజకీయాల్లో ఎంతోమంది చలామణి అవుతున్నారు. కొద్దిమంది మాత్రమే నాయకులుగా మిగిలిపోతున్నారు. ముందు తరాల వారు కూడా వీరిని అధికారంతో సంబంధం లేకుండా నాయకులనే పిలుస్తారు. అందరిలాగానే మొదలయి, ఎన్నో అవరోధాలను అధిగమించి ముందుచూపుతో భవిష్యత్తును తీర్చిదిద్దుతారు. ఇదంతా ఎట్లా, ఎప్పుడు మొదలవుతుందో అనే విషయం గురించిన వివరాలే ఈ పుస్తకంలో ఉన్నాయి.

*పుటలు : 71, వెల : 100/- ప్రతులకు : ఫోన్ : 981 1159 588*






**– ఆచార్య పి.ఆర్. హరినాథ్**

**ల**క్షల నక్షత్రాలు ఉన్నా ఒక సూర్యుని గురించో, ఒక చంద్రుడి గురించో మాట్లాడుకుంటాం. కోట్ల కొద్దీ జనం పుడుతూనే ఉన్నా కొందరినే గుర్తుంచుకుంటాం. మరి ఈ తారతమ్యం దేనికి? మనుషులలోని స్వభావాలను దేని ఆధారంగా విలువకట్టాలి? రకరకాల మనస్తత్వాలతో ఉన్న మనుషుల గురించి భర్తృహరి అంటున్నాడు.

**పద్మాకరం దినకరో వికచం కరోతి**
**చంద్రో వికాసయతి కైరవ చక్రవాలం**
**నాభ్యర్థితో జలధరోపి జలం దధాతి సంతః**
**స్వయం పరహితే విహితాభియోగాః**

సూర్యుడు ఉదయిస్తే ఆ కిరణాలు సోకి పద్మాలు వికసిస్తాయి. ఆ పద్మాలు ఎప్పుడైనా సూర్యుడిని వేడుకున్నాయా? "సూర్యదేవా, మాపై నీ కిరణాలను ప్రసరించనీ. మాకు వికాసాన్ని కలిగించనీ. దయచూడు" అని అంజలి పట్టి యాచించాయా? లేదే. పోనీ అవి అడగలేదు కదా అని సూర్యుడు మాత్రం ఊరుకున్నాడా? నేనెందుకు ఇవ్వాలి? వాటికి అంతగా అవసరం అనుకుంటే అవే అడుగుతాయి. అడగనీ అప్పుడు చూద్దాం అనుకున్నాడా? లేదే. అవి వేడుకోలేదు. ఎప్పుడూ అడగలేదు. అయినా సూర్యుడు వాటిపై కిరణాలను ప్రసరింపజేస్తూనే ఉన్నాడు. వాటికి మనోహర వికాసాన్ని ఇస్తూ ఉన్నాడు. అలాగే రాత్రంతా వెలుగునిచ్చే చంద్రుడు తెల్ల కలువలకూ వికాసం కలిగిస్తూ ఉన్నాడు. అవి కూడా ఏనాడు ఆయనను అభ్యర్థించలేదు. జాలువారే వెన్నెల కాంతులలో తమను జలకాలాడించమని వేడుకోలేదు. అవి అడగకుండానే శశికరుడు వాటికి మిసిమి వన్నెల వికాసాన్ని వెన్నెలతో కలిగిస్తూ ఉన్నాడు.

మరి మేఘం ఎవరూ కోరకుండానే జలజలా ఝళంఝళధారల జలదానం చేస్తూ ఉంది. సత్పురుషులు ఇలాగే ఉంటారు. ఒకరు అడగాల్సిన అవసరం లేకుండా తామే ముందుకు వచ్చి సహాయ హస్తం అందిస్తారు.

**ద్యుమణి పద్మాకరము వికచముగ జేయు**
**గుముద హర్షంబు గావించు నమృతసూతి**
**యర్థితుడు గాక జలమిచ్చు నంబుధరుడు**
**సజ్జనులు దారె పరహితాచరణమతులు**

ఇందులో మూడు విషయాలు ఉన్నాయి. సూర్యుడు, చంద్రుడు, మేఘము. ఈ మూడు విషయాలకు తెలుగు కవి మూడు విశేషణాలను ప్రయోగించాడు. సంస్కృత కవి చంద్రుడు, సూర్యుడు అని సూటి మాటలతో చెబితే, తెలుగు కవి వాటికి మరింత మెరుగులు దిద్ది సూర్యుడిని ద్యుమణి అని, చంద్రుడిని అమృత సూతి అని చెప్పి అసలు పద్యానికి మరింత సొగసును దిద్దాడు. ఈ మహాపురుషులు కేవలం ద్యుమణులే కాదు సర్వలోక మణులు. ఇలాంటి వారికి వారి స్వభావమే అలంకారం. వేరే అలంకారాలు అక్కరలేదు.

**శ్రోత్రం శ్రుతేనైవ న కుణ్డలేన దానేన పాణిర్నతు కంకణేన**
**విభాతి కాయః కరుణాపరాణాం పరోపకారేణ న చందనేన**

నిరంతరం దయ కలిగిన వారికి చెవులకు కుండలాలు అని ప్రత్యేకమైన ఆభరణాలు అక్కరలేదు. వాళ్ళు ఎప్పుడూ ధర్మశాస్త్రాల గురించి వింటూ ఉంటారు. మానవ జీవనానికి బాసటగా నిలబడడం గురించి తెలుసుకుంటూ ఉంటారు. అలా వినడమే వారి చెవులకు ఒక ఆభరణం. చేతులు కూడా అంతే. వాటికి ప్రత్యేకంగా కంకణాలతో అలంకరణలు అక్కరలేదు. ఆర్తులకు, దీనులకు, అనాథులకు ఎక్కడ సహాయం అవసరమైతే అక్కడ ఆపన్నహస్తం అందిస్తారు. దానాలు చేస్తారు. ఆ దానాల చేత వాళ్ళ చేతులు ప్రకాశిస్తాయి. అంతే తప్ప కంకణాలతో కాదు. వాళ్ళ శరీరానికి కూడా ప్రత్యేకంగా చందనపు పూతల అలంకారాలు అవసరం లేదు. ఇతరులకు హితం చేయడం వలనే శరీర శోభ ఇనుమడిస్తుంది.

**అమరు జెవి శాస్త్రమున గుండలమున కాదు**
**వలయమునవొప్ప దీవిచే వెలయు బాణి**
**యురుదయాఢ్యుల మేనుపరోపకార**
**కలన రాణించు గంధంబు వలన గాదు**

అవును మరి. వీళ్ళంతా సత్పురుషులు. మనుషులలో ఉండే ఈ తారతమ్యం ప్రవర్తన వల్ల వస్తున్నదే కానీ మరి దేనివల్ల కాదు.

**ఏతే సత్పురుషాః పరార్థ ఘటకాః స్వార్థాన్ పరిత్యజ్య యే సామాన్యాస్తు పరార్థ ముద్యమభృతః స్వార్థావిరోధేన యే తేమీ మానుష రాక్షసాః పరహితం స్వార్థాయ నిఘ్నంతి యే యేతు ఘ్నంతి నిరర్థకం పరహితం తే కే న జానీమహే**

ఇలాంటి వ్యక్తులలో కొన్ని భేదాలు ఉన్నాయి. కొంతమందిని తేలికగా మరచిపోతాం మనం. కొందరిని కలకాలం మనసులో దాచుకుని స్మరిస్తూంటాం. ఆ తలపులతో తరిస్తూంటాం. వారిలో కొందరు – తమ సొంత ప్రయోజనాలను వదిలేసుకుంటారు. వేరే వాళ్ళ ప్రయోజనాల కోసం పాటుపడతారు. తమ పనులు ఏవైనా వేరే వారి పనులకు భంగం కలగకుండా చూసుకుంటారు. వీళ్ళు ఉత్తములు. ఇంకొందరు ఉన్నారు. వాళ్ళు తమ ప్రయోజనాలను ఆశిస్తారు. అలా తమ పనులను నెరవేర్చుకుంటూనే వేరే వాళ్ళ ప్రయోజనాలను నెరవేరుస్తారు. వీళ్ళు మధ్యములు, సామాన్యులు. మరికొందరు ఉన్నారు. తమ ప్రయోజనం కోసం ఇతరులకు జరిగే మంచిని పాడుచేస్తారు. వీళ్ళు మనుషులుగా కనిపించే రాక్షసులు. వీళ్ళంతా కాక మరొక రకం వాళ్ళు ఉన్నారు. వాళ్ళకు ఏ ప్రయోజనమూ లేకున్నా ఇతరులకు పనికి వచ్చేదాన్ని చెడగొడతారు. వీళ్ళను ఏమని పిలవాలో తెలియకుండా ఉంది.

**తమ కార్యంబు పరిత్యజించియు బరార్థప్రాపకుల్ సజ్జనుల్**
**దమ కార్యంబు ఘటించుచున్ బరహితార్థ వ్యాపృతుల్ మధ్యముల్**
**దమకై యన్యహితార్థ ఘాతుక జనుల్ దైత్యుల్ వృథాన్యార్థ భం**
**గముగావించెడి వారలెవ్వరొ యెరుంగన్ శక్యమే యెరికిన్**

దీనికి దృష్టాంతంగా జైన్‌బౌద్ధంలో ఒక కథ కనిపిస్తుంది. జపాన్ దగ్గర పర్వతాల్లో ఒక చిన్న జైన్ బౌద్ధాలయం ఉండేది. అక్కడ ఒక ర్యోకన్ అనే వృద్ధ సన్యాసి ఉండేవాడు. ఆయన దగ్గర పెద్ద సామానేమీ లేదు. ఒక దర్భ చాప, ఒక చిన్న పాత్ర, ఒక వెదురు పరక, ఎన్నో కుట్లు పడ్డ ఒక వస్త్రం ఉండేది అంతే. ప్రతి ఉదయం సూర్యోదయానికి ముందు ర్యోకన్ పర్వత మార్గాల నుంచి దిగేవాడు. రెండు బాల్చీలలో నీళ్లు ఉండేవి. వాటిని సమీపంలో ఉన్న పల్లెకు తీసుకొనిపోయేవాడు. పల్లె వాళ్ళు తరచుగా అడిగేవాళ్ళు. 'స్వామీ తమరు వృద్ధులైనారు. ఈ ముసలితనంలో ఇంత కష్టం ఎందుకు? వయసులో ఉన్న కుర్రవాళ్ళు ఎవరైనా ఈ నీళ్ళను తీసుకొని వస్తారు కదా. మీకు ఇది బరువు కదా. ఎవరినైనా మోయనివ్వండి' అనేవారు. ర్యోకన్ చిరునవ్వుతో అనేవాడు. 'ఈ కొండను చూసావా? ఎంత మంచును మోస్తూ ఉందో చూడు. ఒక్కనాడైనా గొడవ చేసిందా? నీళ్ళ గురించి నేనెందుకు ఫిర్యాదు చేయాలి?'

కాలం గడుస్తోంది. ఒక చలికాలం భయానకమైన మంచు తుఫాను పల్లెను ముంచెత్తింది. బాటలు, ఇళ్ళు, ఇంటి పైకప్పులు అంతా మంచుతో నిండిపోయాయి. చాలా మందికి తినడానికి తిండి లేక పస్తులు ఉండేవారు. పల్లె వాళ్ళంతా భయంతోను, చలితోను గజగజలాడారు. ప్రాణాలతో ఉంటామా లేదా అని వణికిపోయారు. తర్వాత రోజు ప్రతి ఇంటి ముందు ఒక చిన్న కర్రల మోపు, బియ్యం కనిపించాయి. ఎవరో నిశ్శబ్దంగా ఉంచి వెళ్లారు. ఎవరు చేశారో ఎవరికీ తెలియదు. ప్రతిరోజు ఇంకా ఎవరో ఇస్తూనే ఉన్నారు. ఇంటి ముందు ఈ సామానును ఉంచుతూనే ఉన్నారు. అందరికీ ఆసక్తికరంగా ఉంది.

చివరికి ఒక అబ్బాయి ఈ సంగతి ఏదో తేల్చుకోవాలనుకున్నాడు. మంచులో పడిన పాద ముద్రలను అనుసరించి ఎక్కడికి పోతాయి అని కనుక్కోదలచాడు. అవి పర్వతంపై ఉన్న ర్యోకన్ చిన్న ఆలయం వరకు వెళ్లాయి. వాటిని అనుసరించి వెళ్ళిన ఆ అబ్బాయి లోపలికి వెళ్ళాడు. లోపల దాదాపుగా ఖాళీగా ఉన్న గూడు ముందు కూర్చుని సన్యాసి కనపడ్డాడు. అతని వద్ద ఉన్న బియ్యంలో సగానికి సగం లేవు. అతని వద్ద ఉండాల్సిన కర్రల మోపులు చాలా వరకు లేవు. చూడగానే అబ్బాయి గ్రహించాడు. ప్రతిరోజూ బియ్యం కర్రలు ఇస్తున్నది ఈయనే అన్నమాట. ఆ అబ్బాయి 'స్వామీ నీవిలా అన్నీ ఇచ్చేస్తుంటే తిండి లేక మరణిస్తావు' అన్నాడు. ర్యోకన్ ఒక కప్పులో టీ పోసి అబ్బాయికి ఇస్తూ నెమ్మదిగా చెప్పాడు. 'జనం చలితో గడ్డ కడితే నీవు నిప్పువి కా. జనం ఆకలితో అలమటిస్తే నీవు ఆహారానివి కా. మైనపు వత్తి వెలగడానికే ఉండేది. మైనాన్ని దాచుకోవడానికి కాదు' అన్నాడు. ఆ అబ్బాయికి ఈ మాటలు జీవితాంతం గుర్తుండిపోయాయి.

సంవత్సరాలు గడిచిపోయాయి. ర్యోకన్‌మరణించాడు. ఆ అబ్బాయి అదే పల్లెలో ఉపాధ్యాయుడు అయ్యాడు. ఎవరైనా ఆ ఉపాధ్యాయునితో 'జైన్ అంటే అర్థం ఏమిటి? జ్ఞాని అంటే ఎవరు' అని అడిగితే అతను ఆ కొండ వైపు వేలు చూపుతూ అనేవాడు. 'జ్ఞాని అంటే కరుణ గురించి వట్టి మాటలు మాట్లాడేవాడు కాదు. జ్ఞాని అంటే మంచు కురిసే వేళలో నీ వాకిలి ముందు అన్నం తెచ్చి పెట్టేవాడు'.

అని చెప్పేవాడు. ఇది సత్పురుష లక్షణం. వారికి తమకంటే పరులు ముఖ్యం. ఒక అందమైన సమాజాన్ని సృష్టించడానికి వ్యక్తి వద్దనుంచి మొదలు కావాలి. సమాజం అనేది ఎక్కడో ఊహల్లో లేదు. వ్యక్తుల సముదాయమే సమాజం అవుతుంది. ఒక్కొక్క ఇటుక పేర్చితే గోడ అవుతుంది. అంతే తప్ప ఇటుకకు ఉన్నట్లు గోడకు ఒక ప్రత్యేకమైన ఉనికి లేదు. అలాగే వ్యక్తి కీలకం. వ్యక్తి లేకుండా సమాజం లేదు. అంచేత సంస్కారమైనా, సద్బుద్ధి అయినా వ్యక్తి వద్ద నుంచే మొదలవుతుంది. ఇంట గెలిచి రచ్చ గెలవడం అంటే ఇదే. అసలు చదువు ఇంటిలో మొదలవుతుంది. ప్రపంచాన్ని మార్చే మహా పరిణామం కూడా వ్యక్తి నుంచే మొదలవుతుంది. ప్రస్తుత పద్యంలో కూడా వ్యక్తి స్వభావాన్ని గురించి కవి మాట్లాడుతున్నాడు. ఇలా ఉంటే సత్పురుష లక్షణం. ఇలా ఉండాలి. ఇలా ఉంటే దుర్జన లక్షణం. అంచేత ఇలా ఉండరాదు అనే స్పృహను మనసులో కలిగిస్తున్నాడు కవి.

సాహిత్యం చేసే గొప్ప సహాయం అదే అది మనసును మార్దవం చేస్తుంది. తడి ఆరిపోయి ఎడారిలా మారిపోతున్న ఎదలలో ఎడతెగని వానలై కురిసి ఒయాసిస్సుల్ని నింపుతుంది. కరడు కట్టిన గుండెలలో కరుణను మేల్కొలుపుతుంది. మనిషి తన చేతనైనంతలో ఇంకొకరికి సహాయపడాలి – అనే సద్బుద్ధిని కలిగిస్తుంది. ఒకరికి సహాయం చేయడమే ఆనందం. బ్రతుకులో మాధుర్యం అదే. భర్తృహరి చెప్పిన రహస్యం అదే.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
**తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,**
**మైసూర్, ఫోన్ : 948 044 3108**

## కమ్మతెమ్మెర

నీలవేణి అందంతో – కీరవాణి రాగ మాధుర్యంతో మే నెల **మిసిమి** వచ్చి నా మనసుపై వాలింది. ఆధునిక మహర్షి వంటి శ్రీ సత్యప్రసాద్ గారి సమాలోచన నన్ను ఆశ్చర్యచకితుణ్ని చేసింది. యింకా ఈ సమాజంలో – ఈ దేశంలో యిలాంటి మహనీయులున్నారా? అనిపిస్తున్నది. శ్రీ సత్యప్రసాద్ అనాథలకు ఆత్మబంధువు. ఏ గుర్తింపూ అవసరం లేని మానవతామూర్తి. సభలు – సన్మానాలు – కీర్తికిరీటాలు అవసరం లేని తపస్వి. గుడ్డిపిల్ల సంగీతం విని మురిసిపోయిన మధుర మనస్వి. ఆ పిల్ల సమాధానానికి ముగ్ధుడైన మహనీయత్వం వారిది. వారి సంకల్పం – జీవితాన్ని నడిపించిన తీరు – వారి నాన్నగారి నిరాడంబరత, మాతృమూర్తి అమృతత్వంలో పెరిగిన బంతి సత్యప్రసాద్ గారు. వారిలోని అంతర్లీనంగా వున్న గీతాసందేశతత్త్వం, పట్టుదల, కృషి – ఆత్మవిశ్వాసమూ వారి సంకల్పానికి వెలుగుదారులు కల్గించాయి. ఆయన హృదయం వియ్యమందింది విశ్వక్ దశతో. యిలాంటివారు మనదేశంలో కోటికొక్కరున్నా సౌభాగ్యవంతమై శోభిస్తుంది. సత్యప్రసాద్ గారిని కలుస్తాను. వారి పాదాలకు నమస్కరిస్తాను. కాశీ వెళ్ళినంత పుణ్యం మూటకట్టుకుంటాను.



నీలవేణి

జాతి–భాష రచనలో తెలుగు భాష ఔన్నత్యము వున్నది. వారిలో మన తెలుగు యిలా అయిపోతుందనే ఆవేదన వుంది. "నీ తెలుగెవ్వరిపాలు చేసెద తిరిగెదువాంధ్రా" అంటూ వంద సంవత్సరాలనాడు వేలూరి శివరామశాస్త్రిగారు అన్నారు. చక్కని రచన. రచయితకు ధన్యవాదములు.

ఏమిటండీ! నిజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ఎంత సంపన్నుడు! ఎంత భోగి. మరెంత పసివారిగా మారిపోయాడో కదా! అధికారం–అహంకారం–సంపన్నత్వం, లోభిత్వం నిండి వున్న నవాబుగారి జీవితం భారత ప్రభుత్వంలో కలిసిపోయింది. *'నిజాము సర్కారోడా'!* పాట చరణం జ్ఞాపకం వస్తున్నది. ఏది ఏమైనా భాగ్యనగర సౌభాగ్యంలో – అభ్యుదయంలో చరిత్రపుటలలో చిరంజీవి నవాబ్‌జీ. గొప్ప వ్యాసం. రచయితకు నమస్కారములు. *హార్మోజ్ జలసంధి* గురించి చరిత్ర పుటలను వివరణాత్మకంగా రచించారు. మావంటి వారికి హార్మోజ్ గురించి వినడంతోపాటు ప్రపంచ దేశాలు హడల్ పోతున్నాయి కదా! అశ్వినీగారూ! **మిసిమి** నా భారతి కంటే మిన్నగా నడిపిస్తున్నందుకు కృతజ్ఞతలు, నా శతసహస్ర వందనాలు సమర్పిస్తున్నాను.

***- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184***

# కిషినావ్ విశేషాలు

ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ

*(రెండవ భాగం)*

షెటఫెన్ చెల్ మారె, 15వ శతాబ్దంలో, ఒట్టోమన్ పరిపాలన నుండి మాల్దోవా బయటపడటానికి జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య పాత్ర వహించాడు. అతని ఆధ్వర్యంలో జరిగిన 36 యుద్ధాలలో 34 సార్లు విజయుడయ్యాడు షెటఫెన్. ఇక్కడ తెలిసిన మరొక విశేషం ఇంకోటుంది. షెటఫెన్‌కు తన వివాహానంతరం, వల్లచియా (ఇది ప్రస్తుత రొమేనియాలో ఉంది), పరిపాలకుడైన 'వ్లాడ్ ది ఇంపేలర్' తో బంధుత్వం ఏర్పడింది. 19వ శతాబ్దంలో ప్రచురితమైన, బ్రామ్ స్టోకర్ నవల 'డ్రాకులా' లోని కౌంట్ డ్రాకులా పాత్రకు ఉద్దీపన వ్లాడ్ ది ఇంపేలర్ అట.

షెటఫెన్ చెల్ మారె విగ్రహం ముందు, ఒకామె తన ఇద్దరు కూతుళ్లతోపాటు కవితా గానం చేయటం నా దృష్టిని ఆకర్షించింది. పెద్ద అమ్మాయి వయసు 11/12 సం.లు, చిన్నమ్మాయి వయసు 8/9సం.లు ఉంటుందేమో. వాళ్ళు పాడుతున్నవి, దేశభక్తిగీతాలని ఆనా తెలియ చెప్పింది. ఆ పాటలు నాకు అర్థమవకపోయినా, ఆ పిల్లల ముఖాలలో కనిపిస్తున్న భక్తి భావం అలౌకికంగా ఉంది.

అక్కడ ఒక వీధి మొత్తం, ఇరువైపులా పెరిగిన వృక్షాల మధ్య, మాల్డోవా, రొమేనియా రచయితల ఊర్ధ్వ భాగపు విగ్రహాలు ఉన్నాయి. దీని పేరు కూడా 'రైటర్స్ అవెన్యూ'. వాళ్లెవరో నాకు తెలియకపోయినా, ఇంతటి గౌరవాన్ని పొందిన వారి విగ్రహాల సమక్షంలో నడవటం కూడా నన్ను ఉత్తేజ పరచింది. కవులకు, రచయితలకు ప్రపంచమంతా పెద్ద పీట వేయటం, నా ప్రయాణాలలో నేను గమనించిన మరో విషయం. తమ సంస్కృతిని, ప్రజల జీవనవిధానాన్ని, చరిత్రను సృజనాత్మకంగా గ్రంథస్థం చేసిన వారిని గుర్తించి గౌరవించటం ఆ దేశపు ఆత్మ గౌరవాన్ని చాటుతుంది.

షెటఫెన్ చెల్ మారె విగ్రహానికి ఎదురుగా, ఉన్న పార్కులో జీసస్ పుట్టుకను, అతని తల్లి మేరీ పవిత్రతను ఆరాధించే సనాతన కథీడ్రల్ ఉంది. ఆ దగ్గరలోనే, 1840లో నిర్మించబడిన విజయ ద్వారం (ట్రయంఫ్ ఆర్చ్) కనపడింది. ఒట్టోమన్ సామ్రాజ్యాధీశులపై రష్యా సైన్యం సాధించిన విజయానికి చిహ్నం ఇది. ఇదొక చిన్న సైజు 'ఆర్క్ డి ట్రయంఫ్' (పారిస్)లా ఉంది. మేము నడుస్తున్న దోవలో ఇంకొన్ని సోవియట్ కాలం నాటి భవనాలు, పార్లమెంటు భవనం, ప్రెసిడెంటు నివాస ప్రాసాదం కూడా ఉన్నాయి. అక్కడే ఉన్న పుష్కిన్ 1820 అనే కెఫేలో కాఫీ త్రాగాము. మాటల్లో, తన స్వదేశమైన రష్యాలో సాహితీ పితామహుడిగానే కాకుండా, నాకు తెలిసిన భారత దేశంలో కూడా ఎంతో మంది రచయితలను ప్రభావితం చేసిన రష్యన్ రచయిత అలెక్సాండర్ పుష్కిన్, కిషినావ్‌లో 1820ల ప్రాంతంలో రెండు సంవత్సరాల పాటు నివాసమున్నాడని ఆనా చెప్పింది. 19వ శతాబ్దంలో రష్యాలో, ముఖ్యంగా ఉన్నత వర్గాలలో పాతుకుని ఉన్న నిరంకుశ భావజాలాన్ని వ్యతిరేకించిన యువకుడు పుష్కిన్. సాహిత్యాన్ని స్వేఛావాదంతో సంధించి, సమాజాన్ని సాంప్రదాయపు సంకెళ్ళ నుండి తప్పించి, ప్రజా దృక్పధాన్ని ఔదార్యం వైపు మళ్ళించే వెరపు లేని ప్రయత్నం చేసినవాడు పుష్కిన్.



అలెక్సాండర్ పుష్కిన్

ఆ కాలపు దురదృష్టం.. జార్ చక్రవర్తి, పుష్కిన్ రచనలలో కనిపించే వ్యక్తి స్వాతంత్ర్య ధోరణులను అంగీకరించక, కోపించి, అతనికి దేశ బహిష్కరణ విధించాడట. ముందస్తుగా ఈ శిక్ష, సైబీరియాకు పంపివేయటం. కానీ పుష్కిన్ ఉన్నత వర్గానికి చెందిన వాడవటంతో, దేశ బహిష్కరణకు తగ్గించి, కిషినావ్‌కు పంపారట. ఇక్కడ పుష్కిన్, జెంఫిరా అనే జిప్సీ యువతిని ప్రేమించాడట. ఆమె స్ఫూర్తితోనే తన ప్రఖ్యాత కవిత,

'జిప్సీ' వ్రాశాదని వినికిడి. ధనంతో సంబంధం లేని, ఎనలేని స్వచ్ఛమైన ఆనందభరిత జీవితం ఈ కవిత ఇతివృత్తం. ఫ్రెంచ్ నాటక కర్త అయిన జియోర్జెస్ బిజెట్, రూపొందించిన గొప్ప సంగీత నాటకం 'కార్మెన్'కు ఆధారం ఈ కవితే. కాఫీ త్రాగినంత సేపూ ఆనా, పుష్కిన్ కిషినావ్‌లో ఉన్న కాలంలో అనుభవించిన జీవితంలోని నిగూఢ తత్వాన్ని, అసామాన్యతను గురించి మాట్లాడుతూనే ఉంది. వీటి గురించి ఇంత గౌరవంతో మాట్లాడిన ఆనా అన్నా, జార్‌కు ఎదురు నిలిచి, రెండు సంవత్సరాలు మాత్రమే ఇక్కడ ఉన్న పుష్కిన్‌ను ఇంతగా గుర్తుంచుకుని గౌరవిస్తున్న మాల్డోవా వాసులన్నా... నాకు గౌరవం రెట్టింపయింది. అప్పటికే సాయంత్రం 7 గం.లు అవటంతో, ఆనా సెలవు తీసుకుంది. 7 నెలల పసి పాపతో పాటు, రోజంతా నా వెంటే ఉండి, నా ప్రశ్నలన్నిటికీ ఎంతో ఓపికగా సమాధానాలు చెపుతూ, ఈ అపరిచిత నగరానికి నన్ను పరిచయం చేసి, ఎన్నో విషయాలు తెలియచేసిన ఆనాకు కృతజ్ఞతలు తెలుపుకున్నాను. తాను చేసే పని మీద ఎంతో ఆసక్తి ఉన్న వారే ఇంత ఓర్పు చూపించగలరు.

అక్కడి నుండి రెండు కి.మీ. నడచి నా హోటల్ చేరుకుని, త్వరత్వరగా స్నానాదులతో బడలిక కడిగేసుకుని, తరువాత కార్యక్రమం గురించి టోనీ ఏమి ఆలోచించాడో చూద్దామని అతను ఉన్న హోటల్‌కు వెళ్ళాను. అతను హోటల్‌లో లేడు కానీ, నేను వస్తే ఆ దగ్గరలో ఉన్న 'లండన్ పబ్'కు రమ్మన్నట్లు చెప్పమని హోటల్ సిబ్బందికి చెప్పి వెళ్ళాడు. నేను అక్కడికి వెళ్ళేసరికి, పక్కా బ్రిటిషర్‌లా, టోనీ ఆరు బయట వేసిన టేబుల్ వద్ద కూర్చుని పెద్ద పైన్ట్ గ్లాసులో బీర్ సేవిస్తూ కనిపించాడు. నేను కూడా అక్కడే ఒక గ్లాసు మాల్డోవా వైన్‌తో సర్దుకుని కూర్చున్నాను. మాటల్లో టోనీ ఇంగ్లాండ్‌లో 'హల్' అనే ప్రాంతపు వాడని తెలిసింది. కొంతకాలం క్రిందట నేను పని చేసిన హల్ రాయల్ ఇన్ఫిర్మరీ (హాస్పిటల్)కు దగ్గరలోనే అతని నివాసమట. అప్పుడు అక్కడ, మళ్ళీ ఇప్పుడు ఇక్కడ, ఇంత దూరంలో సందర్శకులుగా చేరువవటం యాదృచ్ఛికం. ప్రపంచం చాలా చిన్నదనే భావన మా ఇద్దరికీ కలిగింది. కొంతకాలం పాటు నీటి పంపులు వగైరాలను ఏర్పాటు చేసే ప్లంబర్‌గా చిన్న సొంత వ్యాపారం చేసి, తరువాత ఆ వృత్తి నుండి విరమించి, దేశ దేశాలు చుట్టి రావాలని సంకల్పించుకున్నాడట. అప్పటికే చాలా దేశాలు తిరిగి చూసిన టోనీ, తను ఇంత వరకు చూడని మాల్డోవా చూడాలని ఇప్పుడు వచ్చాడు.

ఇప్పటికీ గౌగజియా వెళ్లాలనే నిర్ణయం మీదే ఉన్నారా అని నన్ను అడిగాడు. 'ఇంకా ఏమీ గట్టిగా అనుకోలేదు. రేపు ఉదయం ఏమనిపిస్తుందో చూద్దాం' అని అన్నాను. రావాలనిపిస్తే అతనితో పాటు ఉత్తర మాల్డోవా ట్రిప్కు తనతో పాటు రావచ్చని టోనీ సూచించాడు. అందుకు నేను 'సరే' అనటంతో, వెంటనే ట్రావెల్ ఏజెన్సీకి ఫోన్ చేసి, డ్రైవరు/గైడ్‌తో సహా వచ్చే కారు మాట్లాడేశాడు. రేపటి కార్యక్రమం నిర్ణయమైపోవటంతో, అక్కడి నుండి 'పొపసల్ దాకిలోర్' అనే మాల్డోవా రెస్టారెంట్‌కు వెళ్ళి, కూరగాయలు వేసి చేసే నూడుల్ సూప్, 'జీమా' తీసుకున్నాను. వేడి సూప్ వలన ఆకలి ప్రజ్వలితమౌతుంది. దీని తరువాత, కాబేజీ ఆకులలో, మాంసంతో కలిపిన వరి అన్నపు ముద్ద కూరి, దాని మీద కొంచెం పులవబెట్టిన క్రీమ్ వేసి అందించే 'సార్మలే'తో తృప్తిగా రాత్రి భోజనం ముగించి, ఆ రోజు కార్యక్రమాన్ని కూడా ముగించాను.

ఉదయం 7 గంటల కల్లా టోనీ నా హోటల్ రిసెప్షన్‌కు వచ్చేశాడు. 'విజిట్ మాల్డోవా' అని వ్రాసి ఉన్న ఒక స్కోడా ఆక్టేవియా కారు వైపుకు నన్ను తీసుకెళ్ళాడు. అది తెల్లగా మెరిసిపోతోంది. అప్పటికే సంసిద్ధంగా ఉన్న మా డ్రైవరు, గైడ్.. లియోనిడ్ నవ్వుతూ నన్ను పలకరించాడు. అతని సారథ్యంలో, అప్పటికి ఇంకా నిద్ర లేవని రోడ్ల మీద సర్రున సాగిపోయి, ఇట్టే నగరం దాటేసింది మా వాహనం. ప్రయాణం సునాయాసంగా సాగిపోతోంది. కొన్నిసార్లు నాకు గమ్యం కన్నా ప్రయాణమే బాగుంటుంది అనిపిస్తుంది.

ఒక గంట ప్రయాణం తరువాత, ఒక సన్న మట్టి రోడ్డు మీదకు మళ్ళాము. ఇప్పుడు చేరవలసిన చోటు, ఒర్హెయూల్ వెకీ. సనాతన భిక్షువులు సున్నపురాతి కొండలు తొలచి గుహలు ఏర్పాటు చేసుకుని, వాటిని ధ్యాన మందిరాలుగా ఏర్పాటుచేసుకున్న 13వ శతాబ్దపు మొనాస్టరి ఇది. దీని నుండి, కొండ వాలులో మెలికలు తిరుగుతూ లయగా ప్రవహిస్తున్న రవుట్ నది, దాని వెంబడి ఉన్న అందమైన లోయ మనసును కట్టివేసాయి. కను చూపు మేరా లోయలో కనపడుతున్న మొక్క జొన్న తోటలు, విప్పారిన సూర్య కాంత పుష్పాల వెలుగులు, అవి లేనిచోట పచ్చని పచ్చిక బయళ్ళు...అదెంత సారవంతమైన నేలో చెప్పకనే చెపుతున్నాయి. అక్కడ అలముకుని ఉన్న ప్రశాంతత, ఆ ప్రాంతపు పవిత్రతను సూచిస్తోంది.

ఇటువంటి చోట.. ఆధ్యాత్మికేతర భావాలకు చోటు దొరకదనిపించింది. ఆ క్షణంలో, మనసును ఆత్మ జ్ఞానానికి చేరువ చేస్తూ, ఇహలోక సమస్యలను దూరం చేసే ఇటువంటి ప్రదేశాలు, ప్రపంచవ్యాప్తంగా.. జనావాసాలకు దూరంగా, ప్రకృతి సహజ శాంతి వనాలలో ఎందుకుంటాయో బాగా అర్థమయింది.

ఒర్హెయూల్ వెకీ మొనాస్టరి సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణ. దీనిని ప్రపంచ వారసత్వ సంపదలో భాగంగా యునెస్కో గుర్తించింది. మాల్దోవా, రొమేనియా సనాతన క్రైస్తవాన్ని పాటిస్తుంది. మేము ఆ కొండ లోయలోకి కారులో వెళ్ళి, ఒక అరగంటపాటు, పర్వత శిఖరాలపై అంచు వెంబడి మొనాస్టరి వరకు ఉన్న సన్నటి, కచ్చా, కాలి దోవ వెంబడి నడుస్తూ వెళ్ళాము. అక్కడ మాకు నల్ల దుస్తులు వేసుకున్న భిక్షువులుకనిపించారు. వారు అక్కడే నివాసముంటూ, మొనాస్టరీని నిర్వహిస్తారట. వాళ్ళలో ఒకరు మమల్నిద్దరినీ వెంట తీసుకుని వెళ్ళి అంతా చూపించారు. కొన్ని గుహల అంతర్భాగంలో మాసిపోయిన కుడ్య చిత్రాలను చూస్తే అవి చాలా పురాతనమైనవిగా కనిపించాయి. పైనుండి చుట్టూ కనిపించిన దృశ్యాలు హృద్యంగా ఉన్నాయి. వెనుకకు తిరిగి వచ్చే దోవలో, కొండ రాళ్ళతో కట్టి, సాదా సీదాగృహాలతో, గుర్రపు బళ్లతో ఒక పల్లె కనిపించింది.

ఒర్హెయూల్ వెకీనుండి, ఉత్తర దిశగా మరొక గంటన్నర ప్రయాణం తరువాత సోరోక చేరాం. ఇక్కడ 14వ శతాబ్దానికి చెందిన ఒక కోట ఉంది. డ్నీస్టర్ నది బాగా వంపు తిరిగే అనుకూల ప్రాంతంలో, దీనిని ఇంత దీటుగా నిర్మించిన వీరుడు షెటఫెన్ చెల్ మారె. శంఖు ఆకారపు డోమ్‌లతో, అందమైన రాజప్రసాదంలా కనిపిస్తున్న ఈ కోట ధృడత్వం మమ్మల్ని ముగ్దుల్ని చేసింది. డ్నీస్టర్ నది ఒడ్డున ఉన్న ఒక రెస్టారెంట్లో మధ్యాహ్న భోజనం చేశాము. నదికి అవతలి వైపు ఉక్రెయిన్. ఆ దేశంలో ఈ నది రెండవ పెద్ద నది. ఈ రెండు దేశాల మధ్య సహజ సరిహద్దు కూడా. ఇక్కడ ఇది మాల్దోవా నుండి దక్షిణానికి సాగి, మళ్ళీ ఉక్రెయిన్ ప్రవేశించి అటుగా 1362 కి. మీ. ప్రయాణం తరువాత నల్ల సముద్రంలో కలసి పోతుంది.

సోరోక, మాల్దోవాలోని సంచార జాతుల వారి రాజధాని. లియోనిద్ మమ్మల్ని 'జిప్సీ హిల్' అనే ప్రదేశానికి తీసుకు వెళ్ళాడు. దాని చుట్టూ జిప్సీ తండాలు ఉంటాయని మేము ఊహించాము. కానీ అందుకు



సోరోక ఫోర్ట్

వ్యతిరేకంగా అక్కడ ఉన్న రాజ గృహాలనిపించే విశాలమైన కట్టడాలు మమ్మల్ని ఆశ్చర్యపరచాయి. వాటిలో అమెరికాలోని కాపిటోల్ భవనం, వైట్ హౌస్, రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ బాసిలిక, ఇంకా మాస్కో బోల్షాయ్ థియేటర్లను పోలిన భవనాలు కూడా ఉన్నాయి. వీటిలో కొన్ని భవనాలు 'తేలికగా ఒక అరడజను కుటుంబాలు నివసించవచ్చు', అనిపించేంత పెద్దవి. అయితే ఈ ప్రాంతం ఒక పద్ధతి ప్రకారం, అలంకారికంగా లేదు. ఇరుకు వీధులలో అరకొరగా కట్టినట్లు ఉంది. దీనిని చూస్తే, నడమంత్రపు శ్రీమంతులు ఉండే ప్రాంతంలా కనిపించింది. అక్కడ కట్టటం పూర్తి కాని భవనాలు చాలానే కనిపించాయి. నిర్మాణం పూర్తయిన భవనాల మీదు పన్ను ఉంటుంది కాబట్టి, పన్ను తప్పించుకోవటానికి, ఇక్కడి వారికి ఇదొక ఉపాయం అని లియోనిద్ చెప్పాడు. ఈ జిప్సీ కుటుంబాలకు ఆదాయం ఎక్కడి నుండి వస్తుందని అతనిని అడిగాను. 'ఆ సంగతి ఎవరికీ తెలియదు. చాలా మంది సంవత్సరంలో చాలా భాగం ఇక్కడ ఉండరు' అంటూ లియోనిద్ అక్కడ కనిపిస్తున్న ఒక వైభవోపేత భవనాన్ని, 'అది జిప్సీల రాజుదే' అంటూ చూపించాడు. మాల్దోవా ప్రెసిడెంట్, ప్రైమ్ మినిస్టర్లు కూడా ఆ స్థానిక నాయకుడి చేతిలో ఉంటారట. జిప్సీ హిల్‌ను చూసి ఏమనుకోవాలో నాకు తోచలేదు. ఆ ఇళ్ళు అక్కడ అట్లా ఉండటం నాకు అసంబద్ధంగా అనిపించింది. అది పౌరులు నివసించే ప్రాంతంలా కాకుండా, ఒక వినోద, విహారాల పార్కులాగా కనపడింది. ఏమైనా, ప్రస్తుతం సోరోకా చూడటానికి వచ్చే వారికి ఇదొక ముఖ్య ఆకర్షణ.

డ్నీస్టర్ నదీ తీరంలో, ఒక కొండ మీద ఉన్న ఎత్తైన టవర్, 'ది కాండిల్ ఆఫ్ గ్రాటిట్యూడ్'. దీనిని, మాల్దోవాలో వినాశనానికి గురయిన అన్ని స్మారక భవనాలకు ఇది

చిహ్నం. దీనిని చేరుకోవాలంటే 600 మెట్లు ఎక్కాలి. పైకి ఎక్కిన తరువాత.. సొరొక నగరాన్ని ఒక ప్రక్కన పొదవుకుని, రెండవ చేతితో.. దూరంగా చుక్కల్లా కనపడుతున్న వ్యవసాయ క్షేత్రాలను ఉక్రెయిన్ భూభాగంలో వెదజల్లి , తృప్తిగా, నిండుగా సాగిపోతూ కనిపించిన డ్నీస్టర్ నది, రెండు దేశాల మధ్య సరిహద్దుగా కాక, వీటిని కలిపే సజీవ శక్తిగా, నా మనసులో ఎప్పటికీ నిలిచి ఉండే జ్ఞాపకంగా సాక్షాత్కరించింది. ఆ రోజంతా మాల్డోవా అంతర్దర్శనంతో సంతృప్తిగా గడిచింది. అక్కడి నుండి వెనుకకు మళ్ళి, లియోనిద్ మమ్మల్ని కిషినావ్‌లో మా హోటల్లకు చేర్చాడు. వాళ్లిద్దరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పాను. ఆ సాయంత్రం భోజనం, 'లా ప్లాసిన్టె'లో. ఈ రెస్టారెంట్ మాల్డోవా రుచులకు ప్రసిద్ధి. మమలిగా ఇక్కడి జాతీయ వంటకం. దీనిని రుచి చూడకుండా ఇక్కడి నుండి వెళితే, ఈ యాత్ర పూర్తయినట్లు కాదట. మొక్క జొన్న పిండితో జారుగా తయారుచేసి, ఛీజ్, మాంసం, లేదా చేపలు కాని వేసి ఇస్తారు. నేను చేపలతో చేసింది కావాలన్నాను. దీని రుచి అమోఘం.

మరునాడు ఉదయాన్నే, నా హోటల్ బిల్లు చెల్లిస్తూనే అక్కడున్న సిబ్బందిని, రైల్వే స్టేషన్‌కు వెళ్ళటానికి నాకొక టాక్సీ ఏర్పాటు చేయమని అడిగాను. వాళ్ళు నన్ను వెంట తీసుకు వెళ్ళి, వారికి వతనుగా వచ్చే డ్రైవరు, బోగ్దన్‌కు నన్ను అప్పచెప్పారు. అతగాడు దోవలోనే, 'మాల్డోవా లీ' ఇంకెక్కడా చెల్లదు కాబట్టి, నా దగ్గర మిగిలిన డబ్బంతా అతనికి ఇచ్చేయమంటూ మొదలు పెట్టాడు. ఆ కారుకు మీటరు లేదు. 'అరే బాబూ, నేనింకా తిరాస్పోల్‌కు టిక్కెట్టు కొనుక్కోవాలి అని చెప్పాను. అయితే దానికి సరిపడా ఉంచుకుని మిగిలినదంతా యిచ్చెయ్యమని సతాయించాడు. అతనికి ఇవ్వవలసిన దాని కంటే ఎక్కువే ఇచ్చాను. మిగిలిన డబ్బు నాకే, ఈ దేశపు జ్ఞాపికలుగా కావాలని చెప్పటంతో.. మూతి ముడుచుకుని, మాట్లాడకుండా అసంతృప్తిగానే అక్కడినుండి వెళ్ళిపోయాడు బోగ్దన్.

కిషినావ్ స్టేషన్ మార్బుల్, గ్రనైట్లతో కట్టిన మంచి సోవియట్ కాలపు భవనం. మూడు రోజుల క్రిందట, వచ్చినప్పుడు నేనున్న మనఃస్థితిలో ఇదంతా గమనించ లేదు. కానీ ఇప్పుడు, రైళ్ల రాకపోకలు మొదలవటంతో దాని విభవం, ప్రాభవం, ప్రాముఖ్యత నా అనుభవంలోకి వచ్చాయి. అంతలోనే నాకు నిరాశ. కౌంటరులో ఉన్నావిడ తిరాస్పోల్‌కు టిక్కెట్లు లేవని చల్లగా చెప్పింది. మళ్ళీ ఏమనుకుందో.. ప్లాట్‌ఫారం మీద ఉండే కండక్టర్‌ను అడిగితే ఏమైనా చేయగలడేమో అన్నది. ఉరుకు పరుగుల మీద కండక్టర్ దగ్గరకు వెళ్ళాను. నా హడావుడి చూసి, 'కంగారు పడకు. ఏదో ఒకటి చేస్తాలే. ఇదుగో ఈ పెట్టెలో ఎక్కు' అని సైగలతోనే చెప్పాడు.

అతను చెప్పిన పెట్టెలో ఎక్కాను. నెమ్మది నెమ్మదిగా పెట్టె నిండింది. ఒక్క సీటు కూడ మిగల లేదు. దీనర్థం టిక్కెట్టు, సీటు లేకుండా, పద్ధతి ప్రకారం తనిఖీ చేయబడని పాస్పోర్టుతో, జేబులో 150లీ (మాల్డోవా డబ్బు. 150 లీ=9 డాలర్లు), ఇంకొన్ని జ్ఞాపికలతోనేను మాల్డోవా వీడిపోతున్నాను. నాలాగే నిలుచుని ఉన్న ఇంకొందరు ప్రయాణీకులు, కండక్టర్‌కు డబ్బులిచ్చి అనధికార టిక్కెట్టు కొనుక్కుంటున్నారు. అతనికి ఎంత ఇవ్వాలో నాకు తెలియదు. వాళ్ళెవరినీ అడగలేను. సంశయిస్తూనే, 100లీ నోటు తీయకుండా, 50లీ నోటును కండక్టర్‌కు ఇచ్చి, వెళ్ళవలసిన చోటు చెప్పాను. అతను ఆ నోటు జేబులో వేసుకున్నాడు. అక్కడ మొత్తం ముగ్గురు కండక్టర్లు ఉన్నారు. ముగ్గురూ బట్ట తల, బాన పొట్టలతో.. చూడటానికి టక్కరి త్రయంలా ఉన్నా, కొంత స్నేహపూర్వకంగా కూడా ఉన్నారు. ఎట్లాగో నన్ను తిరాస్పోల్ వెళ్ళే రైలు ఎక్కనిచ్చినందుకు ... ఒకింత సంతోషం, రైలులో లెక్కకు మించి ప్రయాణీకులను ఎక్కించుకుని, డబ్బు వసూలు చేసి జేబులో వేసుకోవటం చూసి.. ఒకింతదుఃఖం, రెండూ ఒకేసారి కలిగాయి. చేసేదేమీ లేక, రైలు పెట్టె ఒక చివర ఉన్న మెట్ల దగ్గర, మరొక ఇజ్రాయెల్ వ్యక్తితో పాటు నేల మీద కూర్చున్నాను. అంతలో ఒక కండక్టర్ కొన్ని అట్ట పెట్టెల ముక్కల్ని నేల మీద పరచి, వాటి మీద కూర్చున్నాడు. మేము కూడా దానిమీదకు జరిగాము. వాళ్ళ సీట్లను కూడ అమ్మేసుకున్న మిగిలిన ఇద్దరు కండక్టర్లు కూడా మా అట్ట ముక్కల చాప మీదకు వచ్చారు. మేమయిదుగురం కబుర్లు మొదలు పెట్టాము. భాష అంటారా? అంతా కలగా పులగం. భావ ప్రకటన ముఖ్యం. అది రకరకాలుగా రెండు గంటల పాటు సాగిపోయింది. మాటల్లోనే .. దోవ మళ్ళిపోయిన ట్రాన్స్నిస్ట్రియా రాజధాని.. తిరాస్పోల్రానే వచ్చింది.

ఇక్కడేమి చూడబోతున్నానో!!

**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com

# పైరసీ - సముద్రపు దొంగలు

**- చెన్నూరి శివరామక్రిష్ణ ప్రసాద్**

*(నాలుగవ భాగం)*

**ఉత్తర అమెరికా** : ఉత్తర అమెరికా తూర్పు తీరంలో 17వ శతాబ్దం ఆరంభంలో పైరసీ సర్వ సామాన్యం అయ్యింది. దీనికి కారణం ఆంగ్లో-స్పానిష్ యుద్ధం (1585-1604) ముగింపు. ఈ యుద్ధంలో పాల్గొన్న ఇంగ్లిష్ ప్రైవేటీయర్‌లను బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధ సంబంధిత బాధ్యతల నుండి విడుదల చేసింది. వీరందరూ అమెరికా తీరంలో పైరసీ మొదలుపెట్టారు. వీరిలో పీటర్ ఈస్టన్ అత్యంత సఫలత దక్కిన పైరేటుగా ప్రసిద్ధికెక్కాడు. సముద్రతీరం నుండి పైరసీ అమెరికాలోని నదులకు కూడా విస్తరించింది. 18వ శతాబ్దం ఆఖరి నుండి 19వ శతాబ్దం మధ్య వరకు పైరసీ ఒహయ్యో, మిస్సిస్సిపి నదుల మీద కేంద్రీకృతమై వుండేది. 1803లో అమెరికా సేనలో భాగమైన అశ్వదళం టవర్ రాక్ వద్ద వున్న పైరేట్ల స్థావరాలపై దాడిచేసి వారిని తరిమికొట్టింది. మిస్సిస్సిపి నదిలోని స్టాక్ ఐలండ్ దీవి 1790 చివరి భాగంలో పైరేట్లకు, నకిలీ కరెన్సీ చెలామణీ దారులకు స్థావరంగా ఉండేది. మిస్సిస్సిపి నది ఎగువ ప్రాంతంలో 1809లో ఆఖరిసారిగా చెప్పుకోదగిన పైరసీ సంఘటన జరిగింది. ఫ్లాట్‌బోట్‌మెన్ (బల్లకట్టు వంటి నావ) గుంపు పైరేట్ల స్థావరమైన స్టాక్ ఐలండ్ మీద దాడి చేసి పైరేట్లను సమూలంగా అణచివేశారు. ఈ సంఘటనతో మిస్సిస్సిపినది ఎగువ ప్రాంతంలో పైరసీ అకస్మాత్తుగా ఆగిపోయింది. ఇల్లినాయ్ రాష్ట్రంలో, ఒహయ్యో నది ఒడ్డున వున్న కేవ్-ఇన్-రాక్ పైరేట్లకు, నేరస్తులకు ముఖ్య స్థావరంగా వుండేది. ఇక్కడి నుండి శామ్యూల్ మేసన్ అనే పైరేట్ తన ముఠాతో ఒహయ్యో నది మీద దోపిడీలు చేసేవాడు.

మిస్సిస్సిపి నది దిగువ ప్రాంతంలో పైరసీ 1800 నుండి 1830 మధ్య వరకు కొనసాగింది. ప్రభుత్వం తీసుకున్న చట్టపరమైన చర్యలవల్ల, ప్రజల విజిలాంటిజం (చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవడం) వల్ల పైరసీ క్రమక్రమంగా క్షీణించింది. 19వ శతాబ్దం ఆఖరి, 20వ శతాబ్దం మొదటి దశకంలో డాన్ సీవీ గ్రేట్ లేక్స్ ప్రాంతంలో పైరసీ చేసేవాడు. ఆ తరువాత అమెరికా ప్రభుత్వ వుద్యోగిగా చేరి లేక్ మిషిగన్ ప్రాంతంలో అక్రమ వేటలు, సరుకుల దొంగ రవాణా, పైరసీలను నిరోధిచడానికి పనిచేశాడు.

1856లో చేసిన పారిస్ ప్రకటనతో ప్రైవేటియరింగ్ చట్ట విరుద్ధంగా నిర్ధారించి రద్దు చేయబడినది.

**పైరసీ - నౌకలపై సాంఘిక, సామాజిక వ్యవస్థ** : పైరేట్ నౌకల పైన నిర్దిష్టమైన అధికార క్రమం వుండేది. స్వాధీనం చేసుకున్న/కొల్లగొట్టిన నౌకల నుండి లేదా ఇతరత్రా చేసిన దాడుల వల్ల వచ్చిన సంపదను పంచుకోవడంలో ఈ క్రమాన్ని తప్పకుండా పాటించేవారు. అప్పటి మిగతా సామాజిక వ్యవస్థలతో పోల్చిచూస్తే పైరేట్ల వ్యవస్థలో ఒక విధమైన సామాజిక సమానత్వం వుండేది. నౌక చుక్కానిలకు కప్తాను ఆజ్ఞలను తిరస్కరించే అధికారం వుండేది. ఇది నౌక మీద ఒక సంతులనాత్మక వాతావరణానికి దోహద పడేది. నౌక వైద్యుడి మందుల పెట్టెకు 300 నుండి 400 (ప్రస్తుతపు విలువ షుమారు $ 4,50,000) విలువ ఉండేది. దాడులలో వజ్రాలు, మణులు దొరకడం చాలా తరచూ జరిగేది. కాకపోతే పైరేట్లలో వీటికి అంత ఆదరణ వుండేది కాదు. దీనికి కారణాలు 1. వీటిని విక్రయించడం కష్టం అవడం 2. పైరేట్లకు వీటి విలువ తెలియక పోవడం. ఈ విషయానికి సంబంధించిన ఒక సంఘటన చరిత్రలో కూడా నమోదు అయ్యింది. ఒక పైరేటుకు బాగా విలువైన పెద్ద వజ్రం పారితోషికంగా లభించింది. మిగతా పైరేట్లకు ఎక్కువ సంఖ్యలో చిన్న సైజు వజ్రాలు లభించాయి. తనకు మోసం జరిగిందనే అభిప్రాయంతో ఆ పైరేట్ తనకు లభించిన వజ్రాన్ని సాటి పైరేట్లకు లభించిన వజ్రాల సంఖ్య మేరకు చిన్న ముక్కలుగా పగలకొట్టాడు.

అమెరికాలలోని వలస రాజ్యాలలో స్పెయిన్‌లో ముద్రించబడిన వెండి నాణాలు కరెన్సీగా చెల్లుబాటు అయ్యేవి. వీటిని "పీసెస్ అఫ్ ఎయిట్" అనేవారు. అయితే లెక్క వ్రాయడానికి మాత్రం పౌండ్-స్టెర్లింగ్ వాడేవారు. జెర్మనీ, ఫ్రాన్స్, పోర్చుగల్ దేశాల కరెన్సీలు కూడా చెల్లుబాటు అయ్యేవి. బ్రిటన్ తమ కరెన్సీని దేశం బయటకు ఎగుమతి చేయడంపై నిషేధం విధించింది.

అందువల్ల మిగతా దేశాల కరెన్సీలు వాడుకలో వుండేవి. 18 వ శతాబ్దంలో పీసెస్ అఫ్ ఎయిట్ ప్రామాణిక విలువ నిర్ధారించే వరకు వేరు వేరు వలస రాజ్యాలలో వేరు వేరు విలువలు వుండేవి.

నౌక సిబ్బందిలో అతి తక్కువ స్థాయి పైరేట్లకు దోపిడీ సొమ్ములో ఒక వంతు పారితోషికంగా లభించేది. స్వాధీనం చేసుకున్న ప్రతి ఒక్క నౌక నుండి సగటున ప్రతి పైరేట్‌కు ఒక సంవత్సరం వేతనమంత సొమ్ము పారితోషికంగా లభించేది. థామస్ ట్యూ అనే పైరేట్ 1692లో ఒక భారతదేశపు వాణిజ్య నౌకను దోచుకున్నాడు. అతి తక్కువ స్థాయి పైరేట్‌కు కూడా 3000 పారితోషికం లభించింది. ఇప్పటి లెక్క ప్రకారం ఈ మొత్తం $4.0 మిలియన్ల వరకు వుంటుంది. థామస్ ట్యూ తన వంతు పారితోషికంగా ఈ మొత్తానికి రెండున్నర రెట్లు తీసుకున్నాడు. పైరేట్లకు ఇంతకన్నా ఎక్కువ సొమ్ము పారితోషికంగా దక్కిన దాఖలాలు కూడా వున్నాయి. 1695లో హెన్రీ ఏవెరి అనే పైరేట్ గంజ్–ఏ–సవాయ్ అనే మొగల్ నౌకను పట్టుకొన్నాడు. ఇది దాడి అత్యధికంగా లాభించిన పైరేట్ దాడి అని చరిత్రకారులు అంటారు.

పైరేట్ల వేతనాలతో పోలిస్తే నౌకదళంలో, సరుకుల రవాణా చేసే నౌకలలో పనిచేసే నావికుల వేతనాలు చాలా తక్కువగా ఉండేవి. అందువలనే నావికులు చాలా మంది తమ వుద్యోగాలను వదలుకొని పైరేట్లుగా మారడానికి సుముఖత చూపేవారు. అడ్మిరల్ నెల్సన్ కథనం ప్రకారం 1793 నుండి 10 సంవత్సరాల కాలంలో 42,000 మంది కన్నా ఎక్కువ సంఖ్యలో నావికులు రాయల్ నౌకాదళం వదిలి పారిపోయారు. ఈ కారణం వల్ల నౌకాదళ అధికారులు నౌక రేవు చేరినప్పుడు సిబ్బందిని నావ వదిలి బయటకు వెళ్లకుండా కట్టడి చేసేవారు. లంచగొండి అధికారులు తమ స్వలాభం కోసం క్రింది స్థాయి సిబ్బందిని మోసం చేసి తక్కువ జీతాలు ఇచ్చేవారు. ఇది ఒక విధమైన వెట్టిచాకిరి అని చెప్పవచ్చు. ఈ పరిస్థితులు నౌకాదళ సిబ్బందిలో నిరాశ, నిరుత్సాహాలకు దారితీసింది. పైగా నౌకాదళం నిర్బంధించిన నౌకల నుండి వచ్చిన సొమ్ము బ్రిటన్ రాజు/రాణి ఖజానాకు వెళ్ళేది. ఈ పరిస్థితులను సరిచేసేందుకు బ్రిటన్ క్రూజర్స్&కాన్వయస్ చట్టం 1708ను అమలులోకి తెచ్చింది. 1762లో బ్రిటన్ నౌకలు స్పెయిన్‌కు చెందిన ఫిరంగుల యుద్ధనౌక (Frigate)ను స్వాధీనం చేసుకున్నాయి. ఈ సంఘటనలో పాల్గొన్న కప్తానులు హెర్‌బర్ట్ సాయర్ (Capt. Herbert Sayer; HMS Active), ఫిలోమన్ పౌనల్ (Capt. Philemon Pownoll; HMS Favourite)లకు ఒక్కొక్కరికి 65,000 (ప్రస్తుతపు విలువ $300 మిలియన్) తమవంతు పారితోషికంగా లభించింది. క్రింది స్థాయి నావికులకు కూడా 485 (ప్రస్తుతపు విలువ $2.2 మిలియన్) పారితోషికంగా లభించింది. ఇది చరిత్రలో అత్యధికమైన పారితోషికం.

పైరేట్లు తాము దోచుకున్న సొమ్మును పాతిపెట్టడం సామాన్యంగా జరిగేది కాదు. ఎక్కువగా దోచుకునే వస్తువులు ఆహారం, నీరు, మద్యం, ఆయుధాలు, బట్టలు, సబ్బు వంటివి. ఇవికాక నావకు కావలసిన తాళ్లు, లంగరులు వంటివి కూడా వుండేవి. స్వాధీనం చేసుకున్న నౌకను సాధారణంగా అమ్మేవారు. ఒకవేళ తమ నౌక కన్నా మెరుగైన స్థితిలో వుంటే తమ వాడకానికి వుంచుకునే వారు. ప్రత్యర్థి నౌక లొంగిపోతే పైరేట్లు ఆ నౌక సిబ్బందిని చంపేవారు కాదు. ప్రతిఘటిస్తే మాత్రం హోరాహోరీగా యుద్ధం జరిగేది. ఇరువైపులా ఎక్కువ ప్రాణనష్టం కూడా వాటిల్లేది.

17, 18 శతాబ్దాలలో పట్టుబడిన పైరేట్లను వెంటనే వురి తీసేవారు. ఇంగ్లండ్‌లో థేమ్స్ నది ఒడ్డున పైరేట్లను బహిరంగంగా వురి తీయడానికి "ఎక్జిక్యూషన్ డాక్" అని ఒక నిర్దిష్టమైన స్థలం వుండేది. జనం ఇటువంటి సంఘటనలను వినోదంగా భావించి చాలా పెద్ద సంఖ్యలలో చూడడానికి హాజరు అయ్యేవారు. పేరు మోసిన పైరేట్లకు శిక్ష ఇంకా క్రూరంగా వుండేది. శరీరం సరిగ్గా సరిపోయే బోనులో వీరిని బంధించి, ఆ బోనును జిబ్బెట్ నుండి వేలాడదీసి చావడానికి వదిలేసేవారు. ఈ ప్రక్రియ పూర్తవడానికి 2 సంవత్సరాల సమయం పట్టేది. ఇది జనంలో పైరసీ పట్ల భయం కల్పించడానికి చేసేవారు. విలియం కిడ్, విలియం ఫ్లై, జాన్ రాక్‌హామ్, చార్ల్స్ వేన్ మొదలగువారు ఈ విధంగానే శిక్షింపబడ్డారు.

పైరసీని ప్రధానంగా మగవారే వృత్తిగా చేపట్టేవారు. కానీ చిన్న సంఖ్యలో అడవారు కూడా పైరసీని వృత్తిగా చేపట్టారు. పైరేట్లు ఆడవారికి తమ నౌకల మీదకు

రావడానికి అనుమతి ఇచ్చేవారు కాదు. ఎక్కువ మంది వారి ఉనికిని అపశకునంగా భావించేవారు. అదికాక ఆడవారు సిబ్బంది మధ్య కలహాలకు కారణం కావచ్చు అని భావించేవారు. చాలా పైరేట్ నౌకలు ఆడవారిని, చిన్నవయసు మగ పిల్లలను పనికి



ఆన్ బోనీ – 1724 చిత్రం

నిషేధించేవి. ఈ మేరకు ప్రతిఒక్కరు పనిలో చేరేముందు ఒప్పందం మీద సంతకం చేసి తీరాలి. అయినప్పటికీ పేరు మోసిన ఆడ పైరేట్లు కూడా వున్నారు. పైరసీ స్వర్ణ యుగంలో బాగా పేరు గడించి చరిత్రకెక్కిన ఆడ పైరేట్లు నలుగురే. 1720లో ఆన్ బానీ, మేరీ రీడ్‌లు జాన్ రాక్‌హామ్ నాయకత్వంలో అతని నౌక మీద పని చేశారు. 1727లో మార్థా ఫార్లీ, 1729లో మేరీ క్రిషేట్‌లు మిగతా ఇద్దరు. మేరీ క్రిషేట్ జైలు నుండి పారిపోయిన నేరస్థురాలు. 1801–1809 మధ్య చైనాకు చెందిన ఝ్రేంగ్ యి భార్య ఝ్రేంగ్ యి సావ్ దక్షిణ చైనా సముద్రంలో పైరసీ దాడులలో పాల్గొనేది. ఆడ పైరేట్లలో అత్యంత సఫలత పొందిన పైరేటుగా చరిత్రలో చోటు చేసుకోంది.

పైరేట్ నౌకల మీద నిర్దిష్టమైన నియమావళి, ప్రజాస్వామ్యపు కట్టుబాట్లు వుండేవి. నియమాల ఉల్లంఘనకు శిక్షలు కూడా కఠినంగా వుండేవి. పైరేట్ నౌకల మీద ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ వున్నట్లుగా చరిత్రలో 17వ శతాబ్దంలో మొదటిసారిగా నమోదు అయింది.

పైరసీ దోపిడీలే జరిగేవి. పైరేట్లు అనుభవంతో శిక్షిత ముఠాలుగా మారారు.

1975–90ల మధ్య కాలంలో థాయ్‌లాండ్ అఖాతంలో వియత్నామ్ కాందిశీకుల నౌకల మీద దాడులు జరిగేవి. తరచు ఈ దాడులు హింసాత్మక పరిణామాలకు దారితీసేవి. ఫిలిప్పీన్స్ తీరంలో కూడా దోపిడీలు జరిగేవి. ఇప్పటికీ చెదురు మదురుగా ఇలాంటి సంఘటనలు జారుగుతూనే వున్నాయి. బాంగ్లాదేశ్, భారత్ తీరాలలో కూడా సరుకులు రవాణా చేసే నౌకల మీద దాడులు జరిగేవి. భారత్ తీరంలో రేవు బయట లంగరు వేసి వున్న నౌకల నుండి దొంగతనాలు చేయడానికి పైరేట్లు ప్రయత్నాలు చేస్తారు. చిన్న సైజు కత్తులు, కొడవళ్ళు, చాకులు వీరి ఆయుధాలు. సాధారణంగా వీరు నౌకా సిబ్బంది కంట పడకుండా తమ పని చేసుకుపోవడానికి ప్రయత్నిస్తారు.

**సోమాలియా పైరసీ :** 1991లో సోమాలియాలో ప్రభుత్వం పతనమయ్యింది. పరిపాలనా యంత్రాంగం స్తంభించి పోయింది. అంతర్యుద్ధం మొదలయ్యింది. ఈ పరిణామం చాలా అవాంఛనీయ పరిస్థితులకు దారి తీసింది. నిరుద్యోగం, ఆహారానికి కొరత ఏర్పడ్డాయి. శాంతిభద్రతలకు భంగం కలిగింది. వీధులలో అరాచకం విస్తరించింది. పాలనా నిర్వాహక వ్యవస్థ లేకపోవడంవల్ల అక్రమ వ్యాపారాలు, దొంగతనాలు మొదలయ్యాయి. సోమాలియాలో ప్రజలకు చేపలు ముఖ్యమైన ఆహారం. సోమాలియా తీరప్రాంతంలో ఎంటువంటి పర్యవేక్షణ లేకపోవడంవల్ల ఇతర దేశాల జాలరులు అక్రమంగా చేపలు పట్టడం, తీర ప్రాంతంలోని జలాలను కలుషితం చేయడం వంటి పనులు చేసేవారు. ఈ పరిస్థితులు పైరసీ ఆరంభానికి దారితీశాయి. మత్స్యకారులు తమ మత్స్యసంపదను కాపాడుకోవడం కోసం మొదలైన ప్రయత్నాలు పైరసీగా మారాయి.

1992 లో చాలా ప్రపంచ దేశాలు సోమాలియాను విఫలమైన రాష్ట్రంగా ప్రకటించాయి. 1994 వరకు అనిశ్చిత పరిస్థితి కొనసాగింది. ఎటువంటి పరిపాలనా యంత్రాంగం లేని వాతావరణం వల్ల అరాచక శక్తులు బలపడ్డాయి. 1994 లో ప్రపంచ దేశాల సహకారంతో ప్రభుత్వం ఏర్పడింది. కానీ ఇది చాలా బలహీనమైన ప్రభుత్వం అవడం వల్ల సంఘ విద్రోహ శక్తుల పైనా, సోమాలియా తీరంలో విదేశీ నావలు చేస్తున్న అక్రమ చేపల వేట పైనా ఎటువంటి చర్యలు తీసుకొనలేక పోయింది. ఆ కారణంగా సోమాలి మత్స్యకారులు ముఠాలుగా ఏర్పడి విదేశీ నౌకలపై దాడులు మొదలు పెట్టారు. ఇది క్రమంగా పైరసీలోకి దిగింది. ఐక్యరాజ్య సమితి ద్వారా సరఫరా అవుతున్న ఆహార ధాన్యాలను




సోమాలీ పైరేట్లు

చేరవేస్తున్న నౌకలపైన కూడా దాడులు జరిగేవి. ఈ పరిణామాలు ప్రపంచ వాణిజ్యానికి తలనొప్పిగా మారిన పైరసీకి తొలి బీజాలు అయ్యాయి. మొదట చేపల వేటాడే నౌకలను అపహరించేవారు. వాటిని విడుదల చేయడానికి పెద్ద మొత్తంలో పరిహారం అడిగేవారు. ఈ వ్యవహారం లాభసాటిగా ఉండడంతో ఈ ముఠాలు వాణిజ్య నౌకలపైన కూడా దాడులు చేసి దారి మళ్లించడం మొదలు పెట్టాయి.

2007 నుండి 2012 వరకు సోమాలి పైరసీ ఎక్కువగా ఉండేది. మొదట్లో పైరేట్ దాడులు ఎక్కువగా ఏడెన్ అఖాతంలో జరిగేవి. అరేబియా సముద్రం, ఎఱ్ఱ సముద్రాలను కలిపే బాబ్-ఎల్-మండబ్ జలసంధి ఇరుపక్కలా పైరేట్లు పొంచి ఉండేవారు. నౌకలు పైరేట్ల బారిన పడకుండా ఉండటానికి వివిధ దేశాల నౌకాదళాలు హార్న్ అఫ్ ఆఫ్రికా (Horn of Africa) ప్రాంతంలో గస్తీలు మొదలుపెట్టారు. అదనంగా నౌకలపైన కూడా సిబ్బంది చాలా భద్రతా చర్యలు చేపట్టారు. ఈ చర్యలు పైరసీ ప్రాంతాల ద్వారా ప్రయాణించే అన్ని నౌకలు తప్పనిసరిగా పాటించి తీరాలి. అందువల్ల పైరేట్లకు ఏడెన్ అఖాతంలో దాడులు కష్టతరమయ్యాయి. పైరేట్లు దాడులను నౌకాదళాల గస్తీ వెలుపల వున్న ప్రాంతాలలో మొదలు పెట్టారు. సోమాలి తీరం నుండి 200 మైళ్ళ దూరంలో దాడులు మొదలు పెట్టారు. ఇలాంటి సముద్ర మధ్య దాడులకు వారు దారిమళ్ళించిన పెద్ద నౌకలను వాడుకునే వారు. వీటి నుండి చిన్న సైజు వేగవంతమైన నావలను తీసుకుని దాడులు చేసేవారు. అత్యంత ఆధునికమైన ప్రచార సాధనాలు వున్నప్పటికీ విశాలమైన సముద్ర జలాలు పైరేట్లకు సహకరించేవి. 2012 నుండి సోమాలి పైరసీ తగ్గుముఖం పట్టింది. 2008 అంచనా ప్రకారం సోమాలి పైరేట్లు సగటున సంవత్సరానికి $120 మిలియన్లకు పైగా సంపాదించేవారు.

2012 తరువాత సోమాలి పైరసీ బాగా తగ్గింది. 2023 చివరలో మొదలైన గాజా యుద్ధంతో సోమాలియా పైరేట్లు తిరిగి దాడులు చేసే ప్రయత్నాలు మొదలు పెట్టారు. 6 ఏళ్ల వ్యవధి తరువాత మొదటిసారిగా 2023 డిసెంబర్‌లో ఎమ్.వి. రూయెన్ అనే ఒక నౌకను దారిమళ్లించారు. 2024 మార్చ్‌లో భారత నౌకాదళం సోమాలియా తీరం నుండి 500 మైళ్ల దూరాన ఇదే నౌకను పైరేట్ల చెర నుండి రక్షించి, ఆ నౌక సిబ్బంది 17 మందిని విడుదల చేసింది.. ఆ నౌక మీద దాడి చేసిన 35 మంది సోమాలి పైరేట్లను బంధించి విచారణకై ముంబయ్ తీసుకు వచ్చింది. ఈ కేసు ముంబయి న్యాయస్థానాలలో ఇంకా నడుస్తూ వుంది. నేను ఈ వ్యాసం వ్రాయడం మొదలుపెట్టిన తరువాత కూడా ఒక నౌక మీద దాడి జరిగింది. నవంబర్ 06, 2025న గుజరాత్‌లోని సిక్కా రేవు నుండి దక్షిణ ఆఫ్రికాలోని దర్బన్ రేవుకు వెడుతున్న ఎమ్.వి. హెల్లాస్ ఆఫ్రొడైట్ అనే నౌక మీద హిందూ మహాసముద్రంలో, సోమాలియా నుండి 560 మైళ్ళ దూరాన దాడి జరిగింది. నౌక సిబ్బంది వెంటనే దాడి గురించి మారిటైం భద్రతా కేంద్రానికి వార్త పంపి, ఇలాంటి సందర్భాల కోసం నౌకలో ప్రత్యేకించి నియమించబడిన ఒక "సురక్షిత విభాగం (సిటడెల్)"లో దాక్కున్నారు. ఆ ప్రాంతానికి దగ్గరలో గస్తీ కాస్తున్న నౌకాదళాలు ఆ స్థలానికి




సోమాలియా పైరసీ ప్రాంతం

చేరాయి. ఈ లోపల పైరేట్లు నౌకను స్వాధీనం చేసుకోడానికి విఫల ప్రయత్నం చేసి, భద్రతా దళాలు రావడంతో నౌకను వదిలి పారిపోయారు. విశాల సముద్రం మీద దగ్గరలో అంటే 200 నుండి 300 మైళ్ళ అంతరం కూడా ఉండవచ్చు. సాధారణంగా 100 మైళ్ళ కన్నా తక్కువ దూరంలో నేవీ నౌకలు వుంటే పైరేట్లు నౌకలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించరు. నౌక మీద దాడి చేసిన 2 లేక 3 గంటలలోగా నౌక మీద పూర్తి నియంత్రణ సాధించాలి. లేకపోతె ఆ దాడి విఫల ప్రయత్నమే అవుతుంది.

2009లో ఎమ్.వి. మెర్స్క్ అలబామా అనబడే కంటైనర్ నౌక మీద సోమాలి పైరేట్లు దాడి చేశారు. నౌక కప్తాను మినహా అందరూ సిటడెల్‌లో దాక్కున్నారు. కప్తాను పైరేట్లకు పట్టుబడ్డాడు. కానీ పైరేట్లు నౌకను స్వాధీనం చేసుకోలేకపోయారు. కప్తానును బందీగా పట్టుకుపోయారు. అమెరికా నౌకాదళ సైనికులు పైరేట్ల బారినుండి కప్తానును రక్షించారు. ఈ సంఘటన ఆధారంగా 2013లో కెప్టెన్ ఫిలిప్ అనే చిత్రం కూడా విడుదల అయ్యింది.

ప్రస్తుత కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పైరేట్ల దాడులు ఇంచుమించు ఒకేవిధంగా జరుగుతాయి. దాడి సాధారణంగా రాత్రి 2 గంటలు, పొద్దున్న 4 గంటల మధ్య జరుగుతుంది. ఈ దాడిలో కనీసం ముగ్గురు సిబ్బందితో 2 లేక అంతకన్నా ఎక్కువ పడవలు వేరు వేరు దిశల నుండి దాడి చేస్తాయి. ఈ ఎత్తుగడ నౌక సిబ్బంది దృష్టి మళ్లించడానికి బాగా ఉపకరిస్తుంది. ఈ పడవలు శక్తివంతమైన ఇంజనుతో గంటకు 45 కి.మీ. (25 నాట్స్) వేగం కలిగి వుంటాయి. చాలామటుకు నౌకలు ఈ పడవల వేగంలో సగం వేగం కలిగి వుంటాయి. అందువల్ల పైరేట్ల పడవల నుండి తప్పించుకు పారిపోవడం కష్టం. అంతేకాక సైజులో పెద్దవి అవ్వడంవల్ల నౌకలకు సహజంగా జడత్వం ఎక్కువ వుంటుంది కాబట్టి వాటి దిశ, దశ మార్చడం సులువు కూడా కాదు. పైరేట్లు ఎ.కె.47, RPG (రాకెట్ ప్రోపేల్డ్ గ్రెనేడ్స్) వంటి ఆయుధాలతో దాడి చేస్తారు. నౌక సిబ్బందికి అందుబాటులో వుండే ఆయుధం ఎక్కువ పీడనం వున్న నీళ్ళధార (High Pressure Water Jet). దృఢ సంకల్పంతో దాడికి సిద్ధపడ్డ పైరేట్లను తిప్పికొట్టడంలో



నిర్బంధించిన నౌక సిబ్బందితో సోమాలీ పైరేట్లు

ఇటువంటి ఆయుధాలు ఎంత ప్రయోజనకరమో ఎవరైనా వూహించగలరు. సోనాలియా పైరసీ ఉచ్ఛస్థాయికి చేరే నాటికి పైరసీకి సంబదించిన అన్ని అంశాలు బాగా క్రమబద్ధీకరించ బడ్డాయి. ముందు జరుపబోయే దాడులకు కావలిసిన నిధులు అవలీలగా సమకూరేవి. సోమాలియాలోని హరథేరే అనే పట్టణంలో పైరసీకి కావలిసిన నిధులను సమీకరించేందుకు ఒక స్టాక్ ఎక్స్ఛేంజ్ వుండేది. ముందు ముందు జరపబోయే పైరసీ దాడులను ఒక వ్యాపార సంస్థ వాటాలలాగ అమ్మి నిధులను ప్రోగు చేసుకునేవారు. సోమాలియాలోని ధనవంతులు, ఇతర దేశాలకు వలస వెళ్లిన సోమాలియా నాగరికులు ఈ వాటాలు కొనేవారు అంటారు. ఐరోపా, అమెరికాలలో కూడా కొన్ని సంస్థలు ఇది లాభసాటి వ్యాపారంగా భావించి ఈ వాటాలు కొనేవారు అన్న వదంతులు వుండేవి. బందీల విడుదలకు షిప్పింగ్ సంస్థలు రొక్కాన్ని అమెరికా డాలర్లలో చెల్లించేవి. రొక్కాన్ని గోనెసంచులలో నింపి హెలికాప్టర్ల ద్వారా నిర్బంధిచబడిన నౌక మీద జార విడిచేవారు. డబ్బు తీసుకుని పారిపోయే సమయంలో పైరేట్లు వారి ఆయుధాలను సముద్రంలో పారవేసేవారు. ఒకవేళ పట్టుబడినా వారిని చట్టబద్ధంగా శిక్షించడానికి కావలసిన సాక్ష్యాధారాలు లేకుండా వుండడానికి ఈ పని చేసేవారు.

*(ఇంకా ఉంది)*

**చెన్నూరి శివరామకృష్ణ ప్రసాద్**
రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, మర్చెంట్ నావీ,
రచయిత, పరిశోధకులు, ఫోన్ : 991 225 5220



# చలన చిత్ర-శిల్పకళ

– టి.వి. ప్రసాద్

కళా రూపం ఏదైనా కదిలే దాన్నీ, కదుల్తున్న భ్రమను కలిగించేదాన్నీ చలన చిత్ర, శిల్పకళ అంటారు. కదిలే కళారూపాలన్నీ కైనెటిక్ కళకు చెందుతాయి. కైనెటిక్ అనే గ్రీకు పదానికి కదలిక అని అర్థం. దీన్ని కినెటిక్, కైనెటిక్ అని రెండు విధాలుగా పలకవచ్చు. ఈ వ్యాసంలో 'కైనెటిక్ అనే ఉచ్చారణ వాడబడింది.

విస్తృతార్థంలో చలన చిత్రాలు, ఏనిమేటెడ్ కార్టూన్ ఫిల్ములు కూడా ఈ కళ కిందికే వస్తాయి. ఐనా కదిలే శిల్పాలను, కదులుతున్న భ్రమను కలిగించే చిత్ర, శిల్పాలను కైనెటిక్ శిల్పకళ అంటారు. ఈ కళకే చలనకళ, చలన శిల్పకళ, గతి కళ అని పేర్లు . ఇది ప్రాథమికంగా రెండురకాలు. మొదటి రకం కళాకృతులు కదలడానికి సహజమైన గాలి, నీరు, వెలుతురు (కాంతి), మోటార్ లాంటి యంత్రపరికరాలు, అయస్కాంత శక్తి అవసరమవుతాయి. రెండో రకం చలన కళలో వస్తువులు ఏవీ కదలవు. కానీ వీక్షకులకు అవి కదులుతున్న భ్రమను కలిగిస్తాయి. వీటికి నిర్మాణ కౌశలం, రంగుల కలయిక, కాంతి పరావర్తనం అవసరం. నిత్యజీవితంలో తారసపడే పిల్లల ఆట వస్తువులు, కాగితపు పడవలు, విమానాలు, గాలిపటాలు, గాలి చక్రాలు, వీబుల్-వూబుల్ ఆట బొమ్మలు, కూకూ గడియారాలు, జలయంత్రాలు, తోలు బొమ్మలు మొదలైనవి అనేకం, కదిలే కళాకృతులు.

**చలన కళాలక్షణాలు :** 1. కదలిక ఈ కళ ప్రథమ లక్షణం. 2. గాలి, నీరు, కాంతి సహజ శక్తులు, బాటరీ, గేర్లు, అయస్కాంత శక్తి లాంటి యాంత్రిక శక్తులు వస్తువుల కదలికకు కావలసిన శక్తులు, 3. ఏ వస్తువూ తనంత తాను కదలలేదు. వస్తువు మొత్తం గానీ, దానిలోని భాగాలు గానీ కదలడానికి ఏదో ఒకశక్తి అవసరం. కదలిక, నిర్మాణం, శక్తి – ఈ మూడూ చలన కళ ముఖ్య సూత్రాలు.

**కైనెటిక్ కళా చరిత్ర** : ఎడ్వర్డ్ మానే, క్లాడ్ మోనే, డెగాస్ లాంటి కళాకారుల ముద్రావాదం, 20వ శతాబ్దపు అమూర్త చిత్ర కళ, పారిశ్రామిక వస్తు ఉత్పత్తులు, వస్తువుల సౌందర్యం, ఉపయోగపడే తేలికపాటి డిజైన్లు కలయికతో అలంకరణ కళకు ప్రాధాన్యత పెరిగిపోయింది. అతితక్కువ ఖర్చుతో తయారైన ప్లాస్టిక్ వస్తువుల వాడకం యాంత్రిక యుగ లక్షణం. తొలినాళ్ళలోని స్థిర కళారూపాల స్థానంలో చలన కళారూపాలు చోటుచేసుకోవడం పారిశ్రామిక విప్లవంతో మొదలైంది. నూతనత్వం ఇతర కళారంగాలను – వాస్తుకళ, డిజైన్, సినిమా సాహిత్యం, కళారంగాలను ప్రభావితం చేసింది. పారిశ్రామిక ఉత్పత్తుల వినియోగంలో సాంప్రదాయ విరుద్ధంగా సమాజానికి ఉపయోగపడే వస్తు ఉత్పత్తికి దారితీసింది. ఆ క్రమంలో పుట్టుకొచ్చిన కళే కైనెటిక్ ఆర్ట్.

**కైనెటిక్ ఆర్ట్ వర్గీకరణ** : వస్తువుల, కళాకృతుల కదలికకు మూలమైన ఆధారాన్ని బట్టి ఈ కళను వివిధ రకాలుగా విభజించవచ్చు. సహజమైన గాలి, నీరు ఆధారంగా కదిలే కళాకృతులు. ఈ కళకు మార్గదర్శి అలెగ్జాండర్ కాల్డర్. ఆంథోనీ హొవ్‌లు.

**యాంత్రిక శక్తి వల్ల కదిలే కళాకృతులు :** వీటిలో మోటార్లు, గేర్లు, స్ప్రింగుల వంటి యంత్ర పరికరాలు కళాకృతిలో అంతర్భాగాలు–ఈరకమైన కళకు జీన్ టింగ్విలీ ప్రసిద్ధుడు.

**భూమ్యాకర్షణ శక్తి వల్ల కదిలే కళా శిల్పాలు :** వీటి కదలికకు ఆకర్షణ శక్తి ఆధారం. రెండు వైపులా బరువులు ఉండి ఊగిసలాడే, పెండ్యులంవల్ల కదలిక సాధ్యమౌతుంది.

**వీక్షకుని చర్యలవల్ల కదిలే శిల్పాలు :** వీటి కదలికలకు ప్రేక్షకుని నెట్టడం, లాగడం, తిప్పడం లాంటి చర్యలు అవసరం. బొంగరాన్ని రంగుల రాట్నాన్ని తిప్పడంలో ప్రేక్షకుని పాత్ర అనివార్యం.

**కాంతి/ వెలుతురు వల్ల కదిలే శిల్పాలు :** ఇవి కాంతి పరావర్తనం మీద, కాంతిని ప్రసరింపజేయడం మీద, కాంతి రంగులను మార్చడం మీద, ఆధారపడి కదిలిన భావాన్ని కలిగిస్తాయి. అద్దాలు, కాంతితో ఈ రకమైన కళ సృజించబడుతుంది.

**నేత్ర భ్రమ వల్ల కదుల్తున్నట్లు కన్పించే శిల్పాలు, చిత్రాలు:** ఇవి OP Art/ optical Art వర్గీకరణ కిందికి వస్తాయి. జామెట్రీ ఆకారాలు రంగులు, డిజైన్ల వల్ల కళారూపాలు కదలక పోయినా కదుల్తున్నట్లు అన్పిస్తాయి. గుండ్రని చక్రాలు, సర్పిలాకారంలో ఉండే స్ప్రింగులు మొదలైనవి. నామ్‌గాబో, అతని సోదరుడు ఆంటోనీ పెవ్జనర్ 1920లో 'కైనెటిక్ ఆర్ట్' మాటను సృష్టించారు. 1930లో అలెగ్జాండర్ కాల్డర్ గాలికి కదిలే సున్నితమైన చలచిత్రాలు (mobiles), స్థిరంగా వుండే కొన్ని భాగాలు మాత్రమే కదిలే పాక్షిక చలచిత్రాల (stabiles)తో చిత్ర శిల్పకళకు కదలికను, కదులుతున్న భ్రమను కలిగించడంలో కృతకృత్యుడయ్యాడు. 1955లో పారిస్‌లో జరిగిన ప్రదర్శన కైనెటిక్ శిల్పకళలో కీలక మలుపు. ఈ ప్రదర్శన ద్వారానే కైనెటిక్ కళకు అంతర్జాతీయంగా గుర్తింపు దక్కింది. స్విస్ కళాకారుడు జీన్ టింగ్విలీ 1960లో ఆధునిక జీవన శైలులు ప్రతిబింబించే భారీ కైనెటిక్ శిల్పాలను పారిశ్రామిక వస్తు సముదాయంతో నిర్మించి కలకలం సృష్టించాడు. 1970 నాటికి ఆప్టికల్ ఆర్ట్ (హ్రస్వరూపం పాప్ ఆర్ట్) ప్రాముఖ్యతను సంతరించు కోవడంతో కైనెటిక్ ఆర్ట్ ప్రాభవం క్షీణించడం మొదలైంది.

తైవాన్ కళా పండితత్రయం ఛెన్, లిన్, ఫేన్‌లు కైనెటిక్ ఆర్ట్‌పై సమర్పించిన పరిశోధనాపత్రం 'దహిస్టరీ అండ్ ఇవల్యూషన్ ఆఫ్ కైనెటిక్ ఆర్ట్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్' అంతర్జాతీయ జర్నల్, నవంబర్ 2015 సంచికలో ప్రచురించిన తర్వాత కైనెటిక్ ఆర్ట్‌పై కళాకారుల దృష్టి పడి, ఈ కళకు పునరుజ్జీవనం లభించింది.


వీరు 20-30 వేల సంవత్సరాలకు పూర్వం ఫ్రాన్స్ గ్రోటో కొండగుహల్లో చెక్కిన గెంతుతున్న పశువుల్ని (Jumping cattle) కదలికకు, వేగానికి ప్రతీకలుగా గుర్తించారు. ప్రాచీన ఈజిప్ట్ ఓ సిరిస్ వేడుకల్లో తాడు లాగితే కదిలే ఆట బొమ్మలు, వాటిలోని విడిభాగాలు శరీరానికి ముడి వేసి ఉండటాన్ని గమనించారు. మన ప్రాచీన కళ తోలు బొమ్మలాటలో, బొమ్మ శరీరానికి కాళ్లు, చేతులు అతికించడం అవి కథానుగుణంగా కదలడం మనకు తెలుసు. కైనెటిక్ కళకు గుర్తింపు వచ్చినా, ఏ విద్యాలయంలోనూ, ఏదేశ పాఠ్యప్రణాళికలోనూ ఈ కళకు చోటు దక్కలేదు. 1919లో జర్మనీ ఆర్ట్ స్కూల్ బౌహౌస్ హస్తకళలను, లలిత కళలతో అనుసంధానం చేసిన మొదటి విద్యాసంస్థ. 'అంతవరకూ కాలక్షేపపు వినోద కళగా ఉన్న కైనెటిక్ ఆర్ట్‌ను ఎంతో ముందుచూపుతో ఈ కళను, దీనికి సంబంధించిన సైన్సును కళావిద్యలో ప్రవేశపెట్టి భావితరాలు ఈ రంగంలో పరిశోధనలు చేయడానికి పునాది వేసి మార్గం సుగమం చేసింది. 20వ శతాబ్దపు జీవన శైలి సులభతరం, సౌందర్యమయం అవడానికి ఆధునిక పారిశ్రామిక ఉత్పత్తులు తోడ్పడంతో అది ఒక కళా విభాగం- కైనెటిక్ అర్ట్‌గా' అభివృద్ధి చెందింది. అన్నది తైవాన్ త్రయ పరిశోధనాంశం.

గ్రీకు గణిత శాస్త్రవేత్త సిటిసిబియస్ 3వ శతాబ్దం బిసిఇలో నీటి గడియారాన్ని తయారు చేశాడు. నీటి వేగాన్ని బట్టి గడియారపు కదలికలు నిర్దేశించబడినాయి. జలశక్తి అనేక వస్తువుల ఆటోమేటిక్ (స్వీయ) చలనానికి, గంటలు మోగడానికి కారణమయింది. 14వ శతాబ్దంలో యాంత్రిక సంగీత పరికరాల ఉపయోగం విరివిగా ఉండేది. మీట నొక్కితే సంగీతం వినిపించే వెసులుబాటు వాటిలో ఉండేది. ఈ ఆనవాళ్లు ఇప్పటికీ యూరప్‌లోని కొన్ని మ్యూజియాలలో కన్పిస్తాయి. 20వ శతాబ్దపు చివరి దశకాల్లో పావలాబిళ్ళ వేసి LP రికార్డులపై కోరిన పాటలు వినడం మనలో చాలామందికి గుర్తుండి ఉండవచ్చు.

**బహిరంగ ప్రదేశాల్లో కైనెటిక్ ఆర్ట్** : నగర శోభను ఇనుమడింప జేయటానికి, అక్కడి సమాజాన్ని ఈ కళాకృతుల్లో పాల్గొనేలా చేయడానికి పార్కులు, నగర కూడళ్లు, భవనాల ముందు భాగాలు, మెట్రో స్టేషన్లు (భూగర్భ రైల్వే స్టేషన్లు) విమానాశ్రయాలు మొదలైన చోట్ల ఇవి ప్రతిష్టించబడతాయి. ప్రజానీకానికి, సందర్శకులకు, ప్రయాణీకులకు మానసిక ప్రశాంతతను, ఉల్లాసాన్ని కలిగించడం, గొప్ప అనుభవాన్ని ప్రసాదించడం ఈ కళ లక్షణం.



రెయిన్ డ్రాప్ కైనెటిక్ కళాశిల్పం



ఎ(వ్రీ బీటింగ్ సెకండ్' మై(క్రోకాస్మిక్ శిల్పం,



మెటా మార్ఫోసిస్ కైనెటిక్ శిల్పం

**ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కైనెటిక్ శిల్పాలు : సింగపూర్ ఛాంగీ అంతర్జాతీయ విమానాశ్రయం – రెయిన్ డ్రాప్స్ :** విడివిడి వర్షపు బిందువుల్లాంటివి వెయ్యికిపైగా అందమైన బ్రాంజి రూపాలు లయబద్ధంగా నాట్యం చేస్తున్నట్లు కదులుతుంటాయి. ఎగురుతున్న విమానాలకు, విమానాశ్రయ కదిలే పరిసరాలకు ప్రతీకలుగా పరిగణించబడతాయి. ఎయిర్‌పోర్ట్‌లో అలరించే అనేక కైనెటిక్ కళాశిల్పాల్లో రెయిన్ డ్రాప్స్‌ది అగ్రస్థానం. 2012లో దీన్ని స్థాపించే నాటికి అతిపెద్ద చలనకళగా గుర్తింపు పొందింది. 75చ.మీ మేర ఆక్రమించి నాట్యంచేసే వర్ష బిందువులు చూపరులకు గొప్ప అనుభవాన్నిస్తాయి. జర్మనీ డిజైన్ సంస్థ ఆర్ట్ + కామ్ దీని రూపకర్త .

శాన్‌ఫ్రాన్సిస్కో–టెర్మినల్ 2లోని 'ఎవ్రీ బీటింగ్ సెకండ్' మైక్రోకాస్మిక్ శిల్పం, ఈ సూక్ష్మ విశ్వరూప చిత్రం చలన కళలో మరో ప్రగతి. పైకప్పు నుండి వేలాడుతున్నట్లు కన్పించే చాలా పెద్ద వలలాంటి "మృదువైన శిల్పం" వీచే గాలికి, వినిపించే సంగీతానికి తగ్గట్టు కదులు తుంటుంది. దీని సృష్టి కర్త అమెరికన్ కళాకారిణి జానెట్ ఎకిలిమన్. అల్లిన ఫైబర్, ట్వైన్ ముళ్ళు, మెరిసే రంగుల కాంతి పడుతుండగా గాలిలో తేలికగా తేలిపోతున్నట్లు కన్పించే సముద్రం మీది మేఘాలు, పైకప్పు నుండి ప్రసరించే కాంతి కిరణాలలో, కింద నేలమీద పడే నీడల విన్యాసాలతో ప్రయాణీకులకు స్వప్నలోకంలో అడుగు పెట్టిన అనుభూతిని కలిగిస్తుంది. ఈ కళాఖండం 15,000చ.అడుగుల మేర వ్యాపించి వుంటుంది. ఇది ఆధునిక వాస్తు శిల్ప, సాంకేతికత, చలన కళల అద్భుత కలయిక.

**జర్మనీ ప్రాగ్ పట్టణ క్వాడ్రియో షాపింగ్ సెంటర్ –** కాఫ్కాచలన శిరస్సు 11 మీ ఎత్తున నగర కూడలిలో ఎత్తున గద్దెమీద గుండ్రంగా తిరుగుతూ అనుక్షణం రూపం మార్చుకునే శిల్పం ఇది. 2014లో స్థాపించబడిన దీని రూపకర్త డేవిడ్ సెర్నీ. 39 టన్నుల బరువున్న ఒకదానిపై ఒకటి అమర్చిన విడి విడి స్టీల్ పలకలు 42, మోటార్లు, కేబుళ్ళ సాయంతో నిరంతరం గుండ్రంగా తిరుగుతుంటాయి. అరగంటలో రెండుసార్లు, అదీ కొన్ని క్షణాలు మాత్రమే కాఫ్కా ముఖం కన్పించి మాయమైపోతుంది. ఈ సంక్లిష్ట యాంత్రిక కళా శిల్పం కాఫ్కా అంతరంగ మానసిక పరిస్థితికి అద్దం పడుతుంది. ఈ కైనెటిక్ శిల్పం పేరు మెటా మార్ఫోసిస్ (రూపాంతరం) ఆధునిక జీవన విధానంలో ఇమడలేని అతని పరాయీకరణకు శిల్పరూపం, ఇది 21వ శతాబ్దపు సాంకేతిక విచిత్రం. *(వివరాలకు 'బహిరంగ కళ' **మిసిమి**, నవంబర్, 21 సంచిక చూడగలరు)*

పైన చెప్పుకొన్నవే కాక మరెన్నో కైనెటిక్ శిల్పాలు ప్రపంచ దేశాల్లోని చాలా బహిరంగ ప్రదేశాల్లో నెలకొల్పబడినవి ఆయా దేశప్రజల్ని, సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటాయి. వాటిలో అలెగ్జాండర్ కాల్డర్ చలన శిల్పాలు న్యూయార్క్ విశ్వవిద్యాలయం, బిల్బావొనగర గూగెన్ హెయిమ్ మ్యూజియం, నెడ్ ఖాన్, టంబ్లింగ్ వీడ్స్ – శాన్‌ఫ్రాన్సిస్కో అంతర్జాతీయ విమానాశ్రయం, జార్జి రికీది ఫోర్‌స్క్వేర్స్–న్యూయార్క్ నేషనల్ గాలరీ, బెర్లిన్ మొదలైనవి కొన్ని.

**టమారా క్వెజిటాడ్జి సృష్టి** అలీ నైనా ప్రేమికుల కైనెటిక్ శిల్పం ప్రత్యేకంగా చెప్పుకోదగింది. 2010లో ఆవిష్కరించ

బడిన విడివిడి విగ్రహ రూపాలు పదినిమిషాల వ్యవధిలో ఒకే రూపంగా కలిసిపోయి కన్పిస్తాయి. 8 మీటర్ల ఎత్తులో కన్పించే ఈ శిల్పం జార్జియా, బటూని సముద్రతీరంలో ఊపిరి పోసుకుంది. కుబాన్ సయీద్ కలంపేరుతో రాసిన ప్రఖ్యాత నవల (1937) ఆలీ నైనో దీనికి ప్రేరణ. అజర్ బైజాన్ ముస్లిం యువకుడు అలీ, జార్జియా క్రైస్తవ యువతి నైనోల ప్రేమ కథ. ఇద్దరి విగ్రహ రూపాలు చూస్తుండగానే ఒకటిగా నైనో రూపంలోకి ఐక్యమై పోతాయి. రెండు విగ్రహాలూ విడి విడి పీఠాల మీద నిలబడి ఉంటాయి. పదినిమిషాల వ్యవధిలో రెండూ దగ్గరై ఒకదానిలో ఒకటి లీనమై పోవడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ శిల్పానికి సృష్టి కర్త టమారా పెట్టిన పేరు. అతడు – ఆమె, బటూని బీచ్‌లోని గొప్ప ఆకర్షణ.



అలీనైనా ప్రేమికుల కైనెటిక్ శిల్పం


**మెట్రో స్టేషన్లలో కైనెటిక్ ఆర్ట్** – భూగర్భకళ, కైనెటిక్ శిల్పకళ మెట్రోవ్యవస్థకు అదనపు ఆకర్షణ. 365 రోజుల్లో నగర జీవి 20 రోజులకుపైగా మెట్రో ప్రయాణంలో గడపాల్సి వస్తుంది. నిత్య ప్రయాణీకులకు, టూరిస్టులకు మంచి ప్రయాణ అనుభావాన్ని ఇవ్వడంలో ఈ ఆర్ట్‌ది ప్రముఖ పాత్ర. డిజైన్, నిర్మాణ పరంగా, ఆర్ట్, సాంకేతికతల పరంగా ఒకదానితో ఒకటి పోటీపడే మెట్రోస్టేషన్లు ప్రపంచ వ్యాప్తంగా కోకొల్లలు. వాటిలో కొన్ని–న్యూయార్క్ స్టేషన్‌లోని యాబ్ యమ్, సెంట్ హెరాల్డ్ స్క్వేర్, 34 వ వీధి. దీని సృష్టి కర్త డేవిడ్ పోవాన్. ఈ కదిలే అల్యూమినమ్ శిల్పం నడవ పొడవునా 14 స్తంభాలకు అమర్చిన అడుగు పొడవు ఎర్రరంగు పెడల్స్ గాలికి రెపరెపలాడుతూ, గుండ్రంగా తిరుగుతూ ప్రయాణీకులకు కనువిందు చేస్తాయి. 'భూగర్భ జీవితం', ఇది 8వ అవెన్యూ స్టేషన్‌లోని ప్రత్యేక ఆకర్షణ. ఈ బ్రాంజి చలన శిల్పం నగర జీవితాన్ని, పనిని, సంపదను, దోపిడిని ప్రతిబింబిస్తుంది. నిక్‌కేవ్ మెజాయిక్ సృష్టి 'ప్రతి ఒక్కరూ, అందరూ, అంతా సమానమే' అనే శీర్షికతో టైమ్స్ స్క్వేర్ 42 సబ్ వేస్టేషన్‌లో అలరించే చలనశిల్పం. సౌండ్ సూట్లు ధరించిన శిల్పాలు మొజాయిక్ పలకల మీద చిత్రించబడినవి, ప్రయాణీకులకు అపూర్వ అనుభవాన్ని యిస్తాయి. నగర జీవిత వైవిధ్యాన్ని కళాత్మకంగా చూపించే చలన శిల్పం ఇది.



యాబ్ యమ్, సెంట్ హెరాల్డ్ స్క్వేర్ శిల్పం

చాంగీ ఎయిర్ పోర్ట్ – సింగపూర్, సెంట్రల్ సబ్‌వే–శాన్‌ఫ్రాన్సిస్కో చలన శిల్పాలను గురించి ముందే చెప్పుకున్నాము. బరంగరూ, సిడ్నీ, ఆస్ట్రేలియా కాపర్ స్టీల్ కలిసిన ఏడు శిల్ప వృక్షాలు ఎస్కలేటర్ల పక్కన, ఆకులు రాలుస్తూ ఆశ్చర్యం కలుగిస్తాయి. దీని ఆర్టిస్ట్ ఖలీద్ సబ్‌సాబీ దీనికి పెట్టిన పేరు– In Time we shall. కాలక్రమంలో మనమూ అంతే అని చెట్లతో పోలుస్తాడు. మనదేశంలోని బెంగలూరు ఎమ్.జి రోడ్ మెట్రోస్టేషన్ రంగోలీ ఆర్ట్ సెంటరుకు ప్రసిద్ధి గాంచింది. స్వీడన్ – స్టాక్ హోం మెట్రోలోని శిల్పం ప్రపంచంలోనే పొడవైన చలన శిల్పకళా ప్రదర్శనగా ప్రఖ్యాతి గాంచింది. ఇలా చెప్పుకుంటూపోతే అంతే వుండదు. ప్రజారవాణా వ్యవస్థలో స్థాపించబడిన చలన శిల్పాలు కూడా గాలికి కదిలేవి, పరస్పర చర్య, డిజిటల్ నియంత్రణలో కదిలేవి, కదుల్తున్న భ్రమను కలిగించేవి మూడు రకాలవి కన్పిస్తాయి.

**చలన కళను ఎందుకు యిష్ట పడతాము?** నిశ్చలన చిత్రాల కన్నా చలించే చిత్రాలను మనం బాగా యిష్టపడతాం. కదలిక చైతన్యానికి, జీవితానికి ప్రతీక. అందమైన వర్ణమయ రూపం ఆకర్షణీయంగా ఉంటుంది. దానికి కదలిక ఉంటే ప్రత్యేకంగా కన్పిస్తుంది. కదిలే చిత్రకళ బహుళ ఇంద్రియానుభవాన్ని, తృప్తిని కలిగిస్తుంది. కళాకృతికి, వీక్షకునికి మధ్య అపూర్వ సంబంధం



ప్రపంచ అతిపెద్ద కైనెటిక్ శిల్పం దపెర్ల్

ఏర్పడుతుంది. విశ్రాంతి కలిగిస్తూ అనుభూతి, వినోదం, ఆశ్చర్యం కలిగిస్తుంది. అద్భుత భావాన్ని కలిగిస్తూ సవాళ్ళను విసురుతుంది. దాని నిర్మాణంలోని క్లిష్టత. కదలికలోని కొత్తదనంతో జీవం పోసుకొని జ్ఞానేంద్రియాలకు స్పష్టమైన, స్ఫుటమైన సుఖానుభవాన్ని కలిగిస్తుంది.

సాంకేతిక, భౌతిక, సౌందర్య శాస్త్రాల కలయిక వల్ల దృశ్యానుభవం ఆహ్లాదభరితంగా మారిపోతుంది. అలసిన మనసుకు సేద దొరుకుతుంది, ప్రశాంతత కలుగుతుంది. ఒత్తిడి, ఆందోళనలను పారదోలుతుంది. మార్పు కోరుకునే వారికి కొత్తదనం, వినుగు పుట్టించే యాంత్రిక జీవితం నుండి ఆటవిడుపు, ఓరిమికి పరీక్ష పెట్టే ట్రాఫిక్ నుండి విముక్తి కలిగిస్తుంది. అందుకే చలనకళ బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువగా చోటుచేసుకుంటుంది.

ప్రపంచ దేశాల్లోని ముఖ్యమైన నగరాలు పౌర రవాణాకు భూగర్భ రైల్వేపైనా విమానయానం పైనా ఆధార పడడంతో మెట్రో స్టేషన్లో, విమానాశ్రయాల్లో ఈ కళకు ప్రాధాన్యత హెచ్చింది. ప్రయాణాన్ని మంచి అనుభవంగా మార్చడంలో కైనెటిక్ కళది అద్వితీయ స్థానం.


**ప్రపంచ అతిపెద్ద కైనెటిక్ శిల్పం :** 'దపెర్ల్' గా పేరుగాంచిన అతి పెద్ద చలన శిల్పం ఇది. రాయల్ కరేబియన్ ప్రయాణీకుల నౌక 'ఐకాన్ ఆఫ్ సీస్' కొరకు బ్రేక్ ఫస్ట్ స్టూడియో నిర్మించిన అతిపెద్ద నిర్మాణం-45 అడుగుల పొడవు, 53 అడుగుల వ్యాసం కలిగిన ఈ కళా నిర్మాణంలో కంప్యూటర్ సాయంతో కదిలే మూడు వేల పలకలు, అవి కూడా కరేబియన్ సముద్ర తరంగాల గాలి, ఆటు పోటులకు తగ్గట్టుగా కదులుతుంటాయి. ఇది సముద్ర తరంగాలను అనుకరిస్తూ మనకు తరంగాలపై కదులుతున్న అనుభూతిని యిస్తాయి. ఈ కదిలే కళకు సముద్రమే నమూనా, ఉత్తేజం. వాస్తవంగా సముద్ర పరిసరాల డాటా అనుగుణంగా కదిలే గతిశీలశిల్పం. కళ, సాంకేతిక పరిజ్ఞానాల అపూర్వ మిశ్రమం. ఇది పరిమాణంలోనే కాదు పనితనం, సామర్థ్యంలోనూ గొప్ప ప్రదర్శన. మియామీ నుండి బహామాస్ ద్వీపం వరకు నౌకాయానం చేసేవారికి మంచి అనుభవాన్ని. జ్ఞాపకాన్ని మిగిలిస్తుంది. డేవిడ్ అలెన్ గ్రానైటు, పాలరాతి చలన శిల్పాలకు, బ్రూస్ షాప్రియో సైకత చలన శిల్పకళకు ప్రసిద్ధులు.

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 798 139 8250

---

**కుటుంబం - డా. ఎన్. భాస్కరరావు :** ఈ పుస్తకం ఓ కొత్తకోణంలో రాయబడింది. కుటుంబాలు ఎట్లా ఛిద్రమవుతున్నాయో, దానికి ఖాళీ అయిపోతున్న గ్రామాలు ఎలా కారణమో, ఇబ్బడి ముబ్బడిగా పట్టణాలు చేరుతున్న జనాభా అస్తవ్యస్త వ్యవహారాలు, స్థూలంగా సమాజంలో వచ్చిన మార్పులు, దానికి మూలకారణమైన టెక్నాలజీ, సినిమాలు, రాజకీయాలు, కొన్ని క్రీడలు, సామాన్య జన జీవనంలో కలిగిస్తున్న కలకలాలు, ఉండేందుకు సరైన చోటులేని కుటుంబాలు ఇవన్నీ కూడా సంబంధ బాంధవ్యాలను ఎలా ఛిద్రం చేస్తున్నాయో చర్చించిన వేదిక.

*పుటలు : 98, వెల : 100/-, ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, ఫోన్ : 9000413415*



# కాలంతో ప్రయాణించే కాళోజీ కథలు

– శీలా సుభద్రాదేవి

“**కా**ళోజీని ఒక ఏభై ఏళ్ళ తర్వాత ఇవ్వాళ కథకునిగా పరిచయం చేయకపోతే ఆయనకొచ్చే నష్టం ఏమీలేదు. ఆయన బహుముఖీన వైవిధ్య వ్యక్తిత్వం మనకింకొక కోణంగా తెరచుకొని మన వికాసానికి తోడ్పడడం తప్ప ఆయనకు వచ్చే కిరీటం ఏమీలేదు. జీవితమంతా రాజకీయాల్లోనే కాదు సాహిత్యంలోనూ ఆధిపత్య కిరీటాలను పడగొట్టడమే ఆయన పితూరీ లక్ష్యం” అంటారు కాళోజీ కథలు సంపుటి ముందుమాటలో వరవరరావు గారు. మొదటి కథని వెల్దుర్తి మాణిక్యరావు, అవధానిలతో కలిసి కాళోజీ రాసినట్లుగా తెలుస్తోంది. అది చిన్నదే కావటం గమనిస్తే బహుశా కథాంశాన్ని వారితో చర్చించుకొని రాసి వుండొచ్చు. కాళోజీ అనగానే వెంటనే గుర్తుకువచ్చేది కవిత్వమే. అందులోనూ కాళోజీ నా గొడవే. నిజానికి అది కాళోజీ గొడవ కాదు ప్రజల గొడవ. ఇంకా చెప్పాలంటే అక్షరాలా అగ్నివర్షం. కాళోజీ తన కవిత్వం ద్వారా సమాజంలో మానవ సంబంధాలు మెరుగుపడాలని నమ్మినవాడు. జనజీవితంలో తడి తెలిసినవాడూ, వాళ్ళ జీవితాన్ని భిన్న కోణాలలో దర్శించినవాడూ, తాను కూడా అనుభవించినవాడూ కనుకనే ఎక్కడ ఏ అన్యాయం జరిగినా ఆ అన్యాయాన్ని తీవ్ర స్వరంతో ఖండిస్తూ అక్షరాగ్నుల్ని కురిపించాడు.


ప్రజల జీవన గమనంలో భాగస్వామి అయ్యాడు. ప్రజాఉద్యమానికి ఆయువు పట్టునిచ్చేది సాహిత్యం అని నమ్మటంతో కాళోజీ కలం అక్షరాల్ని వర్షించింది. ప్రజల కష్టాలకు కాళోజీ కళ్ళు చెమ్మగిల్లటంతో రాసిన పదాలే “నా గొడవ”గా ప్రజలు భవిష్యత్తుకి మార్గదర్శకాలుగా నిలిచాయి. ముఖ్యంగా ఆ పద్యాల్ని తెలంగాణా ప్రజలు మనసుకు హత్తుకున్నారు కనుకే కాళోజీ కాలంతో ప్రయాణించి ప్రజాకవి అయ్యారు. సాహిత్యోద్యమాల్ని పరిశీలిస్తే కాళోజీ సత్యాగ్రహం, గ్రంథాలయ ఉద్యమంతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన కాళోజీ ఆ సందర్భంలో అనేకసార్లు జైలుకి వెళ్ళారు.

ప్రజల కష్టాలను, అణచివేతను, ఆశలను కవిత్వంగా ఆవిష్కరించి పోరాటం చేసిన అక్షర యోధుడు. అన్యాయం ఎదురైనచోట ఆయన కలం కత్తిలా ఝుళిపించి సమాజంలో మార్పును కలవరిస్తూ తెలంగాణ ప్రజల గుండె చప్పుడుని ప్రజాకవిగా వినిపించినవాడు. ఆయన కేవలం కవిగా మాత్రమే గుర్తిస్తారు. కానీ మంచి కథకుడు. ప్రజా జీవితానికే అద్దం పట్టే కథల్ని ఒకింత వ్యంగ్యం కూడా చొప్పించి రాసాడు. సుమారు ఎనభై ఏళ్ళ క్రితం కథలే అయినా ఇప్పటికీ సమకాలీనత కలిగిన కథలు అవి.

కాళోజీ కథలు లభ్యమైనవి పదకొండు కథలే కావచ్చు. ఎనభై ఏళ్ళ కిందటివే కావచ్చు. చిన్న కథలే కావచ్చు కాని ప్రతికథా పెద్ద ఆలోచనతో పాఠకుల మనసుల్ని సంచలింప చేస్తాయి. విషాద సంఘటనే అయినా ఒకింత వ్యంగ్యంతో చెప్పటం వలన ఈనాటికీ మారని మానవ మనస్తత్వాలతో, సమాజంతో, రాజకీయాలతో బేరీజు వేసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇప్పటికీ కూడా ఆ కథలు నిత్య నూతనమే అనిపిస్తాయి .

భూతదయ కథని తీసుకుంటే ఒకే ప్రదేశంలో జరిగిన రెండు దృశ్యాల్ని సాదృశ్యంగా చెప్పటంతో ప్రజలు స్పందించిన విధానం విభిన్నంగా వుండటాన్ని కథనం చేసాడు రచయిత. రామ మందిరం ఆవరణలో ఎవరో వదిలివేసిన ఒక నవజాత శిశువును చూసి జనం గుంపులుగా చేరి ఎవరి పద్ధతిని వారు మాట్లాడుకుంటారు. రక్షక భటుడు వచ్చి ఏడుస్తున్న శిశువుకు ఆశ్రయం ఇవ్వటానికి ఎవరైనా ముందుకు వస్తారేమోనని అడుగుతాడు. కానీ ఎవరూ ముందుకురారు. ఆఖరుకు క్రైస్తవమత బోధకురాలు ఆ శిశువును చేతులోకి తీసుకుని ఆశ్రయమిస్తుంది. రెండు నెలల తర్వాత అదే ఆవరణలో రాముడి విగ్రహం కనిపిస్తుంది. అప్పటిలాగే జనం మూగుతారు. ఒక శాస్త్రులు వచ్చి కలలో శ్రీరాముడు వచ్చి తన కొరకు దేవాలయం కట్టించమన్నాడని చెప్తూ

పూనకంతో విగ్రహాన్ని కౌగలించుకొని పారవశ్యాన్ని నటించాడు. ఇక్కడ రచయిత 'శాస్త్రులు నటించాడు' అనటంలోనూ, 'ఆ నటనకు జనులు వశులైనారు' అని కథనం చేయటంలోనూ రచయిత వ్యంగ్యం తెలుస్తోంది. ఆ నటనకు జనం ప్రభావితులై గుడి నిర్మాణానికి వేలాదిరూపాయలు ఇస్తారు.. ఒకే ఊళ్ళో, ఒకేగుళ్ళో జరిగిన భిన్న సంఘటనలకు వచ్చిన భిన్న స్పందనలకూ ఇదే మన భూతదయ అని రచయిత వేదనాత్మక వ్యంగ్యంతో వ్యవస్థకు దెబ్బకొడతాడు. కథలో అనాథ హిందూ శిశువుకు సమాజం ఆశ్రయం కల్పించక పోవటంతో క్రైస్తవ శరణాలయం ఆశ్రయం అయింది. అదే సమాజం శిల్పి చెక్కిన రాతి బొమ్మకు రత్నఖచిత మందిరం ఏర్పడేలా చేసింది. ఇదీ మన భూతదయ అని రచయిత ముగింపు యిస్తాడు. ఈ కథలో రచయిత చాలా విషయాలు ప్రస్తావిస్తాడు.




ఏ కాలంలోనూ అనాథ పసిపాప కన్నా రాతిబొమ్మకే ప్రాధాన్యం ఇవ్వటంలో మానవత్వం కన్నా మతానికీ, దైవభక్తికే జనం ప్రాధాన్యతని ఇస్తారనే విషయం అర్థమౌతుంది. అందులో ముఖ్యమైనది 'చలం ప్రభావానికి లోనైన స్వేచ్ఛావాదుల కథల పరిణామమేమో' అని ప్రజల మాటగా చెప్పటంలో కాళోజీకి చలం రచనల పట్ల సదభి ప్రాయం లేదేమోననే పాఠకులకు సందేహం కలుగుతుంది.

'ఆడవాళ్ళు అక్షరాస్యులైతే ఇలాగే జరుగుతాయి' అని అక్కడ మూగిన జనం అనుకుంటారు' అని కథనం చేసాడు రచయిత. ఆడవాళ్ళ చదువులకు రచయిత వ్యతిరేకం అనే అనుకుందామా? అనేది చర్చించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ కథ రాసిన కాలం 80 ఏళ్ళ క్రితం నాటి సమాజం అభిప్రాయంగానే పరిగణించాలని నా వుద్దేశ్యం. తర్వాత కాలంలో కాళోజీ అభిప్రాయాలు మారి వుంటాయి. ఈ కథ 1937 గోల్కొండ పత్రికలో ప్రచురితమైనదే అయినా కథాంశం తరచి చూస్తే ఆయా సంఘటనలకు ఈనాడు కూడా ప్రజల ప్రతిస్పందనలు ఇంతకు భిన్నంగా మాత్రం ఉండవు. ఇప్పుడు పెరిగిన టెక్నాలజీ వలన వీడియోల, ఛానెల్స్ ద్వారా మరింత చర్చకు తావిస్తాయి. అందుకే కథలో రచయిత క్రాంత దృష్టి కన్పిస్తుందని చెప్పొచ్చు.

1943లో రాసిన "తెలియక ప్రేమ తెలిసి ద్వేషము" కథ కూడా వ్యంగ్యాత్మక కథే. యమకింకరులు రెండు ప్రాణాల్ని యమపురికి తీసుకు వెళ్తూ దారిలో గంధర్వగానం వినటానికి ఆ రెండు ప్రాణాల్నీ నది తీరాన వదిలివెళ్తారు. ఆ రెండు ప్రాణాలు తొలుత చాలా ప్రేమగా కుశల ప్రశ్నలు వేసుకొని తీరా ఇద్దరూ ఒకే చోట దేవాలయంలో ప్రవేశం కొరకు జరిగిన కుమ్ములాటలో ఒకరినొక్కరు చంపుకున్న దళితుడు, బ్రాహ్మలని తెలుసుకున్నాక తిరిగి కుమ్ము లాడుకుంటారు. తర్వాత యముడి దగ్గరకి తీసుకు వెళ్ళటం, ప్రాణాలు పోయాక కూడా కుమ్ములాటలు ఆగనందుకు ఆగ్రహించి యముడు వారికి శిక్షలు విధించటంతో ఆ కథ ముగుస్తుంది. పుట్టుకతో వున్న బుద్ధి పుడకలతో గానీ పోదంటారు. కానీ బతికి వున్నప్పుడే కాదు ప్రాణాలు పోయినా మనుషుల స్వభావం మారదనేది ఈ కథ తెలియజేస్తుంది. అంతేకాదు కులవివక్ష పట్ల కాళోజీకి గల తీవ్రనిరసన ఈ కథలో వ్యక్తం చేశారు.

జీవహింస నిరోధక సంఘం వారు నిర్వహించిన ఊరేగింపు కారణంగా పొలం పని లేకపోవడంతో ఆ రోజు విశ్రాంతి దొరికిన నల్లెద్దు, తెల్లెద్దుల సంభాషణే 'మనమే నయం' కథ (1943). తెల్లవారేసరికి కోళ్ళు, గొర్రెల్ని ఆహారం కోసం చంపుకు తినేవారి భూత దయ గురించి ఆశ్చర్యపోతాయి నల్లెద్దూ, తెల్లెద్దు. పేదల కష్టాలకు మూలకారకులు అయిన భాగ్యవంతులు తప్ప కోట్ల ప్రజల జీవితాలు తమకన్నా ఎన్నో రెట్లు అసహ్యకరంగా ఉన్నాయని చింతిస్తాయి. శారీరక కష్టం చేసిన తర్వాతైనా మనకు తిండీ, నీరు ఉండటానికి పైన కప్పు గల దొడ్లు వుంటాయి. అది కూడా లేకుండా కోట్ల జనం అలమటిస్తున్నారు అనుకుంటాయి ఆ ఎద్దులు. జీవ నిరోధక

సంఘం తమకి వున్నట్లు దాస్యం చేస్తున్న వారికి దాస్య నిరాధక సంఘమైనా లేదే అని ఎద్దులు తెల్ల పోతాయి. ఎద్దుల సంభాషణల ద్వారా పేదవారి జీవనవిధానం, వారి దాస్యం చెప్పించడంలో రచయిత కొంత చమత్కారం చూపించాడని పిస్తుంది.

"విభూతి లేదా ఫేస్ పౌడర్" పేరుతో (1943) రాసిన కథ, దక్షయజ్ఞం కథని పేరడీగా రచయిత హాస్యస్ఫోరకంగా రాసాడు. శివుడు బూడిద తయారు చేసే ఫాక్టరీ నడుపుతూ పార్వతిని పట్టించుకోడు. సత్యభామ కృష్ణుడిని శివుడి దగ్గరకు వెళ్లి ఓ ఫేస్ పౌడర్ (విభూతి) తెమ్మంటుంది. ఈలోగా పార్వతి తన చెల్లెలు పెళ్ళి అని శివుడు వద్దన్నా వినకుండా వెళ్ళి తనతండ్రి మాట్లాడక పోవడంతో బాధపడి ఏడుస్తూ తిరిగి వస్తుంది. ఈ లోగా శివుడు దగ్గరకి నారదుడు వచ్చి మామగారు పార్వతిని అవమానపరిచినట్లు వుత్తరం చదివి వినిపించాడు. శివుడు పార్వతిని వెతుక్కుంటూ బయలుదేరుతాడు. కృష్ణుడు ఎవరూలేని ఆ సమయం చూసుకుని కైలాసం వచ్చి బూడిద ఒకటే కాకుండా ఆ విభూతి తయరుచేసే విధానం రాసిన కాగితంకూడా పట్టుకుపోతాడు, పార్వతి తిరిగి వచ్చి శివుడు లేకపోవటంతో మళ్ళా వెతుకుతూ పోతుంది. శివుని కనుగొని కైలాసం తీసుకు వస్తుంది. శివుడికి బూడిద తయారు చేసే పని లేదు కదా ఇంక తనని పట్టించుకుంటాడని సంతోషిస్తుంది. అటు సత్యభామ పూజ చేసి పేరంటాళ్ళకు చిన్న దబ్బాతో పౌదరు కూడా వాయినంగా ఇస్తుంది. ఈ కథ అంతా సంభాషణాత్మకంగా సరదాగా చదువుకునేలా రాసాడు రచయిత.

రావణ సంహారం అనంతరం విభీషణునికి పట్టాభిషేకం చేయాలనుకొని లంకలోని రాక్షసుల నడవడి బాగుపడేవరకు సుగ్రీవుడి సలహా మేరకు కిష్కిందలోని సమర్థులను లంకకి పంపటానికీ, ఆ తర్వాతే విభీషణుడికి పట్టం కట్టడానికీ నిర్ణయించుకుంటాడు రాముడు. తర్వాత రామాయణ కథంతా జరుగుతూ దానితో పాటూ లంకలో ఆరాచకం కూడా ఎలా వుందో తెలుసుకోవాలంటే కాళోజీగారి "లంకా పునరుద్ధరణ" చదవాల్సిందే. ఈ కథ 17 మంది కథకులు రాసిన 17 కథలు చేర్చిన దేశోద్ధారక గ్రంథమాల లోనిది. ఈ కథ చదువుతున్నప్పుడు కాళోజీ ఆనాడు రాసారు కనక బతికి పోయారనిపించింది. బహుశా ఆరోజుల్లో ఈ కథ చదివిన వారికి ఇప్పుడంత మూర్ఖత్వం లేదేమో మరి. స్వాతంత్రానంతరం 13 ఏళ్ళకు 1959 ఆగస్టులో రాసిన "ఆగష్టు పదిహేను, త్రయోదశ స్వాతంత్రోత్సవము-1959" కథని ఆనాడు పదివేల కాపీలు ప్రచురించి ఉచితంగా పంచి పెట్టారట .

శిష్ట సంరక్షణార్థం, దుష్ట శిక్షణార్థం భగవంతుడు అవతారం ఎత్తి పనిపూర్తి కాగానే అవతారం చాలించినట్లుగా 1947 ఆగష్టు 15న బ్రిటీష్ సామ్రాజ్యాన్ని మట్టికరిపించిన తర్వాత స్వాతంత్రోద్యమ కారకులలోని అవతారాంశ అంతరించి భౌతిక శరీరమే మిగిలిందని చెప్తూ వ్యంగ్యాత్మక కథనంగా రాసిన 'ఆగష్టు పదిహేను త్రయోదశ స్వాతంత్రోద్యమం-1959 కథను రాసాడు కాళోజీ. కథని చాలా స్పష్టంగా రాయటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ కథ కూడా ఏడు దశాబ్దాల క్రితం రాయడం వలన బహుశ ఆనాడు ప్రజాస్వామిక విలువలు ఉండేవేమో అందుకే కాళోజీ ఈ కథ రాసినందుకు రాజ్యహింసకు గురికాలేదేమో. నిజానికి ఆ కాలంలో సాహితీవేత్తలకు భావస్వేచ్ఛ వుండటం వల్లనే చాలామంది ప్రభుత్వాలను నిలదీసే రచనలు చేయగలిగారు.

సంపుటిలో తర్వాత మూడు కథలు మరాఠీ నుండి తెలుగులోకి అనువాదమైనవే. ఒకటి ఆంగ్లం నుండి అనువదించినది. ఆయన కథలైనా, కథానువాదాలైనా దాదాపుగా 1937-47 మధ్యకాలంలో బ్రిటిష్ వారు, నిజాం రాజు గద్దెదిగకముందే రాసాడు. 13వ ఆగస్టు 15 స్వాతంత్ర్యం గురించి 1959లో రాసినా, ఎన్నికల గురించి రాసినా సశేషరచనలోనయినా ఆయన స్పష్టమైన దృక్పథం మనకర్థమవుతూనే ఉంది.

1940లో అనువాదం చేసిన రెండు *గింజలు* ఒక మంచి స్ఫూర్తిదాయకమైన నీతి కథ అని చెప్పవచ్చు. జొన్న చేనులోని దగ్గరగా ఉన్న రెండు గింజల సంభాషణతోనే కథనడుస్తుంది. ఒక గింజ నిరంతరం భయంతోనూ. పిరికితనంతోనూ, నిరాశతోనూ ఉంటుంది. రెండో గింజ ధైర్యంతో ఆశావహ దృక్పథంతో ఉంటుంది. వీచేగాలికీ, పిట్టలకీ భయపడ్తూ మొదటి గింజ వణుకుతుంటే, గాలి వూయాలకీ, పిట్టపాటలకీ ఆనంద పడుతుంది రెండో గింజ.రెండు గింజల్ని నోట పెట్టుకున్నపిట్ట పోతుంటే ఓ డేగ వచ్చి పిట్టని కాళ్ళతో బంధించి ఎగురుతుంది.

అప్పుడు కూడా ఆనందంగావున్న రెండవ గింజ కిందికి దూకుదాం అంటుంది. మొదటిది ఇష్టపడదు. మొదటి గింజ పిట్టతో పాటు దేగ కడుపులోకి వెళ్తుంది. క్రిందకి దూకిన గింజ నేలపై పడి మళ్ళీ మొలకెత్తుతుంది. నిత్యమూ భయపడేవాడు ప్రతీరోజూ చస్తాడు. ఆశావహ దృక్పథం ఉన్నవారు చనిపోయాక కూడా మరొకరికి మేలు చేస్తారు. అనే రెండు చక్కని విషయాల్ని బోధించే ఈ కథ విద్యార్థులకు ఉపయోగపడే కథ.

మరో అనువాద కథ "అనుభవం లేని ఆందోళన" కూడా విద్యాంశంగా వుండదగిన కథే.

గుడ్లగూబ సూర్యగ్రహణం రోజు తన అరుపులకే సూర్యుడు భయపడి వెళ్ళిపోయడని అహంకారంతో విర్రవీగుతూ ఉండగానే గ్రహణానంతరం తిరిగి ప్రకాశించిన సూర్యుడిని మనమందరం కలసి తమ రెక్కలతో కప్పేద్దామని ఇతర గుడ్లగూబల్ని ప్రోత్సహించినా అవి వినవు. ఇక లాభం లేక కళ్ళు మూసుకుని విచారిస్తూ గూటి నుండి కాలు జారి పడిపోతుంది వెంటనే గద్ద దీన్ని తన్నుకు పోతుంది. అలవి కాని చోట అధికులం అనరాదు అనే లోకోక్తినే ఈ కథ గుర్తు చేస్తుంది.


మూడోకథ 'జాజి తీగ' ఉత్తమ పురుషలో సాగుతుంది. పెరటిలోని జాజి తీగను పొగడచెట్టు పైకి పాకించటానికి ప్రయత్నిస్తే గాలికి ఆ తీగ జారి ప్రక్కనున్న ఎండిపోయిన రేగు చెట్టును అల్లుకుని పుష్పిస్తుంది. తన కూతుర్ని అందమైన ఉద్యోగస్తుడైన యువకునితో పెళ్ళి చేయాలని ఆలోచిస్తుంటే ఆమె వారాలబ్బాయిని తీసుకొని రావటాన్ని సాదృశ్యంగా చెప్పాడు రచయిత. ఈ కథ ఆంధ్ర కేసరిలో ప్రచురితమైంది. కాళోజీ కథల్లో మరోవిశేషం రెండు విభిన్న దృశ్యాల్ని గానీ సంఘటనల్ని గానీ తీసుకుని సాదృశ్యంగానో వైరుధ్యంగానో సాధికారంగా చెప్పటం స్వీయకథనాల్లోనూ, అనువాదాలలోను కూడా గమనించవచ్చును.

నాలుగో కథ ఆంగ్లం నుండి ఎంపిక చేసుకుని కాళోజీ అనువదించారు. ఎల్లో సీపై ప్రయాణిస్తున్న అమెరికా నౌక డెక్ పైన ఫాక్టరీ యజమాని అయిన ఒక అమెరికన్ శ్రీమంతుడు తాను సేకరించిన అపురూప పురాతన నాణెములు ప్రదర్శిస్తాడు: అందరు చూస్తుండగా జావాప్రాంత నాణెం గల్లంతు అవుతుంది. అతను ప్రయాణీకుల జేబులు పరీక్ష చేస్తాడు. ఒక ఆంగ్లేయ బ్యాంకరు తన జేబు తణికీ చేయటానికి అంగీకరించడు. 'నాజాతికి అగౌరవం కలిగించేది కనుక అంగీకరించను. అంతే కాక తాను నాణెం తీసుకోలేదని ఖచ్చితంగా చెప్తాడు.

మర్నాడు ఆ నాణెం టేబుల్ కింద దొరుకుతుంది. అప్పుడు ఆ శ్రీమంతుడు ఆయన్ని క్షమాపణ కోరుతాడు. తన జేబునుండి నాణెమును తీసి చూపి 'ఒకవేళ మీరు నా జేబు తడిమినపుడు ఇది దొరికితే నేను దొంగని కానని మీరు నమ్మేవారా' అంటాడు ఆంగ్లేయుడు.

1947లో శోభ పత్రికలో ప్రచురితమైన ఈ అనువాద కథలు చదివిన తర్వాత కాళోజీ కథల ఎంపిక పైన కూడా ఆశ్చర్యం, ఆనందం కలుగుతుంది. తన స్వీయ కథనాలు భారత దేశంలోని సమాజ దృశ్యాన్ని వ్యంగ్యాత్మకంగా ఎత్తి చూపి ఖచ్చితమైన కాళోజీ దృక్పథాన్ని స్పష్టంగా చూపే విధంగా వుంటాయి. అనువాద కథలు విద్యార్థుల మానసిక వికాసానికి ఉపయోగపడే కథలుగా ఆలోచింపజేసేలా వుంటాయి. కాళోజీ కథలు కాలంతో ప్రయాణిస్తూ నిలబడే కథలని మాత్రం తప్పక చెప్పవచ్చును. మి

**శీలా సుభద్రాదేవి**
రచయిత, ఫోన్ : 8106883099




**కటకటా మర్కటా! - ఆర్.సి. కృష్ణస్వామి రాజు :** కటకటా మర్కటా అనే మరో బాలల బొమ్మల కథాసంపుటి పిల్లలకి అందిస్తున్నారు. ఈ కటకటా మర్కటా అనే ఆసక్తిగొల్పే శీర్షిక పిల్లలకి ఉత్సుకత రేకెత్తిస్తుంది రాజు గారు కథలను చిత్రమైన మెలికలతో పిల్లలకి అందించడం విశేషం. చిట్టిపొట్టి కథలతో రోజూ ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో విప్పి చెప్పారు. లేనిదానికోసం బాధపడే కన్నా, ఉన్నదానితో సంతృప్తిపడాలని మరో కథలో చెబుతారు. ఇవన్నీ ఒకరకంగా నీతిచంద్రికలే.

*పుటలు :120, వెల : 140/-, ప్రతులకు : ఫోన్ : 9393662821*

# వడుగర్ సంస్థానం

– డా. సగిలి సుధారాణి



వడగరై సంస్థానం లోపలి ద్వారం

తెలుగు రాష్ట్రాల తరువాత తెలుగువారు అత్యధికంగా ఉన్న రాష్ట్రం తమిళనాడు. చారిత్రకంగా భౌగోళికంగా, రాజకీయంగా, సాంస్కృతికగా, సాహిత్య పరంగా తెలుగు-తమిళ జాతుల మధ్య సంబంధ బాంధవ్యాలు చాలా ప్రాచీనమైనవి. సంగమ కాల చరిత్ర ప్రకారం తమిళులు తెలుగువారిని 'వడుగర్' అని పిలిచేవారు. వడుగర్ అంటే వారికి ఉత్తర దిక్కున ఉన్నవారని అర్థం.

కొన్ని శతాబ్దాల క్రితం నాటి చరిత్ర కలిగిన వడగర్ ప్రాచీన వంశమూల పురుషుడు రామభద్ర నాయకుడు. ఆయన సుపరిపాలనతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. ఈ సుప్రసిద్ధ ప్రాచీన కుటుంబ స్థాపకుడి వంశ చరిత్రను తెలుసుకోవాలంటే, మనం శతాబ్దాల క్రితం జరిగిన సంఘటనల వరకు, అంటే ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన విజయనగర రాజ్యం పాలన అత్యున్నత స్థాయిలో వెలిగినకాలం వరకు వెనక్కి వెళ్ళవలసిందే!

**రామభద్ర నాయకుడు :** ఈ రామభద్ర నాయకుడు దక్షిణాపథాన విజయనగర సైన్యానికి సేనాధిపతిగా సేవ చేసిన సుప్రసిద్ధ కోట నాగమ నాయకునికి అనుచరుడు, దగ్గరి బంధువని చెబుతారు. అతను హోదాలో నాగముడి తర్వాత రెండవస్థానంలో ఉన్నాడు. ఎందుకంటే విజయనగర రాజుకు రుణపడి ఉన్న పాండ్య, చోళ రాజ్యాల నుండి ధనాన్ని వసూలు చెయ్యడానికి, విజయనగర సామ్రాజ్యానికి అవసరమైనపుడు సైన్యాన్ని అందించడానికి అతను నియమించబడ్డాడు.

నాగమ నాయకునికి సంతానం లేని కారణంగా కాశీ తీర్థయాత్రకు వెళ్ళిన సమయంలో రామభద్ర నాయకుడినీ సేనాపతి కేశవప్ప నాయకుడినీ ముఖ్యమైన పదవులలో నాగమనాయకుడు నియమించాడు. వారిద్దరూ తమ తమ పదవులలో విశ్వసనీయంగా సేవచేసి, నాగమ నాయకుడు తీర్థయాత్ర నుండి తిరిగి వచ్చిన తర్వాత బాధ్యతలు తిరిగి భద్రంగా అప్పగించి ఆయనకు గౌరవ పాత్రులైనారు. ఈ మధ్యకాలంలోనే నాగమ నాయకునికి ఒక కుమారుడు జన్మించాడు, అతనికి 'విశ్వనాథ నాయకుడ'ని అని పేరు పెట్టారు. ఈ సమయంలోనే తంజావూరు రాజైన వీరశేఖర చోళుడు, చంద్రశేఖర పాండ్యునిపై దండయాత్ర చేసి తంజావూరు రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. దాని కారణంగా చంద్రశేఖర పాండ్యుడు విజయనగర రాజు వద్దకు వెళ్లి, తన రాజ్యాన్ని తిరిగి పొందడానికి సహాయం చేయమని మొరపెట్టుకొన్నాడు. రాజు కోల్పోయిన రాజ్యాలను తిరిగి పొందవలెనని నాగమనాయకుని ఆదేశించాడు. దానికి అనుగుణంగా, నాగమ నాయకుడు తన సేనాపతి రామభద్ర నాయకుని సహకారంతో తక్షణం సైన్యంతో వెళ్లి, చోళ రాజును ఓడించి, అతన్ని తరిమివేసి, చంద్రశేఖరుడిని తిరిగి తంజావూరు సింహాసనంపై కూర్చోబెట్టాడు. అదే సమయంలో విజయనగర సంస్థానానికి చెల్లించవలసిన కప్పం బకాయిలను చెల్లించ వలసినదిగా నాగమ నాయకుడు చంద్రశేఖరుడిని ఆదేశించాడు. ఈ మొత్తాన్ని వసూలు చేసే ఉద్దేశ్యంతో, అతను రామభద్ర నాయకుడిని మధురలో తన ప్రతినిధిగా నియమించాడు. అయితే, తెన్‌కాశి, గంగై కొండ చోళపురంలో

నివసిస్తున్న తన బంధువులను లొంగదీసుకునే శక్తి తనకు లేదని, వారు తనకు తీవ్రమైన చికాకును, ఇబ్బందిని కలిగిస్తున్నారని, అందువల్ల బకాయిలను తీర్చలేనని, వారిని లొంగదీసుకోవాలని, పరిపాలనా పగ్గాలను తమ చేతుల్లోకి తీసుకోవాలని, తనకు భరణం మాత్రం మంజూరు చేస్తే చాలని నాగమ నాయకునికి చంద్రశేఖర పాండ్యుడు మొరపెట్టుకొన్నాడు. నయవంచకుడైన అతని అభ్యర్థన నమ్మి, నాగమ నాయకుడు పాండ్య, చోళ రాజ్యాల బాధ్యతలు స్వీకరించి, అశాంతి కలిగించే శక్తులను అణచివేసి, అక్కడ శాంతిని పునరుద్ధరించాడు.

కాని చంద్రశేఖరుడు విజయనగరానికి వెళ్లి నాగమ నాయకునిపై వ్యతిరేకంగా ఫిర్యాదు చేశాడు. ఈ ద్రోహం గురించి తెలుసుకున్న నాగమ నాయకుడు, తన ప్రభువుకు ఎలాంటి తప్పుడు సమాచారం అందకుండా చూసేందుకు రామభద్ర నాయకుడిని అక్కడకు పంపాడు. అప్పటికే చంద్రశేఖర పాండ్యుడు చెప్పిన విషయాలు నిజమని నమ్మిన విజయనగర రాజు తననుండి ఎలాంటి అధికారిక అనుమతి లేకుండా పాండ్య రాజ్య పరిపాలనను చేపట్టినందుకు నాగమ నాయకునిపై తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. నాగమనాయకునికి తగిన శిక్ష విధించడానికి ఆయనను వెంటనే అదుపులోనికి తీసుకోవాలని సైనికులకు ఆజ్ఞ జారీ చేశాడు. రాజు చుట్టూ ఉన్నవారు ఆ ఆజ్ఞను అమలు పరచడానికి వెనుకంజ వేశారు. ఆ సమయంలో రామభద్ర నాయకుని ప్రోత్సాహంతో నాగమ నాయకుడి కుమారుడైన విశ్వనాథ నాయకుడు తన తండ్రిని బందీగా పట్టుకుని రాజుముందు హాజరుపరచడానికి ముందుకొచ్చాడు.

**రామనాథ నాయకుని దౌత్యపాత్ర :** విశ్వనాథుడు తన తండ్రితో చేరి, మరో రాజ్యాన్ని స్థాపించవచ్చని రాజుకు అనుమానం కలిగింది. విశ్వనాథుడు గంభీరంగా, తాను రాజు ఆజ్ఞకు విధేయుడిగా ఉంటానని సభాముఖంగా వాగ్దానం చేశాడు. దాంతో తన తండ్రికి వ్యతిరేకంగా ముందుకు సాగడానికి రాజు నుండి అనుమతి లభించింది. ఈ దశలో, రామభద్ర నాయకుడు మళ్ళీ ఒక దౌత్యవేత్త పాత్ర పోషించి, నాగమ నాయకుని వద్దకు వెళ్ళి కుమారునికి లొంగిపోమని సలహా ఇచ్చాడు. నాగమ నాయకుడు కొంతసేపు మొండిగా ఉన్నప్పటికీ, చివరికి లొంగిపోయాడు. అతన్ని బంధించి రాజుముందు హాజరు పరిచినప్పుడు, రాజు విశ్వనాథుని ప్రవర్తనను మెచ్చుకుని, అతనికి దక్షిణాపథ పాలనా బాధ్యతలు అప్పగించాడు. దిక్కుతోచని చంద్రశేఖరుడు చేసేదిలేక అంగీకారంతో రాసిన సింహాసన త్యాగ పత్రాన్ని పరిశీలించిన మీదట, రాజు నాగమ నాయకునికి క్షమాభిక్ష ప్రసాదించాడు. రామభద్ర నాయకుని దౌత్య చాతుర్యం వృథా కాలేదు. ఆయన విశ్వసనీయ సేవకు గుర్తింపుగా, విశ్వనాథ నాయకుడు ఆయనను మధురకు 'ఫౌజ్‌దారు'గా (సేనాధిపతి) నియమించాడు.

పెరియార్ నది నీటిపారుదల కారణంగా ఈ ప్రాంతాలు అత్యంత సారవంతమైనవిగా మారాయి. సరిగ్గా అదే సమయంలో చోళరాజు కంభం, కూడలూరును ఆక్రమించుకున్నాడు. విశ్వనాథ నాయకుడు, రామభద్ర నాయకుడు ఇరువురు కలసి దురాక్రమణదారుడిపైకి దండెత్తి, అతని కోటను ముట్టడించారు. ఆ సమయంలో రామభద్ర నాయకుడు తన ముఖంపై తీవ్ర గాయాలపాలైనప్పటికీ ధైర్యంగా ముందుకు సాగి, కంభం కోట ప్రాకారాలపై విజయనగర పతాకాన్ని ఎగురవేశాడు. రామభద్ర నాయకుడు ప్రదర్శించిన శౌర్య పరాక్రమాలకు, వీరత్వానికి ఎంతగానో సంతోషించిన విశ్వనాథ నాయకుడు వరాహ నదికి ఉత్తరాన (ప్రస్తుత తేనిజిల్లాలోని) రమణీయమైన ప్రకృతి దృశ్యాల నడుమ సుబ్రహ్మణ్య స్వామి కొలువుదీరిన సుందర ప్రదేశం 'వడగర్' పాళయాన్ని శాలివాహనుని శకం 1356లో ( క్రీ.శ. 1484) రామభద్ర నాయకునికి ప్రదానం చేశాడు. ఈ పాళయానికి తూర్పున శ్యామ్మన్ ఆలయం, ఉత్తరాన కుంభకరై సరిహద్దులుగా ఉన్నాయి.

విశ్వనాథనాయకుడి పాలనకాలంలో ఒక అత్యంత ముఖ్యమైన రాజకీయ సంఘటన జరిగింది. తన పాళెగార్ల కోసం మంత్రి అరయనాథ మొదలియార్‌తో కలిసి 72 బురుజులతో కూడిన పాళ్యాలను నిర్మించాడు. ప్రతికోటకు ఒకరక్షణ స్థానాన్ని ఏర్పాటు చేశాడు. ఉదా. తిరుమంజనానికి కుడివైపున ఉన్నది అటువంటి బురుజులలో ఒకటి. ఈ నేపథ్యంలో విశ్వనాథనాయకుడు రామభద్ర నాయక్‌ను దేవాలయాలకు పర్యవేక్షకుడిగా నియమించారు. ఈ గౌరవప్రదమైన పదవిని అతను 20 సం॥ నిర్వహించాడు. దీని తర్వాత కొద్దికాలానికే, రామభద్ర నాయకుడు మరణించాడు. విశ్వాసపాత్రుడైన సేవకుడిని, ఎంతో ఉత్సాహంతో పనిచేసిన విశిష్ట ఆత్మబంధువును కోల్పోయినందుకు విశ్వనాథనాయకుడు తీవ్రంగా

బాధపడ్డాడు. రామభద్రనాయకునికి సంతానం లేని కారణంగా, సోదరుడైన కుమార నాయకుని పసిబిడ్డ మాచి నాయకుడిని ఆదరించి రాజ్య ప్రయోజనాల దృష్ట్యా అతనిని ప్రత్యేకంగా చూసుకోవాలని ఆదేశించాడు. విశ్వనాథ నాయకుని మరణానంతరం, అతని కుమారుడైన కృష్ణప్ప నాయకుడు మధుర సింహాసనాన్ని అధిష్టించాడు. ఈలోగా మాచి నాయకుడు అడవులను నరికి, సాగులోనికి తెచ్చాడు. చెరువులను తవ్వించి, రాజ్యాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేశాడు. అతను 75 సం॥పాటు పాలించాడు. అతని తరువాత అతని మేనమామ కుమారుడైన రంగప్ప నాయకుడు సింహాసనాన్ని అధిష్టించి 50 సంవత్సరాలు పాలించాడు. తరువాత అతని కుమారుడైన రెండవ మాచి నాయకుడు సింహాసనాన్ని అధిష్టించాడు. ఆ సమయంలో మధుర రాజ్యం తిరుమల నాయకుని పాలనలో ఉండేది. ఆయన మాచి నాయకుని తనతో కొంతకాలం గడపమని ఆహ్వానించాడు. ఒకానొక సందర్భంలో, తిరుమల నాయకుడు ఇతర ఫౌజ్‌దార్లు, పాళెగార్లతో కలిసి మధుర సమీపంలోని 'తెప్పకుళం' వద్ద ఉన్నాడు. 300 గజాల చదరపు వైశాల్యం గల ఆ తెప్పకుళం చాలా విశాలంగా ఉండటంతో, అక్కడ ఉన్నవారి బలాన్ని పరీక్షించాలనే ఉద్దేశ్యంతో, దాని పశ్చిమ కొన నుండి బాణం వేసి, అది చెరువు తూర్పు కొనను చేరేలా ప్రయత్నించాలని తిరుమల నాయకుడు ప్రతిపాదించాడు. మాచి నాయకుడు తప్ప మరెవరూ ఆ ప్రయత్నంలో సఫలం కాలేదు. అతని ప్రతిభకు మెచ్చి, రాజు అతనికి 'పులిమన్‌కొంబై' అనే గ్రామాన్ని బహుమతిగా ఇచ్చాడు.

వడగరైలో కొంతకాలం గడిపిన తరువాత, తిరుమల నాయకర్ తన మంత్రి దళవాయి రామప్పయ్యర్‌తో కలిసి, 1638లో రామ్‌నాడ్‌కు చెందిన తిరుగుబాటుదారుడైన సేతుపతి సదైక దేవర్IIపై సైన్యాలతో దండెత్తమని మాచినాయకుడిని ఆదేశించాడు. చివరికి సదైక దేవర్ పట్టుబడి మధురకు తీసుకురాబడ్డాడు, అక్కడ అతన్ని జైలులో ఉంచారు. ఈ కారణంగానే మద్రాసు సివిల్ సర్వీస్‌కు చెందిన శ్రీ జె. హెచ్. నెల్సన్ తన మధుర జిల్లా కైఫీయతు (మాన్యువల్)లో ఇలా పేర్కొన్నారు. "వడగరు అధిపతి రామనాథపురం పాలకుని పట్ల దయతో ఉన్నారు. ఈయన దేనికీ తలవంచరు". రాజు మాచి నాయకుడు చేసిన సేవలను ఎంతగానో ప్రశంసించి, విలువైన బహుమతులతో అతన్ని ఇంటికి సాగనంపారు. మాచి నాయకుడు 55 సం. పాలించాడు. తరువాత అతని పినతండ్రి నారనప్ప నాయకుడు సింహాసనాన్ని అధిష్టించాడు. ఈ సమయంలో మధురకు చొక్కనాథ నాయకుడు పాలకుడిగా ఉన్నాడు. మధుర, తంజావూరు రాజులకు మధ్య కొన్ని కుటుంబ కలహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మధురరాజు 1684లో ఫౌజ్‌దారు వెంకట-కృష్ణమ నాయకునితో చేరి తంజావూరుపై దండెత్తడానికి నారనప్ప నాయకుడిని పంపాడు. దీని ఫలితంగా తంజావూరు రాజు విజయ రాఘవ నాయకుడు యుద్ధంలో ఓడిపోయి సంకెళ్లతో మధురకు తీసుకురాబడ్డాడు.

నారనప్ప నాయకుడు 35 సం॥ పాలించాడు. అతని తరువాత అతని పసికందు కుమార రామభద్ర నాయకుడు సింహాసనాన్ని అధిష్టించగా, అతని తల్లి బంగారమ్మ 10 సం॥ పాటు రాజప్రతినిధిగా ఉన్నారు. రామభద్ర నాయకుడు యుక్తవయస్సుకు వచ్చిన సమయంలో, మధుర రాజు విజయ రంగ చొక్కనాథ నాయకుడు సమకాలికుడు. వడగరులో రామభద్రనాయకుని పేరుమీద ఉన్న వీధి ద్వారా, తెంగరైలో బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి ఈశాన్యంగా ఆయన నిర్మించిన మండపం ద్వారా కుమార రామభద్ర నాయకుడిని ఇప్పటికీ ప్రజలు స్మరించుకుంటారు.

1741లో దిండిగల్‌పై దాడిచేసిన మైసూరు వాసులను అడ్డుకునే ముఖ్యమైన పనిమీద మధుర రాజు తన మంత్రి, నారనప్ప నాయకుడిని దిండిగల్‌కు పంపాడు. నారనప్ప నాయకుడు ఆ ప్రాంతంలోని పాళెగాళ్ళను సభకు రమ్మని ఆహ్వానించాడు. ఆ పిలుపునకు స్పందించి దర్బారుకు హాజరైన వారిలో కుమార రామభద్ర నాయకుడు ఒకరు. ఆయన ప్రముఖవ్యక్తే కాకుండా మధుర నాయక రాజుకు బంధువు కావడంతో, మంచాల నారనప్ప నాయకుడు అతనికి తనతోపాటు సమాన హోదాను ఇచ్చి గౌరవించాడు. అప్పుడు అకనూర్ మంత్రిముందు సాష్టాంగ నమస్కారం చేసి, అతనితో సంభాషించాడు. కానీ గండమయ పాళెగార్ లేవమని సైగ చేసినప్పటికీ, అతను దానిని గమనించనందున లేవలేదు. అప్పుడు, కుమార రామభద్ర నాయకుడు గండమను లేవమని కోరాడు. కానీ గండమయ పాళెగారు కుమార రామభద్ర నాయకుని పాదాల వద్ద సాష్టాంగ నమస్కారం చేయనందున, గండమ

దానిని ఉద్దేశపూర్వక అవమానంగా భావించాడు. ఈ అవమానం గండమ మనసులో నాటుకుపోయింది. అతను వడగరు పాళెగార్‌ను నిరంతరం ఇబ్బంది పెట్టాడు. దిండిగల్ స్వాధీనానికి మైసూరు వాసులు చేసిన ప్రయత్నాన్ని విఫలం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించాడు.

నాయక పాలకులలో చివరి పాలకురాలైన రాణి మీనాక్షి క్రీ.శ. 1737లో మరణించడంతో, ఆమె రాజ్యం మహమ్మదీయ కుట్రలకు, మరాఠా దండయాత్రలకు గురైంది. ఈ అల్లర్ల మధ్య, సేనాధిపతి అయిన ఆశావహుడు, మైసూరు పాలకుడు నంజరాజు నాయకత్వంలో అప్పట్లో దిండిగల్‌పై పెళుసైన పట్టును కలిగి ఉన్న మహమ్మదీయ గవర్నర్ నుండి దానిని చేజిక్కించుకోవడానికి ప్రయత్నించారు. అప్పటికి ఇంకా జీవించి ఉన్న బంగారు తిరుమల, అతని కుమారుడితో సహా పైన పేర్కొన్న విధంగా పాళెగాళ్ళను యుద్ధ మండలికి పిలిపించడంలో కుమార రామభద్ర నాయకుడు మంత్రికి ఎంతగానో సహాయపడ్డాడు. కుమార రామభద్రుడు ప్రదర్శిస్తున్న అహంకారపూరిత వైఖరికి గండమ నాయకుడు అప్పటికే ఆగ్రహించి ఉన్న కారణంగా అతని భూభాగంపై దండెత్తి, అతని తల నరికి, కొడివలార్‌పట్టి గ్రామాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈ విధంగా కుమార రామభద్ర నాయకుని పాలన...21 సంll కొనసాగి ముగిసింది. బహుశా వడగరు భూభాగం అంతవరకే విస్తరించి ఉండేది. ఈ సంఘటనను పెరియకుళం, దాని పరిసర ప్రాంతాలలోని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకొంటారు. గండమ సైన్యాలు ఆగిన దారిలోని కొన్ని వీధులను ఇప్పటికీ 'దండుపాళయం' అనే పేరుతో పిలుస్తారు.

1784లో కల్నల్ లాంగ్ జయించిన దిండిగల్లు ప్రాంతాన్ని, మంగళూరు సంధి ప్రకారం సుల్తాన్‌కు తిరిగి ఇచ్చారు. టిప్పు సయ్యద్ సాహిబ్‌ను దిండిగల్లు వైస్రాయ్‌గా నియమించాడు, తరువాతి కాలంలో, కుమార రామభద్రుని పినతండ్రి కుమారుడైన మైసూరు వాసి దిండిగల్లును జయించే ప్రయత్నాన్ని విఫలం చేయడానికి ప్రయత్నించిన వారసుడు అయిన కొండమ నాయకుడిని కూడా అతను కఠినంగా శిక్షించాడు. దీనిని అవకాశంగా తీసుకున్న పొరుగు పాళెగాళ్ళను నిరంతరం ఇబ్బందులు పెడుతుండగా, మైసూరు సైన్యం అదుపులేని దాడుల కారణంగా రాజ్యం తీవ్ర గందరగోళంలో పడటంతో, కొండమ నాయకుడు పాంబర్ అడవి వాలులో, వెల్లిగావి కొండలపై కుల్లుక్కెయడి (ధాన్యాగారం ఆకారంలో ఉన్న) అనే కొండకోటకు (తిన్నెవెల్లి జిల్లాలో ఉండేది)వెళ్ళి తలదాచుకొన్నాడు. పొరుగు పాళెగాళ్ళ శత్రుత్వం కారణంగా, కొండమ నాయకుడు సహాయం కోసం సప్తూరు పాలెగార్‌ను అభ్యర్థించాడు. అతని పొరుగున ఉన్న ఇతర శత్రు పాళెగాళ్ళవలె కాకుండా, ఆ అభ్యర్థనను వెంటనే అంగీకరించి, మైసూరు సైనికులను, శత్రు పాళెగాళ్ళనూ తరిమివేసి, వడగరు పాళెగార్‌ను తిరిగి కొండమనాయకునికి అప్పగించాడు. దీనితో వడగర్ పాళ్యానికి అధికారంలోకి వచ్చి 35 సంవత్సరాలు పాలించాడు. నాటినుండి రెండు కుటుంబాల మధ్య బలమైన సోదరభావం ఏర్పడింది. అప్పటినుండి వివాహ సందర్భాలలో సప్తూరు జమీందార్లకు ప్రత్యేక ఆహ్వానం పంపడం వడగర్ కుటుంబంలో ఒక ఆనవాయితీగా మారింది. ఈ ఐక్యతాబంధానికి గుర్తుగా సప్తూరు జమీందార్లు తమ పట్టాభిషేక కార్యక్రమాలలో వడగరు జమీందార్లకు బహుమతులుగా ఒక కత్తితో పాటు ఒక గుర్రాన్ని పంపడాన్ని ఆనవాయితీగా చేసుకున్నారు.

కొండమనాయకుని తరువాత అతని కుమారుడు నాగమ నాయకుడు 50 సంll పాలించాడు. ఆ తరువాత అతని కుమారుడు వెంకటస్వామి నాయకుడు అలియాస్ రామభద్ర నాయకుడు అధికారంలోకి వచ్చాడు. అతని పాలనలోనే 1802లో శ్రీ టి. బి. హెర్డిస్ ఆ ఎస్టేట్‌ను శాశ్వత బెరిజ్ కోసం స్థిరపరిచారు. దిండిగల్ ప్రావిన్స్ వడుగర్ పాళెగార్ గురించి ప్రస్తావిస్తూ "ఒక ఉన్నత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని, అది ఆ జిల్లాలో ఒక అసాధారణమైన విషయం" అని మిస్టర్ వించ్ తన (24 నవంబర్ 1795 నాటి) నివేదికలో పేర్కొన్నారు. ఇది నాయక రాజుల కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న ఆ కుటుంబం స్థానాన్ని, గౌరవాన్ని స్పష్టంగా నొక్కి చెబుతుంది.

తరువాత జమీందార్ అయిన కొండమ నాయకుడుII, 1806 నుండి 1810 వరకు నాలుగు సంll పాటు ఆ ఎస్టేట్‌కు బాధ్యత వహించాడు. తరువాత అతని కుమారుడు మీనాయస్వామి రామభద్ర నాయకుడు అధికారంలోకి వచ్చి, 1810 నుండి 1824 వరకు

పాలించాడు. అతని పాలనకాలంలో పెరియకుళం వరదరాజస్వామి ఆలయంలో ఒక పెద్ద ఇత్తడి రేకుపై తన తల్లి చిత్రాలు చెక్కించాడు. అతని తరువాత అతని సోదరుడు రామభద్ర నాయక్III అధికారంలోకి వచ్చాడు. 1856వ సం॥లో, కేవలం రూ. 22,000 పేష్కష్ బకాయిలు చెల్లించక పోవడంతో మద్రాసు ప్రెసెడెన్సీ విలువైన అడవులను మరియు ఎస్టేట్‌లోని ప్రధాన భాగాన్ని స్వాధీనం చేసుకుంది.

రామభద్ర నాయక్III తరువాత 1864లో అతని కుమారుడు వెంకటస్వామి నాయకుడు అధికారంలోకి వచ్చాడు. 1876-77 మధ్యకాలంలో ఏర్పడ్డ కరువు సమయంలో అతని సేవలు స్థానిక అధికారులచే ఎంతగానో ప్రశంసించబడింది. 1875 డిసెంబర్‌లో, మధురలోని నాయక్ ప్యాలెస్‌లో, తిరుమల నాయకరాజు ప్యాలస్ వద్ద నివసిస్తున్న వేల్స్ యువరాజుకు ఇచ్చిన స్వాగత కార్యక్రమానికి హాజరు కావడానికి ఆహ్వానించబడిన వారిలో ఆయన ఒకరు. వెంకటస్వామి నాయక్ స్ఫురదూపి, నిరాడంబరంగా ఉండేవారు. ఆయన తన తోటి జమీందార్లచే ఎంతగానో గౌరవించబడ్డారు.

రామభద్ర నాయకుడు IV 1873 డిసెంబర్ 23న వడగరైలో జన్మించారు. 1881లో దురదృష్టశావత్తు ఎనిమిది సంవత్సరాల చిన్న వయస్సులోనే తండ్రి వెంకటస్వామి 1881 ఆగస్టు 21న మరణించాడు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ అధికారి సి. శివ సుబ్బరాయ అయ్యర్ అతనికి సంరక్షకుడిగా కొనసాగారు. దూరదృష్టి, పరిపాలనా నైపుణ్యం, ఆంగ్లంలో నిష్ణాతుడైన పండితుడు, తమిళంలో విద్వాంసుడైన సభాపతి ముదలియార్, శివ సుబ్బయ్యరాయ అయ్యర్ తరువాత సంరక్షకుడిగా బాధ్యతలు స్వీకరించి, రామభద్ర నాయకుడు మేజర్ అయ్యేంత వరకు ఆ పదవిలో కొనసాగాడు. ఆ కుటుంబానికి ప్రత్యేక స్నేహితుడైన సర్ వి. హెచ్. లెవెంజ్, ఆ యువ జమీందారు విద్యాభ్యాసంపై గొప్ప ఆసక్తిని కనబరిచి, 1884లో అతడిని మద్రాసుకు పంపాలని కోరుకున్నాడు. అప్పుడు అతడి వయస్సు కేవలం 10 సం॥ కావడంతో, అతని సంరక్షకుడుతో మధురకు తరలించారు, అక్కడ అతను విద్యాపరంగా ఇతరత్రా బాగా రాణించాడు. 1888లో, అతను మిడిల్ స్కూల్ పరీక్షలో, 1891లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు, ఈ చదువులంతటా సంస్కృతం ప్రధానంగా ఉండేది.

**iv రామభద్ర నాయకుని విద్యా సంస్కరణలు :-** మధురలోని నేటివ్ కళాశాలలో జమీందార్ రామభద్ర నాయకుడు చదువుతున్నప్పుడు, అతని సంతృప్తికరమైన ప్రవర్తనద్వారా చదువుపట్ల ఆయనకున్న శ్రద్ధ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. ఆయన నిరాడంబరమైన ప్రవర్తన, ప్రజా ఉద్యమాలలో ఆయన చూపే ప్రగాఢమైన ఆసక్తి, అన్నింటికంటే ముఖ్యంగా, విద్యను ప్రోత్సహించడానికి ఆయన చూపిన సంసిద్ధత ఎంతో ప్రశంసనీయమైనవి. ఎఫ్.ఏ. పరీక్ష తర్వాత, మేజర్‌గా పట్టా పొందకముందే, 1894 డిసెంబర్ 24వ తేదీన ఆయన తన ఎస్టేట్ నిర్వహణ బాధ్యతలను స్వీకరించారు.

“బి.ఏ. డిగ్రీ పొందేంతవరకు కళాశాలలో నా చదువును కొనసాగించాలనే గొప్ప ఆకాంక్షతో ఉన్నాను, కానీ ప్రభుత్వం కోర్ట్ ఆఫ్ వార్డ్స్ నియమాలు కారణంగా ముందుగానే ఎస్టేట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టవలసి వచ్చింద”ని పేర్కొన్నాడు. సభాపతి ముదలియార్ గారి స్మృతిని సజీవంగా ఉంచడానికి, ఆయన రచనలను రామభద్ర నాయక్ పెరియకుళంలోని బాలసుబ్రహ్మణ్య స్వామికి అంకితంచేస్తూ, ఆయన అత్యంత పాండిత్య పూర్ణమైన రచనలలో ఒకటైన ‘పిళ్ళై తమిళ్’ ను తన సొంత ఖర్చుతో ప్రచురించాడు.

**వ్యవసాయం పట్ల మక్కువ ఎక్కువ :-** రామభద్ర నాయక్ గారు తన ఎస్టేట్‌లో చేపట్టిన సంస్కరణలు చాలా గణనీయమైనవి. ఆయన చాలా బీడు భూములను సాగులోకి తెచ్చారు. మొక్కల పెంపకం పట్ల ఆయనకున్న ప్రేమ ఒక అభిరుచిగా పరిణమించింది. ఆయన శాస్త్రీయ సాగు పద్ధతులపై ఒక వ్యవసాయ క్షేత్రాన్ని ప్రారంభించారు. దానినుండి లభించిన ఫలితాలు అమూల్యమైనవి, ఆదర్శనీయమైనవి. చుట్టుపక్కల ప్రాంతాల నుండి వ్యవసాయ సంస్కరణలపై ఆసక్తి ఉన్న రైతులు ఈ క్షేత్రాన్ని పరిశీలించడానికి వస్తూ ఉండేవారు. ఆయన తన ఎస్టేట్, ఇతర ప్రాంతాల నుండి పెద్ద మొత్తంలో ఆహార ధాన్యాలు, నార మొక్కలను సేకరించి, వాటిని మద్రాసులోని ‘వ్యవసాయ మరియు పారిశ్రామిక’ ప్రదర్శనలో ప్రదర్శించేవారు. 1904లోవ్యవసాయ ఇన్‌స్పెక్టర్ శ్రీ కామాక్షి రావు చేతులమీదుగా ఆయనకు రజత పతకం

లభించింది. 1906 మే నెలలో మధురలో జరిగిన వ్యవసాయ మరియు పారిశ్రామిక ప్రదర్శన కోసం ఏర్పాటు చేసిన కమిటీకి జమీందార్ ఉత్సాహంగా సహకరించారు. అంతేగాకుండా, ఆహార ధాన్యాలు, నారలు, నూనె గింజలు, కొమ్ములు, జంతుచర్మాలు మొదలైనవాటి సేకరణను ప్రదర్శించారు. ఈ సందర్భంగా, ఆయన వ్యవసాయంపై ఒక పత్రాన్ని చదివారు, అది ఎంతగానో ప్రశంసించ బడింది. వ్యవసాయ విషయాలలో నిపుణుడైన శ్రీ రామభద్ర నాయక్, వడగరైలోని ప్రయోగాత్మక క్షేత్రంపై తన నివేదికలో– "తక్కువ మూలధనం కలిగి ఉండటం మరియు అనేక ఇతర కారణాల వల్ల, రైతు దృష్టి పరిధి అనివార్యంగా పరిమితంగా ఉండటం మూలంగా అతను ఖరీదైన పనులను చేపట్టలేడు. రైతు సేంద్రీయ పద్ధతులను జాగ్రత్తగా అధ్యయనం చేయడం ద్వారావాటిని ఎక్కడ మెరుగుపరచవచ్చో తెలుసుకోవడానికి ఆ పద్ధతులను ఉపయోగించడం ద్వారా రైతుకు సహాయం చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ఉదాహరణకు, రైతు కోసం చేయగలిగిన సహాయం విత్తనాలను అందించడం. ఉత్తమ విత్తనాలను సేకరించి, వాటిని తమ పొలాల్లో సాగుచేసి, విత్తనాలను ఎంపిక చేసి, మంచి పంటను పండించగల రైతులకు పంపిణీ చేయడం ప్రభుత్వ విధిగా ఉండాలి.

**పశువుల పెంపకం చాలా ముఖ్యం :–** భారతీయ రైతుకు పాడికూడా ప్రధాన జీవనాధారం. ముఖ్యంగా ఈ దక్షిణాది జిల్లాలలో ఎద్దుల ఉత్పత్తి తగ్గిపోతూ ఉంది. ఈ దుస్థితిని సరిదిద్దడానికి ఉత్తమ మార్గం ప్రభుత్వం లేదా బోర్డు ఖర్చుతో ప్రెసిడెన్సీలోని ఉత్తమ సంతానోత్పత్తి ఎద్దులను కొనుగోలు చేసి, వాటిని దేశీయ ఆవులతో సంపర్కం చేయించడం. అనేక గ్రామాలలో జల్లికట్టు (ఎద్దుల పందెం) ఉత్సవంలో, ప్రదర్శించిన ఉత్తమ ఎద్దులకు బహుమతులు అందించే విధానాలు ప్రవేశపెట్టాడు.

**ఎస్టేట్ల పురోగతికి తీసుకోవలసిన చర్యలు –** 1902లో దివంగత సప్పూరు జమీందార్‌ను తన ఎస్టేట్‌కు బాధ్యుడిగా నియమించినప్పుడు, వడగరై జమీందార్ ఆయన భవిష్యత్తు మార్గనిర్దేశం కోసం ప్రణాళికలను వివరిస్తూ ఒక సలహా లేఖను పంపారు. అది ఒక గొప్ప సాహిత్య రచనగా నిలుస్తుంది. వారి ప్రాచీన గృహాల కీర్తి ప్రతిష్టలను, వారి ఎస్టేట్‌ల స్థిరత్వాన్ని, సమగ్రతను అంతిమంగా నాశనం చేసే నాలుగు లేదా ఐదు తీవ్రమైన దుర్గుణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని ఆయన ఈ క్రింది విధంగా వివరించారు.

1. చెడ్డవారిని మన చుట్టూ పనివాళ్లుగా, మనపై ఆధారపడిన వారిగా చేర్చుకోవడం. 2. అధికారుల ఎంపికలో ఉదాసీనత మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించడం. 3.సోమరితనాన్ని కలిగి ఉండటం! 4. భోగవిలాసాలలో మునిగి తేలడం!

ఈ సలహాలన్నీ ఒక కరపత్ర రూపంలో ముద్రించబడి, సమాచారం కోసం చాలామంది జమీందార్లతో పాటు ఇతరులకు పంపబడింది. తన వర్గానికి చెందినవారి భవిష్యత్తు ఉజ్వల భవిష్యత్తుకు సంబంధించినంత వరకు, ఆ కరపత్రంలోని ఆయన ప్రతి మాటలోనూ చిత్తశుద్ధి, నిబద్ధత వెల్లివిరుస్తున్నాయి. ఆయన వారి లోపాలను స్పష్టమైన పదాలలో ఎత్తిచూపి, వాటికి నివారణ మార్గాలను కూడా సూచించేంత వరకు వెళ్లారు. కోర్ట్ ఆఫ్ వార్డ్స్ చట్టం ఆమోదానికి సంబంధించి, శ్రీ రామభద్ర నాయక్ ఈ క్రింది అభిప్రాయాల్ని కలిగి ఉన్నారు:–

"మనకు ఈ ప్రయోజనాలలో కొన్నింటిని ఇస్తూనే, మనపై కొన్ని బాధ్యతలను కూడా మోపుతుంది!"

2 ఆగస్టు 1905 నాటి జి.ఓ. నెం. 1599, ఎం. యొక్క చివరి పేరాలో ఇలా ఉంది:

"చైర్మన్, ఎం. ఆర్. రైల్వే వి. రామభద్ర నాయుడు గారు చేసిన మంచి పనికి రెవెన్యూ డివిజనల్ అధికారి ఇచ్చిన సాక్ష్యాన్ని ప్రభుత్వం గమనించింది."

శ్రీ ఎల్. సి. మిల్లర్ ( గౌరవనీయ శ్రీ జస్టిస్) ఇలా వ్రాశారు: "మీరు ఇంత బాగా అభివృద్ధి చెందుతూ, మీ పురపాలక మరియు ఇతర కార్యక్రమాలకు ప్రభుత్వ ప్రశంసలు పొందుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీ పురోగతి గురించి వినడానికి నేను ఎల్లప్పుడూ సంతోషిస్తా".

గౌరవనీయులైన శ్రీ ఎ. ఇ. కాజిల్ స్టువర్ట్ రామభద్ర నాయక్ గురించి ప్రస్తావిస్తూ.."కొన్ని రోజుల క్రితం కోయంబత్తూరులో మిమ్మల్ని గవర్నర్ గారికి పరిచయం చేసే అవకాశం లభించడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి మీరు చేస్తున్న ప్రశంసనీయమైన ప్రయత్నాల ద్వారా మీరు వివిధ రంగాలలో ఎలాంటి ఆదర్శాన్ని నెలకొల్పుతున్నారో

ప్రభుత్వానికి బాగా తెలుసు! అనేకచోట్ల సుపరిపాలనకు ఆటంకం కలిగించే సర్వసాధారణమైన 'వర్గపోరాటాల' నుండి మీ మండలి విముక్తి పొందడం చూసి నేను సంతోషిస్తున్నాను."

**శ్రీ ఎ. జి. కార్డ్యూ :–** "పురపాలక సంఘం ఛైర్మన్‌గా మీరు చేసిన పనిలో మంచి ఫలితాలు సాధించినందుకు, దానిని కలెక్టర్, ప్రభుత్వం గుర్తించినందుకు నేను మిమ్మల్ని అభినందిస్తున్నాను. ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలనే మీలాంటి స్థానిక నాయకుల సంసిద్ధత మరియు సామర్థ్యం పైనే స్థానిక స్వపరిపాలన విజయం ఆధారపడి ఉంటుందని నేను ఖచ్చితంగా నమ్ముతున్నాను, మరియు మీరు రాబోయే అనేక సం॥ పాటు దీనిని కొనసాగిస్తారని ఆశిస్తున్నాను.

**"ది మద్రాస్ మెయిల్," అక్టోబర్ 10, 1906 :–**మధుర జిల్లాలోని వడుగర్రై జమీందార్ అయిన శ్రీ వి. రామభద్ర నాయుడు, తమ సమాజం భౌతిక సంక్షేమానికి సంబంధించిన విషయాలలో చురుకుదనాన్ని, ప్రజాహితాన్ని ప్రదర్శించే ప్రెసిడెన్సీలోని అతి కొద్దిమంది జమీందార్లలో ఒకరు. ఆయన మెరుగైన శాస్త్రీయ వ్యవసాయానికి సంబంధించిన అన్ని పథకాలపైనా ఎంతో ఆసక్తి చూపుతారు. వీరు కోర్ట్ ఆఫ్ వార్డ్స్ సలహా కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వ్యవసాయంపై ఆయనకున్న ప్రగాఢ ఆసక్తికి ప్రత్యక్ష నిదర్శనంగా, కోయంబత్తూరులో కొత్త వ్యవసాయ కళాశాల మరియు పరిశోధనా సంస్థకు శంకుస్థాపన చేసే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చివరిగా ఆయన పెరియకుళం పురపాలక సంఘానికి ఛైర్మన్‌గా ఉండి, దానిని ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారు. గత సంవత్సరం పెరియకుళం పురపాలక సంఘం పరిపాలనలో శ్రీ రామభద్ర నాయుడు ప్రదర్శించిన చురుకుదనాన్ని, ప్రజాహితాన్ని మద్రాసు ప్రెసిడెన్సీ గుర్తించింది".

**శ్రీ జె. ఎ. కమ్మింగ్ (తేదీ: కాకినాడ, 30 డిసెంబర్ 1905) మరియు శ్రీ ఎ.జి. కార్డ్యూ (తేదీ: 7 నవంబర్ 1901) రాసిన లేఖలు ఇక్కడ పేర్కొనడం సందర్భోచితంగా ఉంటాయి.** ''ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా మీరు పెరియకుళం ఛైర్మన్‌గా నియమితులై, దేశ పరిపాలనలోని విధులు, బాధ్యతలలో ఆచరణాత్మక భాగస్వామ్యం అరుదుగా జరుగుతుంది. ఈ జిల్లాలో నేను ఇప్పటికే కలిసిన కొద్దిమంది పెద్దమనుషులలో మీరు ఒకరు కాబట్టి, ఈ పదవికి మీ వ్యక్తిగత యోగ్యతపై నాకు ఎలాంటి సందేహం లేదని మీకు హామీ ఇవ్వగలుగుతున్నాను".

పెరియకుళం ప్రాంతం తెంగర్రై మరియు వడగర్రై (ఉత్తరపు ఒడ్డు, దక్షిణపు ఒడ్డు)గా విభజించబడి ఉంది. వరాహ నది వీటిని వేరు చేస్తుంది. వరదల సమయంలో, నదిని దాటడం అసాధ్యం అవుతుంది. ఛైర్మన్, శ్రీ రామభద్ర నాయక్, ఈ రెండు ఒడ్డులపై వంతెన నిర్మించడానికి ప్రభుత్వ అనుమతిని పొందడంలో విజయం సాధించారు. ఇది పెరియకుళం నివాసితులకు గొప్ప వరం. జిల్లాలోని బాధ్యతాయుత అధికారులు ఇచ్చిన ఈ క్రింది సాక్ష్యాలు, పురపాలక సంఘం ఛైర్మన్ శ్రీ రామభద్ర గారికి ఉన్న ప్రగాఢమైన ఆసక్తిని తెలియజేస్తున్నాయి.

**నాయక్, పెరియకుళం ఆసుపత్రి సంక్షేమాన్ని పరిశీలిస్తూ ఇలా అన్నారు :–** "ఆసుపత్రికి లభించిన ప్రజాదరణకు ప్రధానకారణం నిస్సందేహంగా ఛైర్మన్‌గారు ఆసుపత్రి పట్ల చూపిన ఆసక్తి, అలాగే ఆసుపత్రి అసిస్టెంట్ ఇన్‌చార్జ్ చేసిన కృషే!"

**జె.పి. బెడ్‌ఫోర్డ్, అధ్యక్షుడు, జిల్లా బోర్డు. విద్యా సంస్కరణలు –** జమీందారు తన సొంతఖర్చుతో వడగర్రైలో ఒక ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్నారు, అది సమర్ధవంతమైన స్థితిలో ఉంది. ఆయన విక్టోరియా మెమోరియల్ ఉన్నత పాఠశాలకు మేనేజర్‌గా కూడా ఉన్నారు, ఈ పాఠశాల ప్రజా విరాళాలు మరియు పాఠశాల ఫీజుల వసూళ్ల ద్వారా పోషించబడుతోంది. ఈ పాఠశాల ప్రత్యేకత 1902 అక్టోబర్ 12న జమీందారు కుమారుడు మొదటిసారి పాఠశాలకు పంపబడ్డాడు, ఆ సంఘటనకు గుర్తుగా, ఆయన ఉదారంగా రూ. 15,000 ఖర్చుతో ఉన్నత పాఠశాలను నిర్మించడానికి ఒక విశాలమైన స్థలాన్ని మంజూరు చేశాడు. దివంగత రామనాథపురం రాజా ఉన్నత పాఠశాల నిర్మాణానికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని తన సోదర జమీందార్లకు మరియు ఇతర ప్రభువులకు ఒక విజ్ఞప్తి పంపాడు. ఆ విజ్ఞప్తిలోని ఒక పేరా ఇక్కడ ఉదహరిస్తాను. "వ్యక్తుల విద్య, వాణిజ్య అభివృద్ధి ద్వారా దేశాలను, ఉన్నత స్థాయికి తీసుకువెళ్తున్న ఈ రోజుల్లో; వంశపారంపర్య భూస్వామ్య ప్రభువుల స్థానాన్ని వర్తక రాకుమారులు నిశ్శబ్దంగా భర్తీ చేస్తున్న ఈ రోజుల్లో; ఎలాంటి సామాజిక హోదా లేని వ్యక్తులు విద్యా, మేధోపరమైన అర్హతలతో అత్యున్నత

స్థాయికి ఎదుగుతున్న ఈ రోజుల్లో, మరే ఇతర కారణం కాకపోయినా, భూస్వామ్య ప్రభువులుగా మన ఉనికిని సమర్థించుకోవడం కోసమైనా, మన నిద్రాణస్థితి నుండి మేల్కొని, మన భుజాలను పగ్గాలకు ఆనించి, మన దేశాన్ని మేధోపరంగా ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే ఈ ప్రశంసనీయమైన పనిలో మన సోదరులతో కలిసి పనిచేయడం మన విధి. విద్యా బీజాలను విస్తృతంగా నాటడం ద్వారా దీనిని సాధించవచ్చు.''

దక్షిణ సర్కిల్ పాఠశాలల ఇన్‌స్పెక్టర్ రావు బహదూర్ సి. నాగోజీ రావు, జమీందార్ అధ్యక్షుడిగా ఉన్న పెరియకుళంలోని విక్టోరియా మెమోరియల్ ఉన్నత పాఠశాల పనితీరుపై ఈ విధంగా వ్యాఖ్యానించారు:-

''స్థానికప్రజలమద్దతుతో, స్థానిక జమీందార్ నిర్వహణలో ఉన్న ఈ ప్రైవేటు సంస్థ కృషికి నిదర్శనంగా నిలుస్తుంది. ప్రోత్సాహానికి అర్హమైనది. 2. ఈ సంస్థ చాలా సమర్థవంతమైన స్థితిలో ఉంది. విద్యార్థుల సంఖ్యను బట్టి చూస్తే, ఇది పరిసర ప్రాంతాలకు నిజమైన అవసరాలను తీరుస్తోంది. 3. విద్యార్థుల వస్త్రధారణ, ప్రవర్తన- సంతృప్తికరంగా ఉన్నాయి. 4. విధానం మరియు క్రమశిక్షణ - బాగున్నాయి.

మేనేజర్, వడగరై జమీందార్, ఈ సంస్థపై గొప్ప ఆసక్తిని కనబరుస్తూనే ఉన్నారు. ఆయన ఒక ప్రయోగాత్మక వ్యవసాయ క్షేత్రాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాలలో సాధారణ విద్యకు, సైద్ధాంతిక, ఆచరణాత్మక వ్యవసాయ బోధనను కూడా ఆయన జోడిస్తే గొప్ప మేలు చేసిన వారవుతారు. ప్రజాహిత భావాలు గల వడగరై జమీందార్, మేనేజర్, పాఠశాల పట్ల కనబరుస్తున్న గొప్ప ఆసక్తి కారణంగా కొంత వెనుకబడిన ఈ ప్రాంతంలో ఇది చాలా ఉపయోగకరమైన సంస్థగా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాము.''

రామభద్రనాయక్ గారు 1902 నుండి ఉన్నత పాఠశాల ఏర్పాటుకోసం తన బంగ్లాను అద్దె లేకుండా వాడుకోవడానికి అనుమతించారు. అక్కడ, ఇతరచోట్ల ఉన్నత పాఠశాల మరియు కళాశాల పరీక్షలకు సిద్ధమవుతున్న ఎంతోమంది విద్యార్థులు ఆయనకు రుణపడి ఉన్నారు. అనేకవిధాలుగా ఆయన వారికి సహాయపడ్డారు. జిల్లాలోని ప్రతి విద్యాసంస్థకు ఆయన ఒకపోషకుడిగా ఉండటం ఆయన ఘనతగా భావించవచ్చు.

1906 ఏప్రిల్ 11న పెరియకుళంలోని విక్టోరియా మెమోరియల్ ఉన్నత పాఠశాలలోని ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసే కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్, వడగరై జమీందార్ గురించి ప్రస్తావిస్తూ "ఆయన అరుదైన సద్గుణాలు కలిగిన పెద్దమనిషి అని, తన అనేక మంచి గుణాలతో ఇతర జమీందార్ల మధ్య ఒక ఆదర్శమని-అంటే ముత్యపుచిప్పల సమూహం మధ్యలో ఉన్న ఒక పరిపూర్ణమైన ముత్యం వంటివాడ"ని వ్యాఖ్యానించారు.

1906 నవంబర్‌లో గౌరవనీయ లేడీ లాఫ్లీ గారు స్థానిక థియోసాఫికల్ సొసైటీ మద్దతుతో నడుస్తున్న మధురలోని హిందూ బాలికల పాఠశాలను సందర్శించారు. శ్రీ రామభద్ర నాయక్ ప్రతి సంవత్సరం రెండు బహుమతులను ప్రకటించారు. ఒకటి లేడీ లాఫ్లీ సంస్థను సందర్శించిన జ్ఞాపకార్థం ఆమె పేరు మీద, మరొకటి ఆయన దివంగత తల్లి జ్ఞాపకార్థం. ఆయన అధ్యక్షుడిగా ఉన్న స్థానిక థియోసాఫికల్ సొసైటీకి సహాయం చేయడమే కాకుండా, ఆయన 1897-99 కరువు నిధికి, 1903 పట్టాభిషేక నిధికి, 1906లో మధురలోని థియోసాఫికల్ బాలికల పాఠశాలకు, 1905లో మత సమావేశాలు నిర్వహించడానికి మధురలో ఒక ఇల్లు కొనడానికి, 1897లో మధురలోని ఆల్బర్ట్ విక్టర్ ఆసుపత్రికి, వ్యవసాయ సంఘానికి కూడా విరాళాలు ఇచ్చారు. ఆయన తన తాతగారైన మీనాయస్వామి రామభద్ర నాయక్, 1810లో విష్ణు ఆలయంలో ఏర్పాటు చేసిన తిరువాచి దీపం నిర్వహణ కోసం సుమారు రూ. 1,500 విలువైన భూమిని కూడా బహుమతిగా ఇచ్చారు. డిబేటింగ్ సొసైటీ ఐదవ వార్షికోత్సవానికి అధ్యక్షత వహించిన దివంగత రామనాథపురం రాజా జమీందార్‌ను ఈ క్రింది విధంగా ప్రస్తావించారు. సోదరుడైన వడగరై జమీందార్ ఇక్కడ ఉండటం నాకు చాలా సంతోషంగా ఉంది. జిల్లాలో ఒక ఆదర్శ జమీందార్‌గా అతను ఎదగడం నాకు గర్వకారణం. నేను ఒక జమీందార్‌ను, కానీ ఆదర్శ జమీందార్‌ను కాదు! నా మిత్రుడు మా వర్గానికి చెందిన వ్యక్తిగా ఇప్పటికే తన ప్రత్యేకతను చాటుకున్నాడని ఇక్కడ



వడగరై జమీందార్

సాక్ష్యమివ్వడానికి సంతోషిస్తున్నాను! వడగరై జమీందార్ బయటకు వెళ్ళినప్పుడు, ఇప్పటికీ ఈ సంస్థపట్ల కృతజ్ఞతతో ఉన్నారు. దానికి నిదర్శనం ప్రతి సంవత్సరం కొంతమంది ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు ఇస్తున్నారు".

1903 ఏప్రిల్ 10న జరిగిన కళాశాల దినోత్సవ వేడుకలో, మధుర కళాశాల మరియు దాని సిబ్బంది తరపున టోస్ట్ ప్రతిపాదిస్తూ, శ్రీ రామభద్ర నాయక్ ఈ క్రింది వ్యాఖ్యలతో ముగించారు :- జిల్లా మాతృసంస్థ! బహుశా అన్నింటికన్నా పురాతనమైనదే కాకుండా అత్యంత సమర్థవంతమైనది.

1895 జూన్ 30న, రామభద్ర నాయక్ వివాహం అత్యంత వైభవంగా జరిగింది. జమీందార్‌కు 1897 నవంబర్ 21వ తేదీన నాగమ రామభద్ర నాయక్ అనే కుమారుడు జన్మించారు. ఆయన తన తండ్రి స్థాపించిన పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ, ఇంట్లోనే సమర్థుడైన బోధకుని పర్యవేక్షణలో ఉన్నారు. శ్రీ రామభద్ర నాయక్ తెలుగు, సంస్కృత పండితులు, మధుర జిల్లా కోర్టుకు చెందిన శ్రీ పి. ఆర్. సుబ్రహ్మణ్య శర్మ గారు అలంకార శాస్త్రంపై తాను రచించిన 'కువలయానంద కారిక' లేదా 'అప్పయ దీక్షితన్ కువలయానంద స్మరణ పద్యాలు' అనే సంస్కృత గ్రంథాన్ని శ్రీ నాయక్ గారికి అంకితం చేశారు. జర్మన్ పండితుడైన డాక్టర్ జె. థిబౌట్ చేసిన 'వేదాంత సూత్రాలు-శంకర భాష్యం' అనేపేరుతో శర్మగారు చేసిన అనువాదం పాండిత్యంతో కూడుకున్నది. జమీందారుకు అంకితం చేశారు. ఆయన అమూల్యమైన సహాయం, ఆదరణ లేకపోతే, ఈ పుస్తకం,మునుపటి పుస్తకం వెలుగు చూడకపోయేవి.

నవరాత్రి ఉత్సవాల సమయంలో వచ్చే సరస్వతీ పూజ రోజున, జమీందారు 'రామమూర్తి అజరామరం' అని పిలువబడే తన రాజభవనంలో ఒక దర్బారును నిర్వహించేవాడు. అక్కడ అతని స్నేహితులు, బంధువులు, కౌలుదారులు సమావేశమయ్యేవారు. మరుసటి రోజు, జమీందార్ రాజరికానికి సంబంధించిన అన్ని ఆడంబరాలతో తన పల్లకిలో వెళైకరతు యానై (ఏనుగు) మంటపం అనే నిర్దేశిత ప్రదేశానికి వెళ్లి, స్థానిక బాలసుబ్రహ్మణ్యస్వామి, వరద రాజస్వామి, వైద్యనాథస్వామి ఆలయాలలోని దేవతలు, దేవుళ్ళ విగ్రహాల సమక్షంలో బాణం సంధించే వేడుకను నిర్వహిస్తాడు.

అలాగే మార్చి నెలలో, అతని ఎస్టేట్‌లలో ఒకటైన పుదుకుళంలో, 'పంటల పండుగ' అని పిలువబడే ఒక విందు జరుగుతుంది. ఆ సమయంలో కులమతాల భేదం లేకుండా 3,000 మందికి పైగా ప్రజలకు విందు భోజనం పెట్టారు. గ్రామంలోని పచ్చని వరి పొలాలు, సుందరమైన చెరువులు మొత్తం కనిపించే ఒక అందమైన కొండపై కొలువుదీరిన మాల్-సిమేల్ 'వైద్యనాథస్వామి' ఆలయానికి ఆయన వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. ఏప్రిల్ నెలలో, యుగాది నాడు ఆలయ దైవం గౌరవార్థం ఒక ఉత్సవం నిర్వహిస్తారు. విగ్రహాన్ని 10 రోజుల పాటు వాహనంపై ఊరేగింపుగా పట్టణం చుట్టూ తిప్పుతారు. ఆ నెలలో వచ్చే పౌర్ణమినాడు ఉద్యానవనంలో జరుపుకుంటారు. పురాతన రాజభవనానికి చేసిన చేర్పులు, మరియు ఆయన సేకరించిన చిత్రాలు ఆయన కళాత్మక అభిరుచిని తెలియజేస్తాయి.

చాలామంచి పుస్తకాలతో కూడిన ఒక చక్కటి గ్రంథాలయం ఉంది. అక్కడ ఉన్న ప్రతి పుస్తకం బాగా వాడబడి, నిరంతర వినియోగపు గుర్తులను కలిగి ఉండటం గమనించదగ్గ విషయం. జిల్లాలో, ఇతర ప్రాంతాలలో ఉన్న తన తోటి జమీందార్లకు ఆ జమీందార్ చాలా ఇష్టమైన వ్యక్తి కావడంతో, జమీందారీకీ ఇతర ప్రముఖ కుటుంబాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి మధుర వెస్ట్ సబ్-కోర్టు అతన్ని అనేకసార్లు మధ్యవర్తిగా నియమించింది.

డా. సగిలి సుధారాణి
చరిత్ర పరిశోధకులు, రచయిత్రి
హైదరాబాద్, సెల్ : 949 042 8825

# నో రూమ్

– కాళీపట్నం రామారావు

ఓ సైద్ధాంతిక నేపథ్యంతో, జీవితంలో ఎక్కువ కాలం రచనలు చేసిన విశిష్ట రచయితలు పూర్తి విభిన్నమైన ఒకటి రెండు రచనలు చేసిన సందర్భాలు వున్నాయి. అవి వారి సైద్ధాంతిక నేపథ్యాన్ని దాటి, ఉద్వేగపడి, సత్యనిరూపణ చెయ్యటం విశేషం. అలాంటి రచనే కాళీపట్నం రామారావు మాస్టారు రాసిన కథ నో రూమ్. ఈ కథ ఆంధ్రజ్యోతి వారపత్రిక 13.12.1968 సంచికలో వచ్చింది.

జంతువులకి ఓ సౌలభ్యం వుంది. వాటికి సిగ్గు తెలియదు. చాటు తెలియదు. వాటి సంభోగం ప్రకృతి సిద్ధంగా, ప్రకృతి ఒడిలోనే ఏ చాటు లేకుండా జరుగుతుంది. కానీ మనుషులు అలా కాదు. వారి కలయికకి చాటు కావాలి. ఏకాంతం ఉంటేనే కానీ పూర్తిగా సుఖించలేరు.

పేదరికం వల్ల, సరిగ్గా తలదాచుకునే చోటులేక జీవితకాలం అంతా అలాంటి ఏకాంతం పొందలేని దీనులు మనమధ్య లక్షల్లో ఉన్నారన్నది ఎంత ఘోరం. అలాంటి, చోటులేని, దక్కని రెండు జంటల కథ నో రూమ్. జంతువులకున్న సుఖం కూడా లేని లక్షలమంది అమానుష దీనస్థితే నో రూమ్.

పెద్ద సంసారంలో పదిమంది మధ్యన పడుకుని, చీకటి తెరలూ, గోనె పరదాలు, తడికలూ, మంచాల చాటున భయంభయంగా బితుకు బితుగ్గా ఎవరో చెయ్యరాని వారితో చెయ్యరాని పనిచేస్తున్నట్టు సంసారాలు సాగించేవాళ్ళు ఎందరో, అదీ చోటులేని పేదరికం వల్ల. అలాంటివే ఆ రెండు జంటలు.

నూకరాజుకి తన పెళ్ళాంతో కలిసి, పూర్తి ఏకాంతంగా ఒక్క రాత్రేనా లాడ్జిలో గడపాలన్న కోరిక. దానికోసం మూడునెలలుగా ముష్టి కోరికలు కూడా ఎన్నెన్నో చంపుకుని డబ్బు ఆదా చేశాడు. ఆ రాత్రి పెళ్ళాన్ని తీసుకుని ఆ లాడ్జికి వచ్చాడు. అంతకీ నూకరాజు బాగానే ముస్తాబయ్యాడు. కానీ నూకరాజు రూపం బావుండదు. వాడి పెళ్ళాంది మరీ పల్లెవాటం. పైగా కూడా ఏ లగేజీ, కనీసం ఓ సంచీ అయినా లేదు. వాళ్ళని అలా చూడగానే లాడ్జి గుమాస్తా నో రూమ్ అని గది ఇవ్వకుండా వెళ్ళగొట్టాడు. అదే టిప్‌టాప్‌గా ఉన్న ధనవంతుడు హంగుగా బజారు స్త్రీతో వచ్చినా గుమాస్తా రూమ్ ఇచ్చేవాడే. నూకరాజులాంటి వాడు భార్యతో వచ్చినా నో రూమ్. అదే లాడ్జిలో పనిచేస్తున్న దేవుడు ఇదంతా చూసి బాధపడ్డాడు. దేవుడి భార్య అప్పాయమ్మ దేవుడిని గతంలో అదే కోరిక కోరుకుంది. చచ్చిపోయేలోపు భర్తతో ఓ గదిలో తృప్తైన ఏకాంతం. ఆమె కోరిక దేవుడు తీర్చకముందే అప్పాయమ్మ చచ్చిపోయింది. అందుకే దేవుడికి నూకరాజు మీద సహానుభూతి, బాధ.

నూకరాజు ఎంత ప్రయత్నించినా ఏ లాడ్జివాడు రూము ఇవ్వలేదు. అర్ధరాత్రి అయింది. మూడు సినిమా హాళ్ళ జంక్షన్‌కి వచ్చి, కాలే కడుపుకి ఇంత తినే ప్రయత్నంలో పడ్డాడు. చచ్చే ఉక్రోషంగా ఉంది నూకరాజుకి. ఆ అన్యాయానికి ఎవర్నేనా తన్నాలనిపించింది. అదే సమయానికి అక్కడి కొచ్చిన దేవుడు వీళ్ళని చూసి నో రూమ్ పరిస్థితి అర్థం చేసుకున్నాడు. ఓదార్పుగా పలకరించాడు. నూకరాజుకి తనెవరో చెప్పుకుని పాపం రూము దొరకలేదా? అనబోయి, 'నీకా బొట్టె ఏవవుద్ది?' అన్నాడు. నూకరాజుకి అది అవమానంగా తోచింది. ముసలి దేవుడు తన పెళ్ళాంతో మాట్లాట్టం కూపీలాగుతున్నట్టు అనిపించింది. అంతే.... 'లంజాకొడకా! నా ఆడదాని గురించి నీకెందుకునా? అని దేవుడి మీద పడి చితకబాదాడు నూకరాజు. చుట్టూ ఉన్న నలుగురూ కల్పించుకుని వీళ్ళని విడదీశారు. చివరకి కసితీరినట్టు నూకరాజు పెళ్ళాంతో రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడు. దేవుడు ఆగని దుఃఖంతో, వంటి దెబ్బలతో సాగిపోయాడు.

నూకరాజు, దేవుడి మధ్య ఏ శతృత్వం లేదు. ఏ ద్వేషం లేదు. అయినా కొట్టుకున్నారు. ఎక్కడిదో అన్యాయం ఎవరికో శిక్ష అయింది. సమన్యాయానికి నో రూమ్ లాంటి జీవితం. చిత్రమైన జీవన భాగాన్ని పట్టిచ్చిన అపురూప కథ నో రూమ్.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్, ఫోన్ : 9394738805

## తెలుగు వెలుగుల నవ గంధం

# ప్రొగ్రెస్ ఆఫ్ తెలుగు లైఫ్

తెలుగు సృజనాత్మక సాహిత్యానికి, ముఖ్యంగా కథకు శతాబ్ద కాలపు ఘనమైన చరిత్ర ఉంది. తెలుగు కథ కేవలం అక్షరాల కూర్పు కాదు.అది మన మట్టి వాసన, మన జీవితాల అద్దం. అయితే, ప్రపంచ సాహిత్య వేదికలపై తెలుగు కథల అనువాదాలు తరచూ కేవలం సామాజిక దైన్యాన్ని, అణచివేతను, కన్నీళ్లను మాత్రమే ప్రతిబింబిస్తున్నాయనే ఒక అసంతృప్తి సాహిత్య విమర్శకుల్లో ఉంది. ఆ వెలితిని భర్తీ చేస్తూ,తెలుగు జీవితంలోని ఆశావాదాన్ని, చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అంతర్జాతీయ పాఠకులకు సగర్వంగా పరిచయం చేసిన అద్భుత ప్రయోగమే ప్రొగ్రెస్ ఆఫ్ తెలుగు లైఫ్. అమెరికాలో వైద్య వృత్తిలో ఉంటూ మాతృభాషపై మమకారంతో డా. అట్లూరి లక్ష్మణరావు గారు సంకలనం చేయగా, ఆరు దశాబ్దాల సాహిత్య అనుభవం ఉన్న ప్రముఖ రచయిత వి. రాజా రామమోహనరావు గారు దీనికి సహకారం అందించారు. 'బీట్‌రూట్ బుక్స్' ద్వారా వెలువడిన ఈ గ్రంథంపై ఒక సమగ్ర, వృత్తిపరమైన విశ్లేషణ:

ఒక సమాజం యొక్క సాంస్కృతిక వైభవాన్ని, మానవీయ విలువలను విశ్వవ్యాప్తం చేయడానికి కథ కంటే... ఒక భాష నుండి మరో భాషలోకి జరిగే అనువాదం కంటే శక్తివంతమైన సాధనం మరొకటి లేదు. అయితే సాహిత్య ప్రపంచంలో ఒక భాష నుండి మరో భాషలోకి అనువాదం జరిగేటప్పుడు మూలంలోని మౌలికత వందకు వంద శాతం అలాగే బదిలీ కావడం అనేది దాదాపు అసాధ్యమైన ప్రక్రియ. ఒక భాషకు మాత్రమే సొంతమైన నుడికారాలు, సామెతలు, మరియు సాంస్కృతిక జీవన శైలిని ఆంగ్లంలోకి మార్చినప్పుడు ఆ మట్టి వాసన (నేటివిటీని) మరియు పాఠకుడు పొందే అసలైన అనుభూతి కొంతవరకు తగ్గుతుంది. కొన్ని అత్యుత్తమ అనువాదాలు మూలానికి న్యాయం చేసినప్పటికీ, సార్వత్రికంగా ఆ పరిమితి కనిపిస్తూనే ఉంటుంది.

ఈ పుస్తకం విషయంలో కూడా తెలుగు నేటివిటీని, ఆత్మీయతను ఆంగ్ల పాఠకుడికి అందించడానికి శాయశక్తులా ప్రయత్నం జరిగినప్పటికీ, అది కొంత మేరకే సాధ్యపడింది. దీనికి ప్రధాన కారణం–ఇందులోని వేర్వేరు కథలను వేర్వేరు అనువాదకులు అనువదించడం. ఒకే వ్యక్తి మొత్తం పుస్తకాన్ని అనువదిస్తే ఉండే శైలీగత ఏకరూపత (Consistency of Style), ఇక్కడ వేర్వేరు కలాల కలయిక వల్ల కొంతవరకు లోపించింది. కథల మధ్య శైలి మారడం పాఠకుడి ప్రవాహానికి స్వల్ప అవరోధంగా నిలిచినప్పటికీ, సంకలనకర్తలు చూపిన శ్రద్ధ వల్ల కథల అంతస్సూత్రం మాత్రం దెబ్బతినకుండా నిలబడింది.

**22 కథల జీవన ప్రవాహం :** ఈ సంకలనంలోని కథలన్నీ ఆధునిక తెలుగు సాహిత్య పరిణామ క్రమానికి, మానవ సంబంధాల లోతుకు అద్దం పట్టే మైలురాళ్లు. పుస్తక ప్రయాణం ప్రకృతి సృజనాత్మకతకు, స్త్రీ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే గుడిపాటి వెంకటాచలం గారి 'ఓ పువ్వు పూసింది' కథతో అత్యంత తాత్వికంగా ప్రారంభమవుతుంది. ఆ వెనువెంటనే దేశం కోసం చేసే అపూర్వమైన త్యాగాన్ని, ఒక స్త్రీ యొక్క అసాధారణ మానసిక ధైర్యాన్ని మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు తమ 'మంత్రపుష్పం' ద్వారా చిత్రించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ వర్గభేదాలను దాటి, ఒక సాటి స్త్రీని ఆదరించే ఉదాత్తమైన హృదయాన్ని పాలగుమ్మి పద్మరాజు గారు 'కోలవరాని దూరం' లో ఆవిష్కరిస్తే, ప్రాంతీయ సరిహద్దులను మరియు సామాజిక ఆంక్షలను అధిగమించి నిఖార్సైన విలువలను శోధించే కథగా సి. రామచంద్రరావు గారి 'వేలు పిళ్ళై' నిలుస్తుంది.

సమాజంలో చైతన్యాన్ని రగిలిస్తూ, సంప్రదాయాల పేరిట విధించే ఆంక్షలను ధిక్కరించే ఒక బాలవితంతువు అంతర్ మథనాన్ని శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు 'అరికాళ్ళ కింద మంటలు'లో అత్యంత పవర్‌ఫుల్‌గా చూపించారు. అదే సామాజిక ఆక్రందనను, దిగువ వర్గాల ఆత్మగౌరవాన్ని రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు తమ మార్కు శైలిలో 'ఆఖరి దశ' కథ ద్వారా ప్రతిబింబించారు. కాల ప్రవాహంలో తరాలు మారినా చెదిరిపోని ఆదర్శాల వారసత్వాన్ని భమిడిపాటి జగన్నాథ రావు గారు 'అడుగు జాడలు'లో గుర్తుచేస్తే, సగటు మనిషిలోని కళాత్మక హృదయాన్ని, సంగీతానికి-జీవితానికి మధ్య ఉన్న ఆత్మీయ బంధాన్ని చాగంటి సోమయాజులు (చాసో) గారు 'వాయు లీనం' ద్వారా హృద్యంగా మలిచారు. గ్రామీణ, పట్టణ జీవన శైలుల మధ్య నలిగే మానవత్వాన్ని, భాషా కమ్యూనికేషన్‌లోని లోతుపాతులను మధురాంతకం రాజారాం గారు 'శబ్ద సందేహం' లో విశ్లేషించగా, జీవితంలో ఎదురయ్యే అరిష్టాలను, కష్టాల హెచ్చరికలను అధిగమించే మనుగడ పోరాటాన్ని పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారు 'శని దేవత పద ధ్వనులు'లో వాస్తవికంగా చిత్రించారు. మానవ సంబంధాల వెనుక ఉండే మౌలిక స్వభావాన్ని దేవరకొండ బాలగంగాధర తిలక్ గారు తమ భావుకత్వంతో కూడిన శైలిలో 'నల్లజర్ల రోడ్' కథ ద్వారా నడిపించారు. ఏవైనా విపత్తులు లేదా ఆటంకాల తర్వాత జీవితం మళ్లీ ఎలా ఆశావాదంతో యథాస్థితికి వస్తుందో ఘండికోట బ్రహ్మాజీ రావు గారు 'రైళ్లు మళ్లీ మొదలయ్యాయి' కథలో నిరూపించారు. చీకటి జీవితాల్లో ఆకాశమంత నమ్మకాన్ని సృష్టిస్తూ కాంతిని నింపే తాత్విక ప్రయత్నాన్ని డా. కె. వివేకానంద మూర్తి గారి 'నేను చూసిన నక్షత్రం'లో చూస్తాము.




బంధాల మధ్య దూరాన్ని చెరిపేస్తూ, హృదయాలను ఒకదానికొకటి దగ్గర చేసే ఆర్ద్రతను ఈ పుస్తక సహ-రచయిత వి. రాజా రామ్మోహన్ రావు గారు తమ 'చేరువ' కథాంశంలో అద్భుతంగా ఆవిష్కరించారు. మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక ఇబ్బందుల వెనుక ఉండే నవ్వులను, ప్రేమానురాగాలను చంద్ర గారు 'బడ్జెట్ లైఫ్'లో చూపిస్తే, సమాజంలోని అంధకారాన్ని ఎదుర్కొంటూ తమదైన అస్తిత్వాన్ని చాటుకునే విలక్షణమైన జీవితాలను పి.ఎస్. నారాయణ గారు 'చీకటి పువ్వు' లో మనకు పరిచయం చేస్తారు. కాలంతోపాటు మనుషుల ఆలోచనల్లో రావాల్సిన సానుకూల పరిణామాన్ని అరిగే రామారావు గారి 'మార్పు' కథ చర్చిస్తుంది. క్రూరత్వంపై కరుణ సాధించే విజయాన్ని, మానవత్వమే పరమావధి అనే సత్యాన్ని దాదా హయత్ గారి 'అహింస' చాటిచెప్పగా, స్త్రీ పురుష సంబంధాలలోని సంక్లిష్టతలను, పరస్పర అవగాహన యొక్క ప్రాముఖ్యతను డా. మౌని గారు 'అతడు - ఆమె'లో లోతుగా స్పృశించారు.

ఆధునిక జీవితంలో అనుకోకుండా ఎదురయ్యే సంఘటనలు మనిషి అంతరంగాన్ని ఎలా మారుస్తాయో మహమ్మద్ ఖదీర్ బాబు గారి 'ఘటన' ప్రతిబింబిస్తుంది. అలాగే కాలం యొక్క క్షణికత్వాన్ని, జీవితంలోని సున్నితమైన భావోద్వేగాలను శ్రీ ఉష గారు 'ఇసుక అద్దం'లో అద్దం పట్టగా, ఎంతటి కష్టాలనైనా జయించి, ఫీనిక్స్ పక్షిలా మళ్లీ తమను తాము ఆవిష్కరించుకునే స్త్రీల అంతర్గత శక్తికి నిదర్శనంగా వాడ్రేవు వీర లక్ష్మి దేవి గారి 'పునరుత్థానం' కథతో ఈ కథా ప్రవాహం సగర్వంగా ముగుస్తుంది.

**అనెక్సర్ (Annexure) :** తెలుగు సాంస్కృతిక వారసత్వ దీపిక :- ఈ పుస్తకాన్ని సాధారణ కథల సంకలనాల కంటే ఒక మహోన్నత సాంస్కృతిక నిధిగా నిలబెట్టేది ఇందులోని 'అనెక్సర్'. వాడ్రేవు సుందరరావు గారు అందించిన ఈ విభాగం, ఒకే చోట తెలుగు జాతి సమగ్ర సాంస్కృతిక, సాహిత్య చరిత్రను అంతర్జాతీయ పాఠకుడికి పరిచయం చేస్తుంది. తెలుగు సాహిత్యానికి అక్షర భిక్ష పెట్టి, మహాభారత ఆంధ్రీకరణతో భాషకు దిశానిర్దేశం చేసిన ఆది కవి నన్నయ్య గారి వైభవంతో ఈ విభాగం మొదలై... నాటకీయ శైలిలో భారతాన్ని పూర్తి చేసి తెలుగు భాషకు ప్రాణప్రతిష్ఠ చేసిన కవి బ్రహ్మ తిక్కన సోమయాజి గారి చరిత్రకు కలుస్తుంది. ఆపై భక్తి రసార్ద్రంగా శ్రీమదాంధ్ర

భాగవతాన్ని అందించి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన పుణ్యమూర్తి బమ్మెర పోతన గారిని, పద్యకవితా పితామహుడిగా శ్రీవేంకటేశ్వరునికి వేలాది సంకీర్తనలను సమర్పించిన పరమ భక్తుడు అన్నమయ్య గారిని ఇక్కడ అద్భుతంగా స్మరించుకున్నారు. "దేశభాషలందు తెలుగు లెస్స" అని చాటి, సాహిత్య స్వర్ణయుగాన్ని ఏలిన చక్రవర్తి, కవి సార్వభౌముడు శ్రీ కృష్ణ దేవరాయలు గారి పరిపాలనా వైభవాన్ని వివరిస్తూనే... ఆటవెలది పద్యాలతో విశ్వజనీన సత్యాలను పామరులకు సైతం అర్థమయ్యేలా చెప్పిన ప్రజాకవి వేమన గారి తాత్వికతను ఇందులో పొందుపరిచారు.

కర్ణాటక సంగీత సామ్రాజ్య అధినేతగా, కీర్తనల ద్వారా నాదబ్రహ్మంగా వెలిగిన మహనీయుడు త్యాగయ్య గారి స్వర సుధలను, అలాగే అపారమైన ప్రేమతో తెలుగు గ్రంథాలను సేకరించి, నిఘంటువులు కూర్చి, తెలుగు భాషకు పునర్జన్మనిచ్చిన తెల్లదొర చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (C.P. Brown) గారి భాషా సేవను ఈ వ్యాసాలు సగర్వంగా తలుచుకుంటాయి. అన్నదానమే పరమావధిగా జీవించి, 'అపర అన్నపూర్ణ'గా కీర్తించబడిన విశ్వజనీన త్యాగశీలి డొక్కా సీతమ్మ గారి మానవత్వాన్ని చాటుతూనే... సంఘసంస్కరణకు, స్త్రీ విద్యకు తన జీవితాన్ని అంకితం చేసిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం గారి విప్లవాన్ని ఇక్కడ ప్రస్తావించారు.

"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అంటూ ఆధునిక తెలుగు నవకల్పనకు నాంది పలికిన యుగకర్త గురజాడ అప్పారావు గారి ఆధునికతను, గ్రాంథిక భాషా దాస్య సంకెళ్లను తెంపి, 'వ్యావహారిక భాషా ఉద్యమం' ద్వారా అక్షరాన్ని ప్రజల చెంతకు చేర్చిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి గారి కృషిని ఈ విభాగం ఎంతో గౌరవంగా ఆవిష్కరించింది. స్త్రీ స్వేచ్ఛకు, వారి ఆత్మగౌరవానికి అక్షర రూపాన్నిచ్చి సమాజపు కపటత్వాన్ని ప్రశ్నించిన విప్లవాత్మక రచయిత గుడిపాటి వెంకటాచలం (చలం) గారి కలం పదునును గుర్తుచేస్తూనే... ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులను కనుగొని ప్రపంచ వైద్య రంగాన్నే మార్చిన అద్భుత శాస్త్రవేత్త డా. ఎల్లాప్రగడ సుబ్బారావు గారి మేధస్సుకు ఇందులో నీరాజనాలు అర్పించారు.

తెలుగు సాహిత్యానికి మొట్టమొదటి జ్ఞానపీఠ్ బహుమతిని అందించి, సంప్రదాయ ఆధునికతల కలయికగా నిలిచిన కవిసమ్రాట్ *విశ్వనాథ సత్యనారాయణ* గారి సాహిత్య వైభవం, తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు మరియు రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి త్యాగ నిరతి ఇందులో అక్షరబద్ధమయ్యాయి. తెలుగు కథను భవిష్యత్ తరాల కోసం భద్రపరిచిన ఏకైక మరియు మహోన్నతమైన కథా దేవాలయం కథానిలయం (స్థాపకులు: కాళీపట్నం రామారావు) యొక్క విశిష్టతను చాటుతూ... చివరగా బహుభాషా కోవిదుడిగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మాజీ ప్రధాని పి.వి. నరసింహా రావు గారి ప్రగతిశీల ఆలోచనలతో ఈ చారిత్రక సాంస్కృతిక విభాగం సంపూర్ణమవుతుంది.


భాషాంతరీకరణలో కొన్ని అనివార్యమైన పరిమితులు ఉన్నప్పటికీ, ఫ్రాగ్రెన్స్ ఆఫ్ తెలుగు లైఫ్ ప్రపంచ సాహిత్య పటంలో తెలుగు అస్తిత్వాన్ని సగర్వంగా నిలబెట్టే ఒక అపూర్వ విజ్ఞాన సర్వస్వం అనడంలో ఎలాంటి సందేహం లేదు. విదేశాల్లో పెరుగుతున్న ద్వితీయ తరం తెలుగు పిల్లలకు (Second Generation Diaspora) తమ మూలాలను, తమ సాహిత్య సంపదను ఆంగ్ల మాధ్యమం ద్వారా పరిచయం చేయడానికి ఇంతకంటే ఉత్తమమైన ప్రత్యామ్నాయం మరొకటి లేదు. అనువాద సవాళ్లను దాటుకుని తెలుగు కథల సువాసనను విశ్వవ్యాప్తం చేసిన డా. అట్లూరి లక్ష్మణరావు గారికి, రాజా రామమోహనరావు గారికి తెలుగు సాహితీ లోకం ఎల్లప్పుడూ అభినందనలు తెలియజేస్తుంది. ప్రతి పుస్తక ప్రియుడి అలమరలో ఉండాల్సిన అమూల్యమైన గ్రంథం ఇది. ఇది తెలుగు ఆత్మకు పట్టిన అక్షర ప్రదీపం.

సాహిత్యపరంగా ఎంతో విలువైన ఈ అమూల్య గ్రంథం మొత్తం 344 పేజీల విస్తృతితో, అత్యంత ఆకర్షణీయమైన ముద్రణతో పాఠకుల ముందుకు వచ్చింది. దీని వెల భారతదేశంలో రూ. 600 కాగా, అంతర్జాతీయంగా $20గా నిర్ణయించారు. 'బీట్‌రూట్ బుక్స్' ప్రచురించిన ఈ పుస్తకం ప్రస్తుతం ప్రముఖ ఈ-కామర్స్ వేదికైన అమెజాన్ లోనూ, అలాగే అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలోనూ పాఠకులకు అందుబాటులో ఉంది.

***- ఎన్వీఆర్***

# నెమలినార

తెలుగు కథా జగత్తులో ప్రాంతీయత అంటే కేవలం మాండలిక ప్రదర్శన కాదు. అది ఒక జాతి అస్తిత్వ ఘోష. సాహిత్యంలో కొన్ని పుస్తకాలు చదువుతుంటే మనం కేవలం అక్షరాలను చదవం, ఒక కాలాన్ని, ఒక ప్రాంతాన్ని, అక్కడి మనుషుల శ్వాసను అనుభవిస్తాం. బి. మురళీధర్ గారి 'నెమలినార' అటువంటి అరుదైన కథా సంపుటి. అదిలాబాద్ అడవుల నేపథ్యం, గిరిజన జీవన వైవిధ్యం, ఆధునిక పోకడల మధ్య నలిగిపోతున్న మానవీయ విలువల సమాహారం ఈ పుస్తకం. 2016లో తొలి ముద్రణ పొంది, 2026లో ద్వితీయ ముద్రణ జరుపుకుంటున్న ఈ కథా సంకలనం, పదేళ్ల కాలంలో తన ప్రాసంగికతను మరింత పెంచుకుంది. బి. మురళీధర్ గారి 'నెమలినార' కేవలం 20 కథల సంకలనం మాత్రమే కాదు, అది ఆదిలాబాద్ అడవి తల్లి తన బిడ్డల గురించి రాసుకున్న 'ఆత్మకథ'. గ్లోబలైజేషన్ ఉధృతిలో మన మూలాలను మనం ఎలా కోల్పోతున్నామో, ప్రకృతితో మనకున్న పేగు బంధం ఎలా తెగిపోతోందో ఈ పుస్తకంలోని ప్రతి కథ మన అంతరాత్మను నిలదీస్తుంది. ఈ సంపుటిలోని కథా వస్తువులు అడవి, ఆకలి, ఆత్మగౌరవం అనే మూడు మూలస్తంభాలపై నిలబడ్డాయి.




**పర్యావరణ తాత్వికత : వృక్షమే దైవం :–** శీర్షిక కథ 'నెమలినార' రచయితలోని పర్యావరణ శాస్త్రవేత్తను పరిచయం చేస్తుంది. ఒక వృక్షం చుట్టూ అల్లబడిన గిరిజన వైద్యం, ఆ చెట్టుతో ఆ మనుషులకు ఉన్న భావోద్వేగ అనుబంధం అద్భుతం. ఆధునిక వైద్యం విఫలమైన చోట, ప్రకృతి ప్రసాదించిన 'నార' ఎలా ప్రాణం పోస్తుందో చెప్తూనే, విచ్చలవిడి అటవీ నరికివేత వల్ల మనం ఏ విలువైన సంపదను కోల్పోతున్నామో రచయిత హెచ్చరిస్తారు. ఇది కేవలం చెట్టు కథ కాదు, ఒక నాగరికతను కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేసే కథ.

**ఆకలి – ఒక సజీవ చిత్రం :** 'దశ్మి' కథలో రచయిత చూపే ఆర్ద్రత అసామాన్యం. పండుగ పూట లోకమంతా సంబరాల్లో ఉంటే, ఆకలితో అలమటించే చిన్నారి 'దశ్మి' కళ్లలో ప్రతిబింబించే శూన్యం పాఠకుడిని నిద్రపోనివ్వదు. ఆకలికి కులం, మతం ఉండవు, దానికి తెలిసింది కేవలం ఏడుపు మాత్రమేనని రచయిత అత్యంత సూటిగా గుండెకు తగిలేలా చిత్రించారు.


**శిల్పపరమైన నవ్యత : 'ఏ టాకింగ్ ఎఫిజీ'** సాహిత్యంలో ప్రయోగాలకు కొదవలేదు, కానీ ఒక దిష్టిబొమ్మను కథానాయికగా చేసి, దాని ద్వారా సమాజంలోని కుళ్లును, మనుషుల ద్వంద్వ ప్రవృత్తిని విమర్శించడం మురళీధర్ గారి ప్రతిభకు నిదర్శనం. 'ఏ టాకింగ్ ఎఫిజీ' మ్యాజికల్ రియలిజం తరహాలో సాగుతూ, మనుషుల కంటే గడ్డి బొమ్మలకే మానవత్వం ఎక్కువ ఉందని పరోక్షంగా ఎద్దేవా చేస్తుంది. తెలుగు విశ్వ విద్యాలయం కథా పురస్కారం పొందిన ఈ సంకలనంలోని 20 కథలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటూనే, 'మానవత్వం' అనే దారంతో అల్లబడ్డాయి. అదిలాబాద్ గిరిజన ప్రాంతపు యాసను వాడటంలో మురళీధర్ గారు చూపిన నేర్పు అనన్యసామాన్యం. అది కృతకత్వం లేని భాష, మట్టి సువాసన వెదజల్లే భాష.మురళీధర్ గారు అక్షరాలతో చిత్రాలు గీస్తారు. అడవిలోని ఆకు కదలిక, గూడాల లోగిళ్లు, ఆ పచ్చని ప్రకృతి మధ్య సాగే అమాయక జీవనం పాఠకుడి కళ్ల ముందు కదలాడుతాయి. ఆయన కథల్లో ఉపదేశం ఉండదు, కానీ ఒక గొప్ప సందేశం ఉంటుంది. సమస్యను గుర్తించడమే కాదు, దానికి కారణమైన వ్యవస్థను ప్రశ్నించే ధైర్యం ఆయన అక్షరాల్లో కనిపిస్తుంది. 'నెమలినార' కేవలం గతాన్ని నెమరువేసుకునే పుస్తకం కాదు, ఇది భవిష్యత్తుకు ఒక దిశానిర్దేశం. పదేళ్ల విరామం తర్వాత ఈ పుస్తకం మళ్ళీ వచ్చిందంటే, సమాజంలో మురళీధర్ గారు చర్చించిన సమస్యలు నేటికీ సజీవంగా ఉన్నాయని అర్థం.ఆధునికత పేరిట మనం కోల్పోతున్న సహజత్వాన్ని, మనుషుల మధ్య ఉండవలసిన పారదర్శకతను ఈ కథలు మళ్ళీ గుర్తు చేస్తున్నాయి. ప్రకృతిని ప్రేమించే ప్రతి ఒక్కరూ, అట్టడుగు వర్గాల గొంతుకను వినాలనుకునే ప్రతి సాహిత్య అభిమాని చదవాల్సిన అత్యుత్తమ గ్రంథం ఇది.అడవి తల్లి కన్నీటిని అక్షరాలుగా మార్చిన మురళీధర్ గారి కృషి అభినందనీయం. ప్రతి ఇంటా ఉండాల్సిన, ప్రతి గుండె చదవాల్సిన పుస్తకం ఈ 'నెమలినార'.

**- ఆర్వియన్**

## డమరు ధ్వని-ప్రతిధ్వని

సాహిత్యం కేవలం సమాజ ప్రతిబింబం మాత్రమే కాదు, అది జనజీవనాన్ని ప్రగతి పథంలో నడిపించే ఒక అద్భుత చైతన్య శక్తి. కవి సృజనలో సామాజిక దృక్పథం ఉన్నప్పుడు, దానిని విశ్లేషించే విమర్శకుడిపై గురుతర బాధ్యత ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కళింగాంధ్ర మట్టి నుండి ఎదుగుతున్న సహృదయ విమర్శకుడు పిల్లా తిరుపతిరావు, అభ్యుదయ కవి సీరపాణి రాసిన 'డమరుధ్వని' కవితా సంపుటిని లోతుగా విశ్లేషిస్తూ అందించిన వ్యాఖ్యానం 'డమరుధ్వని-ప్రతిధ్వని' ఒక విశిష్ట సాహిత్య ప్రక్రియగా నిలుస్తుంది. సీరపాణి కవితాత్మను ఆవిష్కరించే ఈ పుస్తకంలో ఇరవై ఎనిమిది విశ్లేషణాత్మక వ్యాసాలు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటికే 'మిసిమి' వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురితమై పండిత, పామరుల ప్రశంసలు పొందడం విశేషం.

సద్విమర్శకుడికి ఉండాల్సిన నిష్పక్షపాత వైఖరిని తిరుపతిరావు ఈ గ్రంథంలో అడుగడుగునా ప్రదర్శించారు. విమర్శకుడు కవికి విద్యార్థిగా ఉంటూనే, పాఠకుడికి ఉపాధ్యాయుడి పాత్రను పోషించాలన్న సూత్రాన్ని ఆయన అన్వయించుకున్నారు. సీరపాణి కవిత్వంలోని గంభీరతను 'శివతాండవ సదృశమే డమరుధ్వని' అంటూ అభివర్ణిస్తూ, సామాజిక అసమానతలపై కవి కలం చేసిన గర్జనను విశ్లేషించారు. లోకంలోని చీకటిని చీల్చడానికి పూల రేకులు కూడా బాకుల వలె ఎదురు నిలుస్తాయని కవి చేసిన వర్ణన, సాత్విక స్వభావం కలవారు సైతం విప్లవానికి సిద్ధమైన పరిస్థితిని సూచిస్తుందని వ్యాఖ్యాత ఎంతో నేర్పుగా విశ్లేషించారు. అలాగే 'సమతా సంగీతాన్ని' భావి తరాల కోసం కవి ఇచ్చే గోదానంగా అభివర్ణించడం ఆయన విమర్శనా పటిమకు నిదర్శనం. సంప్రదాయ గోదానం మరణానంతరం వైతరిణిని దాటడానికి ఉపకరిస్తే, సీరపాణి కవిత్వం బ్రతికున్న ప్రజల కష్టాలను దాటించడానికి మార్గం చూపుతుందని తిరుపతిరావు విశ్లేషించారు.





కాలాన్ని వెండితెరతో పోలుస్తూ సాగిన తాత్విక చర్చ, ఆకలిని 'గర్భశత్రువు'గా చిత్రించిన తీరు పాఠకుడిని ఆలోచింపజేస్తాయి. సామ్యవాద వ్యతిరేక శక్తులపై సీరపాణి ఎక్కుపెట్టిన 'హెచ్చరిక'ను, అట్టడుగు వర్గాల వేదనను తెలిపే 'జ్యోతిర్గమయి'ని విశ్లేషిస్తూ ఆ ఆవేదనకు ఒక తాత్విక భూమికను కల్పించారు. ముఖ్యంగా 'ఏరువాక' గేయంపై చేసిన విశ్లేషణ, కేవలం ఒక వ్యవసాయాధారిత చిత్రీకరణ మాత్రమే కాదు; అది దశాబ్దాల తరబడి సాగుతున్న భూస్వామ్య దోపిడీపై సాగిన నిరసన గళం. కేవలం ప్రాంతీయతకే పరిమితం కాకుండా 'వీరబంగ్లా' వంటి కవితల ద్వారా అంతర్జాతీయ విప్లవ స్ఫూర్తిని, గురజాడ వారసత్వాన్ని సీరపాణి ఎలా కొనసాగించారో ఈ గ్రంథం వివరిస్తుంది. తెలుగు 'వందేమాతరం' అనువాద గేయ విశిష్టతను చర్చిస్తూ ముగిసే ఈ పుస్తకం, నేటి యువతలో ప్రజాస్వామ్య దృక్పథాన్ని, ప్రగతిశీల కాంక్షను పెంపొందించడానికి తోడ్పడుతుంది. కవిత్వంలో నిశ్శబ్దంగా ఉన్న ధ్వనిని పట్టుకుని, దానికి అక్షర రూపమిచ్చి 'ప్రతిధ్వని'గా మార్చిన తిరుపతిరావు కృషి ప్రశంసనీయం. సిక్కోలు బుక్ ట్రస్ట్ ప్రచురించిన ఈ గ్రంథం ప్రతి సాహిత్య ప్రేమికుడు చదవాల్సిన అద్భుత సృజన.

**- మల్రాపు వసుంధరా దేవి**

# చదవండి...

**– మిసిమి**

**కథా పున్నమి - సంపాదకులు - ఎన్.కె. బాబు :** కథా సాహిత్యాన్ని అభిరుచి గల పాఠకులకు అందించాలని పట్టువదలని విక్రమార్కునిలాగా ఈ సంపాదకుడు ఇప్పటికి నాలుగు కథా సంపుటాలు ప్రచురించారు. అవి కథా సౌరభాలు, కథా పరిమళాలు, కథా కుసుమాలు, కథా లోగిలి పేర్లతో వచ్చినవి. ఐదవది కథాపున్నమి ఇప్పుడు పాఠకుల చేతికి అందుబాటులోకి వచ్చింది. ఇందులో నలభై అయిదు మంది రచయితల కథలున్నాయి. అడపా రామకృష్ణ గారి కథ ఈ కథకు ముగింపు లేదు మొదలు వి. వెంకటరావు కథ మాయాబజార్ వరకు ఈ నలభై అయిదు కథలు రచయిత, రచయిత్రుల ప్రతిభను తెలియజేస్తున్నాయి. ఈ కథలో అన్ని ప్రాంతాల రచయితల నుంచి సేకరించినవి. ఎన్.కె. బాబు గారు ఎంతో నిబద్ధతతో, లాభార్జన ముఖ్యం కాకుండా ఇటువంటి సంపుటాలు తేవడం ఎంతో ముదావహం.




*పేజీలు : 383, వెల : 350/–, ప్రతులకు : ఫోన్ : 9440343479.,*


**మెరీనా! ఓ మెరీనా! - ఫణిహారం వల్లభాచార్య :** ఉచ్చ నీచాల్లేని కశ్మలపు రాజకీయాలని నల్లటి అక్షరాల్లో దించి.. స్వచ్ఛమైన మిఠాయికి రంగులువేసి, వెండిరేకులు చుట్టి నోరూరించి అమ్మినట్టు.. శీర్షికలకు రంగులు కొట్టి, డిజైన్లు గీసి, పాలమీగడలాంటి తనమీద అచ్చోసి వదలటానికి నిరసనగా పేపర్ రోల్ చిరిగి పోతూంటుంది అప్పుడప్పుడూ!




ఆ చప్పుడులో ఎంత బలం! ఎంత స్వతంత్రత! నా ఉద్యోగంలో ఇష్టపడేది ఆ పేపర్ రోల్ చిరిగిన చప్పుడే! అది నా సముద్రాన్ని నాకు ఇస్తూ వుంటుంది అప్పుడప్పుడూ.... అంటారు రచయిత. ఆ చప్పుడేంటో, వారి సముద్రమేమిటో మెరీనా ఓ మెరీనా చదివి తెలుసుకోండి.

*పేజీలు : 118, వెల :150/–, ప్రతులకు : ఫోన్ : 9866356198, అన్ని పుస్తక కేంద్రాలలో లభించును.*

**వీరబ్రహేంద్రతత్త్వదర్శనం - డా. పూసపాటి శంకరరావు :** పురాణ ఇతిహాసాలకన్నా, అతి పురాతనకాలంలో భారతీయులకు అందుబాటులోకి వచ్చినవి వేదోపనిషత్తులు. వేదాలు, ఉపనిషత్తులు బోధించిన శాశ్వత సత్యం, సనాతనధర్మం, మూఢవిశ్వాసాలతో నిండినాయని గ్రహించి వేదమత వైశిష్ట్యాన్ని, ఉపనిషత్తుల సారాన్ని, భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రజల వద్దకు చేర్చిన మహా పురుషుడు వీరబ్రహ్మేంద్ర స్వామి. ఆయన చరిత్ర– కాలజ్ఞానం ఎన్నో సాహిత్య ప్రక్రియల్లో వచ్చాయి. కవిబ్రహ్మ పూసపాటి శంకరరావు ఇప్పుడు మరల వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్రను ఈ పుస్తకం ద్వారా అందిస్తున్నారు.




'పూసపాటి శంకరరావు గారికి గల వైదిక, ఉపనిషత్ సంప్రదాయ పరిజ్ఞానం ప్రతిఫలింపజేసే రచన అంతర్దర్శనం. ప్రస్తుత రచన శ్రీ వీరబ్రహ్మేంద్రతత్త్వదర్శనం ఎంతో గుణ గౌరవం కల్గిందని' అంటారు ఆచార్య వెలుదండ నిత్యానందరావు. ఉపాధ్యక్షులు, ఎస్.పి. తెలుగు విశ్వవిద్యాలయం.

*పేజీలు : 138, వెల :200/–, ప్రతులకు : పూసపాటి జయలక్ష్మి, ఫోన్ : 9885898297*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి  బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : తపాలా ఖర్చులు పెరిగిన మూలంగా పత్రిక వెల ***జనవరి 2026 నుంచి రూ. 60/–*** చేయవలసి వస్తున్నది. మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ–మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా ***మిసిమి*** పత్రికను పంపిస్తాం. పాఠకులు సహకరించగలరని ఆశిస్తున్నాం.

**ప్రతినెలా ముప్పయి తారీఖున పత్రిక పోస్టు ద్వారా పంపబడుతుంది. ఏ కారణం చేతనైనా పత్రిక చేరకపోతే మళ్లీ పంపటానికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెసులపాటు కల్పించడంలేదు. కేవలం స్పీడు పోస్ట్ ద్వారానే పంపాలి. దయచేసి చందాదారులు గమనించగలరు.**


**చందా వివరాలు:**

₹720/- (సంవత్సర చందా),
₹1440/- (రెండు సంవత్సరాలకు),
₹2,160/- (మూడు సంవత్సరాలకు),


**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi


## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



సప్తపర్ణి | వ్యాస మంజూష | ప్రవాస సాహిత్యం | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్



యాత్రా కథనాలు | షెల్లీ జీవిత కథ | కొత్త కెరటాలు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ

**ప్రతులకు: *మిసిమి* కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.**

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.**, Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**